శ్రీరస్తు.

శ్రీకృష్ణకవిజీవితము.

(వజ్రాయుధపత్రికనుండి పునర్ముద్రితము)

ఇది

అనంతపంతుల రామలింగస్వామిగారు,

(గవర్నమెంటుప్లీడింగుసూపరింటెండెంటు.)

రచించినది.

[illegible] ముద్రాక్షరశాలయందు

ముద్రితము.

193[illegible]

 — [వెల రు 1—0—0

అంకితము.

ప్రతిభామహాశాసన ప్రజ్ఞాప్రభుత్వముల్
దనరించి మును కవిత్రయముఁ బెంచి
కనకాభిషేకాది గౌరవంబులు గూర్చి
శ్రీనాథకవిని సంప్రీతిఁ బెంచి
గండపెండేరము డాకాలను బిరుదుగా
నిడి పెద్దనామాత్యు నెలమిఁ బెంచి
తననుడిఁ దప్పులేదనుశక్తిఁ గలిగించి
రామకృష్ణకవీంద్రుఁ బ్రేమఁ బెంచి
దేశభాషావధూటులలో శతాధి
కోత్తమగుణైకవిఖ్యాతినొంది, నవన
వత్వ, మమృతత్వమలరాగఁ బ్రబలుచుండు
నాంధ్రభారతి కీకృతి యంకితంబు

అనంతపంతుల రామలింగస్వామి.

కృతికర్త.

విజ్ఞాపనము.

కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు నాకుఁ జిరపరిచితులు. వారురచించినగ్రంథములమూలముననూ, ప్రకటించినపత్రికలమూలముననుసుమా రిరువదిసంవత్సరములనుండి వీరిని నేనెఱుంగుదును కాని కడచినపదేండ్లనుండియు వారిని నేను స్వయముగాఁ జూచి యెఱుంగుట తటస్థించినది.

భాషాజ్ఞానము కలిగినదిమొదలు నాకుఁ గవులన నెంతో గౌరవము. వారు రచించినగ్రంథములను జదువుటయం దత్యంతాసక్తి. అప్పటి కాంధ్రలోకమునఁ గవిరాజబిరుదమునొంది ప్రవర్తించువారు శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారొక్కరు మాత్రమే. అందుచే వీరురచించినగ్రంథములను ప్రత్యేకము ప్రేమతోఁ జదివి యానందించుచుఁ గవిరాజమూర్తిని మనంబునఁ జిత్రించుకొని తద్దర్శనకుతూహలాయత్తచిత్తుండనైయుంటిని. తత్కాలంబున నామనస్సును మిగుల నాకర్షించినదివారు రచించిన కలభాషిణీనాటకరాజము. పిమ్మటఁ గొంతకాలమునకు శ్రీమహాభారతమును యథామూలముగ నాంధ్రీకరించుటకు వారు పూనిచేసిన ప్రతిజ్ఞాప్రకటనమును జూచిననాఁటనుండి ద్విగుణీకృతదర్శనేచ్ఛాసంభ్రమమున నుంటిని. ఏనాఁడుకవిత్రయమువారు శ్రీమహాభారతమును దెనిఁగించిరో యానాఁటినుండి నేఁటివఱకు వారియనువాద మసంపూర్ణమనియు యథామూలము గాదనియు నెఱింగియు నొక్కకవియేనియు నాలోపమును దీర్పనూహించుటకైన సాహసింపలేదు. అట్టియెడ శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారు మహాసాహసమును బూనుటయేగాక తత్కార్యాచరణమునకుం దొడంగి యనతికాలములోన మొదటిసంపుటమును బ్రకటించిరి. దానింజదివిన నుండి వారియెడ నాకపరిమితగౌరవముగలిగినది. తోడనే మఱికాలయాపనము చేయక వారిని దర్శించుటకు రాజమహేంద్రవరమునకుఁ బోయి దర్శించితదానందాతిశయము ననుభవించితిని. తత్సందర్భమున వారిజీవితాంతర్గత విశేషములఁ గొన్నింటిని సంభాషణవశమున వారు నాకునొడివిరి. ఆవిచిత్రవిశేషములనువిని యద్భుతపడియానందించి స్వీయచరిత్రము వ్రాసికొనుఁడని వారిని గోరితిని. దానికివారిష్టపడలేదు. తదుపరి నేను వారి ననేకపర్యాయములు చూచినప్పుడెల్ల స్వీయచరిత్రవిషయము నెత్తుచుంటిని. అంతఁ గొంతకాలమునకు "అయ్యా! స్వీయచరిత్ర మని పేరుపెట్టి ఆంధ్రసర్వస్వపత్రికాధిపతిగారు బలవంతమున నీవము 10 పేజీలగ్రంథము వ్రాసి

వారిపత్రికలోఁ బ్రకటించుటకిచ్చితిని. అంతటఁ దప్పనేను విస్తరించి వ్రాయుటకిష్టపడ” నని వారు చెప్పిరి. అంత నేను “మీస్వీయచరిత్రమును నేను వ్రాసెదను మీరిచ్చెకొం దురా?” అని వారినడిగితిని. దానికిని వారంతగా నొప్పుకొనినట్లుతోపలేదు. కాని నేనుమాత్రమాయూహను వదలక పదేపదే వారినడుగుచు వచ్చితిని. తుదకు ‘మీరు వ్రాయుచో వ్రాయుడుగాని నేనుమాత్రము నాజీవితచరిత్ర ము విస్తరించి యెన్నడును వ్రాయబూన” నని వారునాతోఖండితముగాఁ జెప్పి రి, అటులగుచో మీ జీవితచరిత్రాంశముల నన్నిటిఁ జెప్పుడని కోరితిని. వారుదానికిసమ్మతించి కావలసిన పరికరములన్నింటిని నాకొసంగిరి. ఇవి గాక వారిబంధువులయు స్నేహితులయు ముఖాలమున మఱికొన్నివిషయములు తెలిసికొని వానిని విస్తరించి ‘శ్రీకృష్ణకవిజీవిత” మనుపేరుతో నీగ్రంథము రచించియాంధ్రలోకమునకు సమర్పింపఁగలిగితిని.

తొలుత నిద్దాని నాంగ్లకవిజీవితచరిత్రములఁ బోలె వ్రాయనూహించినను నేను ప్రభుత్వోద్యోగమున నిమగ్నుఁడనౌట దీరికలేమిం జేసియు, కవిసార్వభౌ ములు వారిజీవితచరిత్రాంశములను నాకుఁ బరిచయము జేయుటలో వెనుకవిష యములు ముందును ముందువిషయములువెనుకనుఅప్పుడప్పుడు నాకుఁ జెందజేయు టచేతను, వారొసగుటయే తడవుగ నెప్పుడు తెలిసినవిషయములనప్పుడే విస్త రించి వ్రాసి నాకందుబడిలోనున్న వజ్రాయుధపత్రికలోఁ బ్రచురించుటచేతను ఏతచ్చరిత మిట్టిరూపముం దాల్చుటకుఁ గారణమైనది. కానిసాధనసామగ్రియంత యు నిందున్నదికదా! అందుచే సావధానముగఁ బునర్ముద్రణంబున నేర్చి కూర్చి మార్చి దీని సరిచేయువచ్చునని మనస్సును సమాధానపఱచు కొంటిని. ఈలోపున దీనిం జదువు పాఠకమహాశయులిందుఁ గల వివిధవిషయముల నన్నింటి నెట్లుసమకూర్చి మార్చుచో నుచితముగ నుండునో కొంచెము నాకుఁ దెలుపుచో నాయాసలహాలను గృతజ్ఞతతో స్వీకరించి తత్ప్ర కారమనువర్తించెదను మఱియునిందాయావ్యక్తులకు సంబంధించినవిషయములను నేవిన్నవిధమున వ్రాసితిని. వీనిలో నేవేని లోపము లున్నచో నాకుఁ దెలిపినఁ బునర్ముద్రణమునఁ గృతజ్ఞతతో సవరించుకొందునని విన్నవించుచున్నాను. శ్రీప్ర మాదములను పెద్దలుమన్నించి నన్నాశీర్వదింతురుగాక. ఇట్లు,

మకాం రాజమహేంద్రవరం
20—6—33

అనంతపంతుల రామలింగస్వామి

శ్రీరస్తు.

శ్రీకృష్ణకవిజీవితము

ప్రథమప్రకరణము.

తే. మానమభిమానమును గల్గి మంచివృత్తి, నొరుల ప్రాపున కాశింపకుండ నెంచి
భరతవర్షంబునం బుట్టి భారతీయు, లైన దేశాభిమానుల కంజలి యిది.

"బొబ్బిలియుద్ధనాటకము."

అని చెప్పియున్నట్లు బ్రహ్మశ్రీ కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రులవారు భరతవర్షంబునం బుట్టి భారతీయులై దేశాభిమానము, మతాభిమానము, కులాభిమానముం గలిగి, మానధనులై, పరాపేక్షఁ బ్రవర్తింపక ఆత్మగౌరవముం గాపాడుకొనుచు మంచివృత్తిం బ్రవర్తించుచు సర్వజనసమ్మతులై యుండియు, వృత్తిచ్ఛేదమైనను దప్పుదారి బ్రవర్తించునధికారుల నైనను సరకుగొనక త్రోసిరా జనునట్టిస్వభావమును, పట్టుదలయును, భూతదయయును, పరోపకారపరతయును గలవారు. తమకార్యము విడిచి పరులకార్యమునకై పాటుపడువారు. తమ కపకారము చేసినవారికిని నుపకారము చేయ నెంచువారు. బీదలను సాధులను బ్రేమించువారు. ఉపన్యాసపీఠము నలంకరించి యెట్లో చెప్పి యెట్లో చేయువారివలెం గాక వీరు యథార్థసంస్కర్తలై యున్నవారు. వీరికి జాతిమతద్వేషమీషన్మాత్రమును లేదు. స్త్రీవిద్యాభిమానముకలదు. అతిబాల్యవివాహకన్యాశుల్కవరశుల్కములు లసమ్మతములు. దైవభక్తియు, గురుభక్తియు, పితృభక్తియు, మాతృభక్తియు మెండు. పెద్దం బొడఁగన్నవారి యెడ గురుభావంబు చేసి ప్రవర్తించువారు. కౌశికగోత్రజు లగుటచేఁ గాంబోలు వీరికిఁ గోపమును మెండు. కాని యాకోపము "ఉత్తమస్య క్షణం కోపః" యన్నట్లు క్షణమాత్రస్థాయి గాని చిరకాలస్థాయి కాదు. నేను నీవాఁడ నన్నచో నెవ్వనికైన నీవసుధామునందు చేతనైన సాయముం జేయఁ బ్రయత్నించునట్టి నిష్కల్మషహృదయుండు. జంప నున్నశత్రునైన శరణుఁ జొచ్చె నేని తన చావునకైనం జంకక వానిని జేరఁ దీయునమాయకుండు. [illegible]

జూచి పరితపించుచిత్తము గల యితండు బాల్యమున విద్యాభ్యాసము చేసి వెనుకఁ బెక్కుగ్రంథములు చేసి కొన్నిపత్రికలు నెలకొల్పి విఖ్యాతిం గాంచె. నానాదేశములు తిరిగి నానారాజసంస్థానములయం దష్టావధానశతావధానములు చేసి గౌరవింపంబడి యనేకస్వర్ణపదకంబులును, కవిరాజబిరుదంబును, ఈలోపలఁ గవిసార్వభౌమబిరుదంబును బడసె. మఱియు శ్రౌతస్మార్తాదివైదికవిద్యలం గ్రహించిన యీశ్రౌతి యనేకయజ్ఞములకు కార్త్వర్యవాద్యార్త్విజ్యములం జేసియుండె. అట్టి యిక్కవిరాజుచరిత్ర మొకగ్రంథముగా వ్రాయుట సమంజసమని తలంచి వారి గ్రంథములనుండియు, వారివంశజులయొద్దనుండియు, వారియొద్దనుండియు, కొన్నికొన్ని విషయంబులు సంగ్రహించి నాతెలిసినచందంబున నిట్లు వ్రాసి ప్రకటింప నెంచితిని. ఈచరిత్రమును వ్రాయునాకు శ్రీ పాలెపు వేంకటసుబ్బారావు బి. యే., బి. యల్., యల్. టి., గారు వ్రాసి ప్రకటించిన "ఆంధ్రపురుషులజీవితములు" అనుపుస్తకమును కవిసార్వభౌములు వ్రాసిన స్వీయచరిత్రమును మిక్కిలిసాయము చేసినవి. నిష్పక్షపాతబుద్ధితో యథార్థస్థితి ననుసరించి వ్రాసిన యీచరిత్రము సర్వజనాదరణీయం బగుంగాక.

—* వం శా ను కీ ర్త న ము *—

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు వెలనాటివైదికబ్రాహ్మణులు, కౌశికగోత్రులు, ఆపస్తంబసూత్రులు, తమవంశజులు శ్రీవిద్యోపాసన చేసియుండుటంజేసి శ్రీపాదవారనుగృహనామము నొందినవారు. అని—

"సీ. అఖిలవిద్యాన్వయవ్యాఖ్యానకాంచితనయకోవిదులు వెలనాటివారు
పౌండరీకాదిసవనకాండసుకరణానందసాంద్రులు వెలనాటివారు
అన్వయజీవేశ్వరాద్వైతమతవర్తనస్వభావులు వెలనాటివారు
దిక్ప్రతతినికీర్ణదివ్యాగమవితరణప్రకాశులు వెలనాటివారు
తే. వారిలోఁ గౌశికమునీంద్రవర్యగోత్ర,జలధిఁ బెక్కండ్రువిబుధులు వెలసియధికు
లైరి శ్రీపాదసేవాపరాత్ము లగుట, కతన శ్రీపాదవారన ఘనత కెక్కె.
శా. సత్యోక్తిజ్ఞనుతశ్రుతిప్రచయశాస్త్రశ్రౌతసంగీతసా
హిత్యజ్యోతిషవైద్యదర్శనకలాహృద్యుల్ లసత్సర్వభా
షాత్వర్గార్థచతుర్విధాధికకవిత్వాంచత్ప్రబంధౌఘని
ర్మిత్యత్యంతవిశారదుల్ పొలుతు రాశ్రీపాదవారున్నతిన్.

మ. సకలప్రస్తుతసత్తపోన్నతతపోంచత్తేజుఁడై వేదమూ
ర్తికమూర్తిన్ ఋషి యయ్యెన్ సృష్టికిఁ బునస్సృష్టిన్ స్థానిర్మించెఁ గౌ
శికుఁ డమ్మౌనివరేణ్యగోత్రభవు లా శ్రీపాదవా రుర్వి నెం
తకునుం జాలినధీరు లంచు మఱియున్ వర్ణింపఁగా నేటికిన్."

అను గౌతమీమాహాత్మ్యములోని పద్యములవలనం దెలియుచున్నది. వీరు వైదికు లైనను మొదటినుండియు వైదికవృత్తిం బ్రవర్తించువారు గారు. మొట్టమొదట నరసాపురోపమండలమందలి గుమ్మలూరను గ్రామంబున నుండు వారు. వీరి పూర్వులు నుద్యోగము మొదలగు లౌక్యవృత్తులం బ్రవర్తించిన వారు. వీరి తాత తాత యగు సర్వేశ్వరదీక్షితులుగారు వేదశాస్త్రశ్రౌతాది విద్య లభ్యసించి క్రతువు లాచరించినవారయ్యు గోదావరీమండలమందలి రఘుదేవపురము రాజధానిగాఁ గలయుందపాటి రాజులసంస్థానమున నుద్యోగపదమం దుండి మాన్యులై శాశ్వతమాన్యముల్ వడసి ప్రసిద్ధి కెక్కి రని:—

"ఉ. శాశ్వతమాన్యము ల్వడసె సన్మతి నేర్చెను వేదశాస్త్రముల్
శశ్వదనంతకీర్తి విలసత్క్రతుతంత్రిగుఁ డయ్యె సర్వభూ
మీశ్వరసేవ్యుఁడై బుధుల నేలె నుమేశ్వరతుల్యుఁ డట్టిస
ర్వేశ్వరదీక్షితాఖ్యు నుతియింపఁగ శక్యమె యెట్టివారికిన్.

అను నీగౌతమీమాహాత్మ్యమునందలి పద్యమువలనం దెల్లమగుచున్నది. సర్వేశ్వరదీక్షితులుగారి యర్ధాంగలక్ష్మి యగుపాపసోమిదేవమ్మగారు తనతండ్రి యగువారణాసి కేశవయ్యగారికడ నన్నదమ్ములతో ఘనాంతముగా యజుర్వేదమును, చయనాంతముగాశ్రౌతమును నధ్యయనము చేసినవిదుషి యనియుఁ ప్రభావనిధి యనియు, సాక్షాత్పరదేవత యనియు నెఱింగి కవిసార్వభౌములు తన శ్రీకృష్ణభారతమున :—

"మ. ఘనపాఠంబుగ వేదముం జదువుటే కా కార్యసంస్తుత్యమై
చనుమాహాత్మ్యమునం జగం బెఱుఁగ నాసావిత్రిపోలెం బతిం
దనరం జేసినపాపసోమిదమనున్ నాతాతకుం దాతప
త్నిని సాక్షాత్పరదేవతామతి మెయిన్ నే నెంచి కీర్తించెదన్."

అని స్తుతించి యున్నారు. ఆసోమిదమ్మగారొకపర్వమునఁ దమయింట నిష్టి జరుగుచుండఁ దనభర్త యాజమానములలో నెటనో కొంచెము తప్పి

పోవగాఁ గర్మలోపం బగు నని నెమ్మదిగా నిది మిద్ధ మని చెప్పెనఁట! దీక్షితు లది తనకుఁ బదుగురిలో నవమాన మని తలంచి మహాగ్రహాగ్రస్తచిత్తుండై *ధృష్టితో నామెమోమునం గొట్టెనఁట! అట గంటు పడి రక్తము స్రవింప నది భూమిపయిం బడినఁ గీడని పాపసోమిదమ్మ తనచేలచెఱఁగున గంటుఁ గప్పి పుచ్చెనఁట! రక్తప్రవాహముం గాంచి యుష్ట్రికాధ్వర్యవము చేయు నామె తమ్ముఁడు కాలాగ్నిరుద్రుండై మండిపడి తనచేత నున్న జుహూపభృత్తుం ధాత్రిం బడవైచి యొక్కమొగి మిగ్గిగేయుచునో యన శాప్రకునిమయిం బడెనఁట! అప్పుడు సోమిదమ్మ తమ్మునికడ్డమోయి యిది నీకుఁ దగదు తగదు శాంతింపుము శాంతింపు మని వారింప నతండు నిన్నేల గొట్టనయ్యె నీరక్తంబు నా కాగ్రహం జూడక నాకు శాంతస్వభావము గాక యున్న దనిన నామె సభాన్యులు నన్నుఁ గొట్టలేదు. ఇది రక్తము కాదు. నూనె యని గార్హపత్యముహోమభస్మంబుం గొని గంటుపైఁ గొంతయు, రక్తప్రస్రవముపైఁ గొంతయు, వ్రేసికొనియె నఁట! అయ్యమ్మప్రభావంబునం జేసి గంటుగాని రక్తముగాని యెవ్వరికిని గానరావయ్యె నఁట! ఆహా పాపసోమిదమ్మమహాత్మ్య మేమని వర్ణింతు!! నుతించు నిట్టి పరమాద్భుతంబు లెన్నియో యాసతీమతల్లియందుఁ జూడఁబడె నని తెలియం బడుచున్నయది. ఆమె తనకొడుకు వేంకటశర్మగారికిఁ దానే వేదశాస్త్రంబు లుపదేశమాత్రంబున నొసంగినట్లు లోసంగె నని చెప్పుదురు. వేంకటశర్మగారు నరసాంబ యనుసాధ్విం బరిణయమై యామెయందు సుబ్రహ్మణ్యము, సర్వేశ్వరదీక్షితు లనునిరువురఁ గుమారులం గాంచి ముప్పదిరెండవసంవత్సరమునఁ గైవల్యంబు నొందె ననియు నతనిపుత్త్రుఁడు సుబ్రహ్మణ్యముగారు వేదాధ్యయనము మాత్రము చేసియు నప్రతిగ్రహీతలై యొరుల నెవ్వరి నాశ్రయింపక నియమవ్రతంబున నుండి సర్వదా పరమేశ్వరారాధనంబు సేయుచుఁ గాలంబు గడపిరి. అసుధీతిలకమునకుఁ గామాంబ యనుసతియందు వేంకటసోమయాజు లనుపుత్త్రుఁడును సుందరమ్మ, యజ్ఞమ్మ యనునిద్దఱు పుత్త్రికలును బుట్టిరి.

—* తల్లిదండ్రుల వృత్తాంతము. *—

ఈవేంకటసోమయాజులుగారే మనకవిసార్వభౌముని పితృపాదులు. వీరు వేదశాస్త్రశ్రౌతము లభ్యసించి జ్యోతిషమందును వైద్యమందును నభిజ్ఞులై

* ధృష్టి = అగ్నిహోత్రమును గల్పించునపుడు నేర్పడి తెడ్డువలెఁ జెక్కబడి యున్న దారుపాత్రము.

లోకజ్ఞులై కోట రామభూపతి దేవుగారి సంస్థానమున మంత్రిపదంబునొంది ప్రఖ్యాతిం గాంచి యగ్నిష్టోమాదియజ్ఞములం జేసి పవిత్రశరీరులై పరంధామంబు నొందిరి. వేంకటసోమయాజులుగారు నుభయభాషాపాండిత్యము గలిగి మంచికవిత్వము చెప్ప నేర్చినవారు. వారు పురాణముచదివి యర్థము చెప్పునప్పుడు శేషుడు లాలింపం దగునట్లుండు నది యని ప్రసిద్ధి కలదు. వీరిట్టి ప్రతిభాశాలు లని శ్రీకృష్ణ భారతములోని :—

“మ. సుకులీనుం డయి వేదశాస్త్రములు సంశోధించి సోమాసినై
సుకవీంద్రుం డయి రామభూపతికడన్ శోభించి మంత్రీంద్రుఁడై
సుకలుండై సకలావనీసురవర స్తోత్రాతిపాత్రుండునై
సుకృతం బందిన వేంకటాధ్వరిబుధేశుం గొల్తు మాతంజిత్రినిన్.”

ఈపద్యమువలన నదే తెలియుచున్నది. వేంకటసోమయాజులుగారు తమ బాల్యమున తండ్రి పరలోకగతుం డగుటం జేసియుఁ దమకుఁ గలభూములు పాడుబడుటంజేసి కలిప్రవృత్తి దేశము పీడింపబడుటం జేసియు భోజనభాజనములకు మిక్కిలి శ్రమపడి నివాసస్థాన మగుకొండపర్తి గ్రామము విడిచి పీఠికాపురముదరి నున్న కొమరగిరిపురం బను మాతామహస్థానమునకుం జని యట మాధుకర వృత్తిం జేసి తాను జీవించి విద్యాభ్యాసంగము జేయుటయే కాక తనతల్లిని జెల్లెండ్రను పోషించి నట్లు వినికతిం దెలియవచ్చె. ఇట్లు పదునేను పదునాఱు సంవత్సరములనడుమ నడచినపిమ్మట సోమయాజులుగారొక్క సమయంబున గోకవరంబుకడ నున్న క్రొత్తపల్లి యను గ్రామమునకుం జని యటఁ గొంచెము చుట్టఱికము గల్గి యున్న రుద్రాభట్ల యజ్ఞమ్మ యను నామె యింటం జేరి కొంత కాలమున కామునలమ్మగారిదయకుం బాత్రులయి యామె యాస్తికిం గర్తలై పాలున కేడెనిమిదివందల రూప్యముల రాబడి గల భూస్వామ్యము గలవా రయిరి. ఆ కాలముననే కోట రామభూపతి దేవుగారి దర్శనము చేయుటయు వెనుక నట దివానుగా నుండుటయుం గలిగినది. అప్పటికి సుమారు వారికి మూఁపదియైదు సంవత్సరము లుండవచ్చును. అంత వారి ప్రథమభార్య లక్ష్మీదేవమ్మగా రపుత్రవతియై కాలధర్మము నొందె నని విని తాళ్ళపూడి గ్రామవాస్తవ్యులు వేదశాస్త్రస్మార్తవిద్యానిధులు యాయజూకాన్వయసంజనితులు యజ్ఞకర్తలు కర్మఠులు నగు కల్లూరి సుబ్రహ్మణ్యసోమయాజులుగారు తనసహధర్మిణి మహాలక్ష్మీసోమిదేవమ్మగారు సందేహించుచున్నను తమ ద్వితీయపుత్రిక యగు వేంకట

సుబ్బసోమిదేవమ్మగారి నిచ్చి వివాహము గావించి రఁట. ఈసోమిదేవమ్మగారే మనకవిసార్వభౌముం గన్నతల్లి. ఈమె చదువను వ్రాయను నేరకున్నను దండ్రి కడఁ గొన్ని సామెతలును, కొన్ని పద్యములును నేర్చి కొనియుండెనని శ్రీకృష్ణ భారతపీఠికవలన నేవిని యెఱుంగుదుము. వేంకటసోమయాజులుగారీ వేంకటసుబ్బ సోమిదేవమ్మగారివలన గార్హస్థ్యధర్మముల నెఱవేర్చుకొనుచుఁ బదుగుర్వురు స్త్రీ పురుషసంతానముం గాంచిరి. అందిప్పు డిద్దరు పుత్రులు నిద్దరు పుత్రికలును సజీవులై యున్నారు. మన కవిసార్వభౌమునకు మున్ను పదుగురు పుట్టి గిట్టిరని తెలియుచున్నది. ఆపదుగురిలో లక్ష్మీపతి యనునొకపుత్రుండు మోమునఁ దన నామంబు వెలెనొప్పుచుండు రేఖలతోఁ బుట్టి లక్ష్మీపతియో యనం బొలిచి నాలుగుమూఁడు వత్సరములు మాత్రము జీవించి కైవల్యంబు పొందెనని విందుము. ఈలక్ష్మీపతి తనజీవితకాలములో నెన్నియో మహాద్భుతములఁ గనఁ బఱచెనని శ్రీకృష్ణభారతమందలి విజ్ఞాపనవలనం దెలియ వచ్చెడిని. ఈపుణ్యమూర్తి యగులక్ష్మీపతిం గూర్చి మనకవిసార్వభౌముఁ డొకానొకసంకటసమయంబున :—

శా. శ్రీచూర్ణాంకితఫాలభాగుఁ డయి లక్ష్మీపత్యభిఖ్యాధరన్
బ్రాచుర్యప్రభ జన్మ మందినమదగ్రప్రోద్భవుం బెక్కునా
ళ్ళీచాయం జిరజీవిఁ జేయక ననున్ హీనుం బశుప్రాయునిం
గాచంబుం గొఱ గానివాని నిలుపంగా నేల సర్వేశ్వరా.

అని చెప్పియున్నారు. అట్టిసుకుమారుండు తమ్ము విడిచి పరలోకంబునకుం బోయినదుఃఖంబునం జేసి తల్లిదండ్రులు శోకార్ణవనిమగ్నమానసులై చిరంబు పరితపింపనై రనుట స్వభావమే. ఆవిచారంబునం జేసి వేంకటసోమయాజిగారు ఉద్యోగమును విడిచి కొత్తపల్లినుండి సకుటుంబముగా నెర్నగూడెము దగ్గ రున్నదేవరపల్లె యనుగ్రామంబున కరిగి యట నెట్లో దేహయాత్రం బుచ్చిరని తెలియవచ్చినది. (ఈదేవరపల్లి సోమిదేవమ్మగారి తల్లి పుట్టినిల్లగుటచేతఁ గొళ్ళపూడిన్ విడిచి తల్లియు సోదరులు నందే యుండి రాకారణంబున వీరు నటఁ బోయి యుండిరని యెఱుంగునది) ఇట్లాగ్రామంబునఁ గొన్ని సంవత్సరంబులు నివసించి యప్పటికిఁ దముగన్నబిడ్డ లందఱు నిట్లు వృథవోవుటయే కాక శేషించి లక్ష్మీపతి పోవుట కాదంపతు లింతింతనరానిసంతాపంబునం గుందుచుండిరి. పురుషు లగుటచే సోమయాజులుగారు లోకవిధముగాఁ బ్రవర్తింపఁ గలి

నను సోమిదేవమ్మగారు నిరశనవ్రతంబు పట్టి సర్వదా పల్యంకమే శరణంబుగా వేఁగి కృశించిరి. అట్టిసమయంబున నాయూరి కొక్కింతదూరంబున నున్న యచ్చమ్మ పేట యను గ్రామములో నొక యోగి కలం డనియు నతఁడు మహా తపస్వియు వాదమంత్రజ్ఞుఁడు ననియు నెఱింగి సోమయాజులుగారు తమ జ్ఞాల కులతో నటఁ జని యోగిం గని నిజవృత్తాంతం బంతయు నివేదించిన నమ్మహా త్ముండు సధ్యాననిశ్చలమనస్కుం డయి యొక్కింతతడ వుండి సోమయాజిం జూచి "నీవు పూర్వజన్మంబున నొకసర్పరాజమును జంపితివి. దాని కడుపులో నపుడు పదిగ్రుడ్లుండె. ఆపాము ప్రాణములు విడుచునప్పుడు తనపిల్లలలెక్క నీపిల్లలును హతు లగుదు రని శపించె. ఆకారణంబున నీ కిట్లు సంప్రాప్తంబయ్యె. నీ వాశాపఫలం బనుభవించితివి. నీ కింక నాదోషంబు లేదు. నీ వింటికిం బోయి ఇరువదియొక్కదినంబులు పయోవ్రతంబున నొక్కమహావల్మీకముకడ సర్ప పూజఁ జేయుము. దాన నీ కుత్తమసంతానంబు గలిగి జీవించు. మఱియు గరుడారాధనంబు ఫలప్రదంబు గావున నీగరుడవిగ్రహంబుం గొని పూజించు చుండుము. నీకుఁ బుట్టినవారి కెల్ల నీతని పేరు పెట్టు" మని దీవించుచు నొకగరుడ విగ్రహ మొసఁగి యంపిపుచ్చె. సోమయాజులు మిక్కిలి సంతసించుచు దేవర పల్లికి వచ్చి యోగి చెప్పినచొప్పున నాగపూజాదికంబు గావించె.

అప్పుడొక్కనాఁడు సోమయాజి భార్యాబంధుజన పరివృతుండై యరుణోదయంబునఁ బుట్టపై జలంబు చల్లి పూజించుచుండగాఁ బరమాశ్చర్యకరంబుగా నొక్కమహాసర్పం బాపుట్టనుండి మెఱపు మెఱసినట్లు వచ్చి సోమయాజి కుత్తుకరుం జుట్టఁ బెట్టుకొని నెత్తిపై పడగ విప్పి యాడి చూచుచుండంగ మరలఁ బుట్టపైఁ బడి లోనికిం బోయె. అది నాగపూజావసానదినంబు. నాఁ డట్లు నాగరాజదర్శనంబున సోమయాజిప్రభృతులు మునుమున్న భయం బందిరి గాని వెనుక నిర్భయులై సంతసించుచు నింటికిం బోయి బ్రాహ్మణసమారాధనాదికం బొనరించి వ్రతసమాప్తిం గావించిరి. అంత నాఁటిరేయి సోమయాజి గారికి స్వప్నములో గరుత్మంతునెక్కి శ్రీకృష్ణుండు ప్రత్యక్షంబై పూజింపఁబడి "నీకిరువురుపుత్రులు నిరువురు పుత్రికలుం బుట్టఁగలరు. వారికి నలువురకును మాయిరువురపేళ్ళుం గూర్చి పెట్టుమని చెప్పి యంతర్ధానంబునొందె. ఈస్వప్న వృత్తాంతమంతయు మఱునాఁడు సోమయాజి బంధుమిత్రాదులకుం జెప్పి వారి

జేతఁ గొనియాడంబడి గరుడవిగ్రహారాధనంబును, కృష్ణవిగ్రహారాధనంబును జేయుచు నల్వురు బిడ్డలం గని వారికి గరుడ కృష్ణనామములు రెండును వచ్చునట్లు పేళ్ళుపెట్టి పుత్రార్థియై వ్రతంబుచేసిన పుట్టినవాడ మనకవిరాజు పుట్టినప్పు డొక్క పిప్పలవృక్షంబుం బ్రతిష్ఠించె. ఇట్లు పుత్రసంతానుండై సకలైశ్వర్యంబులను భవించి యనేక పుణ్యకార్యంబులు చేసి కాటవరమున నొక్క సత్ప్రతిష్ఠం జేసి జగంబుమెచ్చ నగ్నిష్టోమాది యజ్ఞములం జేసి నూఱాఱులుం గోటులును పల్కి రాజమహేంద్రవరపురంబునఁ ప్లవసంవత్సరాశ్వయుజ శుద్ధద్వాదశీ సోమవాసరంబున రాత్రి నాల్గుగంటలకుఁ గొడుకులును, కోడండ్రును, బిడ్డలును, మనుమలును, మనుమరాండ్రు, బంధువులు, మిత్రులు, కళత్రంబును, బరివేష్టించియుండఁ బుత్రునివక్షంబుపై నేను జేర్చి నారాయణ స్మరణంబు సేయుచుఁ బరంధాముం బునొందె. పుత్రులగు మనకవిరాజును, వారిసోదరులును దండ్రికి బ్రహ్మమేధవిధిం బ్రేతసంస్కారాద్యౌర్ధ్వదైహిక క్రియాకలాపంబులను పెండ్లిఁజేసినట్లు చేసిరి. పిత్ర్యర్థవృషోత్సర్జనంబు చేయుచు నానావాద్యప్రచుర్యంబుగ సలిపి గోస్తనంబులకు విధివిధానంబున వివాహంబుగావించి వృషభంబు విడిచిపుచ్చిరి. అది కని వినినవారెల్లఁ బుత్రుండన నిట్టివాఁడే పుత్రుండని సోదరసహితుండగు మనకవిరాజుం బస్తుతించి రీ. మనకవిరాజు ప్లవసంవత్సరాశ్వయుజ మాసమునఁ (1901 సంవత్సరము) తమతండ్రిగారి జ్ఞాపకార్థము పత్రికాముఖమునఁ బ్రకటించి రది యిందుఁ బొందుపఱచుచున్నాఁడను.

"శ్లో. అహన్యహని భూతాని గచ్ఛంతీహ యమాలయం
శేషా జీవితుమిచ్ఛంతి కిమాశ్చర్యమతఃపరం.

అక్కటక్కటా!! మా కెంతసంతాపకారణము సంప్రాప్తమైనదే! ఎంతలో మేము హితబోధ చేయు పెద్దదిక్కులేనివార మైతిమి! సంసార సాగరంబునం బడని మా స్వేచ్ఛాజీవనంబున కెంత భంగపాటు వాటిల్లినది! హా హా! సర్వదా లేఖినింబుస్తకంబులుం బట్టు మా చేతితోఁ దలుగుం దర్భలుం బట్టవలసివచ్చినది! కటా! ఈయుంటకును సర్వసమర్థులు నాహితాగ్నులగు మాతాతగారగు వేంకట సోమయాజులుగారు లోకాంతరగతులగుటయే కదా కారణము! అయ్యయ్యో! మాకై పడరానిపాట్లంబడి చేయలేని యనేక నియమవ్రతంబులుచేసి కనిపెంచి పెద్దవారిం గావించి కంటికి ఱెప్పవలెం గాచి రక్షించు మా పితృపాదులు

మ మ్మందఱ విడిచి ఘోరమృత్యుముఖంబునంబడుటం జేసి తదాత్మనగు నే నిప్పుడు పడెడు పరితాపంబు చెప్పనలవిలేదుగదా! "జాతస్య మరణం ధ్రువం" బనుటం బట్టి పుట్టినదంతయు గిట్టునసియు, తాతవంటివాఁడే తండ్రియు, తండ్రివంటి వాఁడనే నేనునని యెఱుంగుదు నిది కాలధర్మమే యని యెఱింగియు నిట్లు పరిదేవనంబునొందుట కాలధర్మంబునొందిరనుటకంటె ధర్మము కాదుగాని నా కలుగఁబోవు కష్టపాటుల నాయుల్లం బిట్లు తల్లడించుచున్నది. ఎంతవృద్ధులైనఁ దల్లిదండ్రులుంట సేగియనువారుండరు. పితృమాతృపుత్రమైత్రియు ఘనం బనుటలోకసామాన్యమేగాని నావిషయమై మాతండ్రిగారు పడినశ్రమ యింతయనరాదు. లోకాతీతమయినది. నావలన వా రింతయును సుఖంపడలేదు. సుఖపడవలసి వచ్చునరికి మిత్తివాతంబడవలసివచ్చెఁగదా యని నే నింతక విచారించుచుంటిని గాని సహస్రమాసజీవులగువారి మృతి కెవ్వరును విచారింపవలసియుండదు. వా సత్తమోత్తములు వారి చారిత్ర మించుక వివరించుచున్నాఁడను.

శ్రీ వేంకటయజ్వగారు సర్వజిన్నామసంవత్సర వైశాఖబహుళతృతీయా సోమవాసరంబున జన్మించినారు. ఈప్లవసంవత్స రాశ్వయుజ శుద్ధ ద్వితీయా సోమవాసరంబున బరమపదమునొందినారు. యీయంతరము డెబ్బదినాలుగుసంవత్సరముల నాల్గుమాసముల పదమూఁడు దినములు. పై సంవత్సరములలో సుమా రిరువదియై దధికమాసములు రావచ్చును. కాఁబట్టి వీరు డెబ్బదియాఱు సంవత్సరముల యైదుమాసముల పదమూడుదినములు జీవించినారని చెప్పవచ్చును. వీరు బాల్యమున మిక్కిలి సుఖపడకపోయినను అన్నవస్త్రములకు మాత్రము ఇక్కట్టుపడనట్టు తల్లిదండ్రులచేఁ బెంపఁబడిరి. పిమ్మట తండ్రిగారు పోఁగాఁ దామే యొకవిధముగా గృహకృత్యములు చక్కఁబెట్టుకొనుచు విద్యాభ్యాసమును జేసి, సంస్కృతాంధ్రసాహిత్యమును, జ్యోతిషమును, వైద్యమును, శ్రౌతస్మార్తములును, సంపాదించి పురాణపఠనమం దసాధారణప్రజ్ఞ గలవారయి లక్ష్మీదేవి యనునొకసతిని బెండ్లియాడి సుఖముగాఁ గాలయాపనంబు చేయుచుండిరి. అంతలో నాలక్ష్మీదేవి యత్యల్పజీవయై లోకాంతరగతురాలయ్యెను. పిమ్మట సోమయాజులుగారు గోకవరముకడనున్న కొత్తపల్లిగ్రామములో రుద్రాభట్ల యజ్ఞమ్మ యనుచుట్టము నింటఁ బోషకపుత్రునివలెనుండి యామె వ్యవహారములన్నియుం జక్కఁబెట్టుచునుండి కోట రామభూపతి దేవుగారి యాస్థానముం జేరి మంత్రియై రాజకీయ తంత్రంబుల నెరవేర్చుచుఁ జిరకాల

ముండి సర్వజనస్తోత్రపాత్రులయి విరాజిల్లిరి. ఇది విని తాళ్ళపూడి గ్రామవాసులు శ్రీ కల్లూరి సుబ్రహ్మణ్యయజ్వగారు తమ కుమార్తెయు, మాతల్లియు నగు వేంకటసుబ్బసోమిదమ్మగారిని కన్యాదాన మొసంగిరి. వేంకటాధ్వరిగారు మరల దారసంగ్రహము జేసినవారయి భాగ్యవంతులయి సుకలులయి క్రొత్తపల్లెలోనుండి వచ్చి పోవువారి కెంతయే మృష్టాన్న మిచ్చుచు బెద్దల నారాధించుచుండియు గోదావరీతీరమును విడిచి మఱియొకచోట గాపురము జేయ నిష్టములేక జన్మభూమియగు కోటవరమునకు వచ్చి నిత్యనివాసంబుండిరి. వీరికి స్త్రీపురుషసంతానము పదునల్వురు. అందు మేము నల్వురము మాత్రము చిక్కియుంటిమి. తక్కిన పదుగురును దక్కరయిరి. వారిలో లక్ష్మీపతియను నొక్కకుమారుడు శ్రీచూర్ణాంకితఫాలభాగుడయి లక్ష్మీపతియోయనంబుట్టి నాలుగువర్షంబులు వారి నానందవార్ధి దేల్చి మృతుండయ్యె. అల్లారుముద్దుల పట్టియగు నామహామహుని యువతారాంతముగా వారు పడిన పరిదేవనంబు చెప్ప దరంబుకాదు గదా సర్వసుఖంబులం దూలదూగుచుండియు నిట్లు పుత్రశోకంబునం బొక్కుచు మాతండ్రిగారు కొండఱు మహాత్ముల ప్రబోధనంబున గొన్నివర్షంబులు నియమవ్రతంబుల గరుత్మంతు నారాధించిరి అంతలో నొక్కరాత్రి స్వప్నంబున గృష్ణునితో గరుత్మంతుండు పొడగట్టి నీకింక బుట్టిన వారికి మాయిరువుర పేర్లుం గలిపిపెట్టుము. వారు చిరంజీవు లగుదురని చెప్పినట్లు తోచె. అంత శాంతిగావించి బ్రాహ్మణాదుల కన్నదానాదు లొసంగి సుఖంబుండిరి. అంత గొంతకాలమునకు నేనును, వెనుక నిద్దఱాడుబిడ్డలును, దరువాత నొక్కమగపిల్లవాడును గలిగితిమి. ఇట్లు పుత్రవంతులయి యనేక మాన్యక్షేత్రంబులు సంపాదించి యనేక దివ్యస్థలంబుల సేవించి యొరుల నరకు గొనక దైన్యవిహీనజీవనంబున గాలయాపనంబు సేయుచు, అధికధనవ్యయంబుగా దీక్షితులయి హవిర్యాగంబు చేసి యజ్ఞుల నారాధించుచు బిమ్మట సోమయాజియై సర్వపర్వంబుల నింద్రాది దేవతల విశ్వదేవతల హవ్యకవ్యంబుల బరితృప్తులంజేయుచు వైరాగ్యంబు వడసి సంసారంబున గీలాలకీటన్యాయ మనుసంధించి సంచరించుచు సర్వదా పురాణకాలక్షేపంబును భగవద్గుణానుకీర్తనంబును జేయుచు సహస్రమాసజీవు లసంజెల్లి, గోదావరీతీరంబున మార్కండేయక్షేత్రంబున పుణ్యదినంబున నారాయణస్మరణము నే జేయుచు సర్వబంధుమిత్రజనసమక్షంబున నాహస్తంబులం దలపెట్టుకొనియుండి నా దెచ్చి పోసిన భాగీరథీవారిం

గ్రోలుచు లోకాంతరగతులయిరి. వారి కళేబరంబు గంగాగౌతమీజలంబుల సమంత్రకంబుగ నభిషేకింపఁబడి బ్రహ్మమేధవిధివిధానంబున సర్వయజ్ఞపాత్రలతో త్రేతాగ్నులకాహుతిగా నొసఁగి పునర్దహనవిధియు నొసంగి సర్వ శల్యభస్మాదికంబును గంగార్పితంబు గావించి యథావిధిగాఁ బితృయజ్ఞం బొనరింపంబడియె. పూతశరీరు లగుటకు వారి యవసాన స్మరణము నారాయణ స్మరణము పుణ్యదేశకాలాదులును బ్రమాణము. ఇఁక మాపాట్లు దేవున కెఱుక. వారి యాత్మ యాపరమాత్మతోఁ గలిసి సుఖించుచుండుఁగాక.

కాటవరము. }
1—10—01 }

తదాత్మపుత్రుఁడు
"శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి."

అని వ్రాసి ప్రకటించినారు. పిమ్మటఁ బదిసంవత్సరములకు మన కవి సార్వభౌముల తల్లిగారు వేంకటసుబ్బసోమిదేవమ్మగారు రాజమహేంద్రవరములో వీరి చెంతనే పరమపదమునొందిరి. సోమిదేవమ్మగారికి మృతికి మూఁడు సంవత్సరములకు ముందు నేత్రావరోధము కలిగినది. మృతికి ముందొకసంవత్సరము వారి కపస్మారరోగ మదయించినది. జ్ఞానము చెడినది. దేహగేహము లెఱుఁగక అన్నవస్త్రము లెఱుఁగక శ్రమపడినారు. ఆకాలమున మన కవిగారు వారికిస్నానముచేయించి, అన్నముకలిపిపెట్టి, మలమూత్రములు తానేయెత్తి బాగుచేసి, పరిచర్యచేసినట్లుకనివిని యెఱింగినవారు పెక్కురుచెప్పినారు. కవిరాజుగారెపుడేని గ్రామాంతరమునకుఁ బోయిననాఁ డాయమ్మకుఁ దిండి లేనేలేదు. ఎవ్వరుపెట్టినను దినరు. కవిరాజుగారు ప్రతిదినము అన్నము కలిపి తినుమని పెద్దపెద్దకేకలుపెట్టి భోజనముపెట్టువారట. ఇట్లొకసంవత్సరమైనపిమ్మట నల సంవత్సర భాద్రపద బహుళైకాదశీ దినమున రాత్రి బరలోకగతికైరి. తండ్రిగారికింబోలె నీతల్లిగారికిని బ్రహ్మమేధవిధింజేసి పితృకార్యము నిర్వర్తించిరని తెలియుచున్నది.

మన కవిరాజుగారు తనవలనఁ దల్లిదండ్రులు సుఖపడ లేదనియుఁ బితృఋణము తనకుఁ దీఱలేదనియు నొక్కప్పుడు నాతోఁ జెప్పియున్నారు. వేంకటసోమయాజులుగారు బాల్యమున ధనలోపంబున నించుక కష్టి నొందినను బిమ్మట నామరణాంతము ధనముతోఁ దులఁ

దూఁగినారని చెప్పవచ్చును. రుద్రాభట్ల యజ్ఞమ్మగారిధనమే కాక కోట రామభూపతిగారియొద్ద దివానుగా నుండి మిక్కిలిధనమును సంపాదించిరఁట! యజ్ఞమ్మగారు తన కిచ్చినభూములు స్వార్జితములైనను దనపినతండ్రిగారికి వానిలో సగము భూములు పంచిపెట్టినారు. ధర్మకార్యములకు వేలకొలంది వ్యయము చేసినారు. సాలునకు నాలుగువేల రూప్యములు వచ్చుభూములను సంపాదించినారు. అట్టివారొరులపాలైపున కాశింప నక్కఱ లేదుకదా! వీరు రాజమహేంద్రవరములో మనకవిగారిం జూడ వచ్చి యచ్చట మరణంబు నొందిరి. వారు మరణించినప్పుడు మనకవిచేతిలో నొక్కకాని యైనను లేదు. కార్యమెట్లు గట్టెక్కునా యని విచారించుచుండ నాయన చిన్న చెల్లెలు కృష్ణవేణమ్మగారు వచ్చి నాయనగారు నిన్న సంధిమాటలలో నీకరంజాగూటిలో నేఁబదిరూప్యములును గుండలములు పెట్టినట్లు చెప్పినారు. అది నిజమా యని నేను గూడ చూచితి నందుఁ జెప్పినచొప్పున రూపికలుఁ గుండలములు నున్నవని తెచ్చి యిచ్చెనఁట! ప్రథమదినకృత్య మారూపికలతో మనకవిరాజు నడపించినాఁడు. కర్మకాండము నొనర్చుటకు రాజమహేంద్రవరము నుండి కాలవరమునకు వెళ్లి ఉత్తరక్రియలకు ఋణమునిమిత్త ముత్తరము వ్రాసి ములకల్లంక యనుగ్రామమునకు మనుగలిని బంపించినారు. అంతలో సంధిలోఁ దండ్రిగారు చెప్పినమాట నిజముగునో యని వారిచెల్లెలు గార్హపత్యము త్రవ్వగా నం దొకనిలువుచెంబులో పదునైదువందల రూప్యములుండెనఁట ఆరూప్యములం బెట్టి మహావైభవంబున గర్మకలాప మంతయు నొనర్పఁ బడిన దనియుఁ దానుతండ్రి జీవించినప్పుడుగాక యనంతరమున దైనను వారికిఁ గా నొక్కదమ్మిడీ యైనను వినియోగము చేయలేక పోయితి ననియు మనకవిగారు నాయెదుట ననేకపరులు చెప్పి విచారించినారు. తల్లిగారి కైన నొకసంవత్సర మేమి యుపచారము చేసి యన్నము పెట్టి పోషించినారో చెప్పఁ జాలము కాని ఆమె తల్లిదండ్రులిచ్చిన సొమ్ము వారికొరులసొమ్మున కాసింప నట్లున్నదఁట మనకవిగారు తమతల్లిదండ్రులకు జీవితకాలములో శుశ్రూష చేయలేకున్నను ఇప్పుడు ప్రత్యాబ్దికములు బహుశ్రద్ధతో జరిగించుచుందురు. ఇది వీరి తల్లిదండ్రుల వృత్తాంతము.

శ్రీరస్తు.

శ్రీకృష్ణకవిజీవితము

ద్వితీయప్రకరణము.

జన్మాదికము.

ల చ		కే	చ	శ	రా గు కే
కు	రాశి	గు	కు	అంశ	
రా	ర. శ.	శు	ల బు శు		

ఇట్లు గ్రహంబు లమరియున్నప్పుడు మనకవిరాజు శాలివాహనశకంబు 1788 సంఖ్య నెసంగ క్షయసంవత్సరాశ్వయుజ కృష్ణ షష్ఠీ సోమవారము పునర్వసూనక్షత్ర యుక్తమిథున లగ్నమందు రాత్రి నాలుగు గడియలకు (29-10-1866) జననమొందె ననిః—

మ. జయకృచ్ఛాలిశకం బిభేభశిఖరిక్ష్మాసంఖ్య నొప్పారున
క్షయవర్షాశ్వినకృష్ణపక్షు విలసత్షష్ఠీందువారంబునం
బ్రియ మొప్పన్ జనియించినాఁడు గృతసావిత్రీచరిత్రాదికా
గ్రియకావ్యుండు సుధీవిధేయుఁడు వరశ్రీపాదకృష్ణాఖ్యుఁడున్.

అనుగౌతమీమాహాత్మ్యమునందలి పద్యమువలనను—

చ. మిథునము లగ్నమందు శశి, మీనమునం గేతుఁడుం వృశ్చికంబునన్
బుధకవు లెంటరిభూమిజుఁడు పొల్తుక రాహువు నక్రమందు న
బ్బుధగురువుం దులన్ శనియుఁ బూనఁగ, నాగ నిభేభభూధరిభూ
పరిధితశకంబునన్ క్షయశరత్కలితేషమునన్ జనించితిన్.

అను పద్యమువలననుం దెలియవచ్చుచున్నది. ఇక్కవిజన్మస్థాన మెన్నగూడెమునొద్ద నున్న దేవరపల్లి యని లోఁగడనే చెప్పియున్నాఁడను. ఇట్లు పుట్టినయితండు తల్లిదండ్రులకును మాతామహికిని మేనమామలకును నల్లారుముద్దుగాఁ బెరుగుచుండెను. ఇతఁడు గర్భస్థుండై యుండఁ దల్లిగారు వెనుకఁ జెప్పిన కారణంబునం జేసి పల్యంకమే శరణముగా వేగించుచున్నది గావునఁ దాను కృశించియున్న కారణంబున నిక్కుమారుండును బుట్టుకతోనే కృశాంగుండై యుండె జన్మప్రభృతి యేదియో యొకతెవులు శిశువును బీడించుచునే యున్నది. ఇట్లు రోగపీడితుండై కృశించియున్నవానికి రెండవసంవత్సరము చివరనో మూఁడవ సంవత్సరము మొదటనో గాని విషూచివ్యాధి వచ్చినది. ఆకాలమున నాగ్రామమున దినమునకుఁ గొన్ని పదులజన మావ్యాధివాతంబడి మడియుచుండెను. మనకవిరాజు నట్టిస్థితికే వచ్చినాఁడు సర్వము సంపూర్ణ మయినది. మృత్యువాసన్న మయిన దని వాని నవ్వాలకుం గొనిపోయిరి. ఆలో దుఃఖనిమగ్నుండగు సోమయాజికి స్వప్నంబున నిష్టదైవం బగు గరుత్మంతుండు పొడకట్టి "బాలునకుఁ బ్రాణభయంబు రాదు" అని చెప్పి పోయెనఁట! అంతఁ గ్రమక్రమంబున బాలుండు పునర్జీవితుండై క్షీరపానంబు చేసె. దానంజేసి యతండు మఱింత కృశించినవాఁ డయ్యె మఱియొకప్పుడు మనగ్రంథకర్తకు నెత్తిపై మంత్రసంబంధమైనమాద యనంబడు కురుపులు వైచి యావి కొన్ని మాసములవఱకును నెన్నిమంత్రము లెన్నిమందులు వైచినను గుదరక మిక్కిలి వేధించె. అవలఁ గోడూరు సుబ్బయ్య యనువైద్యుఁడు నూనితో మందుచేసి పదిదినములలోఁ గుదిర్చెనఁట. ఇదియు నప్పుడు కొంతకార్శ్యమునకుఁ గారణంబయ్యె. ఆకురుపుల మచ్చలిప్పటికిని గవిరాజుశిరంబునం బొడకట్టుచున్నవి. (సోమయాజిగారికి మహాయోగి యొసంగిన గరుడవిగ్రహము నారాధించుటం జేసి సంతానప్రాప్తి యయ్యె నని వ్రాసియుంటిని. అది మొదలుకొని ఆయనకు గరుత్మంతుఁ డిష్టదైవంబయ్యె. సోమయాజిగారు లోఁగడఁ దన దేతార్చనములో నాగరుడవిగ్రహమును బూజించుచునె యుండినారు. వారు కాలధర్మము నొందునప్పుడు తాము సంపాదించి యుంచిన సాలగ్రామముల నెల్లఁ బ్రాహ్మణులకిచ్చి నేను నిత్యమును పూజించు లక్ష్మీనరసింహ మనుసాలగ్రామమును గరుడవిగ్రహమును నీవు పూజించుచుండు మని చెప్పెనఁట! కవిరాజు చెప్పిన చొప్పునఁ దండ్రిగారియంత్యకర్మావసానమున బ్రాహ్మణుల కొక్కసాలగ్రామము నొకరూప్యము చొప్పునఁ

రెండువందలకు మించినసాలగ్రామదానము లొనర్చి లక్ష్మీనరసింహసాలగ్రామము గరుడవిగ్రహమును దా నారాధించుచుండెనఁట! ఆసాలగ్రామమం దొక మహావిశేషము గలదు. అభిషేకానంతరము బిలములో గుడ్డపెట్టి తుడిచి సంపుటములోఁ బెట్టి మఱునాఁడు చూడ నాసాలగ్రామములో నాచమనమునకుఁ జాలినన్ని నీళ్లుండు నని తెలియ వచ్చినది. అట్లు పూజించుచు మనకవి తమకు నొకప్పుడు జాతాశౌచము రాఁగా వెండిసంపుటముతోఁ గూడిననాసాలగ్రామ గరుడవిగ్రహాదులను రాజమహేంద్రవరమున సుబ్బయ్య యను నొక బ్రాహ్మణునకిఁ బూజనిమిత్త మిచ్చె నట? ఆబ్రాహ్మణుఁడా వెండికాసపడి మరల నాసాలగ్రామాదికము మనకవి కియ్యలేదు. ఆసాలగ్రామము వీరింట నైదువందల సంవత్సరములనుండి యున్న దని వాడుక. అట్టిదేవతార్చనము పోవుటచేత మనకవి మిక్కిలిచింతిల్లి దాని కెంతయో ప్రయత్నించెను. గాని లాభము లేక పోయినది. అది మొద లితరసాలగ్రామములను బూజింప నిష్టములేనివాఁ డయ్యె నని తెలియ వచ్చినది.)

అట్లుకొన్నిమాసములు చనినవెనుక దేవరపల్లినుండి సోమయాజి సతీసుతసహితుండై రాజమహేంద్రవరమున కుత్తరమున యోజనదూరముననున్న కాటవరమనునిజగ్రామమునకు వచ్చి నివసించియుండె. పిమ్మట నద్దంపతులకు నిద్దఱు పుత్రికలు నొక్కపుత్రుండును బుట్టిరి. ప్రథమపుత్రుఁడైన మనకవి రాజునకు గరుడాచల కృష్ణమూర్తి యనియు రెండవపుత్రునకు గరుడాచల రామకృష్ణమూర్తి యనియు, ప్రథమపుత్రికకు గరుడాల కృష్ణవేణమ్మ యనియు ద్వితీయపుత్రికకు గంగాచల గరుడకృష్ణవేణమ్మ యనియు, నామధేయములు పెట్టఁ బడియె. తల్లిదండ్రుల కతిప్రణయుం డైనమనకవిరాజు బాల్యంబునుండియు గారాబంబునం బెరుగుచుఁ దనపట్టినపట్టు నెఱవేఱువఱకునుఁ బోరు పెట్టుచుండు వాఁడట. తండ్రిగారు ప్రతిదినము నుదయమున వెండిగిన్నెలో నన్నము గలుపుకొని తమయింటికి కొక మైలుదూరమున నున్న మేకలమందకడకుం దనయుం గొంపోయి మేకకొకముద్ద పెట్టి వీని కొక ముద్ద దినిపించుచుండునఁట. ప్రతిదినమును మేకకుఁ బెట్టినపిమ్మటఁ గాని తానన్నము తిననని పట్టుపట్టి యేడ్చుచుండునఁట! లేక లేక పుట్టి పెఱుగుచున్న బిడ్డఁడు గావునఁ దల్లిదండ్రులు వాని పట్టిన పట్టెల్లఁ జెల్లించుచుండిరని వినవచ్చినది. ప్రతిదినము నట్లు మేకలమంద కడకుఁబోయివచ్చుచుండుట మనకవిరాజున కప్పటికి మూఁడువత్సరములే యున్న

ను దనకిప్పటికిని జ్ఞప్తిలో నున్నదని వారు నాతో నొక సందర్భమునఁ జెప్పి యున్నారు. ఇది గాక యొక విచిత్రము కలదు. వీరికే జన్మసంస్కారమో తెలియదు గాని తాను గర్భములో నుండగాఁ దన యెడమకాలొక ప్రేవులో మడత పడి కాలు చాపుటకు వీలులేక బాధపడినట్లును, తన మరణకాలమందుఁ గుత్తుకలో శ్లేష్మము చుట్టుకొని శ్వాసమాడక బాధపడిన విధమును, అనుభవపూర్వకముగాఁ దెలిసినట్లుండెనని యొక్కనాఁడు మా సంభాషణసమయమున వేఱొరును వినకుండ నాతోఁ జెప్పియొప్పించినారు ఈవిషయమే శ్రీకృష్ణభారతములో భీష్మపర్వమున.

మ. జననంబున్ మరణంబునెట్టి వెత కైసంధిల్లునో తొల్లి నే
ననుభూతంబుగ లో నెఱుంగుదును గర్భాంత్రంబులం జిక్కి చా
పను గాళ్లాడమిఁ గళ్లె కుత్తుకఁ గప్పన్ శ్వాసమున్ రామి యూ
తన కైతిక్ భయ మయ్యె నాకిఁక నటుల్ తప్పింపు మోదైవమా.

ఈపద్యమువలన సూచించినారు. దీనింబట్టి వీరియం దమానుషచర్య కలదని నేను త్రికరణశుద్ధిగా నిర్ణయించుకొంటిని. మఱియు మనకవికి దైవసాక్షాత్కారముఁ గలదు. ఆవిషయము ముందు వ్రాయుదును. మూఁడవసంవత్సరము మొదలుకొని మనకవిరాజునకు దనపెట్టెలు, తనబట్టలు, తనయాటవస్తువులు నేర్పడ యుండునటుండుటయు నైదవసంవత్సరమందే తమతండ్రిగారు చెప్పనుంచుటం జేసి పురాణములకథలను విశేషించి భారతము నందలికథ లెల్లఁ దెలిసినవారై భారతప్రియు లయినట్లు.

మ. "అయిదారేడులయీడునం బ్రతిదినం బా భారతామ్నాయముల్
నియమం బొప్పఁ బురాణము న్వినిచి నిర్నిద్రప్రబోధాప్తి మా
యయగా రర్థము సెప్పి తత్కథలు లోనంటింప నెంతేనియుం
బ్రియ మయ్యెంజుఁడి నాకు భారతముపై నిత్యానుబంధంబుగన్."

అను శ్రీకృష్ణభారతమందలి పద్యమువలనఁ దెలియ వచ్చుచున్నది. వీరికిఁ బురాణశ్రవణమం దత్యంతాసక్తి యునియుఁ బ్రతిదినమును దమవారి కరణముగారింటఁ బురాణము చదువుచుండ విని తత్కథాంశము లెల్ల నెఱింగి యుండినట్లు శ్రీకృష్ణభారతమందు వీరివిజ్ఞాపనమునం బొడకట్టుచున్నది.

విద్యాభ్యాసము.

మన కవిసార్వభౌమునకు నెనిమిదవ సంవత్సరమం దక్షరాభ్యాసముచేసి తండ్రిగారే యక్షరములఁ జెప్పిరి. 'న'కారము వీరికి రెండుమూఁడుమాసములకుఁగాని రాలేదనియు, దరువాత వచ్చినదనియు శ్రీకృష్ణభారతమున వ్రాసి యున్నారు కాని నకారము వచ్చినదనుట సత్యమునకు దూరమని చెప్పుచున్నాను. వీరి కక్షరాభ్యాసమై యిప్పటికి సుమా రేఁబది వత్సరము లైనది. ఇప్పటికిని "న"కారము రాలేదనియే నానిశ్చయాభిప్రాయము. ఎవ్వరేని యాచకులు వచ్చి తమ కేదే నిమ్మని యడిగినప్పుడు వీరిజిహ్వకు "న"కారము రాకుండుటంజేసి నావాక్యము సత్యమునకుం గట్టుబడియున్నదని యెల్లరును దెలిసికొనవచ్చును. మఱియు వీరికి సాధువులన్నను, సన్యాసులన్నను, బ్రేమ మెండు. తనకు లేకున్నను యాచకులకుం బెట్టవలయుననియే వీరు తలంచుచుందురు. దైన్య మనునది వీరికే కాదు వీరి వంశమునకే లేదు. ఇక్కవి బాల్యమునఁ గాటవరమునం దుండెడి కంబైండుస్కూలునందుఁ జదువ మొదలుపెట్టెను. ఇంగ్లీషు కూడ ప్రారంభించి కొంతవఱకుఁ జదివెనుగాని తరువాత దానియం దీయన కిష్టత లేకపోయినదనియు, విడువఁబడినదనియుఁ దెలిసెడిని. బడిలోఁ జదువు కాలములో నెప్పుడో కాని యెల్లప్పుడు వీరే బడిపెద్దగా నుండిరి. (ఆయాతరగతులలోఁ బ్రతిదినమును విద్యార్థులకుఁ దమ తమ పాఠములలో నుపాధ్యాయులు మార్కు లిచ్చి యవియన్నియు మాసాంతమునఁ గూడి దాని ననుసరించి మొదటిమార్కుగలవాఁడు మొదటివాఁడు, తరువాతి మార్కుగల వాఁడు తరువాతివాఁడునుగా నుంజేయుదురు. ఆ మొదటిమార్కుగలవాఁడే బడిపెద్ద లేకమానిటరని వ్యవహరింపఁబడుచుండును.) దీనింబట్టిచూడ మనకవిరాజు బడిలోఁ జదువునప్పుడును గుశలుఁడై యుండెనని తోఁచుచున్నది. ప్రతిదినముం దన చదువు పాఠమునం దొక చిన్నపదమేని విడువకుండ నర్థము చెప్పించుకొనుచు నుపాధ్యాయులకుం దెలియని పదములకు నింటఁ దనతండ్రిగారి నడిగి యర్థముఁ దెలిసికొనివచ్చి యుపాధ్యాయులకుం జెప్పుచుండును. అక్కాలమున నినస్పెక్టింగుస్కూలుమాష్టరుగానున్న దేవరకొండ కృష్ణమూర్తిశాస్త్రులుగారు పాఠశాలం బరీక్షింపవచ్చి మనకవి భాషాజ్ఞానమునకు మెచ్చి కొన్ని పుస్తకములు బహుమాన మొసంగినట్లును, ఆ వెనుక నినస్పెక్టరైన కొ్రివి

దక్షిణామూర్తిశాస్త్రిగారికి నెఱింగించి వారిచేతఁ గొన్ని బహుమానములిప్పించి నట్లును, దెలియవచ్చుచున్నది. బాల్యమునుండియు వ్రాఁతలో వీరికి మిక్కిలి వడిగలదు. ఇప్పటికి నొరు లొక్క కాగితము వ్రాయునప్పటి కీయన నాలుగు కాగితములు వ్రాయఁగలరని చెప్పఁగలను. వీరు కాగితములమీఁద నేగాక తాటి యాకులమీఁదను వ్రాయఁగలరు. తాటియాకులమీఁద వీరు వ్రాసిన వ్రాఁత పుస్తకములు కొన్ని నేను చూచియున్నాఁడను. అవి ముత్యాలకోవలవలె ముద్దులుగులుకుచున్నవని చెప్పు టతిశయోక్తి కాదు. ఇట్లాబడిలో నింగ్లీషుతోఁ గూడిన తెలుఁగు ప్రైమరీవఱకుఁ జదివిరి. వీరు చిన్నతనమునుండియు భారతము వినుచుండువారు గావునఁ దాను నొక భారతమువంటి గ్రంథము చేసి యందుఁ దిక్కనసోమయాజివలె గద్యము వ్రాసికొను భాగ్యముకలవాఁడ నగుదునా యని తలంచుచుండువారఁట! ఆసంకల్ప మిట్లు సఫలమైనదని వ్రాయుటకు సంతసించుచున్నాను. "శ్రీమదుభయకవిమిత్త్ర, కొమ్మనామాత్యపుత్త్ర, బుధారాధనవిరాజి, తిక్కనసోమయాజి ప్రణీతంబైన" అని తిక్కన గద్యము; "శ్రీమదధునాతనోభయకవిమిత్త్ర, వేంకటయజ్వాగ్రపుత్త్ర, సమారాధిత విబుధరాజ శ్రీపాద కృష్ణమూర్తి కవిరాజ ప్రణీతంబైన" అని మన కవిరాజుగారి గద్యము. ఇంచుమించు రెండుగద్యములు నొకవిధమునే పొందియున్నది. దీనికి కారణము పైనం జెప్పియున్నదే కావచ్చును.

అంతఁ దన్నింగిలీషుపాఠశాలయందుఁ జేర్చి చదివింతుమను తండ్రిగారితో "నా కింగ్లీషునం దిష్టములేదు. అది విదేశభాష. అది నేర్చి శరీర మొరులకమ్ముకొని నే నుద్యోగము చేయఁదలఁచియుండలేదు. నాకు మనవిద్యల యందే ప్రేమ. సంస్కృతము చదివి కవిత్వము చెప్పు గొప్పతనము సంపాదింపవలయునని యున్నది" అని చెప్పి వారి యంగీకారముం బుచ్చుకొని కాటవరములో నివసించియున్నవారును, సంస్కృతసాహిత్యచక్రవర్తులును, శివపూజాధురంధరులు నగు బ్ర॥ శ్రీ॥ యుపటూరి నాగలింగశాస్త్రిగారియొద్ద రఘువంశము, కుమారసంభవము, మేఘసందేశము, భారవికృత కిరాతార్జునీయము, మాఘకృత శిశుపాలవధము, నైషధము, భోజకృత చంపూరామాయణము, చంపూభారతము, కాదంబరి, విశ్వగుణాదర్శనము, మొదలయిన కావ్యములును, శాకుంతలము, వేణీసంహారము, మృచ్ఛకటిక. అనర్ఘరాఘవము, హనుమన్నాటకము ప్రసన్నరాఘవము, ప్రబోధచంద్రోదయము, మొదలయిన నాటకములును,

ప్రతాపరుద్రీయము, కువలయానందము, సాహిత్యరత్నాకరము, సాహిత్య దర్పణము, లోనగు నలంకార గ్రంథములును, అమరము లోనగు నిఘంటువులును, చదివి సాహిత్యము కుదిరిన వెనుకఁ గౌముది, (వ్యాకరణము) చదివి శబ్దరూపం బెఱింగి, కృతకృత్యులయిరి. కుమారసంభవముఁ జదువునప్పుడు గురువైన నాగలింగశాస్త్రిగారు వేఁకువజామున పాతపాఠములు పుస్తకముఁజూడకుండఁ జింతనసేయవలయు ననుటం జేసి జ్ఞాపకార్థ మాశ్లోకముల మొదళ్ళన్నియుం

శ్లో. అథ వైవాహికైః స్నాతా ప్రసాధ్య మైత్రి సా
బభౌ తాం లోఢ విన్యస్త సామం తస్మా త్ప్రదేశతాం.
... ...

అని పద్యములుగా వ్రాసి, ఆశ్లోకముల మొద ళ్ళన్నియుం దెలిసికొని చింతనఁ జేయుచుండెడివారఁట ! అప్పుడు—

శ్లో. సానుస్వారో విసర్గాంతో దీర్ఘో యుక్తపరశ్చయః
గురూనేతాన్విజానీయా దన్యేతు లఘవస్స్మృతాః.
ఆదిమధ్యావసానేషు, యరతాయాంతి లాఘవం
భజసాగౌరవంయాంతి మనౌతు గురులాఘవౌ.

అని యీరెండుశ్లోకములును మన గ్రంథకర్త తన భావుకుండగు మల్లాది వేంకటశాస్త్రిగారియొద్ద వ్రాసికొని గురువులు, లఘువులు, గణములు, నేర్చికొని వచ్చియు రాని సంస్కృతముతో మొట్టమొదట సంస్కృతకవిత్వముఁ జెప్ప నారంభించినారు.

సంస్కృత కవిత్వము.

మొట్టమొదటఁ గాటవరంబుననున్న రామలింగేశ్వరస్వామివారిమీఁద నొక శార్దూలవృత్తాష్టకము, రామాష్టకమును జెప్పియున్నారు. వాని నీక్రిందఁ బొందుపఱచుచున్నాను.

రామలింగాష్టకం.

శ్లో. శ్రీమచ్చంద్రవిరాజమానమకుటం శ్రీవిష్ణుపుత్రాంతకం
నాగాధీశ్వరభూషణేన విలసద్దివ్యాంగసంశోభితం
వామాంకస్థితపార్వతీం హరిసఖం నాగస్య కృత్తిం ధరం
శ్రీమత్కాటవరే నివాస మనిశం శ్రీరామలింగం భజే.

శ్లో. గంగా భూషిత కేశపాశ మభవం బ్రహ్మాదిభిః పూజితం
భూతానా మధిపం హిమాలయసుతాజీవేశ్వరం శంకరం
క్షీరోదోద్భవ కాలకూలహారణం సూర్యాగ్నిచంద్రేక్షణం॥శ్రీమ॥
శ్లో. శ్రీమత్పర్వత రాజసూతిసుమనోమోదం పశూనాం పతిం
కాలాగ్నిం వృషవాహనం శశిధరం పంచాననంశూలినం
శ్రీమత్సాంబసుతాయ దత్తసుకరం దక్షాధ్వరధ్వంసినం॥శ్రీమ॥
శ్లో. కృత్వా బ్రహ్మముఖోద్భవాం శ్చ తురగా న్వేదా న్సువర్ణాచలం
కోదండం చ వసుంధరాం దృఢరథం హార్వీం భుజంగాధిపం
సూతం వేధస మచ్యుతం శుభకరం గ్రామత్రయం దాహకం॥శ్రీమ॥
శ్లో. సాంబం లోకగురుం కృశానునయనం స్వచ్ఛన్నపక్షోక్షధ్వజం
లోకానుగ్రహకాంక్షయా మదగజప్రాణాంతకం భీకరం
శ్రీకంఠం శితివాసనానుజసఖం హేరంబతాతం శివం॥శ్రీమ॥
శ్లో. సోమం భానుహిమాంశుశుక్రనయనం రుద్రాక్షమాలాధరం
భస్మోద్ధూళితవిగ్రహం శుభకరం ఖట్వాంగినం ధూర్జటిం
నక్షత్రేశ్వరభ్రాతృపుత్రి సచివప్రాణాంతకస్థాయినం॥శ్రీమ॥
శ్లో. పద్మాసూనువిశాలశర్వరధరం శ్రీజహ్నుపుత్రీశ్వరం
వైకుంఠాధిపవల్లభం శశినరం గీర్వాణవక్త్రప్రియం
శ్రీవిఘ్నేశ్వరతాత మద్రితనయాప్రాణేశ్వరం ధూర్జటిం. ॥శ్రీమ॥
శ్లో. విష్ణుబ్రహ్మసురాసురాశ్చ జలధే ర్జాతా ద్విషా చ్ఛంకరం
యం దేవం శరణం గతా భయయుజః ప్రాప్తా స్సుఖం శాశ్వతం
తం శంభుం సకలాధిపం సురగురుం విశ్వస్థితేః కారణం॥శ్రీమ॥
శ్లో. కీర్తిం సౌఖ్య మనంతశాశ్వతరమాం ప్రాప్నోతి విద్యాధనం
మర్త్య శ్శ్రీవృషభధ్వజస్య పఠతే శ్రీరామలింగస్య వై
శ్రీపాదాఖ్యసువంశజాతసుధినా కృష్ణేన సమ్యక్కృతం
మోక్షప్రాప్తికరం శుభాష్టక మిదం పాపాపహం సర్వదా.

—శ్రీ రా మా ష్ట కం.—

శ్లో. పద్మాక్ష మీశం సురసేవితాంఘ్రిం వేదాంతవేద్యం వసుదేవపుత్రం
సీతాపతిం సర్వగుణాతిరిక్తం రామం భజే నీరదనీలదేహం.
శ్లో. ఆజానుబాహుం రఘువంశదీపం కౌసల్యపుత్రం పరమాత్మమీశం
మృత్యుంజయ స్తోత్రనుచాపఖండం॥రామం॥

శ్లో. సీతాపతిం సానుజ మబ్జనాభం, విశ్వాధిపం కౌశికయాగరక్షం
సంసారరోగస్య సుభేషజం శ్రీ॥ రామం॥
శ్లో. యం దేవ మీశం జలజంతుభంగః స్సంప్రార్థ్య హాస్తీ సుమనా బభూవ
తం కౌసలేయం జితసర్వశత్రుం॥ రామం॥
శ్లో. సుగ్రీవనాథం వినతాసుపుత్రం గంధర్వ మీశం సురపత్నిపోషం
సీతాసమేతం విధుపుత్రనేత్రం॥ రామం॥
శ్లో. కందర్పతాతం కరుణాసముద్రం లంకాహరం దానవవంశనాశం
పీతాంబరం సూర్యసువంశజాతం॥ రామం॥
శ్లో. మాయాకురంగస్య మదాపహారం సౌమ్యం చతుర్బాహుమధోక్షజాఖ్యం
విశ్వంభరత్రాణభుజం సుదేహం॥ రామం॥
శ్లో. రాజాధిరాజం రఘువంశజాతం సర్వేశ్వరం లోకగురుం త్రిమూర్తిం
రాజీవనేత్రం జితశత్రులోకం॥ రామం॥

ఇందు ఛందోవ్యాకరణ దోషములు పెక్కులుండవచ్చును. అప్పటికి మన కృష్ణమూర్తిశాస్త్రిగారికిఁ బన్నెండుసంవత్సరము లుండవచ్చును. అవల మేఘసందేశము చదువుచున్నప్పుడు సంస్కృతభాషలోఁ "జంద్రయశశ్చరిత్ర" మను నొకకావ్యము వ్రాయ నారంభించి కొన్ని సర్గములు వ్రాసియున్నారు. (అది ముద్రితముకాక శిథిలప్రాయమైయున్నది. అందుఁ గొన్ని పద్యము లీక్రింద నుదాహరించుచున్నాఁడను.

శ్లో. నక్షత్రేశ దివాకరౌ దినదినే కల్యాణశైలాధిపం
యో వృక్షో గమనే కరోతి చలనాభావాతుశాఖాశ్రితైః
తంచ క్రౌంగ మయూరకాది విహగ స్తోమోద్భవారావక
వ్యాహారై ర్దశదిక్షుసంస్థితబుధవ్యూహోయ విద్యాంపరాం.
శ్లో. సరో నిమగ్నాయతలోచనాంగనాముఖాని వీక్ష్యేదు పతి ధ్వ్రుథేతికిం
ఇమాని పద్మాని కరోతి మ్లానతాం జనర్నీచంహి తిరస్కరోతికః.
శ్లో. అత్రాంతరే క్షత్రియసార్వభౌమో వృక్షస్థితస్తాం జలకేళియుక్తాం
వీక్ష్యాబలాం మోహవశేన దేహం విస్మృత్య రాజాత్మజ మంత్రతిష్ఠతు.

ఇందును బెక్కు ఛందోవ్యాకరణాదిదోషము లున్నవి. భారవికృత కిరాతార్జునీయమును, మాఘకావ్యమును రెండుమూఁడుదినముల కొక సర్గము

చొప్పునఁ జదివినట్లు తెలియుచున్నది. మాఘకావ్యము చదువునప్పుడు పర బ్రహ్మాష్టకము రచించినారు. దాని నీక్రిందఁ జూడనగు :—

పరబ్రహ్మాష్టకము.

౧. శ్లో. అనన్తాదీ న్నానావిధబహులజన్తు ప్రకలితాన్
విలాసార్థంలోకాన్ జనిలయయుతాం స్తాన్ విరచయన్
వచశ్చేతోఽతీతో హరిహరవిరించాదివినుతః
పరబ్రహ్మాఖ్యో మా మవతు శివతాతః కరుణయా.

౨. మహామానీచ్ఛేతోఽమలకమలహంసో రుచిరస
చ్చిదానన్దాకార స్సదసదపరో లోకజనకః
మహాత్మా ద్వైతాత్మా పరమపురుష శ్శాశ్వతతనుః॥పర॥

3. పిపీలాదీన్ జన్తూన్ సలిలజభవాన్తా ననుదినం
యథా వా ప్రారబ్ధం ప్రతిసుఘట యన్ కర్మవివిధం
అవిస్మృత్యా యోఽన్యస్పృహిరధికపూర్ణోపి జగతాం॥పర॥

౪. ప్రపంచాతీతాం యస్మహిమసరణిం స్పష్టపతితా
మపీశః కో నేదం ప్రకృతికలితం సర్వ మితి యం
నిరాకారం ద్రష్టుం బతవిముఖతాం యాన్తి పిశునాః॥పర॥

౫. అనాద్యన్తం శాంతంకలుషరహితం విష్టపముఖం
మహాజ్యోతిర్మూర్తిం స్థిర మమల మాద్యం తు యతయః
యతన్తే బోద్ధుం యం గురుతరవినీతేన మనసా॥పర॥

౬. సహస్రైః పాతాళం పదసరసిజై స్సత్యమపరై
శ్శిరోభి ర్వ్యాకీర్ణ శ్శతదశముఖో౽తిమహతః
మహీంయాన్ దిగ్వాసః కలదఖిలవిశ్వం వితనుతే॥పర॥

౭. సదోంకారోక్తం యద్గురుతరమహాత్వం విధిముఖాః
సదావిన్దన్త స్తే ప్రచుర మభవన్ కాతరహృదః
మహానన్తాప్తేజఃపవనగగనాత్మాపరశివః॥పర॥

౮. పితా లోకే క్రూరంసుత మపి నిహన్తుం నభవితా
యథాహం మూఢాత్మా ద్విపదపశుసంజ్ఞః కలుషవాన్
తథా ప్యాత్మీయోఽయం పతితు మగతౌ నార్హ ఇతి వై॥పర॥

శ్లో. శ్రీపాదకృష్ణకవినా రచితం పరమార్థదం
పరబ్రహ్మాష్టక మిదం జీయా దాచన్ద్రతారకం.

ఇది మదరాసులో జ్యోతిష్మతీముద్రాక్షరశాలయందు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారిచే సరిచూడఁబడి కరపత్రములుగా ముద్రింపఁబడియె.

—శ్రౌత స్మార్త విద్యలు.—

నైషధకావ్యము చదువునప్పుడు మనకవి శ్రోత్రియై జగదతిఖ్యాతింగాంచి శ్రీ వాజపేయయాజుల పాపయ్యసోమయాజులుగారియొద్ద నాధానపంచకము సోమపంచకము చయనపన్నము ననంబను సధ్వరకాండము (శ్రౌతము) చదివిరి. అప్పటికి మన కవికిఁ బదునైదువర్షములవయస్సు వీరు నాగలింగశాస్త్రి గారియొద్దఁ బ్రతిదినము నైషధమును గాను దియుం జదువుచు బ్ర॥ వాజపేయయాజుల పాపయ్యసోమయాజులుగారు కోటిలింగ గ్రామమునుండి కాటవరమున కప్పుడప్పుడు వచ్చుచుండుట కలదు గావున అవచ్చినప్పుడు వారియొద్ద శ్రౌతము రెండేసి పన్నముల చొప్పున నెనిమిది సంతలు మాత్రము చెప్పుకొని వల్లెలు వేయకయే వారియొద్దనుండి శ్రౌతపుస్తకమును సంగ్రహించి మరల సోమయాజిగారు వచ్చు నెలలో నా రెండు పన్నములు ప్రతిదినమును బారాయణము చేయ నియమము చేసికొని వారు వచ్చినపిదప నవి వారికడఁ గంఠపాఠముగా నప్పగించి మఱియు రెండుపన్నముల చొప్పున సంతలు చెప్పుకొనుచువచ్చిరఁట! మన కవి యిట్లే శ్రౌతవిద్య సంగ్రహించినారు. వీ రిప్పటి వేదపాఠకులు చేయునట్లు సంతలు చెప్పుకొనుటయేగాని వల్లెలువేయునాచారము కలవారు కారనియు నట్లు వల్లెలు వేయకున్నను తూష్ణీముగా వీరికి శ్రౌతమంతయు వచ్చినదనియు నేను వినియున్నాఁడను. అట్లు చదివి క్రియాభ్యాసము నొనర్పకయే పార్థివసంవత్సరములోఁ దమతండ్రిగారి యజ్ఞమునకు "పితరం యాజయే త్పుత్రః పితాపుత్రం న యాజయేత్" అను శాస్త్రము ననుసరించి పదునెనిమిదవ సంవత్సరమున నాధ్వర్యవముఁ జేసిరఁట! ఆధ్వర్యవము చేయునప్పుడు తనకు రాని మంత్రములు సహాయతనము చేయు నభ్యాసముగలవారు గావున నితరర్త్విజులతోఁ గూడి వచ్చినవారు చదివినట్లు చదివి క్రియ నడపుచుండువారఁట! ఆయజ్ఞములో నప్పటికి వీరికి రానివి హోమశాంతులు, త్రిపశుక విశేషములు మాత్రమే. అవి యెట్లు చేయవచ్చునో యని చింతించుచుఁ దనతో నెప్పుడునుంగూడియుండు ప్రతిప్రస్థాతను బిలిచి రహస్య

ముగా అయ్యా! నాకు ఘోష శాంతి రాదు. నేను సహాపఠనము చేయున భ్యాసము కలవాఁడను. నన్ను మీరు కనిపెట్టి శాంతి పఠింపవలెను. నేను మిమ్మనుస రించి వత్తును. అని వారు శాంతిం జెప్పునప్పుడు వారి ననుసరించి తాను జెప్పిన యది తనకు రాదని యెవ్వరికిం దెలియకుండునట్లు వచ్చిన వారికన్న మిన్నయై ప్రవర్తించెనఁట! ఆసహాపఠనమునకుఁ బ్రీతిపరిస్థాత మెచ్చుచుగునాఁడుబుర్త్విజుల కందఱకు నీవృత్తాంతముం జెప్పెననియు వారు మన శ్రోత్రిసి మేలని మెచ్చు కొనిరనియుం దెలియవచ్చుచున్నది. మఱియు నాయజ్ఞములో నుపద్రష్టగా నున్నవారు తాళ్ళపూడిగ్రామవాసులు బ్రహ్మశ్రీ యేలూరిపాటి నరసింహ యాజులుగారు. వారియెకుట నెవ్వరును ఛాత్రపట్టుకొని, ఆర్త్విజ్యము చేయఁ జాలరు. మన శ్రోత్రి యాధ్వర్యవము చేయునప్పుడు ప్రవర్గ్యహోమములు చేయు చుండఁగా మన యధ్వర్యుఁడు బాలుఁడు సుకుమారదేహుఁడగుటచే నాహోమ కాలమున నగ్నివేడిమికిఁ దాళఁజాలక పాత్రియును మాత్రియు విడువక కొంచెము తొలఁగి హోమములు చేయఁజాలనివాఁడయ్యె. అంత నాయుప ద్రష్టయే ఆహోమములుచేసె. అది చూచి మన శ్రోత్రి అయ్యా! నే నధ్వర్యుఁ డను. మీరు హోమములు చేసితిరి. ఇది క్రియాలోపమగును. కావున "అవిధి నాకృత మకృతం" అను న్యాయమున మఱియు హోమములు చేయుదునని చెప్పి చేసెనఁట! అది మొదలుకొని ఆయజ్ఞములో నుపద్రష్టగారు మన శ్రోత్రి చెంతకు రాలేదనియు తన యాధ్వర్యవము పండితులు మెచ్చునట్లు చేసి ప్రఖ్యాతిం గాంచెననియు లోకవిదితము.

వీరికి శ్రౌత సంబంధమయిన రహస్యము లన్నియుం దెలియును. పూర్వప్రాయ శ్చిత్త్యుత్తర ప్రాయశ్చిత్తులను ప్రాయశ్చిత్తకాండమంతయుం గరత లామలకమగుటంజేసి తానిష్టి లోనగునవి జేయించుచున్నపు డెట్టి చిక్కుప్రాయ శ్చిత్తము వచ్చినను క్షణమాత్రమునఁ జేయించు నేర్పుకలదని నేనెఱుంగుదును. ఈకాలమున నర్త్విజులకు నశ్రద్ధమెండు. ఎట్లో తమ పనులం జేసికొని కర్మహాని యగుచున్నను బరిగణింపక ప్రవర్తించుచుందురు. వీరట్లుగాక.

శ్లో. సకారె సూకరంవింద్యా ద్వకారె రిపువర్ధనం
హాకారె బ్రహ్మహత్యాచ ఆహుతిఃకుత్రదీయతె
సకారె చవకారేచ హాకారే చవరిత్యజేత్
స్వాహాంతే జుహుయాదగ్నౌ వశ్వమేథఫలం లభేత్.

అని మొదలగు విధు లన్నియు నెఱింగి పాత్రి మెట్లు పట్టవలయునో హోమ మెట్లు చేయవలయునో మంత్రి మెటు లుచ్చరింపవలయునో నియమ మెంత యుండవలయునో శ్రౌతకలాప మెట్లు నడిపింపవలయునో లోనగునవి యన్నియు నెఱింగి చాంద్రపాణీయ కేశవీయాది వ్యాఖ్యానగ్రంథములు చదివి ఋత్విజ్మౌఢ్యమునకు "యద్విద్వాగుంస" యను మంత్రమును, వాఙ్నియమము నకు "ఇదం విష్ణుస్త్రియంబక" మంత్రములును, స్వరాక్షరపదవృత్తవర్ణలోపము నకు "అభిర్గీర్భి" యను మంత్రమును, జ్ఞాతాజ్ఞాతాది సకల దోషములకు "అనాజ్ఞాతత్రయ మంత్రములును" సదా జపించుచు భయభక్తులం గలిగి వీరు శ్రౌత తంత్రమునఁ బ్రవర్తింపఁగలరు. మన శ్రౌతిగారు తండ్రిగారి యజ్ఞమునకు మున్నె తాళ్ళపూడిలో నేలూరిపాటి నరసింహయాజులుగారు మొదలగువారి సర్వతోముఖాప్తోర్యామాది యజ్ఞములయందుఁ బ్రతిప్రస్థా నాగ్నీధ్రాద్యార్త్విజ్యములు చేసి వాసికెక్కియున్నవారు. మఱియు నీస్మార్త మేనమామయగు కల్లూరి బ్రహ్మసోమయాజులుగారు సంతతము శిష్యులకుఁ జెప్పుచుండుటం జేసి విని స్మార్తమంతయు గ్రహించినవా రయిరి. షోడశకర్మాధికారి యగు నీయన పెద్దాపురములో హైస్కూలునం దుపాధ్యాయులుగానున్న సమయమునఁ బెదతల్లిగారిభర్తయగు మెట్ట బ్రహ్మసోమయాజులుగారు కాలధర్మముంబొందఁగ, అపరక్రియం జేయించువారికిఁ గాకినాడపురమునకుఁ దంతి వార్తఁ బంపియు వారు రా నాలస్యమయినంతలో సభిజ్ఞుండగు మనశ్రౌతి పుస్తకముం గొని మిక్కిలి చిక్కులం గలిగియున్న బ్రహ్మమేధమంతయుఁ దొల్లి చూచి యెఱుంగనివా రయ్యును గ్రంథముం జూచి యథావిధిం జేయించి వైదికాగ్రేసరుల మెప్పునకుం బాత్రమయ్యెనని వినియున్నాను. మఱియు మన శ్రౌతి యొక్కనాఁ డొకవైదికుని యింటిలో నిష్టికి నాధ్వర్యవముం జేయుచుండగా నాయజమానుఁడు సంస్కృతసాహిత్యము లేనివాఁడు గావున నొకచో నధ్వర్యుఁడు తప్పిపోయెనని యెంచి "ఉదాదాయ" యను మంత్రము చెప్పునప్పుడు చేతిక్రిందినుండి వేదిని జూడలే దిది తప్పు. తప్పు" అని పలికెనఁట! శ్రౌతు లందఱును దా మాధ్వర్యవము చేయునప్పు డట్టి సమయమునఁ దమ చేతిలో నున్న కఱ్ఱకత్తి వేదికలోఁ గ్రుచ్చి పట్టుకొని పై మంత్ర ముచ్చరించుచుఁ జేతి క్రిందినుండి వేదిని జూతురు) అట్లు పలుకఁగా శ్రీకృష్ణశ్రౌతి "నేను దప్పు చేయలేదు. చేతిక్రిందినుండి గాని కాలిక్రిందినుండిగాని నేను వేదికను జూడను.

ఇప్పుడు నేను జూచినట్లే చూడవలయును. మీరు చూడుమన్నట్లు చూడఁ గూడదు" అని ప్రత్యుత్తర మొసంగ యజమానుఁడు తన యిష్టికి భంగపాటు కలిగెఁ గర్మలోపమయ్యెనని నిశ్చయించుకొని "నేను బ్రమాదవడి మి మ్మాధ్వర్యవమునకుఁ బిలిచితిని. మీ రిట్టి వా రని తెలిసియున్నఁ బిలువకపోవుదును. నాయిష్టి పాడుచేయుట మీకు న్యాయ్యముకాదు" అనియనేకవిధంబుల నిందా గర్భముగాఁ బలుకుట విని మన శ్రోత్రి తన చేతిలోని పాత్రి నేలపైఁబడవేసి "నేనంత తగనివాఁడనని మీకుఁ దోఁచినచో మఱియొకనిచే నిది నడిపించుకొన వచ్చును. నే నిదె నాయుద్యోగమును వదలుకొనుచున్నాను" అని తొల్లి యజమానుఁడు తన కిచ్చిన దర్భపుల్ల వానిపైఁ బాఱవేయుచు "మీయిష్టిఁ బాడు చేసితినని గదా మీరంటిరి. ఇది చెడిపోయినయెడ దీనికైన సొమ్ము నే నిచ్చు కొనియెద. "యజ్ఞోహి యజ్ఞస్య ప్రాయశ్చిత్తిః" అనుటంజేసి యిష్టి మరలఁ జేసికొనవచ్చును. దానఁ గర్మలోపమురాదు. నేను సూత్రము చేతిక్రిందినుండి మీరు చెప్పినచొప్పునం జూడను. మీకు శ్రోత్రము వచ్చునేమో కాని దాని పరమార్థము మీకుఁ దెలియదు. నామాటలు మీకు విశ్వాసపాత్రములు కాని యెడ మఱియొకరిని విచారించుకొనుఁడు. నన్ను దూషింపకుఁడు" అని గట్టిగా వచియించె. ఆసమయంబునఁ గానూ ర్ర్గహారవాస్తవ్యులును, వేదశాస్త్రశ్రౌత నిధులును, జగదేకపండితులగు ఈవని పెద్దావధానులుగా రాగ్రామమునకు వచ్చియుండుట విని కొందఱు పోయి వారిని బ్రార్థించి దోడ్కొనివచ్చిరి. వారు నీవృత్తాంత మంతయు నానుపూర్విగా విని "వేది మనువీక్షతే" వేది ననుసరించి యంతయుం జూడవలయునని యున్నది. కాని చేతిక్రిందినుండి చూడవలయునని లేదు. తరువాతఁ జేయునట్టి పనికిఁ గట్టుకత్తిని గుచ్చి ప్రేవు యీయవలసి యున్నది. దానిపై చేయవలసిన పని నిపుడు చేసి శ్రోత్రు లందఱు స్వామి నేల గుచ్చి చేతిక్రిందినుండి వేదిని జూచుచున్నా రిది తప్పు. శాస్త్రులుగారు చెప్పినదియే మంచిది. ఇట్లే చేయవలయును. అని మన కవిరాజును మెచ్చి స్తుతించి రఁట! అప్పుడు మన కవిసార్వభౌముఁడు వారికి సాష్టాంగనమస్కారము చేసి చేతులు జోడించుకొని :—

"శ్లో॥ నామ్నాచ విద్యయా బుద్ధ్యావయసా యో గరీయసే
సమ మాప్యాధికా భిఖ్యాం వందే పెద్దావధానినమ్"

అని శ్లోకము చెప్పి వినుతిగావించెననియు, అధ్వర్యు తిరస్కారమునకు యజ

మానునకుఁ బ్రాయశ్చిత్తము విధించి చేయించెననియు, అట్లు చేసి పెద్దావధానిగారి మెప్పులకుం బాత్రమయ్యె ననియుం జెప్పుదురు.

మఱియు మన శ్రౌతి తాళ్ళపూడి గ్రామములోఁ దమ మేనమామ కల్లూరి బ్రహ్మసోమయాజులుగారి ప్రథమాధానమునకుఁ దా నాధ్వర్యవముం జేసె. ఆయాధానమునకు బులుసు వేంకటదీక్షితులుగారు మొదలగువారు ఋత్విజులైయున్నారు. తాళ్ళపూడి వేదశాస్త్ర శ్రౌతములకుఁ బుట్టినిల్లు. మున్నాపురంబున వేదవేదాంగవేత్తలు, ఘనాంత స్వాధ్యాయులు, షట్ఛాస్త్రవిజ్ఞులు, పౌండరీకాంత శ్రౌతులు, నలరారుచుండువారు. కాలవశంబునంజేసి యట్టి తాళ్ళపూడి యిప్పుడు సామాన్యస్థితింబొందినదని వ్రాయుటకుఁజింతించుచున్నాను. "చింత చచ్చినను బులుసు చావదు" అన్నట్లు తాళ్ళపూడిలో నితర గ్రామములలోనుండు పండితులకన్న నిప్పటికిని వేదశాస్త్ర శ్రౌతాదివిద్యలం బండితులు కొందఱున్నారని చెప్పుటకు సంతసించుచున్నాను. అట్లు మన శ్రౌతి మేనమామగారి ప్రథమాధానమున కధ్వర్యుఁడై ప్రయోగము నడుపుచుండగా "అనాహూతోధ్వరంగచ్ఛేత్" అను న్యాయమున నాహూతులు ననాహూతులును బెక్కుమంది పండితు లటకు విచ్చేసియున్నారు. అందుఁ గల్లూరి రామసోమయాజులుగా రనువారు ప్రయోగములో నేదో తప్పువచ్చెనని యనుమానపడి "ఆమంత్రము మరలఁ జెప్పి ప్రయోగము చేయుము" అని మన శ్రౌతి నధిక్షేపించుచుఁ బలికెనఁట! అది విని మన శ్రౌతి వారు కోరినట్లు చేసి "ఏమి మామగారూ! ఏల యిట్లు పలికితిరి?" అని యడిగెనఁట! "ఏమిలే దేమిలేదు. తప్పితి వనుకొంటిని" అని సోమయాజిగారు బదులుచెప్పగా హోతలుగానున్న బులుసు వేంకటదీక్షితులుగారు—సటాసముత్పాటనామర్షిత హర్యక్షంబు చందంబున హుంకరించుచు లేచి రామసోమయాజిగారి కభిముఖులై "నీవు రుద్రమకోటలో హౌత్రము పాడుచేసినట్లు చేయలేదు. మన కృష్ణమూర్తిశాస్త్రికిఁ దెలిసిన శ్రౌత సాంప్రదాయము మిముబోంట్లు తెలియఁజాలరు. తూష్ణీంభావము వహింపుము. ముద్దులుమూటగట్టు నధ్వర్యునిప్రయోగము చూడుము. ఆనందింపు మని చెప్పి మన కవిరాజును మెప్పించిరని తాళ్ళపూడి పండితులు కొందఱు నాతో నొకకాలమునఁ జెప్పియున్నారు.

మఱియు రాజమహేంద్రవరమున, కంభమువారి సత్రములో వాజపేయయాజులరమణప్పయాజులుగారు రక్తాక్షి సంవత్సరమున పౌండరీకమను యాగము

చేసినారు. (ఇది నలువదిదినములు చేయఁదగిన మహాక్రతువు. దీని యనుక్రమ ణిక బహుమార్గములు గలదియై యుండును.) ఈయజ్ఞము మన కవిరాజునకు శ్రౌతగురువగు వాజపేయయాజుల పాపయ్యసోమయాజులుగారు గతించిన వెనుక నీదేశములో స్వతంత్రతతోఁ జేయించినవారు లేరు. ఆ కారణమున రమణప్ప యాజులుగారు దక్షిణదేశమునుండి శ్రోత్రులను బిలిపించి క్రతువుఁ జేసినారు. ఆదాక్షిణాత్యులు క్రతువుచేయించుటఁ జూచి రాజమహేంద్రవరములోనికొందఱు చూచి సైఁపలేకపోయిరి. వారితోఁ బ్రతిఘటించి మాటాడలేదు. తమరు చేయింపలేని యజ్ఞము వారు చేయించుచున్నారే! యను దుఃఖము వారిని బాధించి యొక్కనాఁడు వారు మన కవిరాజునొద్దకువచ్చి "దాక్షిణాత్యులు పౌండరీకము పాడుచేయుచున్నారు. మేము వారితో నిదమిద్ధమని చెప్పుటకు మాకు ద్రావిడభాష రాదు. వారికిఁ దెలుఁగు రాదు. నీవు వచ్చి యొక్కమాటు తగినట్లు మాటలాడుము" అని కోరిరి. మన కవిరాజును వల్లెయని వారితో నాయజ్ఞశాలకుంబోయి యొకచో విశ్రమించెనఁట! అప్పు డధ్వర్యుఁ డొక యిష్టిం జేయుచు "శుంధధ్వం" అను మంత్రి మారంభించి పాత్రప్రోక్షణము చేసెనఁట! అది మంత్రమంతయుఁ జెప్పిన పిదపఁ బ్రోక్షింపవలెను. అట్లుకాక యధ్వర్యుఁడు మంత్రారంభమందే క్రియ నొనర్చుటచేత రాజమహేంద్రవర పండితులచేఁ బ్రోత్సహింపఁబడిన మన శ్రౌతి కోపముతో లేచి "ఇది మంత్రా దిమ క్రియగాదు. ఇట్లు చేయుచున్నారేమి?" అని సంస్కృతభాషతో నడిగె నఁట! అది విని అధ్వర్యుఁడు మన శ్రౌతినిఁ గోపదృష్టిఁ జేసి చెప్పిన నించుక విశ్రమింపుఁడని కొంతసేపు "అయ్యా! ఇది మంత్రాంతక్రియయే కాని సూర్యుఁ డస్తమించుచున్నాఁడు. ఈలోపునఁ బ్రధానహోమములు కావలెను. కాకున్న యజ్ఞము చెడును. నేఁ జేసిన యీస్వల్పదోషమునకుఁ బ్రాయశ్చిత్తముకలదు. దానికిఁ బ్రాయశ్చిత్తము లేదు." అని సమాధానము చెప్పగా మన శ్రౌతి కోపము చల్లాఱినది. క్రమముగాఁ బౌరపక్షముమాని వారిపక్ష మవలంబించి వారు చేయు ప్రయోగమునకు మిక్కిలి సంతసించి వారిపై—

శ్లో. శ్రీరంగాఖ్యపురీసమీపగమణక్కాల్గ్రామవాసీ మహా
విద్వాన్ విద్వదభిష్టుతోఽఖిలకలావైజ్ఞానికః కర్మఠః
అధ్వర్యు ర్భువి ముద్దుదీక్షిత ఇతి ఖ్యాతోఽత్ర సత్త్రే ద్విజ
శ్రేష్ఠో రాఘవపూర్వజో విజయతే నాణ్దీక్షిత స్యాత్మజః.

శ్లో. పంచనదతీరవాసీ, విద్వాన్ శ్రీబాలకృష్ణశాస్త్రి త్యార్యః
విఖ్యాతో ధ్వర్యు రయం, ప్రాజ్ఞో నైకేషు తత్కృతేషు మఖేషు.

ఈశ్లోకములు చెప్పి అధ్వర్యునకు నూటపదియాఱురూప్యములు వెలగల దొక బంగారుసింహతలాటపు మురుగు చేయించినపాయోగకాలమందుఅప్పుడు రాజమహేంద్రవరమున డిస్ట్రిక్టు మునసబుగానున్న యం. కృష్ణమాచార్యులు గారిచే నధ్వర్యుని చేతికి వేయించెనఁట! మఱియు నాయజ్ఞములో సర్వము శూన్యముగానుండుటంజేసిమనకవికొందఱుధనికులనాశ్రయించి రెండుమూడువేల రూప్యములు సేకరించి యజ్ఞము సంపూర్తి గావించె నని రాజమహేంద్రవర ములోఁ బెక్కుమంది నాతోఁ జెప్పినారు. రాజమహేంద్రవరములో మన కవికి బలుకుఁబడి చాల కలదు. ఆయజ్ఞములో నుద్గాతగారి మెడలోనుండు తావ ళము పోయినది. దానికై యుద్గాత విచారించుచుండగా మీరు విచారింపకుఁడు దాని సొమ్మునకన్న రెట్టింపు సొమ్మిప్పింతునని యజ్ఞము చూడవచ్చిన వారి యెదుటికిఁ బోయి చేతిలో నొకపళ్లెరముంగొని "ఉద్గాత తావళము నెవరో హరించిరి. వారికై మిమ్ము నేను యాచించుచున్నాను. మీకుఁ దోచిన ద్రవ్య మిందు వేయుఁడు" అని యొక్కసారి పలికినంతనే పదినిమిషములలో పళ్లెరము నిండినది. రెండునూర్ల రూప్యములు వచ్చినవి. అవి యుద్గాత కిచ్చె నఁట! ఇట్లు మన కవిరాజు శ్రౌత మభ్యసించి తత్ఫలం బెఱింగిన కారణం బునఁ దాను యజ్ఞముల కాధ్వర్యవముచేసియుఁ జేయించియు నిప్పుడు శాస్త్రో క్తముగా యజ్ఞములు జరుగుట లేదు గావున నీఘోరకాలమున నవి సామా న్యులు చేయకుండుటయే శ్రేయమని నాతో ననేకవారములు చెప్పినారు.

—• ఆంధ్ర కవి త్వ ము. •—

కవితాప్రియుం డగు మన కృష్ణమూర్తిశాస్త్రి తనకుఁ బదియేనేండ్లు ఈడువచ్చినప్పు డొకనాఁడు తన నివాస గ్రామమునకుఁ బీఠికాపురముచెంత నున్న గొల్లప్రోలు గ్రామవాసులగు నల్లమరాజు సుబ్రహ్మణ్యకవిగారు పని గలిగివచ్చియున్నప్పుడు వారు కవులని విని వారితోఁ బ్రసంగించి మఱునాఁడు—

"క. తారేట్రిగ్రామమందున, ధ్రువ్రా సంభావిచ్చి కుదురుగ నీకుఁ
బరేల బెఱుగుతో నన్నము, జ్వరంగా బెట్టగలరు చక్కం బోరా."

అని పద్యము చెప్పి వారికిం జూపింప వారు దీనిం జూచి "నీకుఁ గవితాధార గలదు. లక్షణగ్రంథములు చదువుకొమ్ము" అని చెప్పి "సీ. తూకును శఖగ ఘల్" అను పద్యముం జెప్పినారు; పై పద్యములో నివి యివి తప్పులని దిద్ది నారు. ఆదిద్దిన తప్పు లెట్టివో తెలిసికోఁగల శక్తి మన కవి కప్పటికిం గలుగ

లేదనియుఁ దెలుఁ గొట్లుండునో తెలియదనియుం దెల్లమగుచున్నది. అంత నాసుబ్రహ్మణ్యకవిగారి నుపదేశ గురువుగా నెంచి మన కృష్ణమూర్తిశాస్త్రిగారు తన సహాధ్యాయియగు మధిర సుబ్రహ్మణ్యదీక్షితులుగారితోఁగూడి లక్షణ గ్రంథములు వ్యాకరణము మొదలగు గ్రంథములు చదివి మునుము న్నేవియో కొన్ని పద్యములు రచించినారు.

ఆపద్యములలో మొదటిపాదమున హ్రస్వ ప్రాసము. రెండవపాదమున దీర్ఘము, మూఁడవపాదమున సంయుక్తము, నాల్గవపాదమున సమస్వారము, ఇట్లు నానావిధములప్రాసములు, యతులు లోనగునవి యుపయోగించి "పద్యం పద్యస్య లక్షణం" అను న్యాయమునఁ బద్యము చూచి పద్య మల్లుట నేర్చి నారు. వీరికిం గల సందేహము లెల్లఁ గ్రమక్రమముగ భారతాది గ్రంథములు చూచియే సవరించుకొనిరి. అప్పటి కాంధ్రభాషాజ్ఞానము తక్కువగుటచే నచ్చు పడియున్న తెలుఁగు గ్రంథము లన్నియుం గొని చదివి సాహిత్యము సంపా దించుకొనిరి.

మన కవిసార్వభౌముఁడు తెలుఁగుగ్రంథములు చదువునపుడు సకల విద్యాసనాథుండును, కవిరాజును, కవిసార్వభౌముఁడు నగుశ్రీనాథుని కవిత్వ మందు మిక్కిలి గౌరవముఁ గలిగి యంతటినుండియు నితర గ్రంథములు చదువక శ్రీనాథుని గ్రంథములే చదివి యతని శైలికి, నతని పదగుంభనమునకు నతని ధారాశుద్ధికి మెచ్చుచు నితఁడే కవి కులగురువు. ఇతని కవిత్వమే కవిత్వము. ఇతని రచనయే రచన కాని యొరులది కానేరదని నిశ్చయించి తా నాశ్రీనా థునిఁ దన కవితాగురువుగ్గా నిర్ణయించుకొని తన గ్రంథములయందు "నాకవితా గురువు శ్రీనాథుఁ డని వ్రాయుటయేగాక ప్రతిసభయందును నాంధ్రకవులలో శ్రీనాథునిఁ బోలినకవి యొక్కఁడు లేఁడు. అతఁడే నాకు కవితాగురువని చెప్పు చుండును. ఇప్పటికిని మన కవికి శ్రీనాథునియందుఁగల గురుభక్తి దినదినాభివృద్ధి యగుచునేయున్నది. నేఁటికిని శ్రీనాథుని గ్రంథములే చెంత నుంచుకొని చూచు చుండును. అతనినే కీర్తించుచుండును, ఇంచుమించ చతని శైలియే మన కవిరాజు శైలియును. కవిత్వమం దక్షరసాజాత్య ముండవలయుననియు నది శ్రీనాథునకే కుదిరినదనియు నితర కవుల కెవ్వరికిం గుదురలేదనియు చెప్పును. ఈనడుమమన కవి "శ్రీనాథకవిరాజీయ" మనునొక్క నాటకము వ్రాసి ప్రకటించియుండెఁ. అది నేను సాకల్యముగాఁ జదివి తదభిప్రాయ మంతయుం గ్రహించి "శ్రీనాథకవి

రాజీయ నిర్మితియందు మీయభిప్రాయమే"మని మన కవిరాజు నడుగ నతఁడు
నవ్వుచు "మీయభిప్రాయమే నాయభిప్రాయమని బదులుచెప్పెను. అతఁడు
చెప్పకున్నను శ్రీనాథకవిరాజీయమంతయు నించుమించుగా శ్రీకృష్ణకవిరాజీ
యమే యని నాసిద్ధాంతము.

శ్రీనాథుని తండ్రి మారన సంతానములేక తపస్సుచేసి శ్రీమహావిష్ణు
ననుగ్రహంబున శ్రీనాథుం గాంచె. మనకవి తండ్రి వేంకటసోమయాజులుగారు
సంతానములేక తపస్సుచేసి గరుడారూఢుండైన శ్రీమహావిష్ణు ననుగ్రహంబునఁ
గృష్ణమూర్తిశాస్త్రిం గాంచె. మారన కొండవీట నవేమారెడ్డి ననుగ్రహంబున
దేశముఖుండై ప్రఖ్యాతింగాంచె. వేంకటసోమయాజిగారు కోట రామభూపతి
దేవు ననుగ్రహంబున మంత్రియై ప్రఖ్యాతింగాంచె. శ్రీనాథుని కావ్యవిద్యలఁ
జన్నరాయఁడు, ఘోడెరాయ భీమేశ్వరుఁడు, మృత్యుంజయుఁడు, భట్టారకుఁడు
అను నల్వురు గురువులు. మనకవి కావ్యవిద్యల ననగాఁ గావ్యశాస్త్రంబుల
నాగలింగశాస్త్రిగారు శ్రౌతమునఁ బాపయ్యసోమయాజిగారు, స్మార్తమున
బ్రహ్మసోమయాజిగారు, ధర్మశాస్త్ర పురాణాదులఁ దండ్రియగు వేంకటసోమ
యాజిగారు. అను నల్వురు గురువులు. శ్రీనాథునకుఁ బుత్రవియోగదుఃఖము
కలిగినది. ఇతనికిఁ బుత్రవియోగ దుఃఖము నిలిగినది. అతఁడు పెదకోమటి వేమ
భూపాలు నాశ్రయించెను. ఇతఁడు శ్రీచంద్రమౌళిప్రసాదభూపాలు నాశ్ర
యించెను. అతఁడు నానాదేశములు తిరిగి నానాసంస్థానాధీశుల నాశ్రయించి
బహుధనము సంపాదించెను. ఇతఁడు నానాదేశములు తిరిగి నానాసంస్థానాధీశ్వ
రుల నాశ్రయించి బహుధనము సంపాదించెను. అతఁడు బహుకృతులుచేసి
బహుబహూకృతులందెను. ఇతఁడుబహుకృతులుచేసి బహుబహూకృతులందెను.
అతఁడు కవిరాజ కవిసార్వభౌమ బిరుదముల నందెను. ఇతఁడు కవిరాజ కవి
సార్వభౌమ బిరుదముల నందెను. అతఁడు దక్షిణాధీశు ముత్యాలశాలలో
స్వర్ణాభిషిక్తుఁడయ్యెను. ఇతఁడు క్షీరారామ రామలింగేశ్వర సన్నిధిని స్వర్ణాభి
షిక్తుఁడయ్యెను. అతఁడు వేదశాస్త్ర శ్రౌతాది విద్యలు నేర్చెను.
ఇతడు వేదశాస్త్రశ్రౌతాదివిద్యలు నేర్చెను. అతఁడు బ్రాహ్మీదత్త
వరప్రసాదుఁడు. ఇతఁడు బాలాత్రిపురసుందరీ మహామంత్రోపాస
కుఁడు. అతఁడు పెక్కు విద్యావివాదములఁ గెలుపొందెను, ఇతఁడు పెక్కు
విద్యావివాదములఁ గెలుపొందెను. అతఁడు శృంగారాగ్రేసరుఁడను కింవదంతి

పడెను. ఇతఁడు శృంగారా గ్రేసరుఁడను కింవదంతిపడెను. అతఁడు బొడ్డుపల్లెను గుత్తచేసి వ్యవసాయనష్ట మందెను. ఇతఁడు పేటలంకా క్షేత్రముఁగుత్త చేసి వ్యవసాయనష్టమందెను. అతఁడు ధనహీనుఁడై దేశముగాని దేశములు తిరిగి నానా శ్రమలందెను. ఇతఁడు ధనహీనుఁడై దేశముగాని దేశములు తిరిగి నానాశ్రమలందెను. అతఁడు పూర్ణాయుర్దాయము కలవాఁడు. ఇతఁడు పూర్ణాయుర్దాయము కలవాఁడు. ఇత్యాదులు సరిపోల్చఁబడుచున్నవని నాకు తోఁచి యిట్లు వ్రాసితిని గాని మనశాస్త్రిని స్తుతించుటకు మాత్రము కాదని నమ్మి పెద్దలు నన్ను గర్హింపకుందురుగాక !

మఱియు నీసందర్భమున నొక్క దైవశోధనమును, చెప్పవలసివచ్చినది. ఈవిషయము మనకవిగారి పరమమిత్రులగు సుధీమణి పుల్లెల శ్రీరామశాస్త్రి గారు నాతో నొక్క యవసరమున రహస్య సంభాషణములో నీక్రిందివిధముగాఁ జెప్పినారు.

మన కవిరాజుగారును సుధీమణి పుల్లెల శ్రీరామశాస్త్రిగారు నొక సందర్భమున నగరము తాలూకాలోని యప్పనపల్లి గ్రామమునకుఁ జనిరఁట (అప్పనపల్లిగ్రామములో మైనరు రాజా అను సుప్రసిద్ధిగాంచిన శ్రీ అల్లూరి వేంకటపతి రాజుగారు మనకవిగారి కుమారుఁడు కాలధర్మము నొందియున్న దినములలో నదివఱ కెన్నఁడును జూడనివారైనను, ఏవిధమైన సంబంధములేనివారైనను, అయాచితముగా నూటపదియాఱు రూప్యములు పెల్లిగ్రామ మణియార్డరుగా మనకవిరాజునకుఁ బంపించినారు. దానిం బురస్కరించుకొని తమ కృతజ్ఞతను దెలుపుటకై నాక్షత్రియోత్తముని సందర్శించుటకు మనశాస్త్రిగారటకు వెళ్ళిరని తెలియుచున్నది) అప్పనపల్లిలో రెండుపూటలుండి మఱునాఁ డుదయమున లేచి రాజుగారిచే ననిపించుకొని యటకు సమీపమందున్న గ్రామమునకుఁ గాలినడకం గదలిపోవుచుండిరి. ఆసమయమునఁ బుత్రశోకసంతప్తచిత్తుండగు మన కవి కనులు మూసికొని ధ్యానించుచు నడువసాఁగెను. సుధీమణిగారు కొంచెము ముందై నడచిరి. అట్లు కొంతదూరము నడచునంతలో కవిరాజు "హా!రు" మని పెద్దకేకవైచి నేలం గూలఁబడి వెక్కివెక్కి వెక్కసంబుగా నేడువసాగెను. అంత ముందు నడచుచున్న సుధీమణి రోదనము విని వెనుకకు మరలి పఱుగుపఱు గున వచ్చి మన కవిం బొదఁవుకొని "ఏమిది? శాస్త్రులిట్లు పరి

దేవనంబు సేయువచ్చునా ? ఊఱడిల్లు, డూఱడిల్లుఁడు. ఎట్టివానికైనఁ బ్రారబ్ధ మనుభవింపక తప్పదు. వసిష్ఠాదు లంతలును బుత్రశోక మనుభవించిరి. మన మన నెంత శాంతింపుఁడు శాంతింపుఁడు” అని యూఱార్చుచు నుపశమిల్లం జేయుటయు నంత కవిరాజు—“ఇది పుత్రవియోగదుఃఖముకాదు. ఇప్పు డొక మహాద్భుతవిషయము నాకంటఁబడినది. దానంజేసి నాకొడలు తెలియక యిట్లు యుతినని చెప్పఁగా

సుధీ—అయ్యా! నేనుమీకుఁ బరమమిత్రుఁడను. ఆమహాద్భుతంబేదియో విన నభిలషించుచున్నవాఁడఁ జెప్ప ననుగ్రహింపుఁడు. (అని ప్రార్థించెను.)

కవిరా—అది దేవరహస్యమువంటిది. ప్రకటించుటకు నాకిష్టము గాకున్నది.

సుధీ—మీతోపాటు కష్టసుఖములకైన మిత్రునికడ దేవరహస్యమైనను జెప్పనొప్పును. చెప్పక తప్పదు. నేను వినక తప్పదు.

అని నిర్బంధించిన నెట్టకేలకు మన కవిరాజు సరే! చెప్పెదను వినుండు. నే నిపుడు కనులు మూసికొని యేద్దియో చిత్తంబున ధ్యానించుచు నడచు చుంటిని. అంతలో నాయెట్టయెదుట నొక్క మెఱపు మెఱసినట్లయి, ఆ కాంతి పుంజములో నొక మహావ్యక్తి నాకంటికిం దోఁచి “నేను శ్రీనాథుఁడను. నీవు మదంశసంభూతుఁడవు. మహాభారతము మూలానుసారముగా నాంధ్రీకరించు టకుఁ బుట్టితివి. నీమది కెట్టి దుఃఖంబును గలుగనీక నీకార్యము నిర్వర్తింపుము. అని పలికి పలుకునంతలో నంతర్ధానమయ్యె” అని చెప్పి నాకమ్మహాపురుషునితో సంభాషించు భాగ్యము లేకపోయెగదాయని సంతాపించుచుంటి ననునంతలో సుధీమణి ఓహో! నాకును మెఱపు గనిపించి నాకన్నులు మిఱుమిట్లు గ్రొన్మె నవి యని నడుమునకు బట్ట చుట్టుకొని కవిరాజునకు సాష్టాంగనమస్కారము చేసి “నీవు ధన్యుఁడవు. నీవు శ్రీనాథుఁడవు. భారతమునకై పుట్టితివి. ఇంక నీకెట్టి దుఃఖముతో నవసరములేదు. నీచెలిమింజేసి నేను కృతార్థుఁడనైతి. లెమ్ము పోదము” అని లేవనెత్తి మెల్లఁగా నడపించెనఁట! ఇదియంతయు నొక్క క్షణమాత్రములో జరిగిన పరమాద్భుతము. ఇది నాగ్రంథమునకు ముఖ్యవిషయ మని తలంచి యిట్లు వ్రాసితిని. ఇంతతో నీవిషయమును విడిచి యింకఁ బ్రస్తు తమునకు వత్తము.

అట్లు సాహిత్యము సంపాదించిన మన కవిసార్వభౌముఁడు గ్రంథరచనకుం బ్రారంభించి కొన్ని శతకములు, అష్టకములు, చెప్పిన వెనుకఁ దన పదునాఱవ సంవత్సరము మొదలుకొని యీక్రిందిగ్రంథములు రచించె.

—♦ గ్రంథముల పట్టిక ♦—

1. సత్యనారాయణోపాఖ్యానము. ప.
2. సావిత్రీచరిత్రము. ప.
3. ం చిత్రశతకము. ప.
4. గౌతమీమాహాత్మ్యము. ప.
5. కాళిదాసవిలాసము. వ.
6. తెనాలిరామకృష్ణచరిత్రము. వ.
7. జగన్నాథమాహాత్మ్యము. వ.
8. గజాననవిజయము. ప.
9. కావేరీచరిత్రము. ప.
10. ఆనందోదయము. ప.
11. వధూవిజయము. నా.
12. కనకగిరి. ప.
13. వేంకటేశ్వరీయము. ప.
14. ఏకావళీపరిణయము. ప.
15. ప్రద్యుమ్నోపాఖ్యానము. ప.
16. భగద్విలాసము. ప.
17. ♦ పతివ్రతలచరిత్రము. వ.
18. ♦ రామకృష్ణపరమహంసీయము. ప.
19. ఆంధ్రవేణీసంహారవిమర్శనము. వ.
20. ఆంధ్రవిక్రమోర్వశీయవిమర్శనము. వ.
21. ♦ ఇల్లిందకుంట రామాయణము. ప.
22. ♦ శుద్ధాంధ్రనిరోష్ఠ్యసీతాసత్యనిర్వచనైకాదశాక్షరి. ప.
23. 1 సకలఫలసారసంగ్రహము. వ.
24. 1 అమృతరాజీయము. ప.
25. చాణక్యశతకము. ప.
26. విజయాభ్యుదయము. ప.
27. ♦ భవిష్యన్మహాపురాణము. ప.
28. ♦ ప్రసన్నయాదవనాటకవిమర్శనం. వ
29. ♦ మాయావతీనాటకము. నా.
30. ♦ సావిత్రీనాటకము. నా.
31. ♦ భారతసారనాటకము. నా.
32. 1 వీరరుద్రవిజయనాటకము. నా.
33. ం స్వరాజ్యోదయనాటకము. నా.
34. బొబ్బిలియుద్ధనాటకము. నా.
35. వేణీసంహారనాటకము. నా.
36. కలభాషిణీనాటకము. నా.
37. రాజభక్తినాటకము. నా.
38. ♦ ప్రతాపరుద్రచరిత్రము. ప.
39. ♦ కమలినీపరిణయనాటకము. నా.
49. భోజరాజవిజయము. నా.
41. ం కల్హారపుష్పశతకము. ప.
42. వేంకటనృసింహరాయచరిత్రము. ప
43. ♦ ఆంధ్రశాకుంతలనాటకవిమర్శనం.
44. కురుపాండవదాయభాగవిమర్శనం
45. విజయవిలాసకృతివిమర్శనము. వ.
46. లొడారి బుచ్చిగాఁడు. ప్రై.
47. భారతాంధ్రీకరణవిమర్శనము. వ.
48. వేదాద్రిమాహాత్మ్యము. ప.
49. 1 శ్రీరామకుమారవిజయనాటకం.
50. గౌరాంగచరిత్రము. వ.
51. ఆంధ్రమేఘసందేశవిమర్శనము. వ.

52. ఆంధ్రభాషోపన్యాసము. వ.
53. నన్నయభట్టారకచారిత్రవిమర్శనం
54. 1 శ్రీకృష్ణప్రసాదానుబంధము. ప.
55. లక్ష్మీసరస్వతీసంవాదము. ప.
56. అలక్ష్మీలక్ష్మీసంవాదము. ప.
57. ♦ కాళిదాస ప్రహసనము. నా.
58. ♦ రావుబహద్దూరు. వ.
59. భద్రాచలరామచరిత్రము. ప.
60. తిలకమహారాజనాటకము. నా
61. గాంధివిజయధ్వజనాటకము. నా
62. శకుంతలాచరిత్రము. ప.
63. ♦ ఉత్తరరామచరిత్రము. నా.
64. గౌతమీపుష్కరమహాత్మ్యము. వ.
65. సంస్కృతకవిజీవితములు. వ
66. కుక్కకాటువైద్యము. వ.
67. సుదర్శనోదంతము. ప.
68. మాదిరెడ్డివేంకటేశ్వరస్మృతి. ప.
69. అన్నపూర్ణాపరిణయము. ప.
70. మోహినీమనోహరనాటకము. నా
71. ♦ వీరసేనవిజయము. నా.
72. ♦ సుందోపసుందనాటకము. నా
73. మహాభారతయుద్ధనాటకము. నా
74. ౧ ఆంజనేయచరిత్రము. ప.
75. ౦ తిక్కనచరిత్రము. ప.
76. గ్రామ్యవ్యాకరణము.
77. ♦ దుష్టచతుష్టయము. ప
78. ♦ అహల్యానాటకము. నా
79. హంసద్వీపమాహాత్మ్యము. ప.
80. శ్రీనాథకవిరాజీయము. నా.
81. న్యాయపతి. ప.
82 గారెబూరెసంవాదము. ప.
83. మహాభారతచరిత్రనిరాకరణము. వ
84. ♦ అయితేఅంతే శతకము. ప.
85. చంద్రికాపరిణయనాటకము. నా.
86. ♦ శనైశ్చరశతకము. ప.
87. ♦ చంద్రయశశ్చరిత్రము. సం. ప.
88. శ్రీరామాష్టకము. సం. ప.
89. పరబ్రహ్మాష్టకము. సం. ప.
90. ♦ శ్రీరామచరిత్రము. ప.
91. శ్రీకృష్ణకవిరాజీయము. ప.
92. ప్రసాదానుబంధము. వ.
93. బ్రహ్మానందసరస్వత్యష్టకము. సం. వ
94. సరస్వత్యనునయము. ప.
95. ♦ ఆంధ్రభాషానుశాసనవిమర్శనం. వ
96. స్వీయచరిత్రము. వ
97. ముక్తిపురరాజేశ్వర్యష్టకము. సం. వ
98. జీడికంటిరామాయణము. ప.
99. శ్రీకృష్ణభారతము. పదునెనిమిది పర్వములు. ప.

ఇందు ♦ గుర్తుపెట్టినవి యసంపూర్ణములనియు, ౦ గుర్తుపెట్టినవి నశించినవనియు, 1 గుర్తుపెట్టినవి యముద్రితములనియు, తక్కినవి ముద్రితములై ప్రకటింపఁబడియున్నవనియు, ప. యనిన పద్యకావ్యమనియు. వ. యనిన వచనకావ్యమనియు, నా. యనిన నాటకమనియు, సం. ప. యనిన సంస్కృతపద్యమనియు నెఱుంగునది.

మఱియు ననేక విమర్శనములు, వ్యాసములు, స్తోత్రములు మొదలగు నవి యున్నవి. అందుఁ గొన్ని శ్రీకృష్ణకవిరాజీయమున ముద్రింపఁబడుచున్నవి.


ఇందుఁ గొన్నిపుస్తకములు మాత్రమే శ్రీకృష్ణభారతమున—

“సీ. పదియునాఱెండ్లలోఁ బలసత్యకథయు సా, వి్త్రీచరిత్రంబు చిత్రశతక
మిరువదేండులలోన వరగౌతమీమాహా, త్మ్యము శాకుంతల వృత్తాంతవచన
మిరువదైదేండ్లలో నేకావళియు జగ, న్నాథరాజీయ నహుషవిజయము
ముప్పదేండులలోన మునుముమ్మ కావేరి, కథ పద్మావతీయము కనకగిరియు

తే. నవల శ్రీవేంకటేశ్వరీయమును వీర, రుద్రవిజయము ప్రద్యుమ్నభద్రచరిత
బొబ్బిలియు వేణిసంహారముకలభాషిణియును మోహిని రాజభక్తియును మఱియు.

తే. కమలినియును నానందోదయమును వీర, సేనవిజయము లోనుగాఁ జెప్పనైన
కృతులు శతకాష్టకంబులు కృతివిమర్శ, నంబులును బెక్కులొనరించినాఁడ నేను”

ఇట్లు చెప్పఁబడియున్నది. ఇందు “లోనుగా” అను పదములో నేఁ జెప్పిన శతగ్రంథములు నిమిడియున్నవని యభిప్రాయము. ఇవిగాక మఱియు దైవప్రార్థనములు, రాజప్రస్తుతులు. ప్రభుస్తుతులు, ఆశీర్వాదములు, నానావర్ణనములు, లోనగు ననేకపద్యములు రచియించి యున్నారు. ఈ నానాపద్యములన్నియు జేర్పఁగలిగినచో నిప్పటికి లెక్కకుఁ బదివేలకు హెచ్చినదే యుండవచ్చునని యూహింపం దగు. ఈ చెప్పిన గ్రంథములం గూర్చి దేశకాలవిషయ లక్షణాదులు వివరించుచు ముందు విమర్శించి వ్రాయుచున్నాఁడను.



శ్రీకృష్ణకవిజీవితము.

—తృతీయ ప్రకరణము.—

ఉపనయనము — ప్రథమవివాహము.

మన శాస్త్రిగారికిఁ బదియవ సంవత్సరము ప్రారంభమున నేలూరునం జేరిన ద్వారకాతిరుమల యను గ్రామమున వేంకటేశ్వరస్వామివారి సన్నిధి నుపనయనము జరిగినది. వీరిపుట్టువెంట్రుకలును మొదట నచటనే తీయఁబడెను (ఏదేని రోగము వచ్చినప్పుడు గాని మఱి యేకారణమువలనం గాని మ్రొక్కుకొనుటం జేసి దివ్యస్థలములలో నిట్లు పుట్టువెంట్రుకలందీయుట, ఉపనయన వివాహాదులు చేయుట తటస్థించును) మన కవిరాజునకు నెప్పుడో మ్రొక్కుకొనియుండుటం జేసి స్వామి సన్నిధి నుపనయనాదికము చేయవలసివచ్చినది. ఆయుపనయనమునకుఁ దల్లిదండ్రులవంక బంధుసమూహ మంతయు, స్నేహబృందమును వచ్చియున్నది. ఎల్లవారలు ఎద్దులబండ్లమీఁదం బ్రయాణమై దేవరపల్లి మార్గమున నెర్నగూడెముమీఁదుగాఁ దిరుపతికిం బోయిరి. ప్రయాణము చేయువారి బండ్లవరుస యొక ఫర్లాంగు దూరమువఱకును వ్యాపించి యుండెనఁట. ఇట్లు మహావైభవంబున నాల్గుదినములు నుపనయనోత్సవముం జరిగించుకొని యథావిభవ విస్తరంబున గృహప్రవేశంబు గావించి యంతఁ బదునొకండవ సంవత్సరమున ఈశ్వర సంవత్సరములో మనకృతికర్త మొదటివివాహము జరిగినది. వధువు తల్లియును వరుని తండ్రియు నక్కసెల్లెండ్రబిడ్డలు, ఇంచుమించు మేనరికమువంటి సంబంధము. ఆపిల్ల పుట్టినప్పుడే మనకవిరాజున కిత్తుమని యామె తండ్రియైన వాడపల్లి లక్ష్మీపతిదీక్షితులుగారు కాశ్యపగోత్రజులు వాగ్దత్తము చేసినారు. కాని పిల్లకును బిల్లవానికిని గొన్నిదినములే వయస్సున హెచ్చుతగ్గు కలుగుటం జేసి యీయీడు చాలదను భయంబున మనకవిరాజుతండ్రిగారిష్టము కానివారయ్యును దనకుఁ బినతల్లి కూఁతురును వధువుతల్లియు నగు రామసోమి దేవమ్మగారి ప్రతిబంధంబున నాసంబంధంబున కంగీకరించిన వారైరి. అది మొదలుకొని వారికిని వీరికిని రాకపోకలు, భోజనప్రతిభోజనములు మొదలగు

నవి నడచుచుండినవి. ఆకాలమున వాడపల్లివారు కోటవరమునకు సమీపమున నున్న తొఱ్ఱేటిగ్రామములో నుండువారు గనుక శుభశోభనములువచ్చినప్పుడు వారింటికి వీరును వీరింటికి వారును వచ్చిపోవు నాచారము కలవారై యుండిరి. క్రమక్రమముగా జ్ఞానము వచ్చిన వెనుక మనకృష్ణమూర్తిశాస్త్రిగారు రాపిల్ల కొంచెము బొద్దు గలిగి స్ఫోటకపు మచ్చలు గల నల్లని శరీరము కలదగుటచేతనో, తన కన్నఁ బెద్దదిగాఁ గనిపించుచుండుటచేతనో, వాడపల్లి వారంత స్థితిపరులు కాకపోవుటచేతనో, మఱికొన్ని కారణములచేతనో, తనకాసంబంధ మక్కఱ లేదని పట్టు పట్టియుఁ దండ్రిగారి నిర్బంధమునఁ జేయునది లేక వేంకమాంబ యనునాసతీమతల్లికను వివాహమాడిరి. వివాహమైనది మొదలుకొని మన శాస్త్రిగారామెయం దిష్టత లేకపోవుటచేతనో సిగ్గుచేతనో లేక విద్యావ్యాసంగముచేతనో మఱియేమి హేతువుచేతనో చెప్పఁజాలము గాని యత్తవారింటికి నెప్పుడును వెళ్ళుట లేదు. కారణాంతరమున నావాడపల్లి లక్ష్మీపతిదీక్షితులు గారు తమ నివాసమును, తొఱ్ఱేటినుండి రామచంద్రపురము తాలూకాలోని దాక్షారామపురంబునకు మార్చుకొనిరి. కవిరాజువివాహము గూడ దాక్షారామమందే జరగెను. కోటవరమునకు దాక్షారామము దూరమగుటచేత నేపండుగకును నత్తవారింటికి వెళ్లుటకు మన శాస్త్రిగారంగీకరింపలేదు. భార్య పేరు తలఁపెట్టిన వారిపై నాగ్రహించి కలహించుచుండువారఁట! ఇట్లుండఁ దనకుఁ బదునేనువత్సరములు వచ్చినప్పుడు ప్లవంగ వత్సరములోఁ బునస్సంధానము చేసిరఁట! అప్పటికిని శాస్త్రిగారి కామెపై నిష్టము కలుగనేలేదు. వేంకమాంబ పుట్టినింటియందే యుండునది యైనను అత్తవారి యింటికి వచ్చి యప్పుడప్పుడు కొన్నికొన్ని మాసములుండి పోవుచుండునది. "పెద్దపెండ్లాముపుగఁడా" యని నలువురును బిలుచుటచేత శాస్త్రిగారి కామెయందు మఱింత యిష్టము తగ్గుటకుఁ గారణమైనది. పాపము! గుణమణియగు నావేంకమాంబ యుత్తమసత్త్వము వేనోళ్లఁ గీర్తింప వలయుంగదా! మగనికిఁ దనపై నభిమానము నిష్టము లేనప్పు డత్తమామలు లోనగువారికెల్ల నట్టిదియేకదా!!

"చ. మనమున భర్తృసోదరులు మామయుఁ జాలు నిదేటి నంగడం
బనిమొద రత్తయుం గఱకులాడి శపించెడు నాఁడుబిడ్డలుం
గనలుచుఁ బండ్లు గీటెదరు గాటము దూరెడు తోడికోడలుం
మనుజులకెల్లఁ జుల్కనగు నాథబహిష్కృతకాంత కాశ్యపీ!"

అని కవిరాజు ప్రద్యుమ్నోపాఖ్యానములోఁ జెప్పినట్లు మగఁడు తిన్నఁగ జూడకున్న దాని నెల్లరును జులకఁ జేసి తిరస్కరించుట లోకాచారమే. అట్లు మగని దయకుం బాత్రురాలు కాకున్నను, త న్నితరులు మఱియొకవిధముగాఁ జూచుచున్నను, తనకు నగలు నాణెములు లేకున్నను, భోజనభాజనాదులైన నరిగ రాకున్నను, అరుంధతీ స్వరూపం బనువపనుండి యరుణోదయమున లేచి కాల్యకరణీయములు నెరవేర్చి, యింటిలోని యూడిగ మంతయుం జేసి, యింటం గలవారి మడిబట్టలన్నియు నుదికి, యింటికిఁ బట్టినన్ని నీళ్లు మోచి తెచ్చిపోసి, కూరలు తఱిగి, పొయ్యిరగిల్చి, వంటపనులు చేసి, భోజనములు పెట్టి, యెంగిళ్లెత్తి సుద్దులు పెట్టి, యంట్లు దోమి, సందెదివ్వెలుపెట్టి, మఱియు వండిపెట్టి, మిక్కిలి పాటుపడుచుండు నీమె పడుపాటు చూచియే కాఁబోలు కవిరాజు తన ఆనందోదయము మూఁడవయాశ్వాసమున.—

"సీ. వేఁగునప్పుడ లేచి బాగుగ నిల్లు వా, కళ్ళు వీదులు నూడ్చి నీళ్లుచల్లి

యఱుఁగులు గుమ్మములఱలు సుద్దికిఁ బెండ, నలికి ముగ్గులువెట్టిపాలుపుమీఱ

బోలెలు చెంబులు ముంతలు తగఁదోమి, యిల్లుపట్టినపాచి నీళ్ళుమోసి

మడిదోవతు లుదికిపడినన్ని మడినీళ్లు, వడసి యెల్లరకును వంటఁ జేసి"

తే. వెనుక నెంగిళులెత్తి బల్పేడఁ జేసి, వడ్లుదంపి పిండి విసరి పప్పు జేసి

సంజదివ్వెల పనిఁ దీర్చి సరగవండి, యూడపనులన్నియుం జేయునతఁడుగడఁగి"

అని జఠరరుతుని చేయు పనులు వర్ణించినాఁడు. ఇట్లు వేంకమాంబ పవ లంతయుం బాటుపడి రాత్రి భోజనానంతరమునఁ బడకగదిలోఁ బల్యంకమునం గల బరుపుపై మడుగుం బక్కవైచి భర్త్రాగమనంబు నిరీక్షించి నిరీక్షించి తనకు నిద్ర వచ్చునట్లయినఁ బల్యంకమునం బాడక నేలపైఁ జేల చెఱఁగు పఱచుకొని పండుకొని నిద్రవోవుచుండు. ఇట్లు ప్రతిదినమును జేయుచుండు. ఆమెపట్ల నిష్కరుణుండయిన మనకవిరాజు విద్యాభిరుచిం దగిలియో మఱియేమి కారణముచేత నో చెప్పఁజాలము గాని శయ్యాగృహంబునకు వచ్చుటయే లేదు. ఎట్టకేల కితరుల ప్రతిబంధంబున వచ్చినను నేలఁ బండి నిద్రవోవు నాయమను లేపకయే శయ్యం బండుకొని నిద్రవోవుచుండు. ఇట్లే కాలము గడచిపోయినది. లెక్కకు నొక్కన్ని దినములు తక్క నామె భర్తృసౌఖ్య మెఱుంగదనియే చెప్పవచ్చును. ఆదినములందైనను నోటిమాటకు నోచుకొననేలేదు. ఇట్లునిజభర్త్రనుగ్రహాపేక్షురాలై వేంకమాంబ మిక్కిలి శ్రమపడుచుండునది యనియు, నామె పరమో

త్తమురాలనియు, నామెట్లు పాడ దోషించినయెడల, బాపిననియు, మనకవిరాజే నాతో నొక్కమాటు ప్రస్తావవశంబున నెన్నో చెప్పి కంటనీరు వెట్టుకొనియె. ఆమాటలు వినునప్పుడు నాకును దుఃఖము వచ్చెనని చెప్పనేమిటికి? కటికివాని కైనం జిత్తంబు కఱఁగి, నీరు గాకమానదు. ఒక్కరాత్రి కవిరాజు గ్రంథావలోకనము చేయుచు మఱియొకచోఁ బండుకొని యుండె ననియు లోపలఁ బండుకొనిన వేంకమాంబ కిన్నరస్వరంబునఁ గోయిల గ్రోల్చునట్లు పంచమశ్రుతిం బాడుచుండె ననియు నది విని యెవరో యని మనకవి రాజాయింటి కిటికీయొద్దకు వెళ్ళి యాసంగీతమంతయు వినుచుండె ననియు [illegible] విని తెలియనట్లు తలుపు తెఱచుకొని బయట వచ్చి భర్తం జూచి "యెవరు వారు" అని పలుకరించె ననియు, ఏమియుం బలుకక కవిరాజు తన శయ్యకుం బోయెననియు, అంత నాయమ యటకు వచ్చి "నీసంగీతము వినవచ్చితి" నని చెప్పిన సంతోషింతమని కాంక్షలు "[illegible] కటవచ్చితి" నని యెన్నో సాకులడిగెననియు, దానికిఁ బ్రత్యుత్తరముగా నతండు పొమ్మని పలికెననియు, "అయ్యో! యీనోరిమాటయే నాకుఁ గఱవయ్యె నే నింక జీవింపనేమిటికి? పోయెదను [illegible]" అని దుఃఖించుచు లోనికిఁ బోయెననియు. నది [illegible] దనియు, మనశాస్త్రి గారు నాతోఁ జెప్పియున్నారు.

ఇది జరిగిన కొన్నినాళ్ళకే యొకనాఁడు పగలు పదిగంటలకు వేంకమాంబ మగనికి వంటచేసి [illegible] వడ్డించి కూర వడ్డించుచు [illegible] వడ్డింప లేదని కాంక్షలు [illegible] వంగి వడ్డించు నామె నెత్తిపై వైచెనఁట! [illegible] వైచెనదఁట! నెత్తిపై నొడలిపైఁ బుట్టినపై [illegible] వేంకమాంబ కంటనీరు పెట్టుకొనుచు [illegible] "నేదో కీడు రానున్నది" యని దుఃఖించెనఁట! [illegible] దేవమ్మ గారు కుమారునొద్దకు వచ్చి కోపించినట్లును, [illegible] కొన్నినాళ్ళకే వేంమాంబకు రోగ మంకురించినట్లును వినుచున్నాఁడను. అది సన్నిపాతరోగము. ఎవరును మొదట గ్రహింపఁజాలరైరి. [illegible] తన భర్తను పిలిపించి తన స్థితియంతయుం జెప్పి "నే నింక బ్రదుకను. నాకుఁ గాల మాసన్నమయినది. నాయం దిప్పటికైన దయయుంచుఁడు. నన్ను మాత్ర మెప్పుడైనఁ

దలంచుకొనుచుండుఁడు. ముందు ఁబోవు నామెయందైన మీరు ప్రేమించి యుండుఁడు" అని చెప్పెనఁట! అది కడపటిమాటగా నెంచుకొనక కవిరాజు నీకు వచ్చిన ప్రాణభయములేదు. ఊపిచ్చిమాటలు కట్టిపెట్టుము" అనిబదులు చెప్పి వెడలిపోవుచుండఁగా నామె యాతనిచేయి పట్టుకొని కన్నుల కద్దుకొని యేడ్చి పోయిరమ్మని చెప్పెనఁట! ఇట్లామెతో మాటలాడి మన శాస్త్రిగారు బయటవచ్చినారు. అంతలో నామెకు మాటలేకపోయినది. చేష్టలు మాఱినవి. ఎట్టి వైద్యము నుపకరించినదికాదు. తుదకు సమ్మతప్రయోగముకూడఁ జేసినారు. వితమైనది. ఆరాత్రి మరణబాధపడినది. మఱునాఁడు—అనఁగా వ్యయ సంవత్సర భాద్రపదశుద్ధ సప్తమీ దివసంబున నుదయకాలమం దస్తమించి పరంధామంబునొందె. పశ్చాత్తాపతప్తుం డయినమనకవిరాజున కప్పుడు కలిగిన దుఃఖమున కంతములేదు. ఆదుఃఖము చేతులు కాలిన వెనుక నాఁకులు పట్టుకొని నట్లున్నది కాని లాభించునది కాదుగదా! ఆమె ప్రాణముపోయినందులకన్న నామెపట్లఁ దనచేసిన చేఁతలు తలంపునకు వచ్చి కాఁబోలు చెప్ప శక్యముకాని దుఃఖమునొందె. సంగీతము పాడుచున్ననాఁటి మాటలును, అన్నము నెత్తి మీఁదఁ బడవైచిననాఁటిమాటలును, చచ్చిపోవునప్పుడు చెప్పినమాటలును మన కవిరాజు మనమున నాఁటి నేఁటికిని శల్యప్రాయములై వేసించు చున్నవను మాట నిశ్చయము. ఆసంగతి తలంపెట్టిన నిప్పటికి పేదికిఁ గన్నీరు మున్నీరు కాక మానదు. అట్లు పరమపదమునొందిన యామె కూర్ధ్వదేహిక క్రియలు సలిపిన వెనుక నామె వాక్యములయందు బద్ధహృదయుం డగుకవిరాజు సంతతము నామెను స్మరించుచుఁ గొంతకాలము గృహము విడిచి బయటికిఁబోలేదు. చదువుచదువలేదు. సరిగా నన్నము తినలేదు. సుఖనిద్రం బొందలేదు. పరులతోఁ బ్రసంగింపలేదు. ఇట్లు కొన్నినాళ్ళు గడచిన వెనుక మరలఁ జదువు ప్రారంభించి యప్పుడు వ్రాయుచున్న గౌతమీమాహాత్మ్యమందే చిత్తము నిల్పి కవిత్వమును జాగించుటకు బ్రారంభించి కొన్ని గ్రంథములు రచించెనని తెలియుచున్నది.

ద్వితీయ వివాహము.

ఇట్లు గ్రంథరచనాయత్తచిత్తుండై విరక్తుండై కొంతకాలంబు గడపిన యంతట మన కవిరాజునకుఁ దమతమపిల్లలనిచ్చి వివాహము చేయుదుమని యనే

కులు వచ్చిరి. కాని కొన్ని కారణములచేత వచ్చినట్లే వెళ్ళవలసినవారైరి. అందొక్కరి పిల్లనైన మనశాస్త్రిగా రంగీకరింపనైనారు. వారి కందఱకు నేదో యొకవంక పెట్టుచునె వచ్చినారు. పిఠాపుర గ్రామములో నెవ్వరో తమ కన్య నిత్తుమని చెప్పి పోఁగా నాకన్యం జూచుటకు స్వయముగా వరుఁడే చని పాఠశాలయందుఁ జదువుకొను నాకన్యం జూచి సర్వవిధములచేతను దనకు నచ్చియుండుటంజేసి దానిని వివాహమాడుటకు నిశ్చయించుకొనియెం గాని వారికి గ్రామపౌరోహిత్య మున్నదని విని యది తగదని విడుచుకొనియె. అంత మఱియొక సంబంధము రఘుదేవపురమునుండి రాఁగా నటఁజని కన్య తండ్రి మహానుభావుఁడని వినియును దల్లి మంచిది కాదని వినుటచే నాసంబంధమును విడుచుకొని తిరిగిపోయి వచ్చిన సంగతి తల్లిదండ్రులకుం జెప్పి మంచి సంబంధము వచ్చినఁగాని నేను వివాహమాడనని నిశ్చయించుకొనియుండె. ఇట్లున్న సమయమునఁ గుమారదేవగ్రామనివాస్తవ్యులును మహాశ్రోత్రియు నగుపీసపాటి అగ్నిహోత్రిశాస్త్రిగారు మనశాస్త్రిగారి కనుగోత్రాదికమే గాక విద్యావైశద్యముఁ నెఱింగియున్నవారు గావున నరసాపురంతాలూకాలో నున్నసుబ్రహ్మణ్యేశ్వరుని నడుపూడి యనుగ్రామమున నున్నతమభావుకు లగు బ్ర॥ కళా లక్ష్మీనారాయణశాస్త్రిగారికిఁ బత్రికాముఖముగను వాగ్రూపముగను మన సార్వభౌమునింగూర్చి ప్రస్తావించి "యనుకూలవరుఁడు గావున నీకూఁతు నిచ్చి వివాహముచేయుము" మని చెప్పియున్నారఁట! అంతలోఁ బెద్దాపురములో మైత్రి వడసి యున్నపోతరాజు రాఘవయ్యగారనువారికి నడుపూడి కరణముగారి కుమార్తె నిచ్చుటయును, ఆవివాహమునకు మన కవిరాజుగారు కూడఁ బోవుటయును దటస్థించినది. అట్లు పోయియున్నప్పుడు కళా లక్ష్మీనారాయణశాస్త్రిగారును వారి కుటుంబమును, మనశాస్త్రిగారి సంగతి లోఁగడనే వినియున్నవారు గావున నప్పుడు తమ యూరికి వచ్చియుండుటను విని వారందఱును వారిం జూచి సంతసించి తమ తృతీయపుత్రిక యగు వేంకటరత్నాంబను మన కవిగారికిం జూపి యన్యోన్యాంగీకారంబులం బుచ్చుకొనిరి. వెనుక లక్ష్మీనారాయణ శాస్త్రిగారు కాటవరమునకు వచ్చి తమకూఁతు నిత్తుమని చెప్పి ముహూర్తము నిర్ణయించుకొనిపోయిరి. అంతట మనకవిరాజు తల్లిదండ్రులు, తమ్ముఁడు, అక్కచెల్లెండ్రు, బావలు, మఱఁదులు, లోనగుబంధువర్గంబును, గురువరుం డైన యుపటూరి నాగలింగశాస్త్రులవారును, మిత్రు లగుమఱికొందఱును, పురో

హితప్రభృతివిప్రవర్గంబును, మఱికొందఱు భృత్యులును, పరివేష్టింప మహావైభవంబున వివాహమహోత్సవమునకుం దరలిపోయి నడుపూడి గ్రామంబున విజయసంవత్సర చైత్రశుద్ధ నవమినాఁడు వేంకటరత్నాంబం బెండ్లియాడి మరల గృహస్థుండై మహోన్నతివైభవంబునం బ్రకాశించె.

—♦ సంతానము. ♦—

ఇట్లు చదువను వ్రాయను నేర్చిన కులీనం బెండ్లియాడి మన కృష్ణమూర్తిశాస్త్రిగారు సభార్యులై గార్హస్థ్యధర్మంబుల నెరవేర్చుకొనుచుఁ గొంతవరకుఁ దండ్రిగారియొద్దనే నివసించియుండియుం గొంతకాలమునకు రాజమహేంద్రవరమున నివాసంబు గావించుకొనిరి. ఇట్లు గొంతకాలము జరిగిన వెనుక మన కవిరాజునకు శార్వరినామసంవత్సర మాఘశుద్ధ ౧3 సోమవారము రాత్రి 3 ఘటికలు 3౧ విఘటికలకుఁ బుష్యమీనక్షత్రసింహలగ్నమున నడిపూడి గ్రామమునఁ బ్రథమపుత్రికాజననము కలిగెను. అప్పుడు :—

శ		శు బు ర
చ	రాశి	కు
లి		కే ర గు

శ	ల	రా
	అంశ	
శు కే బు చ	ర బు	గు


ఇట్లు గ్రహసంపత్తి గలిగియుండెను. మన కవిరాజుమాతృకు బారసాల మహావిభవంబునం గావించె. ఆసంవత్సరమే శ్రీకృష్ణశాస్త్రిగారు కాశీపురంబునకుం బోయి వచ్చిన వారగుటచే నారేయి తాము కాశికిం బోయినట్లును విశాలాక్షిం దర్శించి సేవించినట్లును తనకు స్వప్నమగుటం జేసియుఁ దాను ప్రత్యహంబును శ్రీబాలా మహామంత్రమును జపించువారగుటం జేసియుఁ బుట్టినపిల్ల కన్నులు పెద్దవియగుటం జేసియును "విశాలాక్షి" యను నామకరణముచేసిరి. విశాలాక్షికిఁ దొమ్మిదిమాసములు వచ్చినప్పుడు ... జేరినిమోన నెత్తివిమచ్చ బయలు దేరెను. దానికి వైద్యము పిఠాపురము లగువేంకటసోమయాజులుగారే

చేసిరి కాని యింతలో నా వేంకటసోమయాజులుగారు కాలధర్మమునొందుటం జేసి మన కవిరాజుగా రాతొందరలోఁ బిల్లచేతిమీఁది మెఱుపుమచ్చకు వైద్యము చేయించుట కశ్రద్ధచేసిరి. ఆమచ్చ క్రమక్రమంబునం దెల్లఁబడి యాచేయి యంతయుం బ్రాకునట్లయినది. అది చూచి భయంపడి కవిరాజు దానికి దేశంబులంగల మందులన్నియుం దెప్పించి వేయించినారు. అనేకవారము లనేకమండలములుగా సూర్యనమస్కారములు చేయించినారు. ఆవైద్యమునకు మొత్తము వీరికి రెండువేలరూప్యములకుఁ బైగానే వ్యయమయినది. కాని దాని వలన నింతయు లాభము కలుగలేదు. తుద కొకపరమహంసక్రియ దొరకినది. అది కాఱుగచ్చగింజలనంబడు బావంచాలు. (అవి ఫుల్లచల్లతోఁ గాని మేకపంచితముతో గాని నూఱి తెల్లచుంగా మచ్చకు రాయుటయును, అదే కుంకుడుగింజంతమాత్ర ప్రతిదినము రెండుపూటలును లోనికి వేయుటయును జేయవలయును. ఇట్లొక్క సంవత్సరము దీక్షగాఁ జేసిన నెట్టి శ్వేతపుమచ్చలైనను బోవును. దీని కిదియే మందు. దీనికన్న మఱియొక్కటి లేదు. ఎవరు ఎచ్చి యెట్టిమందు వేసినను బోఁ గొట్టఁజాలరు. ఇది మన కవిరాజుగా రనుభవముచేతఁ జెప్పినది గాని వట్టిది గాదు. తన కుమార్తెకేగాక వీ రీవైద్యమే పదుగురికిఁ జేయించినారు. అందఱికిని గుణమే కలిగినది.) ఇట్లు ప్రతిదినమును బావంచాలు సేవించుటచేత విశాలాక్షమ్మకుఁ జేతిమీఁదమాత్రమే బయలుదేరిన శ్వేత మిప్పు డిసుమంతయును లేదు. మొదట నీశ్వేత మిసుమంతగలిగియున్న కారణముచేతనే యామెకు మంచిసంబంధము వచ్చినది కాదు. ఈకారణముచేతనే మనశాస్త్రిగారు గొప్ప సంబంధమునకై ప్రయత్నింపనే లేదు. దైవముమీఁదనే భారము వేసియున్నారు. ఇట్లుండఁ దాళ్ళపూడిగ్రామవాస్తవ్యులును సుకులీనులు నగు శ్రీకల్లూరి వేంకటకృష్ణదీక్షితులుగారి పెద్దకుమారుఁడు వేంకటసుబ్బారాయఁడు మెట్రిక్యులేషను పరీక్షం జేరియున్నవాఁడు తగినవాఁడు నని యెంచి వారికి భూస్వాస్థ్యము మొదలగునవి యేమియు లేకున్నను విశాలాక్షమ్మ నాతనికి సాలంకృతకన్యాదానముచేసి విరోధికృన్నామసంవత్సర ఫాల్గుణ శు ౧౧ బుధవారము (28-2-12) (రాత్రి పునర్వసూనక్షత్ర మకరలగ్నమందు రాజమహేంద్రవరమున మహేంద్రవైభవమున వివాహమహోత్సవము గావించినారు. ఆవివాహమహోత్సవమునకు మన కవిరాజుగారికి మూఁడు వేలరూప్యములకు నధికముగానే వ్యయమయినది. వచ్చిన బ్రాహ్మణులకే గాక కుంటి గ్రుడ్డి లోనగువాండ్రకు

నానాజాతులవారికిని గమపాటు భోజనముపెట్టిరి. ఉభయత్ర ఖర్చులును వీరే భరించిరి కావున సుముహూర్తసమయమందును సదస్యకాలమందును బంగారు కాసులు, సేలువలు, దోవతులు, మొదలగునవి నూరుగురికిమించి బ్రాహ్మణులకుఁ బంచిపెట్టినారు. ప్రతిదినమందును నానావిధములైన పిండివంటలు జేయించి భూతతృప్తి గావించినారు. ఇట్లు గారాబంబునం బెఱిగిన విశాలాక్షమ్మ చిన్నతనమునుండియుఁ దండ్రిగారియొద్దం గూరుచుండి చదువను వ్రాయను నేర్చికొనియె. క్రమముగాఁ దెనుఁగు గ్రంథములన్నియుం జదివి తెనుఁగు సాహిత్యము కుదుర్చుకొని మొదట గోపాలశతకమును రంచించినతరువాతఁ జంద్రమతీ చరిత్రము, దమయంతీచరిత్రము, రాజ్యలక్ష్మీపరిణయము, భారతకథామృతము భాగవతకథామృతము, రామాయణకథామృతము, పంచకన్యాప్రభావము, చిరంజీవులు, లోనగు పద్యకావ్యములును, బ్రహ్మవైవర్తపురాణములోని కృష్ణజన్మఖండము, సుచరిత్ర, లోనగు వచనకావ్యంబులును రచించినది. పదిరెండవ సంవత్సరమున రచించిన గోపాలశతకమున "రాజమహేంద్రపురగోపాలా" అని మకుటము.

పదుమూఁడవ సంవత్సరమున రచించిన చంద్రమతీచరిత్రము గోపాల శతకముకన్న మిక్కిలి రుచ్యముగా నున్నది. అందు హరిశ్చంద్రునియొక్కయుఁ జంద్రమతియొక్కయుఁ జరిత్రమంతయును మూఁడాశ్వాసములుగా సులభశైలిం బ్రబంధముగా వ్రాయబడినది. తత్పూర్వమామెకు వ్యాకరణము బాగుగాఁ దెలియదనియునప్పటికి దెలిసెననియుఁ విషయముల వివరించుచుఁ దండ్రియగు మనకవిరాజుగారు పీఠిక వ్రాసియున్నారు. ఆసంవత్సరమందే దమయంతీ చరిత్రము రచించినది. చంద్రమతీచరిత్రము శ్రీశ్రీశ్రీ రాజా వాసిరెడ్డి శ్రీ చంద్రమౌళీశ్వరప్రసాద బహద్దరువారి రాజ్యలక్ష్మి కంకితము చేయఁబడియె. ఆగ్రంథ మామూలాగ్రముగఁ జదివి శ్రీరాజావారు సంతసించి తమరాణీగారిచే గుంటూరిలో మన విశాలాక్షమ్మకు 116 రూప్యంబులను సుమారు 200వందల విలువగల వస్త్రములును బహుమానమిప్పించినారు. ఈపుస్తకము చదివి యానందించి తిరుపతిపురవాస్తవ్యులును న్యాయవాదులు నుభయభాషా భూషణులు నగు శ్రీనాగపూడి కుప్పుసామయ్య బి. యే. గారు రాజమహేంద్రవరమునకు వచ్చి విశాలాక్షమ్మనుజూచి యామెచే నాశువుగాఁ గొన్నిపద్యములు చెప్పించి

మిక్కిలి కొనియాడి యాశీర్వదించి చనిరని వినుచున్నాఁడను. చంద్రమతీచరిత్రమును జదివి యానందించిన శ్రీ రాజా చంద్రమౌళీశ్వర ప్రసాదుబహద్దరువారు మనకవిరాజుం బిలిచి "మీ యన్నగారిచే వెనుకటిలోఁ జేసియున్న రాజ్యలక్ష్మికిని నృసింహునకును వివాహము వర్ణించుచు నొక్క గ్రంథము చేయింపుఁడు" అని యానతిచ్చి యనంతరమున గుంటూరులో వారి నారీమణిచే విశాలాక్షమ్మ గారాజ్ఞ యొసంగింపించిరఁట. గానంజేసి విశాలాక్షమ్మ "రాజ్యలక్ష్మీపరిణయ" మను పేర నాలుగాశ్వాసముల గ్రంథము రచించినది. ఇందు సముద్రుఁడు తన కూఁతురైన లక్ష్మీదేవిని నరసింహమూర్తికిచ్చి వివాహము చేసిన కథ యంతయు వింతగా వర్ణింపఁబడినది. గ్రంథమంతయు మృదుమధురవాక్యంబుల నొప్పుచున్నది. ఈగ్రంథము శ్రీముక్త్యాల రాజావారి సతీమణి [illegible]ద్యానపరమైన కృతి చేయఁబడినది. దానికి శ్రీ రాజావారి [illegible] విశాలాక్షమ్మకు సుమారు వేయిరూప్యములు వస్త్రాదికముతో నొసఁగినారు. భారతకథామృతములో భారతకథమాత్రమే కలదు. అందు సుమారు 2500 పద్యములున్నవి. రామాయణకథామృతము 2000 పద్యములు భాగవతకథామృతము 1500 పద్యములకు మించియే యున్నది. ఇందుఁ గొన్ని గ్రంథములు మహారాజావారిచే ముద్రితము. సుచరిత్ర యను గ్రంథమందుఁ బతివ్రతాకథలు [illegible] ప్రకటింపఁబడినది. ఇది మూఁడు భాగములు. ఇందు రెండు భాగములు గవర్నమెంటువారిచే స్కూలుఫైనల్సుకై యప్రూవు చేయఁబడినవి. మూఁడవభాగమింకను ముద్రితము కాలేదు. తక్కిన గ్రంథము లిప్పటి క[illegible] [illegible] బూసలతోఁ బొమ్మలు, చెట్లు మొదలగునవి కట్టుట [illegible], ఊలుదారముతో ననేక చిత్రములు కట్టుటయందును, మిక్కిలి [illegible] గడిచినమో యట్టి చిత్రరచనమో చేయుచుండును. [illegible] [illegible] మాటలతోఁ బెత్తనములతోఁ [illegible] విశాలాక్షమ్మకు లేదు. మనకవిరాజున కీవిశాలాక్షమ్మ [illegible] మూఁడు[illegible]లకు శుభకృన్నామ సంవత్సర పుష్యశుద్ధ [illegible] ఘటికలకు [illegible] నక్షత్ర ధనుర్లగ్నమున.—




ఇట్లు గ్రహసంపత్తి గలిగియున్నట్టియు ద్వితీయపుత్రికా జననము గలిగెను, ఆకాలంబున మనకవిరాజు ప్రతిదినమును సహస్రగాయత్రిం జపించుచుండినవారు గావునను, అనేకమండలములు సూర్యనమస్కారములు చేయించియు నపుడు చేయించుచున్నవారు గావునను ఆద్వితీయపుత్రికను సావిత్రి యని నామకరణము చేసిరి. సావిత్రి పుట్టినది మొదలుకొని నీరసముగా నుండు శరీరమున నొప్పుచుండును. ఈమెకు రెండవసంవత్సరమునం బిల్లలకు వచ్చు వాతము వచ్చినది. వచ్చినప్పుడు మోటవైద్యముగా మొగంబుమీదం గొంచెము కాలిచినారు. ఆమచ్చ యిప్పటికిని గానుపించుచునేయున్నది. అప్పుడు కర్పూరము నూరి యాగందముతోం గలిపి త్రాగించినారు. అది మొదలుకొని సావిత్రమ్మకు నెనిమిది సంవత్సరములు వచ్చువఱకును పైం జెప్పిన జబ్బు కనుపించుటయుం గనిపించినప్పుడెల్లం గర్పూరము వేయుటయుం జరిగినదిం దీనివలన నామె కృశించిన దేహముగలదియైయున్నది. సావిత్రమ్మ రాజమహేంద్రవరమున నున్న గవర్నమెంటు బాలికాపాఠశాలకుంబోయి చదువుకొనుచున్నను భాషాజ్ఞానము చక్కగాం గలిగియుండలేదు కాని యామెకు సంగీతమం దభిరుచి కలిగినది. అది గ్రహించి తండ్రిగారొక సంగీతోపాధ్యాయునికి మాసవేతన మేర్పఱచి సంగీతము చెప్పించిరి. సావిత్రమ్మగాత్రము చాలమంచిది. కిన్నరవలె మ్రోగును చక్కగా నీమె హార్మోనియమనుజంత్రమును గొంచెము వీణయును వాయించుచుం గృతులు లోనగునవి శ్రావ్యముగాం బాడంగలదు. సావిత్రమ్మయు విశాలాక్షమ్మవలెనే ఊలుపనులు, పూసలపనులును జక్కంగా దెలిసియుండెను. ఈసావిత్రిమ్మకు రాక్షసనసంవత్సర. వైశాఖశుద్ధములో యథావిభవ విస్తర

ముగా వివాహము జరిగినది. వరుఁడు రాజోలుతాలూకాలోని గన్నవరమునకు సమీపమున నున్న రావిపాటియగ్రహారమునందుఁ గాపురంబున్న శ్రీకడియాల లక్ష్మీనరసింహముగారి ద్వితీయపుత్త్రుఁడు సుబ్రహ్మణ్యమను పేరుగలవాఁడు కడియాలవారు సత్సాంప్రదాయము గలవారు, యోగ్యులు. వీరికి వరదక్షిణ లేక వరశుల్కము నానేమియు మన శాస్త్రిగారొసంగలేదు. ఉభయులఖర్చులును దామేభరించి మహావైభవంబున సాలంకృతకన్యాదానము చేసినారు. విశాలాక్షమ్మ వివాహముకన్న సావిత్రమ్మవివాహమునకు నైదువందలరూప్యము లధికమయ్యెనట! అన్నప్రదానము బ్రాహ్మణదక్షిణలు, వధువునకలంకారములకే యయ్యెను. ఈధనమంతయు శ్రీశ్రీ వాసిరెడ్డి శ్రీ చంద్రమౌళీశ్వర ప్రసాద బహద్దరువారు మనకవిరాజుగారికొసంగిరని వినుచున్నారము.

సావిత్రమ్మ వివాహము ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావు పంతులుగారి భవమున జరిగినది. ఆవివాహమునకుఁ బెక్కురు మహాపండితులు వచ్చియున్నారు. వేదములందును, శాస్త్రములందును, కవిత్వమునందును, సంగీతమునందును ఆరితేరిన విద్వాంసులు పెక్కుమంది వచ్చియున్నారు. వారినెల్లఁదగునట్లాదరించి కవిరాజుగారు సత్కరించిరని వినుచున్నాము. ప్రతిదినమును బ్రాహ్మణ భోజనములైన పిమ్మట కుంటి, గ్రుడ్డివాండ్రకు, అన్నము పెట్టఁబడుచుండెనఁట! అట్లు పెట్టుచున్నను సంతబ్రాహ్మణులలోపమువలన ప్రతిదినమును మిగిలిన అన్నము చెడిపోవునట్లు కాగా నదియంతయు భూదేవికి సమర్పింపఁబడుచుండెనని తెలిసినది. ఇట్లతి వైభవంబున జరిగిన వివాహములో మనకవిరాజుచేత నున్నధనము సరిపడినది. సదస్యమునాఁడు ఐదువందల రూప్యములు కావలసి వచ్చినది. అప్పుడు రాజమహేంద్రవరమునఁ బ్రసిద్ధిగాంచియున్న బారుశ్రీరామ నరసింహారావుగారి యొద్దకుం బోయి సంగతిం జెప్పఁగా వారు నోటైనను వ్రాయించుకొనక యైదువందలరూప్యము లిచ్చి సలక్షణముగా వివాహము జరిగించిరఁట!

ఇట్లురువురు పుత్త్రికలుపుట్టిన వెనుక మన కవిరాజు గారికి స్వస్తి శ్రీ ప్రమాదీచనామసంవత్సర వైశాఖశుద్ధ పంచమ్యాదిత్య వారమున(11_5_13) ఉదయము 10 గంటల 15 నిమిషములకుఁ బునర్వసూ నక్షత్ర కర్కాటక లగ్నమందు:-



ఇట్లు గ్రహసంపత్తి గలిగియున్నప్పుడు పుత్రోదయమయ్యెను. ఈపుత్రోదయమునకుఁ బదిదినములకుఁ బూర్వమునఁ దల్లిగారికి రక్తగ్రహణి వచ్చినది. ఊనమునకుఁ గొన్నివందల విరేచనములయినవి. ఎందఱుచేతనో యెన్నో మందులు వేయించినారు కాని యెందునను శాంతి కలుగలేదు. అది యెనిమిదవమాసమని యందఱకు ననుమానము. ఇట్లే దీనికిమున్ను రెండుప్రసవములకువిరేచనములు వచ్చి శిశువులకుఁ భంగము కలిగినది. ఇదియు నట్లే యగునని యెల్లరును భయపడుచుండిరి. అంతలోఁ బ్రసవకాల మాసన్నమయ్యె. మంత్రసాని వచ్చినది. కవిరాజు కస్తూరిఁ దెచ్చుటకుం జనియె. వచ్చునంతలోఁ బుత్రుఁడు పుట్టినాఁడు. మంత్రసాని శాస్త్రిగారిం జూచి "పిల్లవానికిఁ దొమ్మిదవమాసము కాని మీరనుకొన్న యెనిమిదవమాసము కాదు. పిల్లవాఁడు చక్కనిస్థితిలోనున్నాఁడు" అని చెప్పినది. ఆమాటలు విని యెల్లరును సంతసంబునొంది మంత్రసానికి బహుమానం బొసంగిరి. తండ్రి పుట్టిన నక్షత్రమందే పిల్లవాఁడును బుట్టినవాఁడు గనుక మన కవిరాజుగారు గ్రహశాంతిం జేసిరి. పిల్లవాఁడు శంకరభగవత్పాదాచార్యులు పుట్టిన దినము తిథివారనక్షత్రాదులును సరిపడినవేళఁ బుట్టినవాఁడు గావున "శంకరుఁ" డని పేరు పెట్టఁదలంచిరి గాని నాఁటి యరుణోదయకాలమునఁ గన్న స్వప్నమును బట్టియు, మంత్రసాని చేతులలోనుండి తండ్రికి మంచి దర్శన మిచ్చినవాఁడైనవాఁడు గనుకను "సుదర్శన" మని పేరు పెట్టినారు. (ఆనాఁటి యరుణోదయకాలమున మనకవిరాజుగారి స్వప్నములో నొక వైష్ణవుఁడు పొడకట్టి "నేను మున్ను మీతండ్రికిఁ బుట్టితిని: నీకు మఱియుఁ బుట్టు

చున్నాను” అని చెప్పి అర్ధానమయ్యెనట. ఆస్వప్నముదయమునకు మనకవికి జ్ఞప్తి
లో లేకపోయెను గాని రాత్రి భోజనానంతరమున నెల్లరు నిద్రించుచుండ వేఁకు
వనైన స్వప్నము జ్ఞప్తికి రాగా మనకవి భక్తివైరాగ్యభరితుండై యొం డరయఁ
జాలక పురిటింటిగుమ్మముకడఁ కేగి తలుఁపు తెఱఁచి పిల్లవానిం జూచి అతఁడు
శ్రీమహావిష్ణువే యని నిశ్చయించుకొని చేతులు జోడించి నమస్కరించుచు
“శాంతాకారం” అను శ్లోకము చదివి స్తుతించెనఁట! అంతలోఁ బ్రాపంచిక
జ్ఞానము కలవాఁడై “ఏమి ఇట్లు తప్పుచేసితిని. పిల్లవానికి నమస్కరించితిని. ఇది
కీడున కగునని మోహపరవశుండై యాసంగతి యెవ్వరికిం జెప్పక శయనస్థలంబు
నకుం బోయి పండుకొనియెనఁట! ఈకారణంబునం జేసి యాపిల్లవాఁడు చిరం
జీవి కాఁడేమో! తనతండ్రిగారికిఁ బుట్టిన లక్ష్మీపతి యట్టివాఁడే యితఁడునని
సందేహించుచుండెం గాని యెవ్వరికినిం జెప్పలేదఁట! ఆపిల్లవాఁడు పుట్టిననాఁడు
మొదలుకొని శబ్దమందేప్రియముగలవాఁడు. ఏడ్చుచున్నప్పుడే దేనిశబ్దము జేసి దేని
యేడ్పువిడిచి యది వినుచుండును. అది తెలిసికొని తండ్రిగారొకగంట, బూరా
మొదలైనవి తెచ్చి శిశువునకు వినోదముగా వాయించుచుందురఁట! తరువా
తను సుదర్శనము వీధిలోనున్న యిల్లు గనుక బాజాలు మొదలగునవి వచ్చి
నప్పుడు వెళ్ళి చూచి విని యానందించి గంతులువేయుచుండును. ప్రతిదినమును
అక్కయగు సావిత్రమ్మ హార్మోనియము వాయించుచుండఁ దానును వాయిం
చుచు “సా-పా-శా” యని కూనిరాగముతీయుచుండును. సుదర్శనముబొడ్డులో
బంతిపువ్వువలెఁ బెద్దపుట్టుమచ్చకలదు. అది సాముద్రికశాస్త్రప్రకార ముత్తమ
మని పెద్దలుచెప్పుదురు. జాతకమును సర్వోత్తమమని జ్యోతిష్కులు చెప్పియున్నారు.
బొడ్డునందు శ్రీవత్సము గలదు. హస్తముల హలకులిశాదిరేఖలుగలవు. డెబ్బది
సంవత్సరములు జీవించునుఅని చెప్పిరి. మనకవి పదుగురిచే జాతకములు వ్రాయిం
చి వారికి విశేష బహుమానములు చేసిరి. కాని వారి మాటలన్నియును నీటి
లోని మూటలైనవి. వారివ్రాఁతలన్నియును నీటిపైఁ వ్రాఁతలైనవి. ఈవిషయ
మంతయు మఱియొక ప్రకరణమున వ్రాయనెంచి మఱియొక విషయమునకు
వచ్చుచున్నాను.

శ్రీకృష్ణకవిజీవితము

చతుర్థప్రకరణము.

— వర్తకము. —

మన కవిరాజునకు బాల్యమునుండియు స్వయంకృషివలననే జీవింపవలయునని యభిప్రాయము గాని యొరుల చేతిక్రింద నడఁగియుండుట కభిప్రాయములేదు. అది వీరు నీచమునకన్న నీచముగానే చూచుచుందురు. వీరు చిత్రభాను సంవత్సరమందుఁ గాటవరమునఁ జదువుకొనుచుండియుఁ గోమట్లు చిల్లర వస్తువు లమ్ముటలోఁ బల్లెటూరి ప్రజలను మోసముచేయుదురని తలంచి తమ గ్రామమం దాలోపములేకుండఁ జేయఁదలంచి సహాధ్యాయి యగుమధిరసుబ్బన్న దీక్షితులుగారితో నాలోచించి తన తల్లిదండ్రులయొద్దను మేనమామల యొద్దను పెదతల్లియొద్దను సంపాదించి నిలవచేసియుంచినసొమ్ము పెట్టి, ఉప్పు, మిర్చి, చింతపండు, జీలకర్ర, ఇంగువ, మెంతులు, బెల్లము మొదలగు చిల్లర వస్తువులం దెప్పించి కాటవరములో నొక దుకాణముపెట్టించి తాము కొన్ని ధరలకే పరోపకార మపేక్షించి యమ్మించుచుండువారు. ఇట్లు కొన్నిమాసములు చేయువఱకుఁ గొంతనష్టమువచ్చినది. చదువునకు నంతరాయమైనది. అంతతో నితరుల ప్రోద్బలమువలన దానిని విడుచుట కిష్టములేనివారైనను విడువవలసినవారైరి. ఈచిల్లరవస్తువు లమ్మించునప్పుడే దానికి ధనము సంపాదింపవలయుననునభిప్రాయముతో నెచ్చటనో కొన్నివందలరూప్యములు బదులుతెచ్చి పుట్లకొలఁది మిర్చి, జొన్నలు, ఉలవలుఁ ధాన్యము మొదలగు సరకులు గొని నిలువఁ జేయుచువచ్చినారు. ఆవర్తకములోఁ గొన్నిసారులు లాభము, కొన్ని సారులు నష్టమును వచ్చినది. ఒకసంవత్సరమున వీరు కొన్ని వేల రూప్యములు పెట్టి జొన్నలు కొని కార్తికమాసమువఱకు నిలువఁ జేసి యుంచవలయునను నభిప్రాయముతో నాజొన్నలన్ని పాతళ్ల వేయించిరి. ఆయేడు శ్రావణభాద్రపద మాసములలో మిక్కిలివర్షములు కురిసినవి, ఎలుకలబిలములనుండి ఆపాతళ్లలో నీరు పడి యా జొన్నలన్నియుఁ గుల్లిపోయినవి. ఆగోలు చెప్పశక్యముఁ గాకుండెను. కొన్న సొమ్మంతయు నష్టుగంగపాలైనది. అట్లుచేసిన వర్తకములో

మొత్తముమీఁద లాభముకన్న నష్టమే యధికము. తండ్రిగారి కిది యెంత మాత్రము నిష్టము లేకున్నను గుమారునిష్టమునకు భంగపాటు గలిగించిన వార మగుదుమని వలదనియు వలదనకుండిరి. ఇట్లు కొన్ని సంవత్సరములు వర్తకముచేసిరి. వర్తకమం దసత్యమత్యావశ్యకము. అట్టిది వీరికడఁ బనికిరాదు. ముక్కునకు సూటిగ నడచినవారు. దానంజేసి యీవర్తకమందును గొన్ని వేలు నష్టమే గలిగినది గాని లాభము కలుగలేదు. వర్తకమిట్లయినది.

—♦ వ్యవసాయము. ♦—

ఇంక వ్యవసాయమునుగూర్చి ముచ్చటించెదను. కాటవరమునకు సమీపమున నినుగంటివారిపేట యనునొక గ్రామము కలదు. ఆపేటకులంకలుమిక్కిలి గలవు. (లంక యనఁగా నేటిమధ్యమున బయలు దేరి దుబ్బులతోఁగూడిన ప్రదేశము. అది యకరమున కొక్కయేఁడు వ్యవసాయము చేసికొని ఫలమనుభవించుటకుఁగాను నాలుగైదురూపాయలకు శిస్తుగలిగియుండును. ఆలంకలు రయితులకు నేలము వేయుదురు.) అట్టిచో మనశాస్త్రిగారాగ్రామమునకువెళ్ళి పది పదునైదువేలరూప్యముల లంకాభూములు పాడి తనపేర పాట ఖాయము చేయించుకొనియె. అప్పుడు మఱికొందఱు రహితులు వచ్చి "మీ రీభూములు మాకు వదలివేయుఁడు. మీకు వేయిరూప్యములు బహుమాన మొసంగెదము" అని మనశాస్త్రిగారిని గోరిరి. కాని శాస్త్రిగా రట్లిచ్చుట కంగీకరింపక యింటికి వచ్చి యీ వృత్తాంతము తండ్రిగారితోఁ జెప్పక మరునాఁడుదయమున లేచి ములకల్లంక యనుగ్రామమునకుం బోయి యట నొక ధనవంతునితో మాటలాడి వ్యవసాయము జేయించుటకుఁ జాలినంతసొమ్ము పెట్టుబడి పెట్టుటకు వాని నేర్పాటుచేసుకొని యప్పుడే రెండువేలరూప్యములు కాగితములపద్దుపై వ్రాసి బదులుపుచ్చుకొని పిఠాపురమునకుం బోయి యట జత యొకటికి రెండువందలు వెలగల మంచియెడ్లంగొని వాని నన్నింటిని నాటుమార్గమున నింటికిందోలి తెప్పించి వాని సంరక్షణార్థము గడ్డిబీళ్ళు, గడ్డి, ఉలవలు మొదలగునవి కొని పశువులను గాచుటకు దున్నుటకుఁ దగినవాండ్రను జాలికాపుల నొకడబ్బునకు రెండు డబ్బు లిచ్చి నిర్ణయించుకొని, కొందఱఁ జాలివాండ్రంబెట్టి వాండ్రకు నూఱులకొలంది సొమ్ముపెట్టి లంకల దున్నించి యుందుఁ బొగాకుతోఁటలు నాటించినారు. ఎండలచేత భూమిలోని పదును పోయి నేల పడిపోవునని తోఁచి దినమునకు నాగలి యొకటికిఁ మూఁడు

కూలీలకు చొప్పునఁ గూలి యిచ్చి రేఁబవళ్ళు లంకయందే నివాసముగానుండి వ్యవసాయముచేయించినారు. ఒకనాఁడు లంక కాఱుమైళ్ళదూరమందున్న తమ యింటికి భోజనమునకు వెళ్ళుటకు నెండ మిక్కిలి కాయుచుండుటచే వీలుపడినదికాదు. భోజనవేళ దాటిపోయినది. తినుట కేమియు నట దొరకదు. అప్పు డాలంకలలోఁ గాపురమున్న యొకపాలికమతపువాండ్రయొద్ద కొన్ని గంటిబియ్యము సంపాదించి యొకదుబ్బుక్రింద నుడకవేసికొని భోజనము చేసినారు. శాల్యన్నము కాక యెప్పుడును జూచి యెఱుగనివా రాగంటికూడెట్లు తినఁగలిగిరో? కటకటా! ఇట్లు ప్రతిదినము నరుణోదయమున లేచి లంకలోనికివచ్చి పనులెట్లు చేయింపవలయునో యట్లన్నియుం జేయించి భోజనమునకుఁ గాటవరమునకుఁ బోవుచుందురు. ఇట్లు లంకలోఁ బనులు చేయించివచ్చునపుడు నడుమ దమయెడ్లకు మేఁత బీడు కలదు. లంకలో దున్నివచ్చి యెడ్లందు మేయుచుండును. నాఁడు సాయంతనమువఱకుం దున్నినయెడ్లను పాలికాపువాండ్రు తోలుకొనివచ్చి బీటిలో మేఁపక బందములువేసి యిండ్లకుఁ బోయిరఁట. మనకవిరాజు చీఁకటిలో నొక్కరుఁడును బీటి సమీపమునకు రాఁగా నార్తధ్వని యొకటి వినవచ్చినది. అది యేమోయని వడివడింబోయి తమ యెడ్లు గట్టుకొనియున్నచోటికిం బోఁగా రెండెడ్లు బందముతో మేఁతకై పెనఁగులాడి పడి బందములోఁ జిక్కుకొన్నవి. అది చూచి మిక్కిలి వగచి నోటితోఁ గొఱికి బంధమును ద్రెంపిరఁట. అంతలో నొకయెద్దు లేచిపోయినది. రెండవయెద్దు పడి చచ్చిపోయినది. దానికి మిగుల వగచి పశువులు మేఁతలేకయున్నవని తెలిసికొని యన్నిటి బందములును విప్పి తా నాబీటిలోనికిఁ దోలి మేసి యెడ్లన్నియుమరలఁ దమంత నవి స్థానములోనికివచ్చి పండుకొనువఱకు నట మేపుచునుండెనఁట. అంత వేఁగుచుక్క పొడుచునప్పుడు వచ్చిన పాలికాపును బదరి యింటికింబోయెనఁట. రాత్రియంతయు నిద్రాహారములు లేక యిట్లు పాటుపడిరని తెలియందగు. ఇట్లు కొన్నినాళ్లు లంకకు నడచియే పోవుచు లంక దూరమం దుండుటచేతను, ఎండలు మిక్కిలిగా గాయుచుండుటచేతను నడచిపోవుటకు శక్యములేక నూటయేఁబదిరూప్యములు పెట్టి యొకగుఱ్ఱమును గొని దాని నెక్కి పోయి వచ్చుచుందురు. ఆగుఱ్ఱమునకు నిజముగా మాటలువచ్చునని చెప్పవచ్చునఁట. అరుణోదయమున నింటియొద్ద దానిపైఁ గూరుచుండి నిద్రపోవుచుందురఁట. అది క్షేమ యుపాయమును గలుగనీయక మిట్టపల్లములు వచ్చినపుడు సకిలించి

తేపి జాగరూకులై యుండిరని తెలిసికొని గమ్యస్థానముం జేరుచుండునఁట. దానికా లంకనుండి యింటికి వచ్చుటకు నొక యరగంటకాలమునకన్న నెక్కువ పట్టదఁట ! గాలితో సమానముగా నాగుఱ్ఱము పఱవఁగలదని తెలియవచ్చినది. దాని వయస్సు నాల్గుసంవత్సరములు మాత్రమే. ఒకనాఁడు శాస్త్రిగారు దానిపైఁ గూరుచుండి కనులు మూసికొని నిద్రించుచు లంకలోనుండి యింటికి వచ్చుచుండగా మార్గమధ్యమం దొకచోట లంకలలోఁ దిరుగు రెండు పోగరుగుఱ్ఱములు వచ్చి తనపైఁ బడుటకు సిద్ధముకాఁగా నీబుద్ధిగలగుఱ్ఱము యజమానున కెక్కడ భంగపాటు కలిగిపోవునో యని యాయుపద్రవము తెలియఁజెప్పన ట్లిలువచేసి పఱచినదఁట. కొంచెము మాగన్నుపెట్టియున్న మనశాస్త్రిగారవడికి నిలువఁజాలక గుఱ్ఱము కాళ్ళలోఁ గ్రిందఁబడిరఁట. అంతవడిలో గ్రిందఁబడియున్న వీరి కావల రెండుకాళ్లు నీవల రెండుకాళ్లను పెట్టి నిలిచి సకిలించుచుండెనఁట ! అంతలో శాస్త్రిగారు లేచి గుఱ్ఱమును దట్టి మరల నెక్కి కనుమూసి తెఱచునంతలో నాయపాయమునకుం దప్పి యిలు సేరిరని వినుచున్నాను. ఈగుఱ్ఱము గమనమందే కాక బుద్ధియందును బాగడితకెక్కినదియే కాని దానికిఁ "గీలావర్తనము" లనుసుడులుగలవు. అది యజమానునకు దరిద్రమును గలిగించును. దశ్రుధువులును మఱియుఁ గంఠాభరణమును దానికిఁ గలవు. తండ్రిగారు వేంకటసోమయాజులుగా రశ్వశాస్త్ర మెఱింగినవారు గనుక కవిరాజుం జేరి "యీగుఱ్ఱము మనయింట నుండఁదగినది కాదు. దీనిని దక్షిణము విడిచివేయుము" అని చెప్పిరఁట కాని మన కవిరాజు దాని గుణమునకు దాని బుద్ధికిని నలరియున్నవారు కావున దానిని విడుచుట కిష్టములేనివారై యుండిరఁట. ఇంతలో నొకనాఁ డేదియోపనిపై శాస్త్రిగారు గ్రామాంతరమునకు వెళ్ళియుండఁగాఁ దండ్రిగారు వేంకటసోమయాజులుగా రాగుఱ్ఱము నెవరికో యమ్మివేసినారఁట. శాస్త్రిగారు వచ్చి గుఱ్ఱము సంగతి విని మిక్కిలి పొక్కినట్లు తెలిసినది. మరల నాగుఱ్ఱమును వెదకికొనుట కెంతయో ప్రయత్నము చేసిరి కాని యది లభ్యమైనది కాదఁట. తండ్రిగారి కిష్టములేకుండఁ జేసిన కారణముచేతనో, కీలావర్తనములుగల గుఱ్ఱమును గొన్న కారణముచేతనో చెప్పఁజాలముగాని లంకావ్యవసాయము మిక్కిలి దండుగునకే యయినది. పొగాకుతోట మొదట యేఁపుగావచ్చినప్పుడు "శాస్త్రిగారి కీసంవత్సరము పదివేలు రూప్యములు లాభమునచ్చును" అని పనుగురును బలికినారు. అంతలో దైవాను

తూల్యములేమిం జేసి యానందన సంవత్సరములో మాఘమాసములో నకాలమున గోదావరి వచ్చినది. వెల్లువవలన శాస్త్రిగారి పొగాకుతోటయంతయు మునిఁగినది. ఆగోదావరి యొకనాఁడు మాత్రమే యున్నది కాని చేనిలోని నీరు పదిదినము లున్నది. ఆకుతోటయంతయుం గుళ్ళిపోయినది. గోదావరిపడని భూములలోఁ దోటకుఁ బురుగుపట్టి నాశనముచేసినది. శాస్త్రిగారు లేనిసమయముం గనిపెట్టి దొంగలైన పాలికాపులు పొగాకును బుట్లకొలఁది దొంగిలించిరి. "నరవర నీచే నాచే వర మడిగిన కుంతిచేత" అనునట్లన్ని విధముల నష్టమువచ్చినది. తుద కాలంకల వ్యవసాయమువలన నాసంవత్సరము మన కవిరాజుగారికి ముప్పది వేలరూప్యము లప్పగుట తటస్థించినది.

—ఋణబాధ.—

వ్యవసాయముచేసిన లంకాక్షేత్రము శిస్తు పూర్తిగాఁ జెల్లినదికాదు. లంకాక్షేత్రాధికారు లగుశ్రీరాజా యినుగంటి వేంకట జగోపాల బుచ్చి తమ్మయ్యబహద్దూర్ వారికి నాలుగువేలరూప్యము లిచ్చుకోవలసివచ్చినది. అప్పుడు మన ప్రబంధకవి యొక విచిత్రసౌధబంధము మూఁడుమాసములు దీక్షచేసి వ్రాసి దానిని జిత్రకారునిచేఁ జిత్రింపించి రాజునకు సమర్పించిరి. ఆసౌధబంధమందు నడుమ కచ్చములోఁ బైనుండి క్రిందకుఁ జదివిన "శ్రీరాజా యినుగంటి వేంకటరాజగోపాల బుచ్చితమ్మయ్యబహద్దరువా రనుగ్రహించుత" అనియు, మధ్యభాగములో నున్నకచ్చములో నెడమనుండి కుడికిఁ జదివిన "కవిరాజు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ప్రణీతము" అనియు, మఱియు నందందుఁ జదివిన "యరలవమదనస" అనుపద్యమును "పరమదయాకర"యను పద్యమును, "అక్క—ఆకురానిచుట్టము" అనుపద్యమును చుట్టు నంచులయందుఁ గల యక్షరములన్నియుం జదివినచో మూఁ డనుష్టుప్ శ్లోకములును మొదటి శ్రీకారమునుండి ప్రతి కక్ష్యమును వరుసగా చదివినచో రాజుగారి నాశీర్వదించు నొకసీసపద్యమును గలవఁట? మఱియు నాబంధమం దనేకచిత్రము లున్నవని కవిసార్వభౌముఁడు నాతో చెప్పియుండెను. అది కిర్లంపూడిలో రాజావారి భవనముననున్న దేమోకాని కవిరాజుకడనున్న నకలు నష్టమయినది." అట్లు బంధకవిత్వము చెప్పి రాజుగారి దర్శనముఁ జేసి ఆబంధవిశేషములు

జెప్పుచుండగా రాజు మనకవి యాచనకు వచ్చె ననుయభిప్రాయపడి దివానును బిలిచి "వీరికి నేఁబదిరూప్యములిండు" అని చెప్పుచుండఁగా మనకవి తత్క్షణమం దాశువుగా—

"ఉ. అల్పుని వేఁడి మిక్కిలిగ నర్థములందుటకంటె నన్నుఁ దా
నల్పగుణాఢ్యునిఁ సుకృతి నారసి లేదనిపించుకొంటయున్
మేల్పనియంద్రుగాన నిల నీవు కులీనుఁడ వుర్వినేత వ
త్యల్పితకల్పపాదపుఁడ వం చిటువచ్చితిఁ బుచ్చితమ్మయా.
ఉ. వారునువీరుఁబోలె నొకవచ్చియురాని కవిత్వమల్లి జ
ల్తారుమెఱుంగుసేలువలు తద్దయుఁ జుట్టుకమాట లెన్నియే
నేరిచినట్టివారిఁ దగ నెందఱినో వెనువెంటఁగొంచు గ
ఙ్గా రచియించి మిమ్ములఁ గ్రమంబుకటించి ధనంబుఁగొంచుఁబోఁ
జేరినవాఁడఁగాను ననుఁ జిత్తమునన్ బహుమానవృత్తిమై
నారయుమంత సంతసమునొందెద నిచ్చిన నీయకుండినన్"

... ...

అని పెద్ద యుత్పలమాలికం జదివెనఁట! అప్పుడు మన కవివృత్తాంతము రాజు దివానువలన విని "మీరు కిర్లమపూడికి రావలయును" అని యానతిచ్చె నఁట! పిమ్మట కొన్నినాళ్ళకు మనకవి నిమ్మన జియ్యన్నగారనుమిత్రునితోఁ గలిసి కిర్లమపూడికి వెళ్ళెననియు రాజు తమ కీయవలసిన శిస్తు బాకీ నాలుగు వేలును మాఫీచేయుటయేగాక నూటపదియాఱురూప్యములును విలుగఁ రెండు సేలువులును మనకవి కిచ్చి సన్మానించినట్లు వినుచున్నాను.

అప్పుడు తనకు ఋణ మిచ్చినవాండ్రిందఱును దొందరచేయఁజొచ్చిరి. ఆసమయమున మనశాస్త్రిగారేమియుం దోపనివారై కాకినాఁడలో నిమ్మన జియ్యన్నగా రనుతనమిత్రునియొద్దయు వెళ్ళి జరిగిన సంగతి యంతయుం జెప్పి యింటిలోని తండ్రిగారివలని బాధయుం జెప్పి దీని కేమి యుపాయమని యడిగిన నతండు వారితో కాటవరమునకు వచ్చి తండ్రిగారి నెట్లో యొప్పించి వారికిఁగల భూములు మొదలగునవి తాకట్టుపెట్టించి వంగలపూడిగ్రామవాసుం డగుపంతము వెంకన్న యనునాతనియొద్దఁ గొన్నివేలు తక్కువ వడ్డీకి బదు లిప్పించి తొందరైన ఋణములు తీర్పించినట్లును తరువాత నీఋణమంతయుం దీర్చుటకుఁ దగినమార్గము సూచించినట్లును తనకు మిత్రులైన ధనవంతుల

యొద్దకుఁ దీసికొని పోయి యవధానములు చేయించి విశేషధన మిప్పించి ఋణముతీర్పించినట్లును దెలియవచ్చినది. అట్టి సమయమున మన కవిరాజు—

"సీ. గౌతమీమాహాత్మ్యకర్త కంఠముఁ జుట్టుకొనియుండె నేకదా ఋణముచిలువ
కవిమిత్రు మేనెల్లఁ జివికించె నేకదా యప్పులవారి వాక్యాయుధములు
శ్రౌతిమాన్యక్షేత్రసమితి కొదువఁబెట్టఁబడెఁగదా వృషలసంభవునియొద్ద
అష్టశతావధానార్థ్యున కిప్పుడు చేరియున్నదికదా నీరసంబు
తే. కోటలంకలపాట లీపాటఁదెచ్చె, మూలపురుషులపాలయ్యె మఱి పొగాకు
అప్పు ముప్పదివేలరూప్యంబు లింక, నెట్లు తీర్చెడు శ్రీపాదకృష్ణమూర్తి."

అని శ్రీనాథునింబోలెఁ బద్యము చెప్పినారు. ఇట్లే శ్రీనాథుఁడును కృష్ణాతీరమునందలి బొడ్డుపల్లెను గుత్తచేసి వ్యవసాయముఁ జేయింపగాఁ గొంతనష్టము వచ్చినప్పుడును సర్కారువలనఁ దన కిక్కట్టు వచ్చినప్పుడును రెండు సీసపద్యములు చెప్పియున్నాఁడు. అవి సర్వజనైకవేద్యములగుటచేత నిట నుదాహరింప లేదు. ఇట్లు లంకావ్యవసాయంబున ఋణమువచ్చుటచేతనే మన కవిరాజు నానా దేశములు తిరిగి నానాసంస్థానముల శతావధానాష్టావధానములు చేసి, ప్రఖ్యాతిం బొందుటకుఁ గారణమైనది. లేనిచో వీరితరదేశములకుఁ బోఁదలంపరు. పోకున్న వీరి కీర్తి విఖ్యాతి రానేరదు. "కీడును మేలునకే వచ్చును" అను న్యాయ మిటఁబట్టినది. ఇట్లు తటస్థించిన ఋణమంతయు ననేకస్థలములకుం బోయి కవిరాజుగారు మూఁడు నాలుగుసంవత్సరములలోఁ దీర్చివేసి తండ్రిగారు జీవించియుండగా వారు వ్రాసిన తనఖాపత్రమును చెల్లువ్రాయించి తెచ్చి తండ్రిగారి కిచ్చి వారి మెప్పునకుం బాత్రమయిరని విన్నవించుచున్నాఁడను. మనకవికి లంకాక్షేత్రమున దండుగవచ్చినప్పుడు తండ్రిగారు తమచిన్నకుమారునికిఁగూడ నష్టం తగులుకొనునేమోయనుభయంబునఁ దమకుఁగలభూములు విభజించి పారీఖత్తులు వ్రాయించినారఁట! అప్పటికిఁ జిన్నకొడుకునకు వివాహము కాలేదు గావున దానికై వాని భాగములో నూఱురూప్యములు శిస్తువచ్చు భూమి హెచ్చు వేసియిచ్చినారఁట! మనశాస్త్రి తండ్రిగా రెట్లుచేసినను సంతసించుటేకాక "చరాస్థి" యనంబడుపాత్రములు, మంచములు, కుంచములు, బిందెలు, పెట్టెలు లోనగునవి యన్నియుఁ దమ్మునికి వదలివైచి కట్టుబట్టలతో భార్యాసహితుఁడై ...టవరము విడిచి దుర్ముఖసంవత్సరములో రాజమహేంద్రవరమునకుఁ గాపురము వచ్చె నని మున్నే చెప్పియున్నాఁడను.

—♦ ఉ ద్యో గ ము. ♦—

ఉద్యోగముచేయుటయందు మన కవిరాజుగారి కిష్టతలేకపోయినను వర్త కములో నష్టము వచ్చిన వెనుక లంకా వ్యవసాయమునకు మున్ను కొన్ని సంవత్సరము లుద్యోగముచేసినవారైరి. ఖరసంవత్సరములో గోదావరీమండలము నందలి పెద్దాపురములో వర్తకులు మొదలగువా రొకహైస్కూలును స్థాపించిరి. అందుఁ గవిరాజ మిత్రు లగుపానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు ప్రధానోపాధ్యాయులుగా నుండుటంజేసివారు మనశాస్త్రిగారిని బలవంతముచేసి తీసికొనిపోయి యందు సంస్కృతోపాధ్యాయునిగాఁజేసిరి. ఆసంస్కృతోపాధ్యాయపదమం దొకసంవత్సరము మాత్రమే యుండి మనశాస్త్రిగా రాపనిని విడిచి యాపురంబునం గల కొందఱు మిత్రులంగూడి యట నొక ముద్రాక్షర శాలఁ నెలకొల్పి కొన్నినెలలుండి వారి కాపనియంతయుం జెప్పి తాను మరల కాట్రవరమునకు వచ్చి లంకల వ్యవసాయము చేసెను. ఆవ్యవసాయ మట్లయిన వెనుక దేశాటనముచేసి ఋణములన్నియుం దీర్చి చెన్నపురంబునకుం జని యట నొకసంవత్సరముండి విలంబిసంవత్సర మార్గశీర్షమాసమున 1899 జనేవరి నెలలో కలావతీపత్రికఁ స్థాపించి ప్రవర్తింపఁజేసినారు.

అనంతర మాపత్రికను రాజమహేంద్రవరమునకు మార్చుకొని తొల్లి తాము తెచ్చి పెద్దాపురములో భాగములతోనుంచిన ముద్రాక్షరశాలను తా మొక్కరే పుచ్చుకొని దానిని గూడ రాజమహేంద్రవరమునకుఁదెచ్చి ముద్రా కార్యమును, బత్రికాకార్యమును, గ్రంథరచనయును బొనర్చుచుండియు నధి కారుల కోరికపై రాజమహేంద్రవరమునంగలమిషఁ హైస్కూలునందునాంధ్రో పాధ్యాయులుగా నొక్కసంవత్సర ముండిరి. అక్కాలమున నాస్కూలునం దున్నవిద్యార్థు లందఱును వీరియం దత్యంతభయభక్తులతోఁ బ్రవర్తించిరి. ప్రథమోపాధ్యాయునిచెంతనైన నల్లరిచేయుచు వచ్చిరి కానివీరిచెంత నల్లరియనునది లేక వీరు చెప్పినపాఠము మిక్కిలి శ్రద్ధతో విని గ్రహించుచుండువారు. ఆసంవత్సరమునం దాస్కూలులోఁ దెలుఁగునం దొక్కరుఁడును దప్పిపోయినవాఁడు లేఁడని త్రికరణశుద్ధిగాఁ జెప్పఁగలను. ఆమరుసంవత్సరము శాస్త్రిగారు తమ కాయుద్యోగ మక్కఱలేదని రిజగ్నేషన్ పెట్టిరి. అప్పు డుపాధ్యాయులును, విద్యార్థులును, పెద్దలును రిజగ్నేషఁ జేయవలదని యెంతో కోరిరి. "నేను

విలాసార్థ ముపాధ్యాయుఁడనైతిని గాని నాకీయుద్యోగము చేయవలసిన యవసరములేదు" అని చెప్పి స్కూలును విడిచి పత్రికాకార్యము మొదలగునవి చేసికొనుచు రాజమహేంద్రవరముననే నివసించియున్నారు. చెన్నపురిలో స్థాపించి రాజమహేంద్రవరమునకుం దెచ్చిన కలావతి నవిచ్ఛిన్నముగాఁ బది సంవత్సరములు నడిపించినారు. అందనేక మంచిపుస్తకములు ప్రకటించినారు. తెనాలి రామకృష్ణప్రణీతమైన ఘటికాచలమాహాత్మ్య మెంతయో శ్రమచేసి తంజావూరు పుస్తకభాండాగారమునుండి తెచ్చి మిక్కిలి శ్రమచేసి సంస్కరించి ప్రకటించినారు. మఱియుఁ గూచిమంచి జగ్గకవిప్రణీతమైనసుభద్రాపరిణయము, కపిలగోసంవాద మనువేదాంతగ్రంథము లోనగు నమూల్యగ్రంథములు ప్రకటించి యనేకవిమర్శనములు వ్రాసి జగ దుపకారముచేసినారు. ఇతరుల మెప్పునకు లోనుగాక నిర్భయముగా నే విషయమైనఁ బ్రకటించుటకు వెనుదీయువారు కారని కలావతిలో వీరు ప్రకటించిన వ్యాసములే వేయినోళ్ళ చాటుచున్నవి. కలావతిపై ననేకులు మంచి యభిప్రాయము లిచ్చియున్నారు. అవి యన్నియు మఱియొక్క ప్రకరణమునఁ బ్రకటింపఁబడును. ఆకలావతీముఖమున-

పంచచామరము.

"చరాచరాత్మక ప్రపంచజాలము న్విలాసవై
ఖరిక్ స్సృజింపఁ బెంపఁ ద్రుంపఁ గర్తృభర్తృహర్తవై
నిరామయుండునై వెలుంగు నిత్యుఁ డప్పరాత్పరుం
డురుప్రభావుఁ డెల్లకాల మోముతం గలావతిన్"

అని స్తుతించిన పద్యము ప్రతిమాసమునందును జూపటుచుండును. మఱియు ప్లవ సంవత్సరమున "గౌతమి" యనుపేరితో దినపత్త్రికంబెట్టి యొకసంవత్సర మవిచ్ఛిన్నముగా నడపినారు. గౌతమిని ప్రకటించు కాలమునందే వీరి తండ్రిగారు కాలధర్మమునొందినారు. ఆనాఁ డుదయమున మామూలుప్రకారము పత్త్రికను బ్రకటించియే తండ్రిగారి శవమును సంస్కారముచేయుటకుం బోయినారు. కార్యమునందు వీరి కున్నపట్టు స్తవనీయము. మఱియు "వందేమాతరం" అను పేరుతో నొకవారపత్రికం బెట్టి కొన్నిమాసములు మాత్రమే నడపఁగలిగినారు. ఆకాలమున "వందేమాతర" మనిన మనప్రభువు లన్యథా భావించుచుండినవారగుటచేతను బత్రికలో మన గవర్నమెంటునకువ్యతిరేకముగా వ్రాయకున్నను పేరునుబట్టి దానిపై నెట్టిచిక్కులు వచ్చునో యని కొందఱు బుద్ధిమంతుల

ప్రోత్సాహంబున నాపత్రిక నంతలోనే విడిచివేయవలసినవారైరి. పిమ్మట "మానవసేవ" యనుమాసపత్రికను మూఁడుసంవత్సరములు నడిపినారు. ఇందును మంచిమంచిగ్రంథములు ప్రకటింపఁబడినవి. ఆసమయమున మనకవి రాజుగారికి శ్రీకృష్ణభారతమును రచియించుచుండుటంజేసి మాసమునకు నూటపదియాఱురూప్యములిచ్చి ముక్త్యాలసంస్థానాధీశ్వరు లగుశ్రీరాజా వాసిరెడ్డి శ్రీచంద్రమౌళీశ్వరప్రసాదబహద్దూరు మన్నెసుల్తానుగా రాదరించుచున్నారని వ్రాయుట కెంతయు సంతసించుచున్నాను.

మన కవికిఁ జిన్నతనమునుండియు భారతముపై నభిమానము మెండు. వీరు కవిత్రయభారతమును 2, 3 తడవలు చదివిరి. ఇట్లు చదువునప్పుడు కొన్ని కొన్ని స్థలములలో మూలముతోఁ దెలుఁగునకు కొంత వ్యత్యయ వినిమయములు కలిగియుండుటంజేసి తత్తద్భాగములు మూలానుసారముగా సరిపెట్టివ్రాసి ప్రకటింపవలయునని తలంచియు నది సర్వత్ర కలిగియుండుటచేత నాపని సాధ్యము కాదని యెంచి వ్యాసభారతమంతయు సరిగాఁ దెలుఁగుచేయనెంచి ఆది సభా పర్వములు రచించి యాగ్రంథము ముద్రించుట యెట్లని ధనవంతుల నెందఱినో చూచినారు. కాని యిసుమంతయు లాభించినదికాదు. భద్రాచలము పాల్వంచ సంస్థానముల కధీశ్వరులు శ్రీరాజా పార్థసారథి అప్పారావు సవైయశ్వారావు బహద్దరువారు మనకవిగారి కయాచితముగా నొక్క వేయిరూప్యము లొసంగిరి. మఱియొకసమయమున 4, 5 వందలరూప్యముల వెలగల పచ్చల యుంగరమిచ్చి యాదరించి మిక్కిలియనుగ్రహముంజూపిరి. అంతలో నీవృత్తాంతమును కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలోని ముక్త్యాలసంస్థానాధీశ్వరు లగు శ్రీరాజా వాసిరెడ్డి శ్రీచంద్రమౌళీశ్వరప్రసాదబహద్దరువారు జగ్గయ్యపేటపురవాస్తవ్యులును సంస్కృతాంధ్రసాహిత్యవంతులు నగు బ్ర. పిరాట్లమృత్యుంజయశాస్త్రిగారివలన విని వారిచేతనే మన కవిసార్వభౌమున కొకజాబు వ్రాయించినారు. పిఠాపురము లోనగు మహారాజులే యీకార్యమునకుఁ జోడుపడఁజాలకుండిన ముక్త్యాలవారు మాత్రము గ్రంథము నాదరింతురా? యనునను మానమున మనకవి యటకుంబోలేదు. అంతలో మఱియొక యుత్తరము వచ్చినది. "మీ రొక్కసారి ముక్త్యాలవారి దర్శనము చేయుఁడు మీ కార్యము సఫలమగు నని నాయభిప్రాయ" మని మృత్యుంజయశాస్త్రిగారే వ్రాసినారు. ఆయుత్తరముపైఁ జూతుమని మనకవిరా జటకుంబోయి మృత్యుంజయ

శాస్త్రిగారిం గలిసికొని వారితో ముక్త్యాలకు వెళ్ళి ప్రభుదర్శనమునకు నిరీక్షించినారు కాని వారికి ౫, ౬ దినములవఱకును ప్రభుదర్శనము కాలేదు. ఒక గృహస్థు నింటిలో నివాస మేర్పఱచినారు. శిష్యసహితముగా నటనుండి భోజనము చేయుట మాత్రము కలిగినది. అంత రాజావారి సంస్థానమునుండి యొక కాగితము వచ్చినది. అందు "మీరు భారతమున కేమి తీసికొందురు? పర్వమున కింత యని కాని, ఆశ్వాసమున కింతయని కాని కోరుఁడు" అని యుండఁగలదు. అది చూచి రాజదర్శనములేక యట్లు కాగితము వచ్చిన దనునభిప్రాయముతో "నేను బేరములాడువారిలోనివాఁడను కాను. నే నిప్పుడే వెడలిపోవుచున్నాను" అని బదులువ్రాసి ప్రయాణమయ్యెను. అంతలో శ్రీవారు దర్శనమిత్తుమని వర్తమానము పంపించినారు. నాఁడు సాయంకాలమున దర్శనముచేసి మనకవి రాజు ముక్త్యాలకు వెళ్ళినది మొదలుకొని నాలుగుదినములు మిక్కిలి పరిశీలించి రాజున కాశీర్వచనముగా రచించిన యొక్కపద్యము చదివి అది రాజునకు సమర్పించి "ఇది మీరు పూజలో నుంచుకొనుఁడు. మీ కొకసంవత్సరములోఁ బుత్రోదయము కలుగు"నని చెప్పినారఁట. అట్లే వారికిఁ బుత్రోదయమైనది. అప్పుడు రాజుగారు "మీకు నెల కెంతయైన సరిపడును" అని పలుకగా మన కవి నెలకు నా కేనుబదిరూప్యములైనఁ జాలు ననఁగా నా రాజేంద్రుఁడు సంవత్సరమునకు వేయిరూప్యముల చొప్పున నిత్తుమని జాంబూనదాంబరాదులతో కృతి తాంబూల మిచ్చినారు. మరునాఁడు సెలవు తీసికొనునప్పుడు ప్రతిమాసమున నూఱురూప్యము లిత్తుమని చెప్పి పిమ్మట నెలకు నూటపదియాఱురూప్యముల చొప్పున నిచ్చుచు వచ్చినారు. దీనింబట్టి మనకవి తన శ్రీకృష్ణభారతములో—

"చ. అడిగినదానికన్న నధికార్థము లర్థులకిచ్చు నోటితో
నొడవినదానికన్నఁ గడునూల్కొని చేయును జెన్నుమీఱ నె
య్యెడ దురితంబులం దలఁప డిప్పటి రాజమహేంద్రుఁ డెన్న మా
యొడయఁడు భారతప్రియుఁడహో! యని మెంచెద భాగధేయముల్."

అని వ్రాసియున్నారు. ఈవిషయము విపులముగా గ్రంథవిమర్శన ప్రకరణమున వ్రాయుదును.

శ్రీకృష్ణకవి జీవితము

పంచమ పరికరణము.

—◆ తీర్థాటనము ◆—

మన కవిరాజుగారికి బాల్యమునుండి దేశాటనము చేయువలయుననియుఁ దీర్థసేవ చేయువలయుననియు నపేక్ష మెండు. స్వభానుసంవత్సరములో వీరు సహాధ్యాయితోడంగూడి శ్రీశైలయాత్రం జేసి యది మొదలుకొని దక్షిణోత్తరతీర్థంబులును క్షేత్రంబులును సేవించివచ్చినారు. అందు ముఖ్యములు:— కాశీ, శిరోగయ, ప్రయాగము, అయోధ్య, మధుర, గోకులము, కాళీఘట్టము, నాభిగయ, శ్రీజగన్నాథము, శ్రీకూర్మము, సింహాశైలము, దాక్షారామము, భీమారామము, పాదగయ, పట్టనము, వేదాచలము, వేంకటాచలము, కంచి, భద్రాచలము, శ్రీకాళహస్తీశ్వరము, చిదంబరము, చిన్యాళి, కుంభకోణము, శ్రీరంగము, జంబుకేశ్వరము, పక్షితీర్థము, మధుర, రామనాథము, నవపాషాణములు, రామేశ్వరము, సేతుబంధము లోనగునవి. వీరు సామాన్యులవలెం బోయి వాలకు అప్పలకు నమస్కరించి వచ్చునట్టి స్వభావముగలవారు కారు. ఎక్కడ నే విచిత్ర మున్నదో యది సమగ్రముగా గ్రహించివచ్చు నభిప్రాయముగలవారు. అందు నా తెలిసిన కొన్నియంశము లీక్రింద వివరించెదను.

మొదట శ్రీశైలమునకు బయనంబై పడవలమీద నేలూరునుండి బెజవాడకుంబోయి బెజవాడలో సదరణము రాటా రైలుబండినెక్కి శివపురమునొద్ద దిగి యటనుండి నడచియే శ్రీగిరికిం బోయినారు. మార్గమధ్యమున విశేషమేమియును జరుగలేదు గాని దిగువపాలెములో వంటకము చేసికొనుటకుఁ గట్టెలు దొరకినవి కావు. అది యడవిగ్రామము గనుక కట్టెలుమాత్ర మమ్మఁబడవు. ఆనాఁడు పొద్దుపోవుటచేత నెండలోఁ గట్టెలు తెచ్చి వంటచేసికొనుటకు శక్తి లేకపోయినది. ఆయూరి కరణమును నాల్గుకట్టె లిప్పింపుఁడని ప్రార్థించినారు. ఆయన యీయఁ లేదు. అప్పు డొక చాకెత యిచ్చినది. ఆకరణము చెంతకు వచ్చి నీకన్న చాకెత మేలని కరణముమీఁదఁ గొన్ని పద్యములు చెప్పినారు. ఆకరణము భయపడి పాదాక్రాంతుఁ డయినాఁడు ఆపద్యములు నాకు సంప్రాప్తము కాలేదు,

కావున నిట వ్రాయఁబడ లేదు. ఎగువసాలెనులో నాయూరి కరణముగారు పొలము దున్నుచుండగా నొక నంది దొరకెనఁట. ఆనంది సుమారొక యడుగెత్తుకలదట! అది సాలగ్రామమునం జేయబడినదనియు నేరేడుపండువంటి రంగున నిగనిగలాడుచు శ్రీకరమై దర్శనీయమై యున్నదనియు మనకవిరాజుగారు దానిం జూచి యానందించితి ననియుఁ జెప్పియున్నారు. శ్రీశైలమార్గమం దెల్ల ప్రజలును దెలగరాయని చెరువులోఁ జెట్లక్రింద నొకరేయి నిద్రించి పోవుదురు. బడబానల భట్టారకుఁడనుకవి రవికి నర్ఘ్యమిడువేళ వ్రేలియుంగరము జారి చెఱువునీటిలోఁబడినది ననియు నక్కడు నీ రెండునట్లు—

"క. బడబానలభట్టారకు, కుడిచే యుంగరము రవికి గొబ్బున నర్ఘ్యం
బిడువేళ నూడి నీలోఁ, బడిమె తటాకంబ వీగిపోయును వేగన్."

అని పద్యము చెప్పినట్లును నీళ్ళిండిపోయినట్లును అప్పకవి తనగ్రంథమందు వ్రాసియున్నాఁడు. ఎంత నిజమో కాని యేనుఁ గీదండగినట్లు నీళ్లుండనగు నాపెద్ద చెఱువులో నీటిచుక్కయు నిపుడు లేదు. పెద్దయరణ్యమువలెఁ జెట్లతో నిండియుండును. ఆరాత్రి యాచెట్లక్రిందఁ బెద్దనెగళ్లు వేయుదురు. వానికిచుట్టును బ్రజలు పండుకొందురు. రాత్రి రెండుయామము లగునప్పు మహావర్షమున శాంతించున ట్లామంచు నిప్పంతయు శాంతించి యట మంచు చీలమండల లోతునఁ బ్రవహించునఁట. ఆమంచులో నారాత్రి మనకవిరాజు చెప్పలేనంత బాధపడి మఱునాఁడు ప్రజంగూడి దారిలో ననేకవిచిత్రములు చూచుచుఁ జుక్కలకొండమీఁదుగా ననేకము లగుకొండలు, వనములు దాటి శ్రీశైలము చేరిరి. ఇరువదియేడు మెలికలతో నాకొండ యున్నది గావున దానికిఁ జుక్కల కొండయని పేరు వచ్చినది. ఆమార్గములో నొకచోఁ "బాలధార, పంచధార" యని రెండుధారలు కలవు. అవి యొకరాతిపగులునుండి యరణాకాసు దళసరిని ప్రవహించుచుండును. ఆనీళ్ళు పాలవలెను బంచదారవలె నుండును, ఈధారలు శ్రీనాథుఁడు తన కాశీఖండమునందు వర్ణించినాఁడు. శ్రీశైలమునకు సమీపములో శిఖరేశ్వర మనుప్రసిద్ధస్థలముకలదు. అట నొక పెద్దరుబ్బురోలు కలదు. అందు బియ్యము, నువ్వులు నీళ్ళును బోసి యాత్రికులు రుబ్బుదురు. అట్లు రుబ్బునప్పుడు బిందువులు శిరస్సుపై ధరింతురు. పిమ్మట నట నున్నశిఖరేశ్వర స్వామిని దర్శించి దానికిఁ బశ్చిమముగాఁ జూపుమేఱలో నున్నశ్రీశైలమల్లికార్జునస్వామి దేవాలయ శిఖరమును జూతురు. ఆకారణముననే యట స్వామికి

శిఖరేశ్వరుఁడను పేరువచ్చినది. దాని క్రింతలో విభూతికుండముకలదు. అందు జలముండదు. త్రైర్థికులుపోయి "భం మహా దేవా" యని పెద్దధ్వనితో శివస్మరణ చేసినమాత్రాన వారికిఁ దృష్టియగునట్లు జలము లూరునని చెప్పుదురు. తత్సమీపమున నే లంజబావికలదు. అది యొకవేశ్యవలస నైనదఁట. ఆకథ యించుక వివరించెద.

కైలాసమున నొక్కనాఁడు పార్వతీదేవి పరమేశ్వరునిఁగాంచి దేవా! శ్రీశైలములో శివలింగదర్శనముచేసినవారి కేపాపములు నుండవనియు, మోక్షమందఁగలరు వచ్చుననియుం జెప్పుదురు. అందఱు మోక్ష మందఁగలిగినచో యమలోకము పాడుపడును. స్వర్గాదులు పట్టపగ్గములేనివగును. దీని కేమిచెప్పెదరని ప్రశ్నింపఁగాఁ బరమశివుఁడు నీ యడిగిన యర్థంబునకు సదుత్తరంబు చెప్పెద నీవు నేఁ జెప్పినట్లు చేయుమని తా నొకవృద్ధబ్రాహ్మణుఁడు నామె యొకవృద్ధ బ్రాహ్మణియునై శిఖరేశ్వరమునొద్ద మార్గములో నొకచోట విశ్రమించిరి. బ్రాహ్మణుఁడు నీరువట్టున వడఁగొట్టి నోరెండుకొని పోఁ బ్రాణావశిష్టుఁడై పడియుండె. అప్పుడాబ్రాహ్మణి శివరాత్రమునకు శ్రీశైలమునకుం బోవువారిం బిలిచి, "అమ్మలారా! నాయనలారా! నామగఁడు నీరువట్టునఁ బడియుండె. ఇన్నినీళ్ళు నోటిలోఁబోసి బ్రదికింపుఁడు. ప్రాణరక్షణముచేసిన పుణ్యముం గట్టుకొనుఁడని ప్రార్థింపఁగా నామార్గమున నడచువారు "అమ్మా! అట్లేనీళ్ళుపోసెదమని పాత్రములలోని నీళ్ళు వృద్ధబ్రాహ్మణునినోటిలోఁ బోయఁబోగా వృద్ధ బ్రాహ్మణి "అయ్యా! మీరు పాపముచేయనివారైన నీళ్లుపోయుఁడు. ఏయింత పాపము నేనియుఁజేసినవారైన మీనీళ్ళునోటికిఁదగిలినంతమాత్రమున నామగఁడు మరణించును. మీకు మఱింత పాపమువచ్చును. నామగడుపోయిన నేనుదుఃఖము నొందవలసినదాననగుదును" అని చెప్పఁగా నందఱును "నేనెప్పు డేమి పాపము చేసినానో నా కెందుల కీబ్రహ్మహత్య యని శంకించుకొని సందేహించి నీళ్ళు పోయ మానిరఁట! అంతలో నాదారింబోవు వేశ్య యొకతె బ్రాహ్మణి వాక్యములు విని "అమ్మా! భయపడకుము. నేను నీళ్ళుపోసెదనని వెనుకఁ జెప్పిన బావికింబోయి యిన్నినీళ్లుతెచ్చి నోటిలోఁ బోయఁబోగా బ్రాహ్మణి మున్నెల్ల వారితోఁ జెప్పినట్టుగానే చెప్పెనఁట! అది విని యావేశ్య—"అమ్మా! నేను వేశ్యను. పడుచుకొనుటయే నావృత్తి. నేననేకపాపములు చేసినాను. అయినను "శ్లో. శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అనుటంబట్టి నేను

శైలశిఖరమును దర్శించినాను. నా పాపము లన్నియుం బటాపంచలైనవి. నాకింక జన్మము లేదు. నేను పుణ్యాత్ముండ నైతి. నీ వుగని నోటిలో నీళ్ళుపోయుటకు నా కేమాత్రము సందేహము లేదు. నీవుగనికిఁ బ్రాణభయము రాదు. సంశయింపకుము" అని వృద్ధబ్రాహ్మణుని నోటిలో నీరుపోసెనట! అంతలో వారిర్వురును పార్వతీపరమేశ్వరులైరి. అంత నీశ్వరుఁడు దేవీ! దీని కొక్కదానికే మోక్షము వచ్చును. తక్కినవారికి రాఁబోదు. వారు నిశ్చయజ్ఞానము లేనివారు. ఇది నిశ్చయజ్ఞానము కలది యని చెప్పి యంతర్ధానము నొందిరని గ్రంథప్రమాణము. ఆమార్గములోఁ జెంచువాండ్రు తక్క మృగము లేవియు మన కవిరాజునకుం గానరా లేదట! చెంచులే మృగములవలె నుండిరని తెలియుచున్నది. శ్రీశైలమున కొకమైలు దూరమునఁ బాతాళగంగ కలదు. అది కృష్ణానదియే. అడుగున లోతుగా నున్నది గనుక దీనికిఁ బాతాళగంగ యను పేరు వచ్చినది. మనకవిరాజు గంగయొద్దను నొక్కరుఁడు పదిమైళ్లదూరము నడచియున్నారఁట అది మోఁచేతివంపుగా నున్నది. అట కొకనాఁడు చెంచువాండ్రు రాగా దాని వృత్తాంత మేమని యడుగఁగా వాండ్రు పైనఁ జంద్రగుప్తునిపట్టణ ముండునది యనియు దాని కిది చుట్టునుండు కందకమనియు నీకొండయే దానికిఁ గోటగోడ యనియు నిప్పటికి నా చంద్రగుప్తపురములో రాత్రి గడుఁగడుచిత్రములు చూపట్టుననియు మేమప్పుడప్పుడు తేనెకుఁ బోయివచ్చుచుఁ జూచుచుందుమనియుఁ జెప్పిరఁట. శాస్త్రిగా రావలకుఁ బోవుటకై దానిం జూచుటకై ప్రయత్నించిరి గాని పాతాళగంగ నీఁదిపోలేక విరమించిరి. లింగాలఘాటునకుఁ బోయి స్నానము చేయుచుండఁగా నంద మైనలింగ మొకటి వీరికి దొరకినదఁట. అది చెంబులో పెట్టుకొని స్నానముచేసి వచ్చుచో నెటనో బోఁగొట్టుకొనిరి. అది పోవుటకు మిక్కిలి విచారించిరఁట. ఆదారిలోనే నారసింహబిలము కలదు. అందులో ఋషు లుందురనియు దీని కవ్వల బిల్వవనము కదళీవన మున్నదనియుఁ జెప్పుదురు. కవిరాజు గుహలోఁ బ్రవేశించి నడుచుటకు వలనుపడినంత దూరము పోయి మరలివచ్చెనఁట. ఏమియు విశేషములు చూపట్టలేదని చెప్పిరి. (కల్లూరి రామావధానులుగా రను మహావైదికుఁడు మున్నొక్కనాఁ డా నారసింహబిలములో నొకానొక కాలమున రాత్రులయందుఁ గొన్ని దినములు శయనించిరఁట! రేయి రెండుజాము లైనప్పుడు ఆబిలములో ఘోరముగా ఘంటానినాదము

శంఖనాదము నోంకారనాదమును వినిపించెననియు నంత మహర్షులుండిరనియు మనశాస్త్రిగారితోఁ జెప్పియున్నారఁట!) మఱియొకనాఁడు శ్రీశైల దేవతాభవనమునకుఁ బశ్చిమముగా నరణ్యమునం బడిపోవఁబోవ ననేక విచిత్రములు చూడగలిగిరఁట. అందు ముఖ్యమైనది యేమనగా వేలకొలఁది దేవాలయములు పాడఁగాంచుటయే. ఎటుఁజూచినను జిన్నగుడి గుడిలో లింగము ముందునంది. ఇట్లు వనమంతయు లింగమయమైయున్నదఁట. ఇట్లు కొన్నిమైళ్ళుపోవఁబోవ నట వేయితేళ్ళు గుట్టినట్లు మంటపోటు బయలుదేరగా కవిరాజు భయంపడి యవ్వాలంబోక మరలివచ్చెనఁట! అడవిలో నానావిధములైన చెట్లుండును. అందులో "దూలగొండి" చెట్టువంటిది యేదో యొకచెట్టు దేహమునకుఁ దాకుటంజేసి యట్లు పోటువచ్చియుండునని నిశ్చయించుకొననైనది. శ్రీగిరిలో వీరి కింతకన్న మఱియేవిధమైన చిత్రమును జూపట్టలేదు. కాని యరణ్యముల వైచిత్ర్యము చూడవలయునన్న శ్రీశైలమార్గమే చూడవలయును !!

సేతుబంధరామేశ్వరమునకుఁ బోయినప్పుడు సేతువుకడకుం బోయి చూచినారఁట. అట సముద్రమును జూపానునంతదూరము చూడగా నీళ్ళపై నొక తిన్ననిమార్గ మేర్పడి కన్పడుచుండును. అది సేతువే కావచ్చును. దానికిరుగడల సముద్రము రత్నాకరమనియు, మహోదధి యనియు రెండుపేరులం బిలువఁబడుచుండును. "నవపాషాణము" లనునొక స్థలముకలదు. శ్రీరాముఁడు మున్నట నవగ్రహములం బ్రతిష్ఠించినట్లు చెప్పుదురు. విగ్రహములు మిక్కిలి చక్కఁగా సముద్రమున నొరసికొనియున్నవి.

చిదంబరములో నాకాశలింగ మున్నదనియు నది పరమాశ్చర్యమును గలిగించుననియు మనము వినుచుందుము. చిదంబరము దేవాలయములో రెండు నిలువులమీఁద వ్రేలాడుచుండు లింగ మయోమయమనియు దానికి నలుగడల గోడలలో సూదంటురాలు స్థాపనఁజేయఁబడినవనియు నవి సమముగా నాకర్షించుచుండుటచేత నా లింగము నడుమ నిలిచియున్నదనియుఁ దెలియవచ్చెడిని. పక్షితీర్థములో పగలు 12 గంటలకు రెండుగ్రద్దలు వచ్చి అటఁ బూజారిపెట్టిన యాహారము స్వీకరించిపోవుచుండునట! ఇది సంతత పరిచయమువలనఁగలిగినదరే కాని మఱియొకటిగాదని కవిగారు నాతోఁ జెప్పినారు. శ్రీకాళహస్తీశ్వరము సాలెపురుగు, పాము, ఏనుఁగు వీనికలన నాస్వామి కాపేరు వచ్చెనదట! ఈక్షేత్రమునకూర్చి స్థలపురాణ మత్యద్భుతముగాఁగలదు. శ్రీరంగమున

రంగనాథస్వామి యాలయముకలదు. ఈరంగనాథుఁడు తొల్లి యిక్ష్వాకునాఁటి నుండియు నయోధ్యలోనున్న వాఁడనియు రాముఁడు విభీషణునికీయఁగా నజ్జలో నతఁడు తెచ్చి యట నిలిపెనని చెప్పుదురు. దేవళమునకు సప్తప్రాకారములు మనోహరముగా నున్నవి. దాని సమీపములో జంబుకేశ్వరస్వామి కలఁడు. అటఁ బ్రతికాలమందు నైవేద్యమున కొక నేరేడుపండు పడుచుండునని చెప్పుదురు. తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించి మనకవి మహాప్రభూ! మరల నీకొండకు నన్ను రాకుండఁ జేయుమని మ్రొక్కుకొనియెనఁట! ఆయేడు కొండ లెక్కుట కంతకష్టి కలిగించినదని తెలియందగు.

దక్షిణదేశమందుఁగల దివ్యస్థలములలోఁ గవిరాజు వర్ణింపఁగల చిత్రము గల స్థల మేదియుం గనిపింపలేదఁట. శ్రీజగన్నాథముపోయి యింద్రద్యుమ్నని పేరం బరఁగు సరస్సున (పూర్వకాలమున పూరీ జగన్నాధమునందింద్రద్యుమ్నుఁ డనునొక్కమహారాజుకలఁడు. అతఁడు మహాదాత. అతఁడు గోవుల నిచ్చిన యాస్థలమునందు గోవులడెక్కలచే గొయ్యిపడినదనియు దానోదకమందు నిలిచె ననియు నదియే సర స్సయినదనియు దాని కింద్రద్యుమ్న మని పేరువచ్చిన దనియు భారతము చెప్పుచున్నది. ఆయింద్రద్యుమ్నుఁడు స్వర్గమునకుం జని పెద్దకాల ముండగా "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అనున్యాయంబున నతని స్వర్గమునుండి క్రిందికిం ద్రోచిరనియు నతఁడు నేను గొప్పకార్యములు చేసినాను. నాపేరు భూమిలో మాసిపోలేదు. నేను భూలోకమునకుఁబోయి విచారించి వచ్చెదనంతవఱకు నాదేవత్వమును నిలుపుఁడని ప్రార్థింప వా రట్లను గ్రహించిరనియు, ఇంద్రద్యుమ్నుఁడు భూలోకములో మార్కండేయునికడకు వచ్చి "నే నింద్రద్యుమ్నుఁడను న న్నెఱుంగుదువా?" అనగానతఁడు నేనెఱుంగను. నాకంటె ముదుసలికొంగ కలదని చెప్పఁగా నతఁ డతనితో నాకొంగకడకుఁ బోయి మార్కండేయునకడఁ బలికినట్లు గాఁ బలికినఁ గొంగయు నేనంతబాగుగా నెఱుంగను. నాకన్న పెద్దది యొకమడుగులో నొకతాఁబేలు కలదది యెఱుంగు నేమో యన నందఱు నటకుఁజని తాఁబేలును బ్రార్థింప నది గట్టునకు వచ్చి యింద్రద్యుమ్ను నేనెఱుంగుదును. అతఁడు గోదానములుచేసినస్థలమిది. తటాక మయ్యె. దీని కింద్రద్యుమ్నమనిపేరు" అని చెప్పెనఁట! అంతలో దేవ దూతలు వచ్చి యింద్రద్యుమ్నుని స్వర్గమునకుఁ దీసికొనిపోయిరనియుఁ గథ గలదు.) స్నానము చేయుచుండఁగాఁ బదియాఱుసంవత్సరముల వయస్సుగల

బంగారువంటిరూపుననొప్పు పురుషుఁ డొకఁడు గోచిపెట్టుకొని పావలం దొడిగి
కొని యటకు వచ్చి గంజాయి ద్రావుచుండెనఁట! స్నానముచేయు మనకవి
రాజు చిత్త మామునిసత్తమునయందుఁ దగిలి వానియొద్దకుఁబోయి హిందీభాషతో
మాట్లాడెనఁట. ఆమాటలలోఁ "తా నట సమీపముననున్న యొకయరణ్యములో
నుండువాఁడననియుఁ దన కట నొకసింగము రక్షకముగా నుండెననియుం జెప్పి
తనతో మన కవిని రమ్మని పిలిచెనఁట! పిలువఁగా వాని నొకపిచ్చివానిగా
మనకవిరాజు తలంచి జలంబుకడకు వచ్చి సంధ్యావాస్నానకు నాచమించెనఁట.
అంతలోనా బాలరూపధరుం డైన మహర్షి యంతర్ధానమయ్యెనఁట. ఎంతఁజూచినను
గానరాఁడయ్యెనఁట. అంత చూపు సాఁగినంతలోఁ జెట్లు మొదలగు నడ్డ
గల వేమియు నటలేవఁట! దానికిఁ బరమాశ్చర్యమునొందుచు నూరి కేసికివచ్చి
యావృత్తాంతమంతయు వృద్ధగు లోకనాథపండాగారికిం దెలియఁజెప్పిన నాయన
పరమానందభరితాంతరంగుండై "మీరుత్తములు మహాత్ముని దర్శింపఁగలిగి
నారు" అని పలికి "మీకుఁ గానుపించిన మహాత్ముఁ డొకమహాయోగి యిట్టి
కొందఱకుఁ గానుపించి పలుకుచుండును. మా తాతలు, తాతలతాతలు నెఱుం
గుదురు. ఆమహాత్మునకు వేయిసంవత్సరము లుండవచ్చును. ఆతఁడునరసింహో
పాసకుఁడు. అడవిలో సింగము రక్షించునని చెప్పుట కర్థమదే" అని చెప్పెనఁట!
ఆచెప్పినది మొదలుకొని మనకవిరాజునకుఁ బిచ్చిపట్టినట్లయ్యెనఁట. ఎన్నియో
సాకులు తా నాయింద్రద్యుమ్నమున కేగెను గాని యోగిదర్శనము మరల
కాలేదఁట! దీనింబట్టి విచారింపఁగా మనకవిరా జొకమహాయోగి దర్శనము
చేసిన పుణ్యమూర్తి యని తేలుచున్నది.

—కాశీవిశేషములు.—

కాశీవాసము పుణ్యప్రదము కాశీమరణము మోక్షప్రదము. కాశిలో
విశ్వేశ్వరాలయము కలదు. మఱియు మణికర్ణికాదిస్నానమనంతఫల ప్రదంబని
పెద్దలు చెప్పుచుందురు. కాశీగంగలో నొక విశ్వేశ్వర విగ్రహము కలదనియు
మన మొక మారేడుదళము నీటిపై వైచిన నది మునిఁగి శివుని శిరస్సుపైఁ బడు
ననియు నొక కింవదంతి కలదు. ఆమారేడుదళములు రసమాధికముగా నుండుట
చేతనే మునుఁగును గాని పై కారణము కాదనియు నద్దళములం దెచ్చి మఱియొక
చెఱువునీటిలో మఱియొక కుండ నీటిలో వేసి మునుగుటం బట్టి పరీక్షించి చెప్పిన
మనశాస్త్రిగారివలనం దెల్లమగుచున్నది. వరుణ, అసియను రెండునదులనడుమ

నుండుటచేత వారణాసియనియు, అవిముక్తమనియు, మహాశ్మశానమనియు లోనగు పేర్లు కాశికి కలవు. కాశి, యనగాఁ బ్రకాశించునది ఎప్పుడు నశింపనిది. కాశిలో విశ్వేశ్వరస్వామి మాధవస్వామి, డుంఠిగణపతి, దండపాణి, భైరవుఁడు వందేశాశి, గుహా, గంగ, యివి ముఖ్యములు. మఱియు నన్నపూర్ణావిశాలాక్షుల యాలయములు కలవు. పెక్కు లన్నసత్రములు కలవు. అందన్నపూర్ణ సత్రము, నాటకోటిసెట్టి సత్రము ముఖ్యములు. కాశీగంగలోని శవము కొలుగొట్టను. దానికిఁగారణము నీటిలో విస్తారముగా మంచు చేరియుండుటయే కాని మఱియొకటి కాదు. పంచక్రోశమధ్యమందు మొసలి మనుష్యులు పశువులు మొదలగువానిం బట్టి చంపదు. ఏజంతువునకైనను బ్రాణముపోవునప్పుడు కుడిచెవి మీఁదికివచ్చును. కొంబును వెట్టి కట్టిన నట్లు రాకమానదు. ఆసమయమున నాచెవిలో శివుఁ డోంకారముపదేశించునని స్కాందములోని కాశీఖండ మను గ్రంథము చెప్పుచున్నది. ఇది మనకవిరాజు స్వయముగాఁ గంటితోఁ జూచినవియే దీనికేమి కారణమో యూహింపఁ జాలకుంటినని చెప్పుచున్నారు. కాశిలో గుహాయని యొకగదికిఁ బేరుపెట్టి తైర్థికులవలన ధనము సంపాదింతురు. ఆగుహానుండి కైలాసమునకు మార్గమున్నదని చెప్పుదురు. మనశాస్త్రిగారటకుఁ బోయి దీనివిశేషమేమి యని యటనున్నవారి నడిగి వారికియ్యవలసిన దానికన్న నెక్కువ సొమ్మిచ్చి పాములున్నవి దిగవద్దను చున్నను గోయివలెనున్న దానిలోకి దుమికి చీకటిచేత నేమియుఁ గానుపింపకున్న నాయిల్లువలెనున్న దానిఁలోఁ జేతులతోఁదడిమినలుమూలలఁజూచెను. కైలాసమార్గముగాని పాములు గాని గాములు గాని యేమియుం గానుపింపలేదని చెప్పుచున్నారు. కాశిలో సత్యశౌచములు గలవు గాని భూతదయ తక్కువయేమోయని మనకవిరాజు చెప్పుచున్నాఁడు. గయలో ఫల్గునీనదిపెన్నంటి ప్రవహించి యుండుట పరీక్షింపఁబడినదియే ఇసుకలో నొక్కింత గుంట తీసినచో నీరొకమూలనుండి మఱియొక మూలకు బ్రవహించునఁట! వటవృక్షమిదియే ప్రయాగములో నున్నదియునని చెప్పుదురు గాని యది యసత్యమని కవిరాజుగారు చెప్పుచున్నారు. ప్రయాగములో భూమిలో నొక చక్కని కోట కలదఁట! దానిలోనుండి నానావిధమార్గములు కలవని గ్రహింపవలయునని చెప్పుచున్నారు. అయోధ్యకోతులకు ముఖ్యస్థానము. అంత పెద్ద కోఁతులు మఱియెక్కడను గానరావట! యాత్రికుఁడొకయిన్ని సెనఁగపప్పుబద్దలు కొని కోఁతులకుఁ బెట్టుకున్నచో వాని కేదోహానియువి

చేయకమానవు. మన కవిరాజయోధ్యకుఁ బోయినప్పుడు కోఁతులకేమియు బెట్టలేదట. అంతలో నొక గండుకోఁతి యొకటి యెటనుండియో వచ్చి శాస్త్రిగారి చేతిలోనున్న నూఱురూపాయలవిలువగల కరెన్సీనోటును సంగ్రహించుకొని నతిశీఘ్రమార్గమున నొక యున్న యొక చింతచెట్టుమీఁదకిఁ బోయెనఁట. ఆసంగతి కవిరాజందఱితోడఁ జెప్పఁగా వారు మీరు కోఁతులకేమియుఁ బెట్టలేదు కాబోలు పుట్నాలు తెచ్చిపెట్టుడు అని చెప్పగా రెండణాల సెనగపప్పు తెప్పించి బుట్టలో పోసి యామేడమీఁద నిలిచి కోఁతులరేని బ్రార్థించుచు నిలిచియుండిరఁట! అంతలో నాకోఁతి వచ్చి నోటు నటఁ బాఱవైచి పప్పుబుట్టం దీసికొని పోయెనని వారు నాతోఁ జెప్పినారు. మఱియు నాయయోధ్య నొరసికొని పాఱుసరయూనదిలో నానావిధంబులైన తాబేళ్ళు పెద్ద పెద్ద కొండగులవలె నల్లగాఁ దెల్లగాఁ బచ్చగాఁ నాకుపచ్చగా నెఱ్ఱగా నుండునట. అది నీరాడు రేవులందు విస్తరించియుండును. స్నానార్థము వచ్చిన జనులాకచ్ఛపములకింత యాహారము వెట్టిపోవుచుందురు. అచటివారొక దిబ్బను జూపి యిది రాముని జన్మస్థలమని చెప్పెదరది విశ్వసనీయము కాదు. ఆకాలమునాఁటి యయోధ్యనదీ పాతమైనదనియే వాడుక. అట బంగారుసీతావిగ్రహము కలదు. అది రాముఁడశ్వమేథము చేసినప్పటి విగ్రహమందురు. ఇదియు నసత్యమే. ఇట్లు చెప్పుట సత్యమునకుఁ జాలదూరమని తెలియఁబడుచున్నది. మఱియు మన కవి యనేక దివ్యస్థలములు చూచి సేవించినారు. ఓరుగంటిప్రతాపరుద్రుఁడు వాని పూర్వులు కట్టించిన దేవాలయములు పానగల్లు, హనుమకొండ, లోనగుచోట్లవీరుచూచియున్నారు. ఆ దేవాలయములు శిల్పనిర్మాణమున దేవతానిర్మాణమునఁదగియున్నదఁట. మఱియు నైజాము దేశములో నొక మహారణ్యమధ్యమునను మంథనపురికి 8 యోజనములదూరములో "రామగిరి" అను నొక మహాక్షేత్రము కలదు. అట భూవివరములో నొక దేవాలయము కట్టఁబడియున్నది. అది సుమారు 1, 2 వేలవత్సరములకు మున్ను కట్టియుందురేమో? అది యీనాఁడు కట్టినట్లు మనోహరముగాఁ జూపట్టుచున్నదఁట! అటఁ గల విచిత్రములు వర్ణింప శక్యము కాదని మన శాస్త్రిగారు చెప్పినారు. అటఁ బులులు పిలిచినఁ బలికినట్లుండునఁట! ఆపర్వతముమీఁద సంజీవ్యాదిమహౌషధులున్నవఁట! మహాయోగులట కప్పుడప్పుడు వచ్చి యౌషధులు స్వీకరించుకొని పోవుచుందురని చెప్పినారు. ఇవి గాక మనకవిరాజనేక దివ్య

దేశంబులు తిరిగి సేవించినారు గ్రంథవిస్తరభయంబున నిట్లు సంక్షేపించితినని విన్నవించుచున్నాను.

ఇట్లనేక దివ్యస్థలములు సేవించి కష్టసుఖముల లెక్కింగియున్న వారగుట చేతనే వారికి భూతదయయును పరోపకారచింతయును, గలిగినవి. వీరు చిన్నతనమునుండియు నెట్టి దొంగతనమును, జూదములేదనియు, నెట్టియసత్యము నాడలేదనియుఁ దెలియుచున్నది. మఱియు వీరికి జాతిమతద్వేషము లేదనియు. సర్వమతములు సమ్మతములేయనియు, లోకగురుసంఘములు వారిస్వీయచరిత్రమువలనఁ దెలియుచున్నవి. ఈవిద్వాంసుత్తముని కోపము తాటాకులమంటవంటిదనియు నప్పుడే చల్లారుననియు నేనెఱుంగుదును. కాని ప్రతిఘటించిన వారిని నిగ్రహింపక మానరనియు నెవ్వరుచెప్పినను దనకిష్టమైనట్లు విడువరనియు నేనెఱుంగుదును.

— ప్రభుదర్శనము. —

లంకావ్యవసాయమున నష్టముపొందినప్పుడు మనకవిరాజుగారు దేశమ్ములంగల ప్రభువుల సందర్శించుటకై నానాదేశంబులు తిరిగివిశేషధనమ్మును యశమ్ము నార్జించిరి. 1890 సంవత్సరమునఁ బ్రాగ్దేశప్రభువులగు విజయనగరము బొబ్బిలి, పర్లాకిమిడి లోనగు రాజులం దర్శించి యాయాస్థలములలో నవధానములు చేయుచుం బోయి బరంపురములో మహాప్రసిద్ధినిగాంచియున్న శ్రీపాద సుబ్బారావుపంతులుగారి నాశ్రయించిరి. వారును వీరిని స్వవంశజు లగుటచేత మఱింత యెక్కువ తాత్పర్యంబున మన్నించి తమయింట బెట్టుకొని కొందఱు ప్రభువుల దర్శనంబు గలిగించిరి. బరంపురములో న్యాయవాదిగానుండి దానకర్ణుఁడనిప్రఖ్యాతిగాంచిన కీర్తిశేషు లయినజయంతి కామేశముపంతులుగారి పిమ్మట నీశ్రీపాద సుబ్బారావుపంతుగారే సర్వవిధములచేతను సమర్థులై మహాఖ్యాతిం గాంచినారు. ప్రతిదినమును దనయింటికెందఱు బ్రాహ్మణులు వచ్చినను లేదనక తనపంక్తిని పడసోపేతముగా భోజనముపెట్టుచుండెడివారు. ఎన్ని దినము లట్లున్నను పొమ్మని వారి ననుటలేదు. ఆవచ్చినవారు వారంత వారు పోవలసినదియే కాని వీరు పొమ్మని చెప్పు నాచారములేదు. ఇప్పటికిని తనయింటి కెందఱువచ్చినను భోజనముపెట్టి యాదరించు నాచారము వారికుమారుఁడు సుందరరామశాస్త్రిగారును నడుపుచున్నారని వినుటకు మిక్కిలి సంతసించుచున్నాను. కాలాంతరమున 1895 వ సంవత్సరమున మనకవిరాజుగారు ఛత్రపురంబునం బాలుపొందు ఉన్నవ శ్రీవేంకటేశ్వరరావుపంతులుగారి దర్శ

నముచేసి వారి మూలమున శ్రీ శ్రీ కల్లికోట రాజా హరిహరమర్దరాజదేవు
గారి దర్శనముచేసి వారి యనుగ్రహమునకుం బాత్రులై వారి యాజ్ఞానుసార
ముగా నట రెండుమాసములుండి యటనుండి వారి వివాహమునకు వారితోఁ
గూడి బంగాళా రాజధానియందున్న "మయూరభంజి" యనుపురంబునకుంబోయి
యట సంస్కృతముతో నొకశతావధానము నొకయష్టావధానము చేసి మహా
పండితుల సమక్షమునఁ "గవిరాజ"ను బిరుదముతో నొకస్వర్ణపతకము నొంది
నారు. మయూరభంజిని "మోహాన్‌బంజో" యని యోఢ్రియులం బిలుతురు. అది
మహారణ్యములో నున్నది. దానికిఁ జుట్టును గొండలు కలవు. ఆరాజు ప్రతి
సంవత్సరము నేనుఁగుల నడవిలోఁ బట్టించి తనకుఁ గావలసినవి యుంచుకొని
తక్కినవి యమ్మించుచుండును. ఆరాజుపేరు శ్రీరామచంద్రభంజిదేవుగారు.
వారు నల్వురన్నదమ్ములు. నల్వురును షరుస్సుచేసి కూర్చున్నప్పుడును, వెల్ల
యేనుఁగ నెక్కి తిరుగునప్పుడును శ్రీరామలక్ష్మణభరతశత్రుఘ్నులవలెం బోల
దోచుచుందురు. జా రెక్క తెల్లనేనుఁగ నడవిలో దొరకినదియే. దాని
కొమ్ములు నిజముగాఁ దెగబారెడుంతేను. అది యొక నడగొండవలెం బొడకట్టు
చుండును. వారికి సివిల్ మేజస్ట్రీటు పవరుకలదు, వారి జడ్జిలే కేసులు విచారించి
తీర్పులు తీర్చుచుందురు. రాజు మిక్కిలి చిన్నవాఁడు. అప్పటికి నిరువదిమూఁడు
సంవత్సరముల వయస్సుగలవాడు. సుందరమూర్తి. మితభాషి. మనకవిరాజు
గారి యవధానమునుఁ జూచి పరమానందభరితులై వేయినూట పదియాఱు
రూప్యములు, సేలువులు, దోవతులు, నుంగరములు, నిచ్చి యాదరించెనఁట!
వారిమీఁదఁ సంస్కృతముతోఁ గొన్ని పద్యములేఁ కొన్ని కీర్తనలను జేసి తన
తోఁ బెండ్లికి వచ్చిన నందిగాని వెంకయ్యగారను మహావైణికునిచే గానము
చేయించి రాజుగారి మెప్పునకు దానకమయ్యెనని తెలియవచ్చెనది. ఆకీర్తన
లన్నిటియందును "రామచంద్రభంజీదేవశ్రీ" అను కీర్తనం బాడుచున్నప్పుడు
రాజుగారెంతయో సంతసించుచుందురట. వారిపై ననేక శ్లోకములు రచింపఁ
బడినవి యని యన్నియు మఱియొకచోఁ బ్రకటింపఁబడును. వీరట నొకనాఁడ
ష్టావధానము చేయుచుండ స్రగ్ధరావృత్తమున నారాయణమూర్తిని వర్ణింపు
మని కాశీపండితుండగు రామచంద్రశాస్త్రిగారు కోరగా "శ్రీమల్లక్ష్మీసనాథస్స
కల సుజగతా మీశ్వరస్సర్వసేవ్యః" ఇందు లక్ష్మీశనాథయని యోఢ్రాక్షరముల
తో వ్రాయున గానిచే వ్రాయఁబడినదఁట. ఓఢ్రపండితుండగు రామచంద్రశాస్త్రి

గారది తప్పని గద్దరింపగా మనశాస్త్రిగారు నేనట్లు చెప్పలేదు "సనాథ" యని చెప్పితిని. ఇట్లయినను దప్పలేదు. "లక్ష్మీశుఁడు, నాథుఁడు" నని సమర్థించుకొన వచ్చునని చెప్పగా సంస్కృతభాషయందుఁ గవిత్వము చెప్పఁ దగిన మహారాజు తనపండితుని వాదము సరిగా లేదని మనకవిరాజును మెప్పించెనని చెప్పుదురు. మఱియు నాయవధానమందుఁబుష్పగణనము, అంకగణనము, ఘంటాగణనము, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, లిఖితాక్షరి, నిషేధాక్షరి, పురాణపఠనము, సహపఠనము, కావ్యపాఠము, ప్రసంగము, చతురంగఖేలనము,లోనగు ముప్పది పనులొక్కసారి నడపింపఁబడియె. పుష్పగుణనములో మన యవధానిగారి లెక్కకు నేకోనశతమే వచ్చినదఁట గాని మీరు ఇట్లొక్కటి తక్కువచేయ వచ్చినారా! మనము ప్రమాదపడినామేమో యని పుష్పములు నూఱని చెప్పిరఁట రామచంద్రశాస్త్రి ప్రభృతులు తప్పని కేకలు వైచిరఁట. అప్పుడుమనకవి మీరు వేసిన యొక పువ్వు నాకు రెండుసారులు తగిలినది. అది నేను రెండు సారులు లెక్కపెట్టుకొంటిని గావున నాకు నూఱు లెక్కవచ్చినదని చెప్పఁగా రాజు పరమానంద భరితాంతరంగుండై బావమఱఁదియగు హరిహరమర్దరాజదేవుం బ్రశంసించెనఁట! ఇట్లు మహావధానంబున కృతార్థుండైన మనకవిరాజు రాజసన్మానపాత్రుండై గండు మిగిలెనని వినవచ్చుచున్నది.

మఱియును మనకవిరాజుగారు నైజాము సంస్థానమందలి హనుమకొండపురంబునకుం జని యట న్యాయవాదిగానున్న శ్రీమోదుకూరి రాజేశ్వరరావు పంతులు గారి యిష్టమును సంపాదించుకొని వారితో మంథెనపురంబునకు సమీపమున నున్న పెద్దపల్లియను రాజధానికిం బోయి యట జమీందారుఁడై యున్న శ్రీ రాజాపోలేపల్లి వేంకటరాజేశ్వరరావు సర్దేశముఖు సర్కారారామగిరు దొరవారి దర్శనము చేసి వారి సంస్థానములో నొక యవధానము చేయుచున్న సమయంబున నొక వైష్ణవోత్తముండటకు వచ్చి కవిరాజుం గాంచి "అయ్యా! సీతారామ స్వామి కంకితము చేసి యొక కంకణబంధము చెప్పుఁడు" అని యడిగెను.

అడుగగా నవధానముచేయుచున్న మనశాస్త్రిగారు దొరవారి కొక చీటిని వ్రాసిరి. అందులో "కంకణబంధము స్థిమితముగాఁ గోశములు చెంత నుంచుకొని కొన్నిదినము లాలోచించి చేయఁదగినది. నన్నిపు డీయన దానిం గోరుచున్నవాఁడు. కంకణబంధ మిప్పు డెవ్వరును జెప్పఁజాలరు. తయః కా

బంధమేమో దాని కష్ట మేమిటియో తెలియదు. శ్రీవారి సెలవయినచోఁ జమత్కారము చేసెద" ననియున్నది. దాని కాచార్యులుగారు "తమ చిత్తమువచ్చినట్లు చేయుఁడు" అని బదులు వ్రాసిరి. అంతలో నాచార్యులుగారు మఱియొకసారి "అయ్యా! కంకణబంధము" అని యడిగిరి. అప్పుడు మనశాస్త్రిగారు దేవీస్తవముచేసి "కంకణబంధము కావలయునా? ఒకటియా? రెండా? మూఁడా? ఎన్నియైనం జెప్పెద వ్రాసికొనుఁడు" అని చెప్పినారఁట. దాని కాచార్యులుగా "రమ్మయ్యో" యని యాశ్చర్యము నొందుచు వ్రాయుటకుసిద్ధమయ్యె. అపుడు మన యవధాని పాదపాదనియమముగ నిట్లనెను:—

"విద్యున్మాలావృత్తము. మా రా కా రా శా రా మా రా రామాదూ రాదూ ర్వామా ర్వా
భారోడా రాదా రాభా రాభీరాసా రా సీతా రామా."

అని యేవో వట్టి యర్థములేనిపదములువేసి పద్యమల్లి "ఇదిగో కంకణబంధము, ఇం దనేకపద్యము లున్నవి. దీని యర్థము చెప్పుటకు మూఁడుదినములుపట్టును గావలసినచో మాబసకువచ్చిన రేపు చెప్పెదను" ననిన నాచార్యులు పరమాశ్చర్యమునొందెనఁట! అవధానములలో నిట్టి చమత్కారములు కూడఁ గొన్ని యుండును. అనంతరము జగ్గయ్యపేటలో గొప్పగానవధానము జరిగెను. ఆయవధానములో—

"వడ్డాణ మలంకరించె వనితకుచములన్"
"కుళీరకుమారే కరిపరిలునాతిపంచాననం"

అని మొదలైన సమస్య లీయఁబడినవి. అవి యీక్రిందివిధమునఁ బూరింపఁబడియె:—

"క. వడ్డకులు పోరుచో భూ, రాడ్డమ్మున నడుమనేగు రభసమ్ముననా
వడ్డాకఁ దొగుడు మొడఁగొను, వడ్డాణమలంకరించె వనిత కుచములన్.॥
శ్లో. అహోమధుపసంచయః కవికులాధినాథం సదా।
పదప్రచర ఉత్పతన్ హరిగతావధానస్థితం।
కరోతి యదిచేత్త్రిరస్కృతి మిహాఘయుక్తైకలో।
కుళీరకుమారే కరిపరిలునాతి పంచాననం."

అని పూరించిరఁట. ఈకడపటిశ్లోకమునందు శ్లేష కలదు. మఱియు నాసభలోఁ జేరూరి సూర్యనారాయణగారు "అవ్వ తాతా, డంకాసగారా, రారా పోరా, మేనాసవారీ," ఈమాటలువచ్చునట్లు ఊర్వశి యర్జునుం గోరి యతఁడు తనకు వశుఁడు గామిం చేసి వడిన విహార మొక శార్దూలములోఁ జెప్పవలయునని కోరగాఁ బదినిమిషములలో—

"శా. ఆపాకారికుమారుఁ డట్లు విభవంబవ్వారిగా రొగ్గ, రా
రాపోరాయను సందడిం బడుసుధర్మం బ్జావి నేసవ్వాతా
తా పాల్మాల వరింపకేగెనను వాఁ డంకానగా రా కహా
విశ్వాలం బడితిం జెలుగ్గ మనుపశే మేనానవారించితిన్"

ఇట్లు చెప్పినారఁట! దానికి సంతసించి సూర్యనారాయణగారు రెండువందల రూప్యములప్పుడే యిచ్చినారఁట! ఆసభలో మొత్తము పదునాలుగువందల రూప్యములు వచ్చినవని తెలిసినది. మఱియు గోదావరీతీరంబున మంథెన యను నొక పెద్దగ్రామము గలదు. అది నైజాముసర్కారులోఁ జేరినది. అందుఁ దహశ్శీలుదారు కచ్చేరీ మొదలగు కచ్చేరీలుగలవు రెండువేల బ్రాహ్మణగృహములున్నవి. అందు వేదము ఘనాంతము చదివినవారిప్పటికి 5, 6, వందల మందికిఁ దక్కువ యుండరు. ఒకానొక కాలంబున వీరు హనుమకొండపురవాసులగు మోదుకూరి అమృతరావుపంతులుగారు అటకుఁ దహశ్శీలుదారుగాఁ బోయియున్నప్పుడు వారియాహ్వానంబున నటకుఁ బోయి వారిప్రోత్సాహంబున నొకయవధాన మాగ్రామములోఁ జేసిరి. మహావిద్వాంసులెందఱో యీసభకుఁ వచ్చియున్నారు. సహాపఠనములో వారు చదివిన వేదములలోని పనసలు స్వరము తప్పక చదివినారు. ఆవిద్వాంసులు మనయవధానిని మెచ్చి "యీయనకు వేదములన్నియువచ్చును" అనిరి. అంత నొక మ్లేచ్ఛుఁడు వచ్చి "నేనరబిక్కు చదువుదును అదివీరు చదవగలరా" అనఁగాఁ జదువుఁడని మనకవిబదులు చెప్పి ఆమ్లేచ్ఛునితో నరబిక్కుపద్యములు తప్పక చదివి మెప్పందిరని వినుచున్నాను. మన యవధాని యిప్పటికిని, ఇగ్లీషు, అరవము, కన్నడము, ఓఢ్రము మొదలగునే భాష యెవ్వరు చదువుచున్నను వచ్చినవాఁడు చదివినట్లు వారితోఁ గలసి చదువునని కంఠోక్తిగాఁ జెప్పుచున్నాఁడను. నేనుస్వయముగాఁ బరీక్షించినాను. నాతో నిగ్లీషు చదివినారు. "మీ రెట్లు చదువఁగలుగుచున్నారు" అని నేనడుగగా శాస్త్రిగా "రిదియొకపట్టు. మీరుచ్చరించునట్టు నేను నుచ్చరింతును" అని చెప్పిరి. ఇదిగాక వీరుఇంగ్లీషులోఁగాని తెలుఁగులోఁగాని వ్రాసినజాబులు మొద్దలైనవి చూచి ఈతఁడన్ని యేండ్లవాఁడు, వీనిగుణమియ్యది, సాధువు, అసాధువు, ఇత్యాదులు జాతకము చెప్పినట్లుఁ జెప్పఁగలరు. వేంకటగిరి, జటప్రోలు, బొబ్బిలి మొదలగు ప్రభువులం జూచి వారిచే సత్కరింపఁబడిరి. గ్రంథవిస్తరభయంబున నవి యన్నియును విడిచి నైజాముగారి దివానగు శ్రీరాజా రాజాయాక్కిషన్

ప్రసాద బహద్దరుగారి దర్శనము చేసిన సంగతి యించుక వ్రాసి యీవిషయ మింతతోఁ ముగించుచున్నాను హైదరాబాదు నవాబునుఁ జూడవలయునను కుతూహలముతో హనుమకొండకుం బోయి యట సుబేదారుగానున్న రాయ మురళీధరును దర్శనము చేసి.

"సీ. మురళీధరుఁడె కాని మురళీధరుఁడు కాఁడు,
మురళీధరుఁడవన భూషణుండు.

... ...

ఇత్యాదులు వారి పద్యములు చెప్పి వారిదయకుం బాత్రులై మన కవిరాజుగారు సుబేదారుగారిచేఁ చెప్పఁబడిన పోలీసులో మొదటియుద్యోగిగా నున్న హాంకిన్‌దొరగారి కడ క్యూత్రబూటు మొదలయిన గణితచిత్రములు చేసిన సంతసించి వారు తనతోఁ వీరిం గొనిపోయి హైదరాబాదులో కిషన్ ప్రసాద బహద్దరుగారి ప్రయివేటుసెక్రటెరీకిం దెలియఁజెప్పి తన్మార్గమునఁగిషన్ ప్రసాదు బహద్దరుగారి దర్శనము చేయించినారు. వారికడఁ మనకవిరాజుగారవ ధాన చిత్రములెన్నియో కనబరచి యీక్రిందివిధమునఁ బద్యములు చెప్పినారు.

శ్లో. విద్వద్ద్విజ కిషన్ ప్రసాద మమభోదారిద్ర్యరోగోఽజని

... ...

పరాఙ్ముఖగతా వైద్యాస్సమస్తాభువి

... ...

శ్లో. ఆరబ్ధం బహుభువార్షికోత్తమ మహాసత్రం పవిత్రీకుందా
తత్రార్థ్యవ్యయపదం కుటుంబ అగమత్త్రాజ్యః ... ...
హావిశ్నాకపాకాదికం

ఈశ్లోకములుచిత్తులో దొరికినవి. అవి చదువుటకు వీలు లేనట్లుఖిల మైనవి. ఇట్లనేక సంస్కృతాంధ్ర పద్యములు చదువగా నాయన సంతసించి నైజామునవాబు మహబూబుదౌలాగారి దర్శనము చేయింతుమని చెప్పినారు కాని అది మన కవిరాజుగారికిఁ దటస్థించినది కాదు. హైదరాబాదులో నొక్క మాసముండిరి. అప్పుడేదో యింటికిఁ బోవలసిన యవసరమువచ్చుటచేత నాలా భమును మానుకొని యింటికి రావలసినవారైరి. ఇట్లే మనదేశములో గొప్ప వారన్నవారి నందఱం జూచి యనేకావధానములుచేసి లంకలవ్యవసాయమునఁ గలిగిన అఱువదివేలు వడ్డీతోనైన ఋణమంతయుఁ దీర్చి కృతకృత్యులైరి.

౨ కృష్ణకవిజీవితము

షష్ఠప్రకరణము.

— మాయావులు. —

రాజమహేంద్రవరమున మనకవిరాజు పత్రికాకార్యము నిర్వహించుచు గ్రంథములు రచించి ముద్రించి ప్రకటించుచు సుఖముగాఁ గాలక్షేపము సేయుచున్న సమయంబున నొక్కనాఁడు కృతపరిచయుండగు పులిగడ్డ భీమశంకరుఁ డనునొకమాయావి విస్సాప్రగడ సూర్యనారాయణ యనునొకవృద్ధబ్రాహ్మణునింగూడి కవిరాజుయొద్దకు వచ్చెను. భీమశంకరుఁడు మున్నొకప్పుడు మనకవి కేదియో మోసముచేసియున్నవాఁ డగుటచేత నతనితో మాటలాడుటకు నిష్టములేకపోయినను, ఇంటికివచ్చి కూర్చున్నవారితో మాటలాడకుండుట ధర్మము కాదని కొంచెము కుశలప్రశ్నముచేసినారఁట! అంతలో శంకరుండు సూర్యనారాయణను జూపి "వీరు లక్షాధికారులు, వీరి కాపురము చికాకోలు, వీరు మీతోనొకపనికలిగి మీదర్శనము నిమిత్తము వచ్చినారు" అని చెప్పెనఁట. చెప్పఁగా కవిరాజు సూర్యనారాయణ రూపమునుఁబట్టి ధనవంతుఁ డనితోఁపకున్నను ధనవంతులైనం గొంద ఱిట్లుందురని నిర్ణయించుకొని వానితో నించుక సంభాషించి శంకరుఁడు మోసగాఁడని యెఱింగియును "మీరు వచ్చిన కార్యమేమి" అని యడిగెను. అంత సూర్యనారాయణగారు "పెద్దకార్యము మీవలనఁ గావలసియున్నది". రేపు వచ్చి మనవిచేయుదుమని నిష్క్రమించిరి. ఆవెనుకఁ గొంతసేపటికి మరల శంకరుఁడు వచ్చి గురువుగారూ! అని సంబోధించుచు „నాతో వచ్చిన సూర్యనారాయణగారు గొప్పదాత. మీవలనఁజిన్నకృతి పుచ్చుకొని మీకు రెండువేలరూప్యము లిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. మీరు మాత్రము వారి కొకయుపకారము చేయవలయును" అని పలుకగా „నీవు దొంగవు. నీమాట నాకు విశ్వాసపాత్రము కాదు. నీతో మాట్లాడుట నాకిష్టము లేదు. ఇం దేమి మోసముండునో నాకు మీగొడవతోఁ బనిలేదు. నేనేమియుఁ జేయఁజాలను. మీకార్యము మఱియొకరిచేతం జేయించుకొనుఁడు"

అని కవిరాజు చెప్పెను. శంకరుఁడు మఱియును నామాట మీరు సత్యమని తోఁపనియెడల సూర్యనారాయణగారే వచ్చి చెప్పెదరని వెంటనే పోయి తీసికొనివచ్చి "రేపేమి యిప్పుడే శాస్త్రిగారితో మీసంగతి మనవిచేయండి" యని చెప్పగా నాసూర్యనారాయణ "నేనువిశేషధనము కలవాఁడను గాకున్న మానెగాని కొంచెము కలవాఁడను. మీకు లంచ మిత్తునన్న మీ రంగీకరింపరు గావున నాకొకకృతియిండు. మీకు రెండువేలు ముట్టఁజేయుదును" అని చెప్పి మఱియు "అయ్యా! ఉర్లామును మీరు వినియున్నారుకదా! ప్రకృతము జమీందారిణిగానున్న మహాలక్ష్మమ్మగారి యనంతరము రాజ్యముఁబొందఁదగినవారు కందుకూరి సన్యాసిరాజుగారికొమాళ్లిద్దఱు కలరు. వారిపుడు హైదరాబాదులో నున్నారు. సన్యాసిరాజుగారికి నేను ముప్పదివేలిచ్చి ప్రామిస్సరీ నోటు వ్రాయించుకొంటిని. ఆనోటున కిపుడు కాలదోషము పట్టినది. నేనేదో యొక యెత్తువేసి వారి నిటకుం దీసికొనివచ్చెదను. మీ రెట్లయినను వారిచే నాకానోటు తిరుగ వ్రాయించి యిప్పించుఁడు. ఇదియే నాకు మీరు చేయు నుపకారము. నిష్కారణముగా నారూపాయలు పోవుచున్నవి. మీకిందులోఁ బనిచేసినయెడలఁ బుణ్యము పురుషార్థమువచ్చును" అనిన "సరే కానిండు. వారిటకువచ్చిన నాచేయఁగలది చేయుటకుఁ బ్రయత్నించెద" అని కవిరాజుబదులు చెప్పిన వారుమరునాఁడే బయలుదేరి బెజవాడకుం బోయిరి. ఇదియంతయు శంకరుని మాయయని మాత్రము కవిరాజున కనుమానముపోలేదు. అనంతర మిరువదిదినముల కీయిద్దఱును మరలవచ్చి "రెండుమూఁడుదినములలో ఉర్లాము రివర్షనర్లు వత్తురు. వారిని వంటపూటి యింటికిఁ దీసికొనిపోవుట బాగుండదు కావున మీరు కొంచెము సదుపాయము చేయవలయును" అని కోరిరి. కోరగా "సరే వారు వచ్చినఁ జూచుకొందుములెండి" యని కవిరాజనియె. ఆమరునాఁడు కవిరాజుపేరనే హైదరాబాదునుండి టెల్లిగ్రాము వచ్చినది. అందు "నేనీమెయిలులో వచ్చుచున్నాను. రైలువద్దకు రావలెను. ప్రసాదరావు" అని యున్నది. అప్పుడు మనకవిరాజున కేదో కొంతనమ్మకముతోఁచి సూర్యనారాయణను బిలిపించి "యిదిగో టెల్లిగ్రామువచ్చినది. మీరు రైలునకు వెళ్ళి మాయింటికే వారినిఁ దీసికొనిరండు" అని చెప్పిరి. వారును సరే యని పోయి చిన్నప్రసాదరావని పిలువఁబడు లక్ష్మీప్రసాదరావుగారిని గలిసికొని కవిరాజుగారి సంగతియేమియుం జెప్పక వారింటికిఁదీసికొనిపోక మఱియొకచోటికిఁదీసికొనిపోయి

రి. మనకవిగారి కాయన వచ్చినట్లయినం దెలియలేదు. అంత మూఁడుదినములకు నోరునెత్తి మొత్తుకొనుచు సూర్యనారాయణవచ్చి "శాస్త్రులుగారూ! కొంపమునిగినది. ఈనాఁడు మాపెట్టిలో నైదువేలువెలగలనోట్లు దొంగలెత్తుకొనిపోయినారు. పోలీసువారికి రిపోర్టుచేసినాము. వారు వచ్చి మమ్ము తర్జనభర్జనలుచేయుచున్నారు. మానోట్లు పోతేపోయినవి. మూఁడునిమిషములలో సంపాదించుకొందుము. ఉర్లాము రివర్షనరు వచ్చినాఁడు. కొన్ని యిబ్బందులచే మీయింటికిఁ దీసికొనిరాలేను. వారి ప్రయాణమునకుఁ బదిరూపాయలు మాప్రయాణమునకుఁ బదిరూపాయలు పోలీసు మొగమున వేయుటకుఁ బదిరూపాయలు ముప్పదిరూపాయీలు మాకు బహుమతిప్పించండి. మేము యానాము వెళ్ళి నాయుడు గారికి నోటువ్రాసి కొన్నివేలు తెచ్చి యుర్లామువారికిచ్చి మీచేతనే వ్యవహారము పరిష్కారము చేసికొందుము. పెద్దవారు తూర్పున నున్నారఁట వారి నెల్లుండికి మీరు పోయి తీసికొనివత్తురు. మాచేతిలోఁ బైసయయిన లేకుండఁబోయినది" అని యనేకవిధముల బతిమాలిరి. "నరే పోలీసున కిచ్చుట యేమిటికి నేను వత్తును బదుండు" అని శాస్త్రిగారు వారివెంట వంటపూటి యింటికి వెళ్ళిరి. అంతలో నట లక్ష్మీప్రసాదరావుగారు, భీమశంకరుఁడు, మఱికొందఱు తినవచ్చినవారు, నొకపోలీసు సబినస్పెక్టరు, నొకరిద్దఱు కానిష్టేబులు కూరుచుండి జరిగిన సంగతి విచారించుచుండిరి.

పోలీసుయినస్పెక్టరు—"పోయిన రూపాయల మొత్తమెంత?

సూర్యనారాయణ—బాబూ! అయిదువేలు.

పో. యి—అయిదువేలును రూపాయలా? నోట్లా?

సూర్య—నోట్లండి. నోట్లు. బ్యాంకినోట్లు బాబు! బ్యాంకినోట్లు.

పో. యి—ఎన్నినోట్లు? వానినెంబర్లు నోటు చేసినారా?

సూర్య—అయిదునోట్లుబాబు! అన్నీ వేలు. మేము నెంబర్లువేసికోలేదు.

పో. యి—పోనీ యివి యెక్కడ తెచ్చినారు? చెప్పండి మనము పోయి వారిని విచారించి పని చేయుదము.

శంకరుఁడు—బాబోయి బాబోయి! నోట్లిచ్చినవారి పేరు చెప్పఁగూడదు బాబూ! మాకొంప మునిఁగింది కాకుండా వారికొంప కూడా మునుంచమా?

పో. యి—వారికొంప మునుఁగు టేమి? వారిపే రెందుకుఁ జెప్పరాదు. ఇవి మీరెక్కడనైనఁ దొంగిలించితిరా యేమి?

సూర్య—బాబూ! మేమొక యోడమనిషిదగ్గర తెచ్చినాము. చెప్పితే ఆమెకు చిక్కు వచ్చును. అందుచేత నిట్లంటిమిబాబు!

పో. యి—ఆనోట్లిచ్చినది ధనవంతురాలా?

సూర్య—కా—

శంక—కాకపోవడమేమి? ఆమెమగఁడు పెద్దయుద్యోగము చేసి సంపాదించినాఁడు.—

పో.యి.—ఏమోనాకు సందేహముగా నున్నది. సరే యటుండనిండు. మీనోట్లెప్పుడు పోయినవి. ఎవరు వచ్చినారు? మీకెవరిమీఁద ననుమానము?

శంక—(లక్ష్మీప్రసాదరావుఁజూపి) ఈయనను మెయిలులో విజయనగరము పంపుటకు నిశ్చయించి, భోజనము పెట్టించినాము. ఇంతలో రైలు ఛార్జి నిమిత్తము సొమ్ము తీసి యిత్తుమని నేనింతకుమునుపే పెట్టితాళము తీసి చూచినాను. అన్నియు నున్నవి గాని నోట్లు మాత్రము లేవు. ఒకపిల్లవాఁడు నిన్నరాత్రి యిటఁ భోజనము చేసి వెళ్ళినాఁడు. ఆతఁడు నోట్లు నేను దీయుచుంటే చూచినాఁడు. చేతిలో నొక దమ్మిడీయైనా లేకపోయినది. మాకొంప యిట్లు మునిఁగినది.—

పో యి—(ప్రసాదరావుంజూచి) ఏమండీ! మీరేమి చెప్పెదరు?

ప్రసా—(గడగడవణకుచు) అయ్యో! నాకేమియుఁ దెలియదు. వీరు హైదరాబాదువచ్చి "మీకైదాఱువేల రూపాయలిత్తుము. మాకు యస్టేటు వచ్చినతరువాత మాకు లాభము చేయుఁడు" అని కోరినారు. మాకు ధనమవసరమగుటచేత సరే నేను రాజమండ్రి వచ్చి "విజయనగరములో నున్న మా యన్నను దీసుకొనివచ్చి మీకు దస్తావేజు వ్రాసి యిచ్చి పుచ్చుకొందుము. నాయొద్ద రైలుఛార్జిలేదు. మీరిచ్చిన పోయి మాయన్నను దెచ్చెద" అని నేను జెప్పఁగా రెండుదినములనుండి యిప్పుడు రేపు మాపు అని చెప్ప నేఁడు భోజనము చేసి ప్రయాణమని చెప్పినారు అంతలో నీశంకరుఁడు పెట్టితాళము తీసి చూచి గుండెలు దిబదిబ కొట్టికొని నేలమీఁదఁ బడి యేడ్చుచు నోట్లు పోయినవి అని యేడ్వ మొదలుపెట్టినాఁడు. ఇది నేను వీరితోఁ గూడవచ్చి పోలీసులోఁ జెప్పినాము. నాకింతకన్న నేమియును దెలియదు.

పో. యి—ఈపెట్టిలో వేఱే కొంత డబ్బు కూడఁబెట్టినారా?

సూర—వేఱే డబ్బులేదుబాబు! నోట్లుమాత్రమే.

అంత శాస్త్రిగారు పోలీసు ఇన్స్పెక్టరుగారితో సేమో చెప్పి పంపించి రహస్యముగాఁ బ్రసాదరావుగారిని గదిలోనికిఁబిలిచి, 'వీం డెవరు? వీరికిని మీకును సంబంధమేమి? మీతండ్రిగారికిని వీరికి నిచ్చిపుచ్చుకొను వ్యవహారమున్నదా? వీరు ధనవంతులా? మీరేమి యెఱుఁగుదురు? ఇక్కడకు మీ రెందులకు వచ్చినారు?" అని యడుగఁగా బ్రసాదరావుగారు 'అయ్యా! మీరేనా కృష్ణమూర్తి శాస్త్రిగారు? మీ రత్నములని మొదట నాతో వీరు చెప్పి తరువాత రైలు వద్దకు నాకొఱకు వచ్చినప్పుడు నన్ను మీ యింటికిఁ బోవలదని యీమాటలను దీసికొనివచ్చినారు. వీరిది శ్రీకాకుళము. మాకిపుడు ధనలోపమున్నది కావునఁ గొన్ని వేలరూపాయీలు నిత్తుమనియు మాకు నెస్టేటువచ్చిన వెనుక రెండు రెట్లు ముట్టఁజెప్పవలయుననియుఁ గోరి యిక్కడకుఁ దీసికొనివచ్చినారు. మా తండ్రిగారికి వీరికి నేమియుఁ బరిచయమునుగాని మఱియేమియుఁగాని లేదు. వీరిని నేను బాగుగా నెఱుఁగను వీరు భాగ్యవంతులని నేనూహింపను" అనిన మన కవిరాజుగారు వారిని జూచి 'మీరు గొప్పయింటివారులాగున నున్నారు' వీండ్రు మోసగాండ్రు మిమ్ము వంచించి ముప్పదినలువది వేలకు దస్తావేజు వ్రాయించుకొందుమని నాతోఁ జెప్పియున్నారు. మీతండ్రిగారికి సూర్యనారాయణ బదులుపెట్టినట్టు చెప్పినాఁడు. నేఁడు నోట్లుపోయినమాట సత్యము కాదు. వీ రిట్లు వేషమువేసినారు. నన్ను రూపాయీలు బదులు అడుగుచున్నారు. వీరితో మీ రుండవలదు." అని చెప్పఁగా బ్రసాదరావుగారు "నాచేతిలో సొమ్ములేదు. నేను మాయన్నదగ్గఱకు వెళ్లితేఁ గాని సికిందరాబాదునకు వెళ్లుటకుఁ గాని సొమ్ములేదు. నే నేమిచేయుదునో తెలియదనిరి. అంత శాస్త్రిగారాయనను జూచి 'మీకుఁ గావలసిన నే నిచ్చెదను. మీ పెట్టె మొదలగునవి మాయింటికిఁ బట్టించుకొనిరండు' అని చెప్పి దుఃఖాక్రాంతచిత్తులై కాళ్ళపైఁబడిన సూర్యనారాయణకుఁ బదిరూపాయలుచితముగా నిచ్చి సాఁగనంపిరి. రాత్రికిఁ బ్రసాదరావుగారువచ్చి కవిరాజగృహంబున విశ్రమించి తమయావద్వృత్తాంతమును జెప్పిరి. కొన్ని కాగితములనుజూపిరి. ఈసందర్భమున వారియస్టేటునుగూర్చియు వారింగూర్చియు నించుక చెప్పుట యవసరము కాకపోదు వినుఁడు;—

—♦ ఉర్లాము యెస్టేటు ♦—

గంజాము మండలములో శ్రీకూర్మమునకు సమీపమున నుర్లామను నొకచిన్నపల్లెకలదు. దానికి సంబంధించిన దేవాదియను మఱియొక చిన్నపల్లె కలదు. ఈ రెండును బ్రకృతము రెండు యస్టేట్లుగా విభజింపఁబడెను. తొల్లి యీస్టిండియాకంపెనీ మన దేశమునఁ బ్రఖ్యాతిఁగాంచినప్పుడు పిర్యాగ్రహారమునఁ గాపురంబున్న శ్రీ కన్నేపల్లి యాజులుగారనువారు ఉర్లాము దేవాది

మొదలగు నేడు చేబిరాలు గ్రామములను గుత్తకుఁ దీసికొనిరి. గుత్తకుఁ దీసి
కొననుగాని దానివలనఫలము నొందుటలేదు. అంతలోఁ బేరూరునుండి అయిదు
పోలవారమునయ్యలసోమయాజుల పేరమ్మగారు (ఆ కాలములో నీమె ధన
వంతురాలు, ధర్మాత్మురాలును) కాశీప్రయాణము చేయుచుఁ బ్రిసరాగ్రహారము
నకువచ్చినది. అప్పుడు యాజులుగారామెను దర్శించి తమగ్రామస్థితిని విన్న
వించెను. అప్పుడామె దానట నొకచెఱువుఁ ద్రవ్వించుటకు వాగ్దానముచేసి
7, 8 వందలరూప్యములు యాజులుగారికిచ్చి ప్రయాణముచేసెను. యాజులు
గారా ధనములో గొంచెము కొంచెము వాడి కూలివాండ్రకుఁ జోడిబావ
కాపించి ప్రతిదినమును బోయించి చెఱువు త్రవ్వించినారు. దానికి రెండువందలు
మాత్రమే వ్యయమయినది. మఱికొన్ని మాసములకుఁ గాశీనుండి పేరమ్మగారు
ప్రియాగ్రహారమువచ్చి తన చెఱువు జంఘాలరితిమైయుండుటం జూచి మిక్కిలి సంతో
షించెనఁట! యాజులుగారు ఆ చెఱువునకు రెండువందలుమాత్రమే వ్యయమైనదని
చెప్పగా నామె సరే! ఆసొమ్ము నాకు మీరిచ్చుపనిలేదు. అని మఱి
కొన్ని వందలాయనకు బహుమానమిచ్చి పేరూరునకుఁ బ్రయాణము చేసి
రఁట! యాజులుగారా సొమ్ముపెట్టి తన గ్రామములు కొన్ని ఆబాదుచేయించె
ననియు దానివలన సాలునకు 4, 5 వందలు లాభము వచ్చుచుండెననియుఁ
జెప్పుదురు. సిమ్మట వారికుమారులగు కన్నెపల్లి రామావధానులుగారు
ఆయేడు గ్రామములను బాగుచేయించి సర్కారువన్నులు చెల్లించుచు దాని
వలనఁ గొంతలాభమునుబొందినారు. ఇట్లుండ దేశము పండకపోవుటచేత
క్షామముకలిగినది. అప్పుడు సర్కారుపైకము చెల్లించలేదు. అందుపైన సర్కారు
తాలూకాను జప్తుచేసి సిశిప వేలము వేసిరి. ఆవేలములో బుద్ధిరాజు బసవరాజు
గారుపాడిరి. అట్లుసంపాదించి బసవరాజుగారు నిరాటంకముగా నగ్రామము
ననుభవించుచు మొదటిభార్యయం దన్యపుత్రికలును రెండవభార్యయం
దొక్కపుత్రికంగాంచి తనయెస్టేటునయుఁ గూఁతునకుఁ జెందునట్లు విల్లువ్రాసి
యావజ్జీవ మనుభవించుటకు ద్వితీయభార్యపరముచేసి కాలధర్మము నొందె.
అంత నాద్వితీయభార్య తనయల్లునిపేర యెస్టేటువ్రాసియిచ్చి నన్వాధికారము
వెలిగించె. అప్పుడు మొదటిభార్యకూఁతులకును వీరికిని గొన్నిసంవత్సరములు
హోరాహోరీని వ్యాజ్యములు భియోగములు మొదలగునవి జరిగినవి. తరువా
తగొంతకాలమున కపుత్రవతియై మొదటిభార్యమొదటికూఁతురును, రెండవభా
ర్యయునీమెకూఁతురును మృతిజెందిరి. అప్పుడు యెస్టేటంతయు బసవరాజుగారి
మొదటిభార్య రెండవకూఁతురగు పిచ్చమ్మగారిపరమయ్యె. ఆపిచ్చమ్మగారు
కందుకూరి వీరయ్యలింగముగారిభార్య వారికినన్నాసిరాజుగారు బసవరాజుగారను

సిద్ధయిపుత్రులు. అందాబసవరాజుగారే కొంచెము ప్రసిద్ధిఁ జెందినవారు. పిమ్మటనీకంపెనీవారు బసవరాజుగారికి సుగ్రామము పట్టునిచ్చినది. కొన్ని సంవత్సరములవిచ్ఛిన్నముగాఁ బరిపాలించినారు. వేదపరీక్షలం బెట్టి బహుమానము లేర్పఱచినారు. ఆయనకు విశ్వేశ్వరరావను నొకకుమారుఁడు. పిమ్మట విశ్వేశ్వరరావుగారికి బుద్ధిరాజువారి పడుచును మహాలక్ష్మమ్మ నిచ్చి వివాహము చేసి తాను మృతినొందెననియు విశ్వేశ్వరరావు మైనరుగాన యెస్టేటుకోర్టాఫ్ వార్డ్సువారు స్వాధీనము చేసికొనిరనియు నెఱుంగుదుము. విశ్వేశ్వరరావు తనకుఁ బదునాఱువత్సరములయీడుగా వచ్చినప్పుడు స్కూలునుండి వచ్చుచు చిఱుకోటలో గుఱ్ఱపుబండిమీఁదనుండి క్రిందఁబడి యాదెబ్బతో నకాలమరణము నొందెను. అప్పుడొకవిల్లు బుద్ధిరాజు వియ్యన్నపంతులు ప్రభృతులు ప్రదర్శించిరి. అదిసృష్టియని బరంపురముజిల్లాకోర్టులో వ్యాజ్యము వచ్చినది. దానికారకులలో గడఁ జెప్పినసన్యాసిరాజుగారు. ఈసన్యాసిరాజుగారి తండ్రియు బసవరాజుగారి తండ్రియు నన్నదమ్ములు. ఇది హైకోర్టువరకు వెళ్ళినది. విల్లు సరియైనది కాదని సన్యాసిరాజుగారును వారి పుత్రులును మహాలక్ష్మమ్మగారికి సంతరవారసులని నిర్ణయమై తీర్పిచ్చినారు. పిమ్మట మహాలక్ష్మి మేజరైన పిమ్మట నామెకు రాజ్యమువచ్చినది. ఆమె స్త్రీయైనను మామగారు నెలకొల్పిన వేదపరీక్షాబహుమానములన్నియు యథావిధిగఁ జేసినది. సత్రముల ననుకూలముగా నడపించినది, సంస్కృతమును వృద్ధిచేయించినది. ఇంగ్లీషుస్కూలును బెట్టించి విద్యార్థులకన్నవస్త్రములిచ్చి పోషించినది. ఆమె రాజ్యముచేయుకాలమున సన్న్యాసిరాజుగారును బుత్రులును ధనములేక మిక్కిలి కష్టములపాలైరి. సన్యాసిరాజుగారికి మొదటిభార్యయందుఁ జిరంజీవిరావనునొక్కఁడును రెండవభార్యయందు నిద్దఱుకొడుకులును గలరు. ఫ్రెంచివారి యానాముపురంబునకుఁ బోయి కాపురముండిరి. అక్కడనే కొన్నాళ్ళకు సన్యాసిరాజుగారును జిరంజీవిరావుగారును కాలధర్మమునొందినారు. పిమ్మట వారిపుత్రులగు పెద్దప్రసాదరావు చిన్నప్రసాదరావు ననబడు బాలసూర్యప్రసాదరావు లక్ష్మీప్రసాదరావుగార్లు తల్లియగు వెంకటసుబ్బమ్మగారితో దిగ్దేశములఁదిరిగినారు. తరువాత బెజవాడలో సుమారు రెండుసంవత్సరములకాలముండి సికింద్రాబాదునకుఁబోయి యక్కడ నెట్లోకాలక్షేపము చేయుచుండిరి. ఇంతలో సూర్యనారాయణగ్రహావేశమున నిల్లు రాజమహేంద్రవరమునకు రావలసినవారైరి.

శ్రీకృష్ణప్రసాదము

అట్లు తనగృహమునకు వచ్చిన లక్ష్మీప్రసాదరావుగారి నాదరించి మనకవిరాజు తనయింటం బెట్టుకొని భోజనము పెట్టించి మీకుఁ బనులు గావలసినవానిను వీరు నిప్పించుటయేల నేనిప్పింతునని వారియొద్దనున్న రికార్డుపట్టుకొని కొంచె

ము ధనవంతులన్న వారియిండ్లకుఁ దిరిగితిరిగి విసికి వేసారిపోయిరి.. ఎవరును వీరికి బదులిచ్చుట కంగీకరింపలేదు. సూరిరామమూర్తిగారను వారియొద్ద కవిరాజు తనహామీమీఁద బదులిప్పించుట కేర్పఱచుకొని లక్ష్మీప్రసాదరావుగారినిదీసికొని రావలయునని పదియైదురూప్యములిచ్చి విజయనగరమునకుఁ బంపించినారు. వారు గొన్నినాళ్ళకు రాజమహేంద్రవరముఁ జేరినారు. పెద్దప్రసాదరావుగారును జిన్నప్రసాదరావుగారును మనశాస్త్రిగారియొద్ద గొన్నాళ్ళుండినవెనుక సూరిరామమూర్తిగారు మొదట నిత్తునని చెప్పినంత సొమ్మియ్యక యిరువదిరూప్యములు మాత్రమే బదులుగా నిచ్చిరి. వారారూప్యములుపుచ్చుకొని హైదరాబాదునకు వెళ్ళి యక్కడఁ దమచిక్కులు గొన్ని తీర్చుకొని మనశాస్త్రిగారి మాటమీఁద నే రాజమహేంద్రవరము కాపురమునకువచ్చినారు. 'మీ రుగ్రామము యెస్టేటు వచ్చునంతవఱకును మీ కుటుంబపోషణము నేను జేయుచుందును' అని శాస్త్రులు గారు వాగ్దత్తముచేసి వారిని బిలిపించినారు. వారో 'మాకు యెస్టేటు వచ్చినచో నంతయు మీదే' యని చెప్పినారు. ఇట్లున్న సమయమునఁ జిన్నప్రసాదరావుగారు మన శాస్త్రిగారితో "మేము శ్రమపడలేము. మీ రుగ్రామమునకు వెళ్ళి మాదగ్గఱ వారిని జూచి మాట్లాడి మాకెట్లయినఁ గొంచెమిచ్చునట్లు రాజీ చేసికొని రావలయును అని కోరిరి. కోరగా తన చేతిసొమ్ము పెట్టుకొని 1908 సం॥రం 2 వ ఫిబ్రవరి తేదీని బయలుదేరి ఉగ్రామునకు వెళ్ళి మాది మేనేజరుగానున్న ప్రకాశరావుగారితో మాట్లాడి రాజీ తనకును యిష్టములేదు కావున దానిం గుదురునట్లు మాటలాడక యెట్లో మాటలాడి వచ్చినారు. ఈ కందుకూరివారు గొప్ప పదము నొందవలసినవారు. వారివలన మనమును బాగుపడవచ్చునని మనకవిరాజు వారిని బ్రేమించి భావిపరిణామ మెఱుంగఁజాలక వారికిని దమకును భేదమెంచక ప్రవర్తించుచుండిరి. ఇట్లు కొంతకాల మఱిగినవెనుక కవిరాజుగారు లక్ష్మీప్రసాదరావుగారికి బాలామహామంత్రము నుపదేశించినారు. ఆయున మన కవిరాజుగారిని గురువుగా నెంచి సర్వదా యమ్మహామంత్రమునె ధ్యానించుచుఁ గాలము గడుపుచుండె. అంతఁ గవిరాజు తనకు గ్రామాంతరమునకుఁ బోవలసినయవసరము వచ్చినప్పుడు తన ముద్రాయంత్ర వ్యవహారమును, బుస్తక విక్రయ వ్యవహారము లోనగునవి వారిపైనిడి ప్రయాణమేగె. లక్ష్మీప్రసాదరావుగారు మన కవిగారి వ్యవహారమును జూచుచు హనుమకొండ కీవిధమున నుత్తరము వ్రాసియున్నారు. దానివలన వీరి యనుబంధము తేటపడఁగలదు.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రులువారి సన్నిధానమునకు, తమ శిష్యుఁడు కందుకూరి లక్ష్మీప్రసాదరావు నిత్యం త్రికాలములయందు అనేక నమస్కారములు చేసి వ్రాయుంగల వి॥ త॥ యిందుతో నావద్ద

వున్న లెఖ్ఖకు కాపి పంపించినాను (కళావంతులు పంపినవి 42-వి-పి- లు రిట ను అయినవి. 17 సొమ్ము ముట్టినవి. 13 వాటియొక్క కాగితం మా అన్నయ్య పెట్లో యున్నది. నావంట్లో కొంచెం స్వస్థత లేనందున మా అన్నయ్యను చూడుమన్నాను. ఖర్చులు మాత్రం విడికాగితము మీాద నేను యిక్కడ వ్రాసుకున్నాను. రేపు సాయంకాలము అత్తవారి యింటివద్దనుంచి మా అన్నయ్యరాగానే దానిలెఖ్ఖ ఏతారీఖున యెంత వచ్చినది అంపుతున్నాను. నా యింట్లో చిక్కులు. ఈ చిక్కులు నన్ను వెర్రి వెంకటశాస్త్రులను చేసినవి.

"చిత్తగించవలెను లక్ష్మీప్రసాదరావు"

ఇట్లనేకములు వీరి యనుబంధాదికమును దెలుపునవి యున్నవి. కాని గ్రంథవిస్తరభయంబున నవియన్నియుఁ బ్రకటింపఁ బడలేదు.

శ్రీ కృష్ణకవి జీవితము

సప్తమప్రకరణము

— ఉర్లాము మాహాత్మ్యము —

ఉర్లాము యస్టేటు జమీాందారిణియైన మహాలక్ష్మిగారు వృద్ధవయస్సుగలదగుటచేత నామె యనంతరమందుఁ బొందఁదగిన మన కందుకూరి ప్రసాదరావుల కెప్పుడు యస్టేటు వచ్చునో యడ"నందో రాజాభవిష్యతి"యనునట్లున్నదనియు వీరిపోషణమున కెదియైన నొక యుపాయము మాలోచింపవలయుననియు నెంచి మన కవిరాజు హనుమకొండనుండి మంథెనపురంబున మోదుకూరి కమలాకరరావుగారను తన మిత్రుఁడు తహశ్శీలుదారుగా నుండెనవి విని వానియొద్దకుం బోయి వారితో యీవద్వృత్తాంతమును జెప్పి కొన్ని వేల యకరములు గలిగిన చినతూండ్ల పెదతూండ్ల యను రెండుబేనిగాకు గ్రామములు దరఖాస్తుజేసి దాని విషయమయిన కృషి చేయుచుండగా నిట నుర్లాము మహాలక్ష్మమ్మ నకాలమరణంబు నొందె. ఈ వృత్తాంతము విని వీరు చికాకోలు వెళ్ళి సబుకలెక్టరువద్ద పిటీషను పెట్టియున్నారు. (అప్పటికి జమీాందారిణి పోవుటయు నరసన్నపేట సబుమేజస్ట్రీటు వచ్చి లోగిలి యాక్రమించుకొని తాళములు వేయించుటయు జరిగినది) సబుకలెక్టరుగారా పిటీషను రికార్డుతో ఛత్రపురము పెద్దకలెక్టరుగారికి బంపింపఁగా నాతఁడు వారికి యస్టేటు నప్పగింప వలసినదని యార్డరు దయచేసిరి అంతలో కందుకూరి బసవరాజుగారి యన్నభార్య యగు నరసాయమ్మ పెంచుకొన్న పిల్లవాఁడు కందుకూరి వీరబసవరాజుగారు ఉర్లామునకు నేను వారసునని మరియొక పిటీషను పెట్టినాఁడు. అది రెండు దినములు లాలస్యమైనది. వారికి లోగడనే యస్టేటు నప్పగించిరి, కావున వ్యాజ్యెము వేసి న్యాయమును బొం

జూడని వారి కుత్తరువిచ్చిరి. వారు పెద్దకలెక్టరువద్ద మరల పిటీషనే యిచ్చియున్నారు. మహాలక్ష్మమ్మగారు పోయినప్పుడు గాని, వీరు చికాకోలు వెళ్ళినప్పుడు గాని, ఆ యుగ్రామములోఁ బ్రవేశించినప్పుడుగాని, తరువాతఁ గాని మన శాస్త్రిగారి కుత్తరముగాని టెలిగ్రాముగాని పంపించినవారు కారు. వారా కాలమందు వీరిని బోషించు పనిమీఁదనేకదా మధిరకు వెళ్ళియున్నారు. ఈ సంగతి మంధిరకు శాస్త్రిగారి భావమఱఁది యుత్తరము వ్రాయఁగా విని పరమానందమును బొంది తమ చేయుచున్న పని విడిచి కవిరాజు రాజమహేంద్రవరమునకు వచ్చి తన రాక కందుకూరివారి కెఱింగించి యుగ్రామునకు వెళ్ళినారు.

ఉగ్రామములో మెయిలు నిలుచుట గనుక, ఆముదాలవలస స్టేషనులోఁ దిగుచున్నానని టెలిగ్రాము నిచ్చియున్నారు. ఆముదాలవలస స్టేషనులో దిగినారు. ఉగ్రామువా రెవ్వరును లేరు. బండిలేదు దానిచేతనే కవిరాజు మనస్సు చివుక్కురుమన్నది. వచ్చి మరలిపోవుట న్యాయముకాదు కావున నొక యెద్దులబండి బాడిగకు గట్టించుకొని రాత్రి తొమ్మిది గంటల కుగ్రామునకు వెళ్ళినారు. దేవిడీగుమ్మముదగ్గరకు వెళ్ళి లోనికి వర్తమానము జేసినారు. అంతలో నా లోనికిఁబోయిన మనుష్యుఁడు వచ్చి 'జమీందారువారు భోజనము జేయుచున్నారు" అని జెప్పెను. జెప్పఁగా నది యుగ్రామము కాదో జమీందారుఁ డనఁగా బ్రసాదరావుగారో కారో యని కొంచెము సందేహించి 'మీరు చెప్పిన జమీందారుగారు రాజమహేంద్రవరమునుండి వచ్చినవారేనా? వారిపేరు ప్రసాదరావుగారేనా అనిన వాఁడవునని యె. అయిన రాజమహేంద్రవరమునుండి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు వచ్చిరని చెప్పుమనిరి. వాఁడు మరలవచ్చి లోపలికి రమ్మని చెప్పుమనిరని జెప్పెను. తన యింటియొద్దకు వచ్చినను దానుగాని తమ్ముఁడుగాని యెదురువచ్చినవాఁడు కాఁడే. చికాకోలునకు రాకున్నమానె నిటకైన వచ్చినవారు కారని కొంచెము విషాదమునొంది, యిదివరకు మీరుపోయి చెప్పినది పెద్దవారితోఁ గాఁబోలు మరియొక్కసారి పోయి చిన్నవారితోగూడ జెప్పఁగలరా? యని కోరగా వాఁడు పోయి మరల వచ్చి "వారు తలనొప్పి వచ్చి యిప్పుడే పండుకొని నిద్రపోయినారు. అనిచెప్పి రమ్మనిపిలచెను. అంతలో మన కవిరాజు పెద్దవారు భోజనము చేయుచున్నారు, చిన్నవారు నిద్రపోవుచున్నారు. గావున నిటవచ్చుటకు వీలుపడినది కాదు. మనమె పోవుదమని వానితో లోపలికిఁ బోయినారు. పోవువరకుఁ బెద్దప్రసాదరావుగారు వరండాలో నెవ్వనికో తలనొప్పి కమృతాంజనము రుద్దుచు "వచ్చినారా" యని పలుకరించినారఁట. "చిత్తము" అని కవిరాజు పలుకుచుండునంతలో నెటనుండియో పరుగు పరుగునఁ జిన్నప్రసాదరావుగారు వచ్చి సాష్టాంగ నమస్కారము జేసి 'మీ కరుణాక

టాక్షమున నిట్లు సంప్రాప్తమైనది" అని చెప్పి లోపలకుఁ దీసికొనిపోయి భార్యచే తన తల్లిగారిని నమస్కారము జేయించి వేడుకస్నానము జేయించి దగ్గర కూరుచుండి భోజనము పెట్టించి తాను స్వయముగా నొక గదిలోఁ బక్క వేసి సరసను గూరుచుండి సంగతులు లేవియో మాట్లాడుచుండెనఁట. "నాకుత్తరమైన వేసినారు కాగదా" అని కవిరాజడుగగా, నేను నాల్గుత్తరములు వ్రాసితిని. అవి యెవ్వరెట్లు జేసినారో తెలియదు. నేఁడు మీరు వచ్చు సంగతి నాకు దెలియదు. తెలిసినచో నా ముద్దాలవలన స్టేషనుకు రాకపోదునా? అని మొదలగు ననేక విషయములు జెప్పి నాటికిఁ దన సత్యవృత్తాంత మంతయుఁ జెప్పి సంతోషపరచెనని మన కవిరాజుగా రొక సందర్భమున నాతో జెప్పినారు.

మరునాఁ డరుణోదయమున లేచి కాల్యకృత్యములు దీర్చుకొని శాస్త్రిగారు లక్ష్మీప్రసాదరావుగారితో "మీ పుణ్యము మంచిది మీకు యస్టేటు వచ్చినది. కాని మీయన్నదమ్ములకు విరోధము వచ్చుట మిక్కిలి విచారకరము. నేను మీయన్న పక్షముగా నున్నట్లుండి యెట్లయిన నీ విరోధమును గొన్నినాళ్ళలోఁ జల్లార్చెదను" అని చెప్పి యొప్పించి బాలసూర్యప్రసాదరావుగారి మీఁదమీఁదికిఁ బోయి వారు తిన్నగా మాటలాడకున్నను తామే యొకదాని కొకటి గల్పించుకొని వారితోడనే యుండి వారినే పొగడుచుఁ గొన్నినాళ్ళు గడపి వారి యిష్టమునకుఁ బాత్రులైరి. ఇట్లు జేయుదునని చెప్పి వెళ్ళినను లక్ష్మీప్రసాదరావుగారు మన శాస్త్రిగారిమీఁద నిజముగా ద్వేషించి పిలిచినను బలుకుట మానివేసిరి. అంతట నన్నదమ్ములకుఁ గ్రమ క్రమముగా విరోధ మతిశయించినది. పిమ్మటఁ గాలక్రమమున సర్లామువారి చిక్కులన్నియుఁ దీఱియున్నవారు సుఖమున్న కాలమున నొక సమయమున కవిరాజుగారికి మిక్కిలి సొమ్ము అవసరము వచ్చినది. పిమ్మట జియ్యన్నగారియొద్ద బాలసూర్యప్రసాదరావుగారు రూపాయిలు తెప్పించుకొనుచున్నప్పుడు 1909 సం॥రం ఆగష్టు 8 తేదీని కవిరాజుగారిచేత ప్రామిసరీనోటు వ్రాయించుకొని రెండువేల రూపాయీలు బదులుగానిచ్చినారు. కొంతకాలమునకు వదరురూపాయీలు తిరిగియ్యనక్కఱలేదని నోటుపై నీక్రిందివిధమునఁ జెల్లు వ్రాయించి నోటిచ్చివేసినారు. 'శ్రీ. వే. బ్ర॥ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రులుగారికి శ్రీ॥ కం॥ బాలసూర్యప్రసాదరావు పం॥ గారు నమస్కారములు త॥ మీకు మాకూ వుండుకున్న స్నేహభావము ద్వారా యీనోటు తా॥ ప్రతిఫలం మాకుపూర్తిగా ముట్టినది. కాన దీనిని రద్దుపర్చి మీకు యిచ్చివేయడమైనది. మాకు లోగడ ఆపదలో మాకు మీరు చేసిన సహాయ్యమున్ను ప్రస్తుతము మీరుచేస్తున్న ఉపకృతిన్ని మనస్నేహమున్ను మీరుణ విముక్తి చేసినది. కందుకూరి బాలసూర్యప్రసాద రావు' ఇట్లు

వ్రాసి యిచ్చిరి. కందుకూరివారికి యస్టేటు రాకపూర్వమునఁ జేసినదానికి, ముప్పదివేలు బదులు యిప్పించినదానికిని, రెండుసంవత్సరములు తనయింటనున్న పనులువిడిచికొని చాకిరీచేసినదానికి తన ప్రెంటింగుప్రెస్ వారి యాధీనముచేసిన దానికి నిదియే ప్రతిఫలము.

వీడుకోలుమహోత్సవము.

అది మొదలుకొని కవిరాజుగా రాచోట నుండుటవలనఁ దనకనేకనష్టములు గలిగినవనియు, ధననష్టమేకాక నిష్కారణముగా లక్ష్మీప్రసాదరావుగారితో విరోధము వచ్చినదనియు, నింకటితో నట విడిచి యిల్లుచేరుకొనుట పరమోత్తమకార్యమని నిశ్చయించి 'నేను రేపు ప్రాతఃకాలమున బయలుదేరి రాజమహేంద్రవరమునకుఁ బోగల' నని చెప్పి యామరునాడే రాజమండ్రికివచ్చినారు. వచ్చిన వెనుక బాలసూర్యప్రసాదరావుగారు ఈ క్రిందివిధమున శాస్త్రిగారికి జాబులు వ్రాసినారు.

'శ్రీ వేదమూర్తులైన బ్రహ్మశ్రీ కవిరాజు శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారికి।

శ్రీకందుకూరు బాలసూర్యప్రసాదరావుపంతులుగారు అనేకనమస్కారములు త॥ మీరు వ్రాసినవుత్తరము చేరినది, యిట్టిమోస్తరు మీరు వ్రాయుడము నామనస్సు చాలా నొప్పిగలిగించుచున్నది. మీరు అకారణముగా కష్ట కలిగించుకొని నాకు కష్టకలిగిస్తుంటారు. లేనిపోని అపభ్రమలు పొందుదురుగాని మరేమీలేదు. యిక్కడిస్థితులు వేరేవ్రాయనక్కరలేదు. మీరు ఎరుగనివి లేవు మీరు ఎంతకట్టుదిట్టముగలవారో నాకుబాగా దెలుసును. మాతమ్ముడు పిలిచినా మీరెట్లుప్రవర్తింతురో నాకే నమ్మకము శ్రీమహాలక్ష్మిసమానురాలయిన మా సోదరి నాకన్న చిన్నదైనప్పటికి యింతచక్కని ఆలోచన చెప్పినందుకు (అనగా మిమ్ములను వారించినందుకు) నానమస్కారములు అని చెప్పవలెను. మీరు ది 20 తేదీ వాయిదాలోపున పనులుయావత్తు చక్కబెట్టుకొని రావలెను. యిక్కడ మేమంతా క్షేమముగాయున్నాము పిల్లలక్షేమం వ్రాయించవలెను—

ఏరుదాటవచ్చి ఎండమావులలో దగుల్కొనుదురా? మీరుపడ్డ అనుమానము లేశము నిజము కాదని ప్రమాణపూర్తిగ వ్రాయుగలను. మీకుయిప్పుడు నమ్మకం కలగకపోయినా మనము చెన్నపట్నం వెళ్ళినతర్వాత నమ్మకం కలుగగలదు. యింతకన్న అధికం వ్రాయను. చిత్తగించవలెను.

కం॥ ప్రసాదరావు.

ఇట్లువ్రాసినను మనకవిరాజులాగ్రామునకు వెళ్ళలేదు. తరువాత లక్ష్మీప్రసాదరావుగారితో మరల మైత్రికుదిరినది. వారికోర్కెప్రకారము జియ్యన్నవారి వద్దవారికిని బదులేర్పాటుచేసినారు. అంతనొకసమయమున వారు శ్రావణికిరమ్మనికోరుటచే

ఊర్లామునకు వచ్చి యచ్చట రెండుదినములుమాత్రముండి రాజమహేంద్రముఁ జేరినారు. శ్రీలక్ష్మీప్రసాదరావుగారు మనకవిరాజుగారికి సాలున కైదువందల రూప్యములిత్తుననియు లేక ముప్పదిబస్తాల ధాన్యమిత్తుననియు వాగ్దానము చేసినారు. రూపాయలిత్తుమన్న సాలున రెండునూర్లిచ్చినారు. ధాన్యమిత్తుమన్న సాలున నొక్కముప్పదిబస్తాలును మాత్రమే యిచ్చినారు. పిమ్మట రెంటికిని సున్నయే చుట్టినారు. వీరిని గురించి యింతకన్న విస్తరించి చెప్పవలసియున్నను గ్రంథవిస్తరభయంబున నింతటితో నీవిషయము విరమించి ప్రకృతమునకు వచ్చుచున్నాను.

—ముక్త్యాలసంస్థానాశ్రయము.—

ఊర్లామునుండి రాజమహేంద్రవరమునకు వచ్చినకవిరాజుతోఁటి తన వృత్తి చెడిపోవుటచేతను అనఁగా నచ్చుకూటము పోవుటచేతను, తనపుస్తకము లూర్లాము ప్రయాణములో యథాయథలగుటచేతను, నవుకరీచేసికొనుటయం దిష్టములేనివారగుటచేతను, పరుల నాశ్రయించి జీవించుతలంపులేనివారగుటచేతను, అభిమానవంతులగుటచేతనుమిక్కిలి చిక్కుపడిరని చెప్పుటసత్యదూరము కాదు. అంత మనకవిరాజుగారు తామొనర్పఁబూనిన శ్రీకృష్ణభారత మనుబూరింపవలయుననియు దానికిసరిసాయము గలుగునోయని పిఠాపురము మొదలైన గ్రామముల కరిగెను. గాని యెందును లాభము లేకపోయినది. దానికై భద్రాచలము జమీందారులగు శ్రీరాజాపార్థసారథి అప్పారావుసవైయశ్వారావు బహద్దరువారొక్కవేయిరూప్యములొసంగిరి. గుంటూరు సర్కిలు నందుస్కూళ్ళయినస్పెక్టరుగానున్న మంథపూడి కామేశ్వరరావుపంతులుగారు మనకవిరాజుగారికిష్టులగుటచే నెల కటువదిరూప్యముల వేతనముగ నుపాధ్యాయపదవి నిప్పింతుము రావలయునని కోరినను వీరు తమకది యిష్టములేమిఁ జేసి పోయియుండలేదు. వారాలో రెండుమూఁడుసారులు రాజమహేంద్రవరమునకుఁ వచ్చి పని యిప్పించెదను రావలయునని నొక్కిచెప్పిరి. మఱి పదిదినములలోఁ దప్పక రాఁగలనని వారికి మనకవిరాజు బదులుచెప్పె అంతలో ముక్త్యాల దొరవారుత్తములని విని వారి దర్శనము నిమిత్తము కొంత ప్రయత్నముచేసి గుంటూరులోఁ జిరుమామిళ్ళ కాసుప్రసాదరావునాయుడుగారితోఁ బోవనిశ్చయించియు నుత్తమునియొద్దను మఱియొక్కనితో వెళ్ళనవసరములేదు. అనుత్తమునొద్దకు మఱియొక్కనితో

గ్రామములో నిలిచినారు తాను శిష్యుండును నడచి ముందుఁ బోయిరి. అప్పుడు వీరియొద్ద రైలుసంచులలో రెండువేల రూప్యములకుఁ దక్కువకాని సొమ్ములు వస్త్రములు నున్నవఁట! ఆ మధ్యాహ్నమున నెటనో వండుకొని యింతటిని నాలుగు గంటల కొక పల్లెం జేరిరఁట! అక్కడకు ఖమ్మముమెట్టు 10 మైళ్ళ దూరమునగ నున్నది. సూర్యుఁ డస్తమించుచున్నాఁడు ఆమార్గములో నిటునటుం గొండలుగలచోట దొంగలు మనుష్యుల నఱకివేయుచున్నారు. ఆ తావు మిక్కిలి గా నున్నది. అట్టిచో నా పోవుపల్లెలోని గొందఱు "అయ్యా మీరు ఖమ్మముమెట్టునకుఁ బోఁజాలరు. నడుమ దొంగలున్నారు మిమ్ము నఱకివేయుదురు మీసొమ్ములు హరింతురు. ఈ రాత్రి యిటనుండి పో[illegible]గానో చెప్పిరఁట! కాని శాస్త్రిగారట్లు చేయ లేదు. కారణమేమనఁగా [illegible] ఘాతుకులు దొంగలు వీరిని పోవద్దని తమయూరిలో నిలిపి రాత్రి [illegible]. ఈసంగతి మనకవి యెఱుంగును. అప్పుడు వారితో దొంగలు మమ్మేమి చేయుదురు? మాకడ నేమి యున్నది? (రైలుసంచులం జూపి) ఇదిగో గుడ్డపీలికలివి మా జోలికి రాఁకుడు. మీకుఁ గావలెనన్న నివి తీసికొండని చెప్పినాము" అని రైలు సంచులుక్రిందఁ బెట్టికొట్టెనఁట! అందువలన వాండ్రు వారియొద్దనేమియు లేదని నిర్ణయించుకొనిరఁట! (ఇట్లు తెలిసికొనిన వీండ్రే ఖమ్ము దారిని నాగస్టుయొద్దకు బోయి బాటసారుల వేధించి సొమ్ము గ్రహింతురు) అట్లు చెప్పి మాకేమియు భయము లేదని మనకవిరాజు శిష్యునితోఁ గదలి నడచెనఁట! అట్లు చేయకున్నచో నారాత్రి యాపక్కసంబునఁ జచ్చుటయే నిశ్చయమగునని నాతోఁ జెప్పిరి. కొండల నడుమఁ జావు సందేహమని సాహసించి సూర్యుఁడస్తమించిన కొంతవడికి మీఁదఁ జెప్పిన కొండలనడిమికిఁ జేరినారు. మనకవిరాజునకు ధైర్యమే కాని ఏమి జరుగునో యని భయమును గొంత గలదు. అప్పుడేమియుం దోపక కొండలు పగులునట్లు "లావొక్కింతయు లేదు" ఇత్యాది పద్యములు చదువ నారంభించినారు. ఈధ్వని పైనఁ జెప్పినపల్లెకు వినవచ్చును. దొంగలెవ్వరును రాలేదు. కొండలదారి దాఁటవచ్చినది. అంతలో మనకవికిఁ బెద్దభూతమువలె నెదుట నొక నల్లని పదార్థము కానవచ్చెను. అది యేమియో? దొంగలగుంపో యని మిక్కిలి భయపడుచుండెను. అట్లుండఁగా "కోఁకోఁ" అను శబ్దము వచ్చినది. అది విని నాగే! దొంగలు వచ్చుచున్నారు మన పని నేటితో సరి! అనుకొని మనకవిరాజు "[illegible]" అని బోలు జెప్పెను. అంత మఱియు "ఖబర్ద

వెళ్ళనవసరములేదు. ఎట్లుకొందలందియున్నదో [illegible] కవిరాజు స్వీయ ముగా బయలుదేరి జగ్గయ్యపేటకు వెళ్లి యట మిత్రుఁడైన [illegible] మృత్యుంజయ శాస్త్రిగారిం దోడ్కొని [illegible] గ్రామమునకు వెళ్ళి [illegible] మృత్యుంజయ శాస్త్రిగారివలన [illegible] యట నెనిమిది దినములు విశ్రమించిరి. రాజు గారి దర్శన [illegible] నొకనాఁడు తత్పరిశ్వరుండగు [illegible] రెడ్డి శ్రీ [illegible] బహద్దరు మన్నె సుల్తాన్ [illegible] లును వెలగల కొన్ని వస్త్రములు [illegible] లిచ్చునట్లు చెప్పి గ్రంథము పూర్తిచే [illegible] వేయ [illegible] మొదలుకొని మన కవిరాజుగారు ఉల్లా [illegible] సంకమును గృష్ణ గోదావరీ జలంబులం [illegible] నివసించి శ్రీకృష్ణ భారతంబను పేర శ్రీమహా [illegible] రని నానంతో షమిట్లు వెల్లడించుచున్నాను.

[illegible]

మనకవిసార్వభౌముఁడొక [illegible] కల్లూరను గ్రామంబున కేగి యటఁ [illegible] దినంబులుండె [illegible] "కల్లూరప్ప" శతకమును జెప్పి నారు. అది యరణ్యప్రదేశమగుట [illegible] ఒక్కొక్క కష్టముగాఁ దోఁప నట నుండి నడకదారిని రాత్రి [illegible] పట్టుపట్టి కల్లూరులోఁ దెల్లవాఱుజామున [illegible] తుపాకీలవా రితోఁ బయనము చేయుచుండగా వీరును శిష్యులును వారితోఁ బయనమైరి. మార్గమధ్యమందు నొక లోయనుండి పదుగురుం గలసి నడచు చుండిరి. అంతలో వేటకారుఁ పులిజాడలగపడుచున్నవనియు నది మనముందరనే యుచుచున్న దనియు నిశ్చయించిరి. మనకవి తా నరణ్యములో నుండు పులిని జాడ నెంచి యున్నవారు కావున నాజాడ లెట్లుండెనో పరీక్షించుచు నడువఁజొచ్చె. అంత లో నింతసమీపమునఁ బులియొక్క కేక వైచి యిటునుండి యటు లోయలో నున్న మనకవి నెత్తిమీఁదనుండి దుమికి పాఱిపోయినదఁట! పులి వచ్చినప్పు డెట్టివారికిని భయము పుట్టుట సహజము మనకవికి భయమున్నది యెట్లుండునో యనునట్లుండుటయే కాక "అయ్యో! పులిని బాగుగాఁ జూడనైతినే" అని వారితోఁ బలికినారఁట! అంతఁ దెల్లవారినది. కరణము లోనగువారు మధ్యమార్గ

దార్ మారుంగ" అని శబ్దము వచ్చెను. అంతమనకవి ధైర్యముతో "ఖమ్మంమెట్టు జానేవాలాహుం" అని బదులు చెప్పుచుండ నల్లగ మున్ను కనుపించిన వ్యక్తి గుఱ్ఱముపై నెక్కిన యొక మనుష్యుఁడు, ముందు తుపాకీని లోడు చేయుచున్న వాఁడొయొక మనుష్యుఁడుగా మారెను. సమీపించిన మన కవిరాజుం బరికించి గుఱ్ఱముమీఁదనున్న వ్యక్తి స్వరమునుబట్టి తెలుఁగుతో "నెవరువారు? కృష్ణమూర్తి శాస్త్రిగారా" అని పలికెను. "అవును మీరెవరు?" అని మనకవి పలుకగా "నేను రివిన్యూఇనస్పెక్టరును హనుమంతరావు" నని పలికి గుఱ్ఱముదిగి "మీరింతసాహసము చేయనొప్పదు. ఈకొండలదారిలో నిన్నను, మొన్నను దొంగలు కొందఱను జంపినారు. ఇట్లేలవచ్చితి"రని హనుమంతరావు యావద్వృత్తాంతమును విని "మీరు రాత్రి రెండు ఖమ్మముమెట్టునకుఁ బోలేరు. దారిలోఁ వేయిమంది త్రాఁగి తాటితోఁటలో నల్లరి చేయుచున్నారు" అని యెంతో బతిమాలెను. గాని కవిరాజు దాని కంగీకరింపక ఆయనవద్ద సెలవు గొని దారిలో నల్లరి చేయువారికి గానుపింపకుండ దారి తొలంగి ముళ్ళలో బాలలోఁ బడి శరీరము రక్తప్రవాహము చేసికొని రాత్రి 12 గంటలకు ఖమ్మముమెట్టు చేరియట ఖిలాలు ఖానాయిజారాదారుగా నున్న గెంటేల వెంకటరామయ్యగారింటికిపో తోల గఱ్ఱలు తీసికొని వాఁకిటిలోనికి వెళ్లినారు. అక్కడ నొక తక్తా వేసియున్నది దానిపైఁ గవిరాజును గుమ్మముతినెపై శిష్యుఁడును మేనులు వైచి శవాకారములై పడి నిద్రపోయిరి. గెంటేల వెంకటరామయ్యగారు మనకవికిఁ గృతపరిచితులు. అంతఁ గొంతవడికి నింటిలో నెవ్వరో తలుపు తీసి శవములవలె పడియున్న వీరిం జూచి భయపడిరి. వెంకటరామయ్యగారు దీపము తెచ్చి మనకవిని పోల్చి లేపిరఁట! కాని యెంత పిల్చినను లేవకుండుటచే "ఈయన యెటనుండియో సాహసము చేసి నడచివచ్చియున్నాఁడు" అని నీళ్ళు కాపించి కొంతగంజి వార్పించి పిమ్మటఁ గుంభకర్ణుని లేపినట్లు లేపి వేఁడినీళ్ళు పోయించి గంజి త్రాగించిరఁట! ఆసంగతి మనకవికి స్వప్నముగ నున్నదఁట. అంత మనకవిని, శిష్యుని మఱియొకయింటిలోఁ బక్కలువేసి పండుకొనఁ జేసిరఁట! వీరిద్దఱును మరునాడు 1 గంటవేళకు లేచిరనియు ఆనాఁటి మార్గాయాసము 10 దినములవఱకుఁ దీఱలేదనియు నీపదినాళ్ళు నక్కడనే యుండిరనియుఁ దెలియుచున్నది.

మఱియు నొకకాలంబున నైజాము సర్కారులోని పెద్దపల్లెయను గ్రామంబునుండి బండి చేసుకొని హనుమకొండపురికి వచ్చుచుండిరి. తనతో బండి

వాఁడు తప్ప మఱియెవ్వరును లేరు. అప్పుడును మనకవియొద్ద వస్త్రములు, శాల్వాలు లోనగునవి వేయిరూప్యముల సొమ్ము కలదు. హనుమకొండకు 6 మైళ్ళ దూరమునకు వచ్చువఱకు రాత్రి 8 గంటలైనది. దొంగలాదారిని మిక్కిలిగాఁ గలరు. అప్పుడు చేయునదేమియుఁ లేక తనపెట్టెలో నున్నవిలువగలబట్టలు లోనగునవి తీసి బండిలోనున్న చొప్పక్రింద పెట్టి పెట్టె మరల తాళము వేసి స్వర్ణపతకములు రెండు మిక్కిలి పెద్దదియైన తనజుట్టులోఁ బెట్టుకొని గట్టిగా దారము గట్టికొనియెనఁట. కొంతదూరముపోగాఁ దలఁచినట్లుగానే దొంగలువచ్చి “బండి ఆపు” అని యెదురుపడిరి. తక్షణము మనకవి బండిదిగి “నేను బ్రాహ్మణుఁడను. కవిని నాయొద్దనేమియు సొమ్ములేదు ఇదిగో చూచుకొనుఁడు నన్నుఁ గొట్టకుఁడు” అని పెట్టితెచ్చి యెదుటఁ బెట్టగా వాండ్రు చూచి అందు చిన్న చెంబు పుస్తకములు కొన్ని సామాన్యపుబట్టలుమాత్రముండగాఁ “ఈయనకయి యంత పాపమీన్నొదిలిపెట్టండిరా” యని యందులో నొకఁడు పలుకగా వాండ్రుబట్టలు తీసికొనక పొమ్మని వదలివేసినారు. ఆసమయములో నట్లు చేయకున్న సొమ్ముపోవుటయే కాక దెబ్బలును దగులుట నిజము. దీనివలన మనకవి సమయజ్ఞతయు, ధైర్యమును బ్రశంసనీయములు.

మఱియొక్కప్పుడు మనకవిసార్వభౌముఁడు కాశీప్రయాణము చేయువాఁడని విని రాజమహేంద్రవరమున కుత్తరముగా నున్న మిర్తిపాటిగ్రామమున మునసబుగానున్న మద్దిపోటు వేంకటరామన్నగారను సంపన్నగృహస్థుఁడు మనకవిరాజునొద్దకువచ్చి “మీరు కాశీకి వెళ్లుచున్నారఁట! నేనును వత్తును. నాకొక మంచి గుఱ్ఱము కావలెను. మీరశ్వశాస్త్రములో నిపుణులు గనుక నాకటనేని గుఱ్ఱమును గొనిపెట్టుఁడు” అని వీరితో వారును మఱికొందఱును బ్రయాణమయిరి. అప్పుడు కటకమువఱకే రయిలు నడుచుచున్నది. నడుమఁ గొంత బండిమీఁదను, కాలువలో బోటుమీఁదనుం బోయి “జట్నీ” యను చోటికిఁ బోయిరఁట! దారిలో వర్షముచేఁ దడిసినారు జట్నీగ్రామమున కింత దూరములో నొక పెద్దబంగాళా కలదు. దాని చుట్టును జెట్లు చేమలును గలవు. మనకవిరాజు మొదలగు వారటకుఁ బోవునప్పటికి పగలు 4 గంటలైనది. గ్రామములో వసతి యుండునో లేదో యట ననుకూలముగ నుండునని గృహపాలుర నడిగి యట వంటకము చేసికొని యాబంగాళా వరండాలో నారాత్రి శయనించిరి. అప్పుడు మన మకవితోఁ ముగురుమగవాండ్రును మఱియిద్దరాడువాండ్రును

గలరు. ఆడువారు దారిలోఁ [illegible] అందొకతె యమునలంపురము తాలూకాలోనుండు నొక విధవ. [illegible] చెల్లినది. [illegible] తొంటి యాభరణము లన్నియుం బుచ్చుకొని [illegible] ప్రచుచున్నది. ఇట్టిం దఱును దమ తమ వస్తువులన్నియు [illegible] బంగాకొనిరి. అప్పుడు వారియొద్ద 4 వేల [illegible] వస్తువులు సొమ్ములు గలవు. చీఁకటిపడినది. కృష్ణపక్షము [illegible] మనవారెవరును నిద్రపోక జాగరూకులై [illegible] పగలు మిక్కిలి వినయముతోఁ మాటలాడిన గృహపాలుఁడు [illegible] వాఁడు కొందఱు దొంగల నేర్పాటుచేసినాఁడు [illegible] మహాకవిరాజు కనిపెట్టి [illegible] జెప్పెను గాని చేయునదియేదియు నెవ్వరికిని దోఁ లేదు. భగవంతుని [illegible] చేసికొనుచుండిరి. రాత్రి [illegible] మైనది. అంధకారబంధురమైనది. దొంగలు [illegible] ముప్పదినలువదిమంది సమీపమందు చెట్లలో [illegible] ఒక నిమేషములో వీరిపైఁ బడి యేమి చేయవలయునో అట్లు [illegible] సింహద్వారములో భయంకరమైన యొకధ్వని [illegible] అది విని మనవారికి గుండెలు బద్దలైనవనుటలో నతిశయోక్తి యుండదు. మనవారు హరిస్మరణము తక్క నితరమేమియుం జేయఁజాలరు. [illegible] గేటుకడకుఁ బెద్దకొండ యేదియో వచ్చుచున్నట్లు నల్లని [illegible] చీకటిలో [illegible] గోచరమయ్యెను. ఆక్షణమందే "చలో" అను శబ్దమైనది. అదియొక పెద్ద యేనుఁగ [illegible] యొక మావటివాఁడును మనవారు పండుకొనుచోటికి ప్రత్యక్షమయ్యె. ఏనుఁగును మావటీనిం జూచినంత మనవారికిఁ బోయిన ప్రాణములు లేచివచ్చినవి. మావటివాఁడు గృహపాలుని [illegible] మనకవిరాజుచెంతకు [illegible] హిందీభాషలో మీరెవ్వరు? అని [illegible] సంభాషణము చేసెను. మహాకవిరాజు వానికిఁ గనికరము పుట్టునట్లు తమసంగతి యంతయుం జెప్పి తమభయమును నెఱిఁగించెను మావటీఁడు మిక్కిలి మంచివాఁడు. దయార్ద్రహృదయుడు. ఆబంగాళా కలకత్తాలోనున్న గృహస్థుఁడైయున్న యొక బంగాళీబాబుది [illegible] యు, [illegible] యేనుఁగువారిదే [illegible] యు, నిటనున్న గృహపాలుఁడు [illegible] యు, [illegible] దనియు, దొంగయనియు, దొంగల [illegible] తో మీవస్తువులు,

సొమ్ములు పోవుటయే గాక మీప్రాణములు దక్కకుండుననియు లోనగు సంగతులు చెప్పగా మనకవి తనకట మొదటను [illegible] జరిగిన సంగతులును, గృహపాలుఁడు చేసిన చేతలును, దొంగల యాలోచనలును, వారి దురాలోచనములును జెప్పినారఁట! అంత మాచటీఁడు గృహపాలుని బిలిచి "నీప్రవర్తనము బాగుగాలేదు. నీవిషయమై యజమాని యనుమానపడియున్నాఁడనియు, లోనగు సంగతులు చెప్పి "ఇప్పుడీబాటసారుల విషయమై నీవు చేయనెంచిన సంగతియు నాకుఁ దెలిసినది. నీవు పంపిన దొంగలు నేను వచ్చినంతనే పాఱిపోవుటయు నేను గనిపెట్టితిని. ఈసంగతి [illegible] విన్నవించి తగునట్లు చేయించెద"నని బెదరింపగా వాఁడు మనకవి [illegible] వచ్చి "అయ్యా! నేను మిమ్మేమి చేసితిని. వంటకు వసతి గల్గించితిని. పడకకు జాగా యిచ్చితిని ఆదరించితిని. నేను మీకుఁ జేసిన ద్రోహమేమి [illegible] పలికి [illegible] తప్పులేమి వెల్లడించె. అంత సూర్యోదయమైనది. [illegible] లాచరించుకొని మనవారటనే మరల వంటకము చేసికొని మాచటీఁడు [illegible] బహుమానమొసంగి స్టేషన్‌కు వచ్చి రైలెక్కి మఱునాఁడు [illegible] జేరిరి. అచవలటఁ జేయవలసిన కృత్యములు చేసి రాత్రి [illegible] అలహాబాదుస్టేషనుకు వచ్చువఱకు రైలు దాటిపోయినది. మరల [illegible] గంటకుఁ గాని కాశికిఁ బోవు బండిరాదు. తమ సామగ్రియంతయు స్టేషనుకడ మైదానములో గుట్టఁగా బెట్టి తక్కినవారి నందఱ నట నుంచి [illegible] తానును మునసబును అలహాబాదు చూచివత్తము రైలు [illegible] వేళ కని యొకఘుట్కాబండిని మాట్లాడుచుండి రంతలోఁ బోలీసుజవా[illegible] మిమ్ముఁ బోలీసిన స్పెక్టరుగారు పిలుచుచున్నారు. రండు" అని పిలువఁగా "[illegible] స్పెక్టరు పిలిచినప్పుడు పోకుండరాదని వీరిద్దఱు నతనితోఁ గదలిరి. ఆపోలీసుబంటురౌతు వీరిని స్టేషనుకుఁ గొంతదూరములో నున్న నొక యింటికిఁ [illegible]కొనిపోయెను. అట చిన్న కిరసనాయిలుబుడ్డిదీపము మిణుకు మిణుకుమని యున్నది. దానిప్రక్కఁ గొందరు తురకలు కూర్చుండిరి! అందొకఁడు తురుష్కభాషతో "మీరెవరు? ఇంత రాత్రివేళ నెక్కడకుఁ బోయెదరు? మీరు దొంగలని తోచుచున్నది. మిమ్ము విచారింపవలెను" అనెను. అనఁగా మనకవి "మేము దొంగలము గాము. రాజమహేంద్రవరము మాకాపురము. నేఁడు ప్రయాగనుండి వచ్చితిమి. కాశికిఁ

బోవుచున్నాము రైలు మేమువచ్చువఱకు దాటిపోయినది. మరల 1 గంటకు వచ్చు రైలుమీఁదఁ బోఁదలఁచితిమి. ఈలోగా అలహాబాదు మేమిద్దఱమును జూచి ... చి బండి మాటలాడుకొనుచున్నారు" అని చెప్పగా నాదొరంగ యినస్పెక్టరు "జవాను! వీరిద్దఱను నేటిరాత్రి జైలుఖానాలో వేయుము. రేపు విచారించెదను" అనెను. అంత మన కవి కోపావిష్టుఁడై "మేము జడిసి నీకు చేదేవి యిచ్చుకొంటి వేమో? మేము దొంగలమా? ఎట్లు జైలులోఁ బెట్టుదువు. ఈతఁడు లబ్ధాధికారి. మిమ్మెట్లు చేయవలయునో అట్లు జేయకమానము. మీ రెవ్వరో తెలియదు. మీరు ప్రశ్నలేదు. మీరినస్పెక్టరని తెలిసికొనుటకు వీలు లేదు. మీరే దొంగలని యూహింపవలసియున్నది." అని జేబులో పిన్సిలు కాగితము తీసి "మీరెవరో తెలియకున్నను ఈతఁడు పోలీసుబంట్రౌతు కానిండు" అని వాని నెంబరు నోటు చేసికొనెను. అంతలోఁ బోలీసువాఁడు గడగడవడక మొదలుపెట్టెను. అంతలోఁ లిచుండి మఱియొక పోలీసువాఁడు వచ్చి "అయ్యా వీండ్రు పిల్లవాండ్రు తెలియక మిమ్ముఁ బిలిచినారు క్షమించి దయచేయుఁడని మెరొన్నవిధములఁ బ్రార్థించి పీడకొనిపోయి దల్లాలిర్వురు. పిమ్మట వారు మనకవి రాజును సాహసినియున్న చోటికిఁ దీసికొనివచ్చి యొకచాప తెచ్చివేసి యుంచు గూరుచుండఁబెట్టి రైలు వచ్చువఱకును గలిసియుండి మన వారి వస్తువులన్నియు రైలు రాగా దానిలోకి కెక్కించి మాలిమిని చేసి పంపుగొనిపోయిరని మన కవి నాతోఁ జెప్పినారు పరదేశములో నెంతో ధైర్యమున్నఁ గాని యిట్లు చేయుట దుర్లభమని నయభిప్రాయము.

చిత్రభాను సంవత్సరములో నొకచిత్రము జరిగినది. కాటవరములో మన కవిరాజున్న కాలమున నొకనాఁడు పేటనుండి యొక వెఱ్ఱియావు వచ్చినది. అది యంత పెద్దది కాదు. వీధిలోఁ బడి కొన్ని దూడలను గుఱ్ఱాలను గఱచియల్లకల్లోలపెట్టెను. జనులందఱును జెందరి వఁదరగాఁ బరువులిడఁజొచ్చిరి. అప్పుడొక పెద్ద యరుగుపైఁ గొందఱుండ నట కాయావు వచ్చి వారిని గఱచుటకుఁ బ్రయత్నించుచుండెను. వారెత్తు మీఁదనున్నారు. ఆవున కందుటలేదు. ఆవు వారినిబగబట్టి యున్నది. ప్రజలపైఁ జూపు పెట్టియున్నది. అందున్న మనకవిరాజుగారు దిగి వెనుకతట్టునుండి వచ్చి సాహసించి దాని రెండు కొమ్ములుం బట్టిదానికిమొక్కుతాడు వేసి బిగించి యంత మఱికొందఱ సహాయంబున నట నున్న చెట్టునకుం గట్టిపెట్టెను. ఆవుమిక్కిలి చిక్కి శల్యావశిష్టముగానున్నది. గడ్డిమేయుటే బహు

కీళ్లు కొంపవలెను. వరుసగా నన్ని నాళ్లలో నది దప్పినది. దానిచే గఱువఁబడిన మూడలు, చెక్కలు మొదలగునవియును వెళ్ళియొత్తి దప్పినవి. బక్కచిక్కిన యావునుబట్టి కట్టుటంత సాహసకార్యమా యందురేని జనులందఱు భయపడి పాఱిపోవుచున్నప్పుడు అట్టియావునుబట్టి కట్టుట సాహసకార్యమని నాయభిప్రాయము. మఱియు నొకకాలమున మనకవిసార్వభౌములు నైజాముదేశములో నున్న కొత్తపల్లి యనుగ్రామమునుండి రెండెద్దులబండి (చిన్నచక్రములుకలిగి చక్కని గూడుగలిగియుండు. దానిని కచ్చడమందురు) చేసికొని పదిమైళ్ళదూరములోనున్న మఱియొకగ్రామమునకు మిత్రదర్శనార్థముపోవుచుండిరి. దారిలో నొకవాగు నిండి పాఱుచుండెను. ఆవాగులో నొకపెద్ద దిగుడుబావియుండి వేసవికాలము జనులకు నీళ్ళిచ్చుచుండును. అప్పుడు వర్షకాలముగాన దానిమీఁద నొక గజమెత్తుగా నీరున్నది. బండివాఁడది యెఱుఁగక బండిని దిగుడుబావిలో పడవైచెను. ఎద్దులీఁతగొట్ట మొదలుపెట్టెను, బండి మునుఁగఁజొచ్చెను. అప్పుడు మనసాహసికుఁడు ఎద్దులపగ్గములఁ బట్టుకొని నీటిలోదుమికి ఆవలియొడ్డునకీఁది నీటిమట్టమునకు సుమారు గజమెత్తుననున్న యొడ్డెక్కి యెట్లో యెద్దులను, బండిని బండివానిని, బండిలోనున్న తనశిష్యుని ఒడ్డెక్కించెనని వినియుంటిని.

మనకవిరాజునకు ౩౦ సంవత్సరములు వచ్చినపుడు కోటవరములోనుండిన కాలమున పెద్దవరదవచ్చి గోదావరి యిద్దరద్దులు మోసి మిన్నుముట్టి యున్నది. అప్పుడు చిన్నపిల్లలు విలాసముగ నీమట కేర్పడియున్న చిన్నతెప్పకొయ్యను స్నానమునకేగుచోఁ జంకనఁబెట్టుకొనిపోయి యేటిలోదిగి రెండుబారలు వేసినంతలో నొకసుడివచ్చి మనకవిరాజును నీటిలోముంచి రెండుమైళ్ళదూరములో తేల్చినది. అప్పటికి మనయీతగానికిఁ గాళ్ళు, చేతులు నాడకుండెను. కాని తలమాత్రము తేల్చఁగల్గిన తెప్పకొయ్యను విడువకుండెను. అప్పుడాదారినిపోవు తోట్టివనవయ [illegible] గలవాఁడు మనకవిని పట్టుకొని పడవమీఁదఁ బెట్టి యొడ్డుకేర్చెను. మఱియొక కాలంబున మానిహారతిత్రిమైన సోమపురమునఁ గార్తికపూర్ణిమనాఁడటనున్న గంగకీనదిలో స్నానమునకుదిగగా నదికత్తిరియొక్కగుట్టచే లోనికీడ్చివేసెను. మనకవి కీతవచ్చునుగాని ఆనీరు శరీరమునకు కట్టెవలెం జేసినది. కాలుసేతు లాడకపోఁగా అంత [illegible] పోయినంతలో దైవానుకూలమున గట్టునకుఁ ద్రోయఁబడె. ఇట్లాయన కెన్నో గండములు తప్పినవి.

ఈనడుమ (14—10—10) శుక్లనం॥ ఆశ్వయుజ బహుళపక్షములో తమగృహమున నిద్రించుచుండ నొకనాటి రాత్రి 1 గంటయైనప్పుడు దొంగలు పడి గదిలోనున్న ట్రంకుపెట్టెను (అందు వెండిపాత్రములు, పట్టువస్త్రములు, నగలు కలిసి వేయిరూప్యములకు మించినసొత్తుగలదు) తీసుకొనిపోయి వీథిలోనికిఁ బోవుసందులో పెట్టి రెండవపెట్టె నిమిత్తము మరలలోనికి దొంగవచ్చెను. మరియిద్దరుదొంగలు వానితోవచ్చి, వీథిలో కావలియున్నట్లు తరువాత తెలియవచ్చెను. రాత్రి 2 గంటలు కొట్టునంతకును మేలుకొని గ్రంథరచన చేయు నభ్యాసముగల మనకవికి మొదటిపెట్టెను కదిపినప్పుడే చప్పుడు వినవచ్చెనుగాని యెలుకలేమో యని లేవలేదు. పెట్టెసందులో పెట్టినప్పటి శబ్దమువిని, ఇదియేమి సందులోఁ బెట్టెచప్పుడగుచున్నది, అని కన్నువిచ్చి చూచునంతకు దీపము గానరాలేదు. (అప్పుడు తాను తనభార్యయు, తనదౌహిత్రుడు మాత్రమే యింటిలో నుండిరి) అంతలో భార్యనులేపి దీపమేది యని యడుగగా నామె దీపమీగదిలోనికివచ్చినది. అని తొట్రుపడెను. తత్క్షణము మనకవిగారు లేచి, గదిలోనికిఁ బోయి దీపము పుచ్చుకొని సందులోనికి నడచెను. దీపమునకు వెళ్లినపుడు రెండవపెట్టె నిమిత్తము వచ్చి నకుకులగదిలోనే తలుపుచాటున దాగి యుండినదొంగ కవిరాజు సందులోనికిఁ బోవుటచూచి పారిపోవుచుండగా కవిరాజుగారియు జమానుగాలు దొంగనుజూచి "ఇదిగో పారిపోవుచున్నాఁడ"ని యొకకేక వైచెను. అదివిని మనకవిఁ జేసరొకొని వానిని సందిట నిరియఁబట్టెను. దొంగ ముప్పదిసంవత్సరముల యీడుగలవాఁడు. అట్టివానికి 2, 3 సార్లు జైలులో బడ్డవాఁడు, గొప్పరౌడీ అన్నము బాగుగా త్రాగియున్నవాఁడు. తప్పించుకొని పారిపోవుటకెంతయైనను ప్రయత్నించినవాఁడు కాని వజ్రపంజరములో బడినట్లు మనకవిగారి సందిటఁబడి కదలలేకపోయినాడు. ఆపెనుగులాటలో వారిరువురును మందువాలోఁ బడినారు. మనకవిరాజునకు శరీరమంతయు రక్తప్రవాహమైనది కాని దొంగను విడువలేదు. అంతలో నెదుటనున్న వారిముద్రాలయములో పండుకొనియున్న వారిమేనల్లుడు వచ్చి తమకు తోడ్పడగా అప్పుడే వానినీడ్చుకొనిపోయి పోలీసుస్టేషనులో నప్పగించి తెల్లవారునప్పటి కింటికివచ్చిరి. పోలీసువారు వానిపై కేసుచేయగా మేజస్ట్రీటు వానికిఁ దొమ్మిదిమాసములు కఠినశిక్ష విధించినాడు. మనకవిసార్వభౌమునకు మెచ్చి గవర్నమెంటువారు 10—0—0 లు గ్రాంటుగా నిచ్చిరి.

మఱియు నిట్టివి యెన్నియో సాహసకార్యములు మనకవిరాజుగారు నెఱపియున్నారు. వారికి కలరాయన్నను దయ్యమన్నను భూతములన్నను ప్లేగన్నను భయములేదు. కలరా మొదలయిన రోగములు వచ్చువారి యిండ్లకు నిర్భయముగాఁ బోయి విచారించి వచ్చునాచారము కలదు. కాటవరములో వీరున్నప్పుడు పదిమైళ్ళలో నున్న వంగలపూడియను గ్రామమున కొకనాఁడువెళ్ళి అక్కడ పంతము వెంకన్నగారను ఋణదాతతో మాటలాడుచు సాయంకాలమువఱకు నటనుండి "ఈరాత్రి యిటనుండి మఱునాఁడు పోవలయు"నని వెంకన్నగారెంతనిర్బంధించినను నిలువక యింటికిఁ బ్రయాణమైవచ్చుచుండ రెండుమైళ్ళునడచి వచ్చువఱకుఁ బొద్దుగ్రుంకినది. చీఁకటి వచ్చినది. అంతలోఁ బెద్దమబ్బుపట్టి వాడివాన గురిసినది. మనకవిగారి బట్టలన్నియుఁ దడిసినవి. చలి వదవద లాడించినది. కన్నుమిన్నుమన్ను కానరాకుండెను. నడచుదారి పెద్దపోతగట్టగుటచే కాలుజారి దారిలోఁ బెక్కుసారులు క్రిందఁబడుటయుఁ దటస్థించినది. అప్పుడు కలరా వ్యాపించి ప్రతిగ్రామమందును బ్రజలను మ్రింగుచున్నది. దారిలో ప్రతిగ్రామమందును రోదనధ్వనులే మనకవికి వినవచ్చెను. అట్టి పమ్మచీఁకటిలో నెట్లో నడచి కాటవరమునకు మైలుదూరములోనున్న ముసికూడలి యను గ్రామము సమీపమునకు రాగా నట నాల్గుచితులు వెలుగుచున్నవి. (కలువురుమనుష్యులు కలరాచే మృతినొందగా వర్షము వెలిసినపిమ్మట దహనసంస్కారము చేయఁబడెరి. శరీరములింకను, గాలనిస్థితిలో నపుడున్నవి.) ఆచితులవెలుఁగుఁ జూచి మనకవి భయపడలేదు. అప్పుడా చితులనడుమనుండి పోయి చలిగొట్టియున్న తనశరీరమును గాచుకొని వస్త్రములు తడియార్చి కట్టుకొని 2 గంటలవేళకు నిల్లు చేరెనని తెలియుచున్నది. ఇట్టిధైర్య వంతుఁడును జేయఁజాలఁడనుట సర్వజనైకవేద్యము. ఇత్యాదులవలన మనకవిరాజునకుఁ బిఱికితనము యేకోశమందును లేదని ముమ్మాటికిం జెప్పవచ్చును.

మంత్రశాస్త్రము.

మనకవిసార్వభౌములు మంత్రశాస్త్రములో పాదుకాంతదీక్షితులనియు మహాసామ్రాజ్యాభిషిక్తులనియు నే వినుచున్నాను. ఉపనయనమునా డుపదేశ మొందిన గాయత్రీమహామంత్రమునందు భక్తితాత్పర్యము కలవారై చాలకాలము

ప్రత్యహము సహస్రగాయత్రీ మంత్రజపము చేసి దేవి యనుగ్రహము కలిగించుకొనిరనుట నిర్వివాదాంశము "గాకారం త్రాయత ఇతి గాయత్రీ" జపము చేసినవారిని రక్షించునని బిరుదనామము నొంది "వేదమాతాచ గాయత్రీ మంత్రమాతా షడక్షరీ" అనున్యాయమున సవితృదేవతాకమైన సావిత్రిం జపించుటం జేసియే వీరికిట్టి మహోన్నతస్థితి గలిగినదని చెప్పవచ్చును. ఈగాయత్రీప్రభావముచేతనే వీరికెప్పుడు నెట్టిగ్రహబాధయు తటస్థింపలేదు. వీరు పుట్టినదిమొదలు నేటివరకు నెప్పుడు లంఘనము చేసియెరుఁగరు. జ్వరమువచ్చినదని తెలిసినప్పుడు వేడియన్నముమీద గేదెపెరుగు వేసికొని తిని దుప్పటము కప్పుకొని పండుకొని నిద్రపోవుదురట. కొంతసేపటికి బట్టలన్నియు తడియునట్లు చెమటలు పట్టి జ్వరము జారుననియు, అప్పుడే తిరుగుదురనియు తెలియవచ్చెడిని. మరియు మనకవి 'షడక్షరీ" అనగా నోంకారసహితమగు పంచాక్షరి తనవిద్యాగురువగు నివటూరి నాగలింగారాధ్యులవారియొద్ద నుపదేశము నొందనెంచి కొందరు పెద్దలతో జెప్పగా వారు "నాగలింగశాస్త్రిగారు రసజ్ఞులు, వారియొద్ద యంత్రోపదేశము నొందగూడదు" అని చెప్పినను వినక 'శైవునొద్దనే శైవమంత్రముపదేశ మొందవలయు, విద్యాగురువునొద్ద నుపదేశము నొందుటయు విశేషము." అని నాగలింగశాస్త్రిగారియొద్దనే షడక్షరి నుపదేశము నొందిరి. అంతఁ గొంతకాలమునకు భద్రాచలమునొద్ద పెక్కువర్షములు పిండిమాత్రము దిని తపస్సుచేసి పిండిశాస్త్రులుగారని పేరుపొందిన యొకబ్రాహ్మణోత్తముఁడు సాక్షాత్పరమేశ్వరునివలెఁ దమగృహమునకు రాగ వారిని దమయింట గొంతకాలముంచుకొని వారివలన శ్రీ బాలాత్రిపురసుందరీ మహామంత్ర ముపదేశము నొందిరి. ఈ బాలాత్రిపురసుందరియే వీరి కిష్టదైవమని "శ్రీ బాలాత్రిపురసుందర్యై నమః" అని వీరు గ్రంథాదిని తప్పక వ్రాయుచుంటవలనఁ దెలియవచ్చుచున్నది. కాలాంతరమున వీరు శ్రీబోధానందభారతిమహాంశాచార్యులవారియొద్ద రాజశ్యామల నుపదేశము నొందినట్లు తెలియఁగలదు.

వీరికి దుష్టులవలనం గలుగు ప్రయోగాదిబాధలుండవని నేనెఱుంగుదును మన యవధానిగారొకప్పుడు మానుకొండపురమునందలి హైస్కూలులో నవధానము చేయుచుండగా నాయూరిలో మహామాంత్రికుఁడని, ప్రయోగములు

చేయువాఁడని యెల్లరకు భీతికలిగించు నొకవైష్ణవునితో వాగ్వాదము కలిగెను. 'వానితో కలహింపవలదు. వాడు కడ్డవాఁడనియు, ప్రయోగములు చేయునని యు, తనమిత్రులు చెప్పినను వినక మనకవి వానితో ప్రతిఘటించి యువిధానము నిర్విఘ్నముగా సాగించి ఆ రాత్రితనబసలో నిద్రించుచుండ రాత్రిరెండు యామ ములైనప్పుడు కెవ్వున కేకవైచిరి. అదివిని యింటిలోనివారందరును లేచి మన కవి రాజునొద్దకువచ్చి చూచి "ఇది వైష్ణవుని ప్రయోగమే" యని భయపడసాగిరి. అంతలో మనకవి మేలుకాంచి "మీరు భయపడవలదు. నా కేమియు భయము లేదు. ఇది ప్రయోగము కాదు. ప్రయోగములు నాదరికి రావు" అని చెప్పితన వీపుపైనున్న దెబ్బను (అరచేతితో గొట్టగా బైకి తేలినబొబ్బ) వారికి చూపి "మీరుపోయి పండుకొనుడు" అని వారి వెళ్ళనంపిపుచ్చి తానప్పుడు స్నాన ముచేసి, శుచియై బాలామంత్రమును జపించుచు దెల్లవార్చెనట (మనకవిసార్వ భౌము డీనాడైన ప్రమాదమువలన నశుచియై బాలను జపించినను, ఏ దేని యుపచారము చేసినను బాల బాలికారూపమున స్వప్నదర్శనమిచ్చి తప్పుజేసిన బిడ్డనుఁ దల్లి శిక్షించునట్లు శిక్షించునట, పైనజెప్పిన వీపుమీఁదిదెబ్బ బాలాత్రి పురసుందరి చేతితో చరచిన చరుపే)

ఇట్లు భగవదనుగ్రహపాత్రుడైన మనకవి తనచేతితో విభూతిమంత్రించి యిచ్చినను, జపతీర్థమిచ్చినను పీడలు, పిశాచములు, గ్రహబాధలు, సామాన్య జ్వరములు లోనగునవి నశించునని కొందరు చెప్పగా నేను వినియున్నాఁడను.

ఒకానొక కాలంబున మనకవిరాజుగారు నైజాములోని పెద్దపల్లి గ్రా మమున కరిగి యట దొరగానున్న పోలేపల్లి వేంకటరాజేశ్వరరావు బహద్దరు వారి దర్శనము జేసియుండిరని చెప్పియున్నాను. ఆసమయములో నొకనాడు దొరగారు మనకవిరాజుం బిలిచి మీరు నాకొకయుపకారముం జేయవలయును. నాపురోహితునికుమారుని బ్రహ్మరక్షస్సు పట్టినది. దానిని మీరు నిర్వర్తింప జేయగలరు, అట్లుచేసి వారివంశమును నిలువఁబెట్టుఁడు. వారి కాయొక్కఁడే కుమారుఁడు అని ప్రార్థింపఁగా మనకవి రాజు 'నేను మంత్రశాస్త్రవేత్తనుగాను నాకేమియు దెలియదు. నేను బ్రహ్మగ్రహమును వదలగొట్టజాలను. నన్నుమ న్నింపుఁడు' అని బదులుచెప్పగా రాజాగారు 'మీరు మాంత్రికులు గాకున్నను

మీకా తంత్రము తెలియకున్నను. మీరింత జపము జేసి తీర్థమిచ్చినం జాలును. అందువలనఁ గ్రహబాధ నివారించునని వారును నేనును నమ్మియున్నాము. అట్లనుగ్రహింపుడని మనకవిరాజు నొప్పించి సమీపమునున్న పురోహితుని గ్రామమునకు మనకవిని దీసికొనిపోయిరి. ఆగ్రామమున కేగునప్పటికి సాయంకాలము కావచ్చినది. పురోహితుని యింటియెదుట జమీాందారుతో మనకవి బండి దిగి గేటుదాటి లోపలికడుగుపెట్టెను. అప్పుడింటియెదుటనున్న వీధివాకిట నొక పెద్దబల్లమీాఁదనలువురు గ్రహముపట్టినవాని నాఁగబట్టికొనియుండిరి. అంతగ్రహపీడితుఁడు మనకవినింజూచి కొండలు పగులునట్లు పెద్ద కేకవైచి "గోదావరివాడా! నిన్ను మ్రింగుదునురా' అని మఱియు నఱచెను. అదివినిన మనకవికి గుండెపగిలినది. పెద్దవిరోచనమైనది. అంత మనకవి నూతియొద్దకుఁబోయి 20 బిందెలు నీళ్ళుపోసికొని బట్టలారవేసికొని మడిగట్టి జపముచేసికొనివచ్చి గ్రహపీడితునొకస్తంభమునకు విరిచికట్టించి ముందొక యంత్రము వేసి జపించుటకు మొదలుపెట్టెను. కొన్ని చింతబరికెలు దెప్పించి కేకలువైచినపుడు వీపుమీాఁదఁ దగిలించెను. ఇట్లు కొంతవఱకు నడిచినపిమ్మట నటనెవ్వరును లేనిజాడఁగనిపెట్టి గ్రహముమనకవిం బిలిచి "అయ్యా! నేనొక బ్రాహ్మణుండను. ఘనాంతము యజుర్వేదము చదివినవాడను. దరిద్రుడనగుటచే కాలపురుషదానముబట్టితిని. దానంజేసి నాకు బ్రహ్మరాక్షసత్వము వచ్చినది. ఈపిల్లవాడు పొలమునకు రాగా నేనొక మఱ్ఱిచెట్టునుండి వీని నాశ్రయించితిని. నీవు ఉత్తమవంశజుఁడవని నే నెఱుంగుదును. నీవు నేను చెప్పినచొప్పున గాయత్రిం జపించి నాకు నాగోత్రనామములు చెప్పిధారవిడువుము. అట్లు చేసిన నేనువీనినివిడిచిపెట్టుటయు కాక నారాక్షసత్వమును బాసి పరమపదము నొందుదును. అని చెప్పగా మనకవి మిక్కిలి విచారించి యట్లుచేయుట కంగీకరించెను. అంత బ్రహ్మరక్షస్సు 6 బీజాక్షరములు చెప్పి అది గాయత్రీమంత్రములో నాలుగుచోట్లయందును బెట్టి జపించుమని యుపదేశింపగా మనకవి యట్లు చేసెనట. నడుమనడుమ అక్షరములు తప్పుచుండ రాక్షసుడే దిద్దుచుండెను. అట్లుసహస్రజపమైనపిమ్మట ధారవిడుచుటకుఁ బూర్వము మఱియు నారాక్షసుఁడు ఇంకనాగోత్రనామములతో ధారవిడువవలెను. పునస్సంకల్పము చేయవలెను, బ్రహ్మరాక్షసత్వ నివృత్త్యర్థమని ధారవిడువవలెను. రేపు వేయిమందికి భోజనము పెట్టవలెను. నేను వదలిపోవునట్లు గుర్తుగా వీధి

గుమ్మటము పగిలి క్రిందఁబడును. అనిచెప్పి ధారవిడిపించుకొని పోయెను. గుమ్మటము విఱిగిపడినది. అంత మనకవి పెద్దపల్లిదొరవారికిం జెప్పి గురునాథ బ్రాహ్మణుని గోత్రనామములతో సమారాధనము చేయించెను. రాత్రి గ్రహము తొలగినపిమ్మట పగ్గములు విప్పింపగా పురోహితునికొడుకు శవాకార మైపోయెను. రెండునెలలకుగాని వానికి శక్తి రాలేదు. ఇట్లు గ్రహబాధ నివారించిన మనకవిగారి కాపురోహితుఁడు వేయినూటపదియాఱులియ్యఁ బోయెను గాని వీరు దానిని నిరాకరించిరని తెలియుచున్నది.

మనకవిసార్వభౌముల యింటిలోఁ గొంతకాలము ఉర్లాం జమీందారు శ్రీకందుకూరి లక్ష్మీప్రసాదరావుగా రున్నపుడు వారికోరికపై వారికొకనాడు గోదావరిలో నాకంఠదఘ్నమగు జలంబున నిలిచి మనకవి బాలా మహామంత్రి ముపదేశించి, దీనిని మీరు దీక్షతో జపింపుఁడు. మీకొక సంవత్సరములో నైశ్వర్యము కలుగు' నని చెప్పిరఁట! వారట్లు చేసిరఁట! తత్ప్రభావముననే వారి కాఱుమాసములలో నుర్లాముజమీందారీ వచ్చినదనివినియున్నాఁడను అట్లేయీ నడుమ శ్రీశ్రీ జయపురముమహారాజా విక్రమదేవవర్మగారికి దైవప్రబోధితులై మనకవిసార్వభౌములు శ్రీ బాలాత్రిపురసుందరీ మహామంత్ర మొక యేకాదశీ దినంబున జయపురములో నుపదేశించినట్లు తెలిసినది. అందున శ్రీవారికి వీరి యందు గురుభక్తి యుండుననుట నిశ్చయము.

—o—

శ్రీకృష్ణకవిజీవితము.

—o—

అష్టమప్రకరణము.

— చెడ్డకాలము —

మనకవిసార్వభౌముఁడు శ్రీమహాభారత మాంధ్రీకరించుచు రాజమహేంద్రవరమున భార్యాపుత్రపుత్రికాసమేతుఁడై సుఖంబుండెనని వెనుకటి ప్రకరణమునఁ దెలిపియుంటిమి. ఆకాలంబున వారికేలోపంబును లేదని చెప్పవచ్చును. ఎక్కడఁజూచినను రూపాయలే. ఏపుస్తకముక్రిందఁగన్నను కరెన్సీ

నొల్లీ పేరటుపు దిగువం దిలకించినను బీతాంబరములే. ఏమూల వీక్షించినను బదార్థనమునయమే. ఇట్లుండి శ్రీకృష్ణభారత మాదిపర్వము మొదలుకొని ద్రోణపర్వము సగమువఱకు నాంధ్రీకరించిరి. అరణ్యపర్వము నాంధ్రీకరించు నప్పుడు ఆధివ్యాధులు కలుగుటయు మాత గతించుటయు లోనగుకష్టములు తటస్థించినని శ్రీకృష్ణభారతమందలి—

మ. ఘనవాతామయ పీడితుండనయి హృద్ఘాతంబునం గుంది మా
తను గోల్పోయి సగోత్రమిత్రహితభృత్యవ్రాత వైరంబు గ
ల్గి నితాంతాత్మ గతార్తినై వెడఁగువోలెం జెప్పనై యిప్పుడీ
వనపర్వాబ్ధి దరించి యిట్లు నినుఁ గొల్వంగంటి లోకేశ్వరా.

ఈపద్యమువలనఁ దెలియుచున్నది. పిమ్మటఁ గొన్నిదినములలోఁ దనకు నెలకు నూటపదియాఱు రూప్యములిచ్చుచున్న ముక్త్యాలసంస్థానాధీశ్వరులకును తమకును ఒక్కింతలోఁ గొంత వైరుధ్యము కలిగినది. కారణ మత్యల్పము. అది విశదీకరించుటంత పోలకున్నను సర్వవిషయములను గోడీకరించి జీవితము కుప్పాయి నాకు నిద్రాహాయుటయే పోలునని తోచినది. మనశాస్త్రిగారు తమ భారతమునందలి ఆశ్వాసాంతమున—

మ. తనయాస్థానికవీంద్ర మాత్రునిగఁ జిత్తంబందుఁ జర్పింప కి
ష్టునిగా మిత్రునిగా గురూత్తమునిగా జుట్టంబుగా నెంచుచున్

ఇట్లు వ్రాసియున్నారు. ఈపద్యము ముక్త్యాలరాజుగారి యశస్సునకు కొంపు గూర్చునదైనను రాజుగారికి గురువుననిపించుకొను నొక మహాపురుషుఁడు తన యశస్సునకెక్కడ భంగముకలిగిపోవునో యని సందియమున రాజుగారియొద్దకుఁ బోయి 'రాజా, కృష్ణమూర్తిశాస్త్రిగారు మీకు గురూత్తముఁడా' అని యేమేమో చెప్పగా రాజుగారు మనకవిరాజుగారికి 'ఆశ్వాసాంతపద్యమును మాకుఁ జూపక ప్రకటింపవలదు.' అని జాబువ్రాయించిరి. అంతఁ గొంతకాలమునకు మనకవిరాజుగారు రాజుగారియొద్దకుఁ బోయి 'అయ్యా ఇష్టునిగా, మిత్రునిగా, గురూత్తమునిగా, జుట్టంబుగా నెంచుచున్' ఇందున్న 'గా' లక్షణమును విచారించినచో అట్టి ప్రేమతో, అట్టిగౌరవముతో, అట్టిభక్తితోఁ జూచుచున్నారని యర్థముకాని మీరు తలఁచినట్లు గురువుగాను, చుట్టముగాను,

దీనికింత రాద్ధాంతమున కవకాశమునులేదు" అని చెప్పిరట. ఇదియే వారిపోరల కు బీజమైనది. ఇదిగాక గురుపరిభృతులవలన మరికొన్ని సంగతులును నడుపబడి నవని వినికి. నెలనెలకిచ్చు నూటపదియారులు పోయి 3, 4 నెలలకు 100, 200 చొప్పునఁ బంపుచు వచ్చినారు. ఇట్లు కొన్నిమాసములు కడచినవి. అప్పటికి అరణ్యపర్వమువఱకు ముద్రితమైనది. విరాటోద్యోగములు వ్రాతయైనది. ము ద్రింపవలయునని రాజునకు మన కవిరాజెన్నో జాబులువ్రాసిరికాని వారుపే క్షించి కొంతకాలము నిలిపి పిమ్మట ముద్రింపదొడఁగిరి. మన కవిమానక భీష్మ పర్వము, ద్రోణపర్వములో సగమునువ్రాసెను.

మ. అతికష్టంబుగ నిట్లుకాలమును ద్రోయంజాలి యున్నప్పుడున్
కృతినిర్మాణము మానకిట్లొ యిరుమూడేపర్వముల్ పూర్తి చే
సితి ద్రోణంబుదొడంగి యార్జునివధంబున్ వ్రాయుచున్నప్డునా
సుతునిం జెంద "హతోసిమేసుత" యటంచున్ ఫాల్గునుండేడిచెన్.

చ. అదిలిఖించు నామనమునందొక సందియ మూవహిల్లె న
య్యదనున నాసుతాయనక యోసుత! యంచు వెలుంగునేయుగా
మొదలిడినాడ నాసుతుడు పొంతవసింపగ రాగ నప్పుడి
ప్పదమున నుండకంచు నెడఁబాపునైన దిగుల్మదిం బడెన్.

ఇట్లు సందేహించుచు గ్రంథనిర్మాణము చేయుచుండె. అంతలో వాలకు లిఖాది రేఖాంచితుండును శ్రీవత్సాంకితుండును నగు మనశాస్త్రిగారి కుమా రుఁడు సువర్ణవసుధికిఁ గుడికాలి మొకాలోఁ బోటుపుట్టి దానిపై జ్వరమువచ్చి తెలివితప్పునట్టి గతిపట్టినది. అప్పుడు మనకవి తగినవైద్యము చేయించెఁగాని దానలాభము లేకపోయినది. కుమారుఁడు మాటలాడుచు మాటలాడుచు రుధిరోద్గారి సం॥ర జ్యేష్ఠ శు ౨ భానువారము రాత్రి దివంగతుఁడైనాఁడు. అప్పుడు మనకవికిఁ గల్గిన దుఃఖ మింతింతయని వ్రాయశక్యముగాదు. కుమారు న కుపనయనకాలము దాఁటినదిగావున అపురఁడించునపుడు వానికి మనకవిరాజు యజ్ఞోపవీతము వేసి చెవిలో గాయత్రి నుపదేశించెనుగాన వాని కంత్యకర్మము యథావిధిగా నిర్వర్తించెను. అది మొదలుకొనియే రాజుగా రొసంగునట్టి ధన ము రాకపోయినది. శాస్త్రిగారి కపస్మారరోగము పట్టినది. భోజనము మానినా రు. కాకినిచూచి 'ఇదియేమి" అని యడుగునంత స్థితిలోనికివచ్చినది. తనకుమా

యేడు మరల జీవించివచ్చునని బూడిదనూసి కొనివచ్చిన్న ఋషిసన్యాసిని సేవించి పోదెను చెప్పువారి నాశ్రయించి యెన్నెన్నో విచ్చికములు చేసినారు. ఆ కాలమున అల్లక వీరభద్రకవి యను నొక దేవాంగి వీరిని కనిపెట్టుకొనియుండి బలవన్మరణము కలుగకుండ కాపాడినారని తెలిసినది. భారతరచన మాగిపోయినది. ఇంటిలో కానిమైనను లేకపోయినది. అట్టి సమయమున నగరముచెంతనున్న అప్పనపల్లెయను గ్రామమునుండి యెప్పుడును కవిని యెఱుంగని మైసరు రాజా యను అల్లూరి వెంకటపతిరాజుగారు కర్ణాకర్ణికగా నీవృత్తాంతమువిని కొన్ని వందలరూప్యములు తపాలుమార్గమున వీరికిఁ బంపించిరి. దానితో కొంత కాలక్షేపము జరుగుట కవకాశము చిక్కినది. అట్టిసమయమున మన కవిరాజుగారికిఁ బూర్వపరిచితులును రాణి నృసింహ చయనులుగారను పూర్వాశ్రమ నామముకలవారును అప్పుడు విరూపాక్ష పీఠాధిపతులు నగు శ్రీశ్రీ బోధానంద భారతీస్వాములవారు. (వీరు జ్యోతిశ్శాస్త్రమందును మంత్రశాస్త్రమందును సంపూర్ణప్రజ్ఞగలవారు.) దర్శనమిచ్చి మన కవిరాజుకొద్దాక్షి రాజమాతంగియను శ్యామలామంత్రము నుపదేశించి "దీనిని జపింపుము. నీకు సర్వార్థములు దీరునని చెప్పిపోయిరట. అంత మన కవిరాజు (వీరు చాలకాలము ప్రతిదినమును బాలాత్రిపురసుందరిని, సహస్రగాయత్రిని జపించుచుండువారు. శ్రీ విద్యోపాసకులగుట చేతనే శ్రీపాదవారని ప్రఖ్యాతిగాంచిన వీరివంశస్థులందరును గాయత్రితో బాలామంత్రమును నుపదేశమునొంది తదనుగ్రహము సంపాదించికొనియుండురని తెలియుచున్నది. అట్లే మనకవికిని గాకున్న యెడల నిన్నిగ్రంథములు రచించి యింత ప్రఖ్యాతినొందుటకుఁ గారణముండదు.) శ్యామలామంత్రము కొంతకాలము జపించి శిష్యసహితముగ పట్టిసాచలంబునకుఁ జని, అట భద్రకాళియెదుట గూరుచుండి పదునొకండు దినములు నిరశనవ్రతంబుపూని జపించి సిద్ధిం బడసె. భద్రకాళియెదుట నెవ్వరును రేలునిలిచి తపింపలేరనియు నట్లు తపించినవారెందరో నష్టులైరనియు ప్రతీతికలదు. కొంతకాలముక్రిందట నొకతపస్విపచ్చి నొకరేయి యా దేవియెదుటఁ దపించుచుండగా నిశీథసమయమున దేవి యాతనిఁగొనిపోయి యేదో లంకలో పారవైచెననియు, అట్లే పోలవరపు సంస్థానాధీశ్వరులు కామాయమ్మగారి భర్త దేవియెదుట నుగ్రజపముఁ జేయుచుండ రక్తముగ్రక్కుకొని మృతిఁజెందెననియు లోనగు సంగతులు చెప్పుదురు. ఇదియంతయు వినియు మన

కవిసార్వభౌముడు తన మేడపై పూజాశాలయం దగుటంజేసి యొకరాత్రి పూజారులకుం దెలియకుండ గుడిలోనికిం బోయి శ్యామలామంత్రముం జపియించుచుండగాం గొంతవడికిం గీచుకయను శబ్దమొండు విగ్రహముందరిని జనించెనియు దానిని సరకుగొనక తదేకదీక్షతో ఱెప్పవాల్పక విగ్రహము నిరీక్షించుచుండగా దేవి నానావిధ రత్నభూషణ భూషితాంగియై దేదీప్యమానముగ వెలుగుచుం జిరునగవుతో నేదియో మాటలాడబోవుచున్నట్లును, ఆమె వామభుజముపైం దన కుమారుడు సుదర్శనుని శీర్షము మాత్రము కానుపించునట్లును తోచెనట. మనకవి పరమానంద మగ్నాంతరంగుడై మంత్రము జపియించుచు నిరీక్షణముచేయుచుండిరట! అంతలో పూజారులు లోనగువారు మన కవింగానక "ఈతని కేమియపాయము వచ్చెనో"యని పదుగురుకలిసి గుడియొద్దకువచ్చి తలుపుందట్టి పెద్దకేకలు వైచుచుం బిలచిరట! అపుడు దేవీవిగ్రహదర్శన మగ్నాంతరంగుడగు మనకవి మాఱుపలికి తలుపుందీయమింజేసి దానిని బవులంగొట్టి లోనికివచ్చి మనకవిరాజు చేతులుపట్టుకొని వెలుపలకు లాగుకొనివచ్చిరంట! అట్టివారేకదా తపోవిఘ్నముచేయు రాక్షసులు. అట్లు వారు ఇంకనొక కొంతవర కుండినచో దేవి ప్రత్యక్షమై మన కవికెట్టి వరములిచ్చునో గదా! అట్లు జరిగినదికాదు. ఈశ్వర సంకల్ప మట్లున్నదని విచారించుచు మనకవి శయన స్థలమునకుంబోయి రాత్రిశేషంబునుగడపి మరునా డరుణోదయంబున పట్టసాచలంబున కుత్తరముగా నాలుగైదు మైళ్ళలో గౌతమీగర్భంబునందున్న మహానందీశ్వరంబను క్షేత్రంబునకుం జని నాటిపవలును రాత్రియుం గడపెననియు, ఆరాత్రి యాకొండపై ననేకమహాద్భుతంబులం జూచెననియుం దెలియుచున్నది. ఇట్లతికష్టంబున మూండువత్సరంబులు కడచినంత "భారతరచన నిలుపవలద"ని పెక్కురు జాబులువ్రాసిరి. అంతలో—

క. తొలిబాములందుం నీశ్వరుగొలిచిన ఫలమునను నాళ్ళు కొన్నరిగినపై
గలవంటిదనుచు సంస్మృతిగలిగె న్విజ్ఞానలవము కడుస్ఫుటముగన్

ఆ. ఒడలుమఱచి నిదురనొందిన మేల్కొనునట్టి జనునకెల్లదొంటి పనులుజ్ఞప్తి
వచ్చునట్లునాదు భారతకృతి మనమునందుదోపవచ్చె నచ్చెరువుగ.

అట్లు విజ్ఞానము గల్గినవెనుక ద్రోణపర్వములోని...ద్వితీయాశ్వాసము ౮౬౫ పుటలో—

ఉ. ఆమొనసింప బలిపరుగదా మనవారతడందుజొచ్చి సం
గ్రామవినోదము న్సలిపి కష్టులచేతికిఁ జిక్కిపోడుగా
కోమలమూర్తికా చిఱుతకుఁ మృతిగాదుగదా తలంప నా
దౌమదిచేయిపెట్టి యనయంబుగలంచిన చందమయ్యెడిన్.

ఈపద్యము మొదలుకొని ప్రారంభించి తక్కిన పర్వములన్నియుఁ బూర్తిగాఁ దెనుఁగుజేసిరి. రాజమహేంద్రవరము, నెల్లూరు, బందరు, సామర్లకోట మద్రాసు లోనగు పట్టణములలో శ్రీకృష్ణభారతాభినందనసభలు పెక్కుజరిగినవి. అనేకులు మనకవిసార్వభౌములకు యోగ్యతాపత్రములు సమర్పించిరి. అవి యన్నియుఁ గవిసార్వభౌమాభ్యుదయమను గ్రంథమున ముద్రింపబడినవి. కావున నిటఁ బేర్కొనబడలేదు.

—౦ పాలకొల్లు సత్కారము ౦—

ఇట్లు శ్రీకృష్ణభారతము పదునెనిమిదిపర్వములు రచియింపబడి మొదటి 5 పర్వములుమాత్రమే ముద్రింపఁబడి యున్నప్పుడు మన కవిసార్వభౌములు పాలకొల్లుపురంబున వైశ్యశిఖామణు లుదారులున్నారని విని యప్పురంబునకుఁ బోయియున్నంత నట హైస్కూలునం దాంధ్రోపాధ్యాయులును సంస్కృతాంధ్ర కవిత్వ తత్వజ్ఞులును పరోపకార పరాయణులు నగు పామర్తి సూర్యప్రకాశశర్మ గారు మన కవిసార్వభౌము నాదరించి యటఁ దమకు చిరమిత్రులును కవితాప్రియులు నగు రేపాకసత్యనారాయణమూర్తి చుండూరినారాయణరావుగార్లతో శాస్త్రిగారివృత్తాంతమంతయుఁ జెప్పి చెరియొకసంపుటమునుముద్రించునట్లుఁ జేసిరి. వారుకృతితాంబూలమునిచ్చు సందర్భములో నూటపదునారు రూప్యములునొక్కొక్కసవరసువస్త్రములు శాలువలు వెండిపళ్ళెరములతోఁగూడనొసంగి ముద్రణార్థము రెండేసివేలనొసంగిరి. కృతిగ్రహణ సమయమందు గొప్ప బహుమానములు చేసిరి. మొత్తము వారిచ్చినసొమ్ము చెరియైదువేలరూప్యములకుమించియేయుండును.

రెండుకృతులు పుచ్చుకొన్నపుడును బ్యాండు మొదలగు వాద్యములతో నూరేగింపు టుత్సవము గొప్పగా జరిగినది. పాలకొల్లు పౌరులేగాక నరసాపురము మొదలగు గ్రామములనుండి పెక్కుమంది పండితులు, న్యాయవాదులు, భూస్వాములు, వర్తకులు లోనగువారు మహోత్సవ దర్శనమునకు వచ్చియున్నారు కిందవకృతి సమర్పణమునకు విశాఖపట్టణమునుండి ప్రభల లక్ష్మీనరసింహము

పంతులుగారును రాజమహేంద్రవరమునుండి ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావు పంతులుగారును వచ్చి యాధిపత్యము వహించిరి. మొదట లక్ష్మీనరసింహము పంతులుగారు మన కవికి "కవిసార్వభౌము" బిరుద మొసంగవలయునని మహోపన్యాసము చేయుచు తీర్మాన మువపాదించిరి. దాని నామోదించుచు సుబ్బారావుపంతులుగారు మొదలగువా రేకగ్రీవముగా నాతీర్మానమును బలవరచిరి. ఆసభలో బండితులు మొదలగువారు సుమారొక వేయిమంది దాని కానందించిరి. పిదప బెజవాడలో నాంధ్రసభవారు కోటిరెడ్డిగారి యాధిపత్యమున మన కవిసార్వభౌము నాహ్వానిం................తేదీని ఆంధ్రసభవారే కవిసార్వభౌము బిరుద మీయదగునని నిశ్చయించి దానికై యొక తీర్మానము చేసి సన్మానపత్రముతోను కాశ్మీరశాలువవచ్చి కవిసార్వభౌమ బిరుదము స్థిరీకరించి యభినందించిరి. అట్టి యభినందనసభలు నెల్లూరు, బందరు, సామర్లకోట, రాజమహేంద్రవరము లోనగు పురములలో మహోన్నతముగా జరిగినవి.

పిదప మరియుం బాలకొల్లులో 11—1—30 తేదీని బురప్రముఖులగు కొందరు మన కవిసార్వభౌమునకు స్వర్ణాభిషేకము జేయుటకు సంకల్పించిరి. ఈసంకల్పము శేషాద్రి సత్యనారాయణమూర్తి చుండూరి నారాయణరావుగార్లు విని మిమిగువ్రము శాస్త్రిగారిచే కృతులనందినవారము మేమే యీ స్వర్ణాభిషేకము జేయుదుమని ... దోహదము ... మీయంగా ... స్వర్ణపుష్పములు జేయించి శుక్ల సంవత్సర పుష్య శుద్ధ ౧౧ శ్రీ (ముక్కోటి యేకాదశి) దినమున శ్రీరామలింగేశ్వర స్వామివారి యాలయమున సభ్యసమావేశమైన ... పండిత వేదశాస్త్రపండితుల సమక్షమున మహాసభలో స్వర్ణాభిషేకము జరిగించిరి. ఆనాడు మన కవిసార్వభౌములు భార్యాసహితముగా నరుణోదయమున లేచి సముద్రస్నానముగ 108 మృత్తికాస్నానములు లోనగు నవి చేసి మేళతాళములు భజనలు మొదలగువానితో దేవళంబునకుజని సర్వప్రాయశ్చిత్తము చేయించుకొని పతివ్రతకు గోదానము లోనగు దశదానములు జేసి యున్నంతట పురోహితులు ... నదీతములైన గంగ, గోదావరి, కృష్ణ, కావేరి సముద్రము లోనగు జలంబులతో, మంత్రంబులతో స్వర్ణపుష్పంబులు చేర్చి సువర్ణక ... తో సామ్రాజ్య పట్టాభిషేక మంత్రములతో

కవిసార్వభౌమ దంపతుల సున్న తాసనములఁ గూరుచుండఁబెట్టి యభిషేకించిరి. అప్పుడొక ఛాయాపటము తీయఁబడెను ఆసర్వజ్ఞ పండితులకుఁ బంచిపెట్టఁబడెను. నాఁడు గోదానాదులకైన ధనమంతయుఁ మన కవిసార్వభౌముల స్వంతమేయని తెలియుచున్నది. ఆసభకు బందరు లోనగు పురములనుండి పెక్కుమందికవులు వచ్చియున్నారు. ఈ విషయములోఁగడ జరిగిన కవిసార్వభౌమ బిరుదాభినందనాది సభలవిషయమును ఆంధ్రపత్రిక లోనగు పత్రికలలో ప్రచురింపఁబడుటయే కాక 'కవిసార్వభౌమాభ్యుదయము' అను గ్రంథములో విస్తరించి వ్రాయంబడుటఁ జేసి నేనిచట విపులముగా వ్రాయక సంక్షేపించితిని.

— పెండ్యాలాభియోగము —

ఇట్లు స్వర్ణాభిషిక్తులైన మన కవిసార్వభౌములు తమప్రారంభించిన భారతరచనము పరిసమాప్తి నొందుటంజేసి కొంచెము విశ్రాంతిగలవారై నిజముద్రాలయమునందు (తమకు లోఁగడనున్న కలావతీ ముద్రాయంత్రము శ్రీ శ్రీ శ్రీ దేవాది యను దేవిడీ ప్రొప్రయిటరుగారగు శ్రీ శ్రీ శ్రీ కందుకూరి బాలసూర్యప్రసాదరావు గారియొద్ద విడిచివచ్చినది మొదలుకొని ముద్రాయంత్రము లేనివారై తాము రచించిన గ్రంథము లెల్లం ముద్రాయంత్రములలో ముద్రించుకొనుచుఁ దమ పత్రికను బ్రచురించుకొనుచుఁ గొన్నికొన్ని నాటకములు, ప్రహసనములు లోనగు చిన్నగ్రంథములు వ్రాయుచు నొక కాలమున మద్రాసునకుం బోయి యట బట్టిప్రోలు రాజాగారు భద్రాచలము రాజాగారు లోనగువారి యనుగ్రహము సంపాదించి ముద్రాయంత్రార్థము కావలసినసొమ్ము సంపాదించి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి కాధనమిచ్చి ముద్రాయంత్రము కొనిపెట్టవలయునని కోరగా వారు వీరిచ్చిన ధనముకన్న రెట్టింపు ధనము వ్యయముచేసి యింగ్లాండునుండి ముద్రాయంత్రముం దానికిందగిన యక్షరములు మొదలగునవి తెప్పించిరి. అవితెచ్చి రాజమహేంద్రవరమునస్థాపించి దానికి శ్రీ లలితా ముద్రాలయమని పేరుపెట్టిరి. అందు వజ్రాయుధపత్రికయేకాక శ్రీకృష్ణభారతమందలి భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు లోనగునవి ముద్రింపించిరి.) తత్కార్యములం జూచుకొనుచుఁ గొన్నికొన్ని చిన్నగ్రంథములు వ్రాయుచు నుండునంతలోఁ బిఠాపురము హైస్కూలునం దాంధ్రోపాధ్యాయులుగా నున్న పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగా

రు మదరాసు లయోలా కాలేజిలో నొక సభయందు మున్ను తాను రచించిన "మహాభారతచరిత్రము" అను గ్రంథమునుండి కొన్ని విషయములు (ధర్మరాజు, శ్రీకృష్ణుడు, వ్యాసులు లోనగువారు నీచజాతివారనియు, కుంతి ద్రౌపది లోనగువారు వ్యభిచారిణులనియు లోనగు సంగతులు) ఉపన్యసించుచు మన కవిసార్వభౌముని పేర్కొని యేవో యప్రస్తుతప్రసంగములు చేసిరఁట! అవి మనకవి పత్రికలలో జూచి కొంచెము వెచ్చగిలిన మదితోనున్న కాలమున పం॥ సు॥ శాస్త్రిగారి మహాభారత చరిత్రము వీరికంటఁబడుట తటస్థించినది. కాని ప్రాంతముగాఁ జదివి యందలి విరుద్ధార్థములకు రోయుచు హైందవ మహాధర్మముల కాకరమైన మహాభారతమునిట్లు పనికిమాలిన గ్రంథముగా వర్ణించి వ్రాసినారనియు, దానంజేసి దేశమునకనర్థ మాపాదిల్లుననియు నిశ్చయించి దానిపైనొక విమర్శన గ్రంథము వ్రాసి వజ్రాయుధపత్రికలోఁ బ్రచురించినారు. అది యాస్తికులకానందదాయకమైనది. నాస్తికులకు దుఃఖదాయకమైనది. పం॥ సు॥ శాస్త్రిగారు వైదికవంశమునందుఁ బుట్టినవారయ్యు సంస్కారప్రియులై సంస్కారప్రియులగు బ్రహ్మసామాజికులు లోనగువారికిఁ బ్రియముగా వారి యనుగ్రహము సంపాదించుకొనుటకై యాగ్రంథమును వ్రాసియుందురు. వారు మనకవిరాజు తమనిరాకరణాగ్రంథములో వ్రాసిన విషయములకుత్తరము చెప్పఁజాలక వ్యక్తిదూషణము చేయుచు మదరాసునందలి సమదర్శనీపత్రికలో మన కవిగారిని, వారి వంశమును దూషించుచు రెండుమూడువ్యాసములు వ్రాసినారు. అదిజూచిన మనకవిసార్వభౌములకు సమర్థసాధికమై రాజమండ్రి సబుకలెక్టరునొద్ద పం॥సు॥ శాస్త్రిగారిపై నొక యభియోగమును దెచ్చిరి. కలెక్టరు దానిందాము విచారింపక రాజమండ్రిలో 1వ క్లాసు హానరరీ మేజస్ట్రేటుగారియొద్దకుఁ బంపివైచిరి. వారు కేసు కొంత విచారించినపిమ్మటఁ గొన్నినెలలపై పం॥ సు॥ శాస్త్రిగారు కొందఱు ధార్మరుల ప్రోత్సాహమున మన కవి వ్రాసిన నిరాకరణాగ్రంథములో నేవో దూషణవాక్యము లున్నవని లేనిపోనివన్నియుఁ గ్రోడుచేసి పెద్దాపురము డెప్యూటీకలెక్టరుకోర్టులో గౌంటరుగా మన కవిమీఁద నొక యభియోగముం బెట్టిరి. మన కవిరాజు దానిని రాజమండ్రిలో హానరరీ మేజస్ట్రేటు కోర్టునకే మార్చునట్లుచేసిరి. (ఈ మేజస్ట్రేటుగారు మున్ను డిప్యూటీకలెక్టరుగానుండి యిపుడు ఉపకారవేతన మందుచున్నవారు. వారికి సంస్కృతాంధ్రములందు విశేష విజ్ఞానములే

దు. "పరోపకారార్థమిదం శరీరం" అను న్యాయమున సుమారు 60 సంవత్సరముల వయస్సు కల్గినవారయ్యును ప్రజాసేవ చేయునిమిత్తము జీతము లేక యీపనికి గుదురుకొనినారు.) పై రెండుకేసులను సార్థసంవత్సర పరిమిత కాలము విచారించి వారికేసునకు వీరికి వీరికేసునకు వారికిని జెరి యిరువదిరూప్యములు అపరాధము విధించినారు. అప్పుడు మహాకవి "అయ్యా నే నప్పీలుచేసికొందును. 50 రూపాయలు జరిమానా నాకు వేయింపుఁడని యెంతకోరినను ఏ కారణముచేతనోగాని తామట్లు చేసినవారుకారు. దానిపై మన కవిసార్వభౌములు హైకోర్టులో రివ్యూపిటీషను పెట్టినారు. అట విచారణకర్త "ఇది విద్యావిషయమైన చిన్నకేసు. హైకోర్టువారికిని కాలహరణముగా విచారింపఁబడనేర"దని విమర్శముగాఁ బిటీషను త్రోసివేసినాఁడు. ఈవిషయ మంతయు పత్రికలలోను మఱికొన్ని గ్రంథములలోను వివరింపఁబడియున్నది. కావున నిట విస్తరింపలేదు. వలయువారు సదరు గ్రంథములు తెప్పించుకొని చూచి తప్పొప్పుల నెఱుంగుదురుగాక.

— మఱియొక కేసు —

పెండ్యాలకేసునకుఁ బూర్వము కొన్ని సంవత్సరముల క్రిందట రాజమహేంద్రవరములో శ్రీ కొచ్చెర్లకోట నరసింహారావుగారు (వీరును మన కవిసార్వభౌములును జాలకాలమునుండి మిత్రులు. ప్రతిదినమును బుకమందిరమునకుఁ బోయి యచటఁ జదరంగ మాడుకొనుచుండువారు. ఒకనాఁడు వీరిద్దఱకును జదురంగ ఖేలనమున వివాదముపడినది ఉభయులు నొకరికొకరు తిట్టుకొన్నారు.) మనశాస్త్రిగారిపై, దన్నుఁ దిట్టినట్లువారు చార్జి పెట్టినారు. ఫిర్యాదీసాక్ష్యమువల్లనే, యీకేసు కొట్టివేయఁబడినది. వీరిద్దఱు నప్పుడే యొకరిచేయి యొకరుపట్టుకొని నవ్వుకొనుచు నిండ్లకువచ్చినారు.

— వ్యయములు —

మన కవిసార్వభౌములు జాతకమెప్పుడును బుద్ధిజాతకమే కాని ధనజాతకము కాదు. జ్ఞానము వచ్చినది మొదలుకొని యిప్పటికి రెండులక్షలరూపాయలు సంపాదించినారని చెప్పవచ్చును. చేతిలోనికి రూపాయివచ్చిన నది వ్యయముగునంతవఱకు మన కవికి నిద్రపట్టదు. వారి ధనమంతయు సద్వ్యయము చేసినారు కాని దుర్వ్యయము చేయలేదని బాసచేసి చెప్పఁగలను. లంకల వ్యవసాయము

చేసినదిమొదలుకొని ఋణములలోనే చిక్కియున్నారు. ఆఋణము తీఱిన మఱియొకఋణము వెంటనే యున్నదనియే గ్రహింపఁదగు. వారే కార్యము నను మహారాజులు చేసినట్లు చేయుదురుగాని సామాన్యులుచేసినట్లు చేయ తమకుమారైలవివాహములకు మూఁడేసివేలు ఖర్చుపెట్టినారు. తమయింట ప్పుడును బదుగురకుఁ దక్కువగాఁ బైవారుండరని నేనెఱుంగుదును. భోజనకి నములందును వెనుదీయక వ్యయము చేయుదురు. అడిగినవారికి లేదనునా కమీయనకులేరు. కవిసార్వభౌమాభ్యుదయములోని కృతజ్ఞతానమర్పణమ నున్న—

మ. తనతోఁబుట్టువు పట్టుకొమ్మనయినం దన్నిప్పు డుం గొల్వఁగొం
డిన నీకొక్కకుఁ గొంతచాలదనుచున్ బీకొటనో నత్రిగ
ల్గినవాఁడంచునొకాని మున్లెగోనఁగా లేకున్ననొం జ్లో ననం
దినఁ బెట్టం దగునట్లుచేయుచు నన్నుం దేలించు శ్రీ వెంకటేదన్.

ఈపద్యమువలన వీరు ధనికులు గాకున్నను భోజనాదినమస్తకార్యమ ులను లోపమెన్నఁడును గలుగలేదని తేటతెల్లంబగుచున్నయది. తనచేతిలోన కానిలేనప్పుడైనను తాను సంకల్పించిన మహాకార్యములు వేలతో నగునవి వేర్పినారని స్పష్టముగాఁ జెప్పఁగలను. మొన్నఁ బుష్కరములలోఁ దీర్థవి జేయవలయునని సంకల్పించినారు. చేతిలో రు 20-0-0 లున్నవి. మరునాఁ కార్యము, ఆనాఁడాసొమ్ము చేతఁబుచ్చుకొని అది యవ్వారుచేసి రు 30-0- పెట్టికొవుదు గొన్నారు. ఆరాత్రి మొన్నారో రు 300-0- లు పంపించినారు. మ నాఁటికార్యము మహోన్నతముగా జరిగినది. ఇట్లే యెల్లప్పుడును వీరికిఁ జరు చున్నది. దరిద్రుఁడనని వీరెప్పుడును భావింపరు. లక్షాధికారిననియే తృప్తినొ దుచుందురు. వీరిపై నిద్దఱుమువ్వురు ఋణదాతలు వ్యాజ్యములు వేసినారు. కా మనకవి యొకదానికినిడానవోయి వాదించియుండలేదు, ఎవరిఋణము నెగఁ ట్టియుండలేదు. కాలదోషములు పట్టిన ప్రామిస్సరీనోట్ల ఋణములును వడ్డీ దీర్చివేసినారు. మఱియు నిప్పటికిని గొన్నిఋణములు మనకవిసార్వభౌమ బీడించుచునే యున్నవి.

వీరికి లంకల వ్యవసాయము మొదలుకొని మొదటో వేలకొలఁది మ్ము బాకీపడియున్నారు. కొందఱుపై వీరు వ్యాజ్యములువేసి డిక్రీలంబొందినా

కాని వారిపాత్రులైన బహుళ వేలములుచేయించి కారిచి బాధింపలేదు. అట్టి సామ్యంతయు వదలుకొనినారు. తమ బంధువు కొందఱికొ బదులని నదులని వేలుగా నిచ్చియున్నారు. కాని వారియొద్ద పరము స్వీకరించినట్లు వినియుండలేదు. వీరేరాజునో ఆశ్రయించి కృతులిచ్చి మాలిచ్చి ధనము స్వీకరింతురుగాని యాన్యులు మాటలుగా సంభావనలిచ్చినను పిలువపోయి పుచ్చుకొనరు. వారిని సరకుగొనరు. ఇత్యాదులంబట్టి మన కవిసార్వభౌముని భిక్షాధికారియని యనక లక్షాధికారియనియే చెప్పచున్నాను.

— నీలాపనింద —

మనకవిసార్వభౌములు రాజమహేంద్రవరమునకు వచ్చిన కొత్తరికములో వారు ముక్కావారి యింటిలో నద్దెకున్నారు. ఆయింటికిం జేరి ట్రైనింగు కాలేజీ రైటరు కృష్ణమాచార్యులుగారు కాపురముండిరి. వీరిద్దఱకు మైత్రికలిగినది. అంతలో కృష్ణమాచార్యులుగారి తమ్మునికూఁతురుకు వివాహము వచ్చినది అప్పుడు మనకవిగారున్న యింటిలోఁ గొంతభాగము పెండ్లివిడిదిగాఁ దీసికొన్నారు. పెండ్లికొడుకు వస్త్రాలపెట్టెలు మొదలగునవి వీరింట నొకగదిలోఁ బెట్టఁబడెను. పెండ్లికొడుకు పెండ్లికూఁతునకు ౫,౬ వందలరూపాయల నగలు పెట్టుటకు నిర్ణయము. ఇట్లుండగా నాదినములలో నొకనాఁటిరాత్రి పెండ్లివారున్న గదికిఁ బుగొండెములాగ వేసినట్లు లోనిపెట్టెలు 2,3 తాళములు వేయక తీసియున్నవఁట! వానిలోని పెండ్లివస్త్రములు విలువగలబట్టలు నేలంబడవేయఁబడియున్నవి. పెండ్లికూఁతునకుఁ బెట్టుటకుఁ దెచ్చిన నగలన్నియు లేవు. దొంగలు హరించిరని నిర్ణయించి పోలీసువారికి రిపోర్టుచేసిరి మనకవిసార్వభౌముని యిల్లు సోదాచేసినారు. మఱియు వారిబంధువులయొక్క స్నేహితులయొక్క గృహములు తనిఖీచేసినారు. ఏమియుఁ గానరాలేదు. కాని యీనీలాపనింద భరింపలేక మనకవి మిక్కిలి పరితపించినారు. దొంగతనము వారింట కుక్కపిల్లకైన లేదని చెప్పనవసర మిట్టిసమయమున మనకవి కెట్లుండునో పాఠకులే గ్రహింతురుగాక. ఇట్లు కొంతకాలము జరిగినపిమ్మట "నిజము నిలుకడమీఁదఁ దెలియు" నన్నట్లు అందలి నిజము దెలిసినది. వేఱు దొంగలెవ్వరును రాలేదు. ఇటఁ బెండ్లికొడుకే దొంగ. వీను ౫, ౬ వందల నగలు పెట్టవలయును గదా! అవి తెచ్చిపెట్టుటకు వీలుకలిగినది కాదు. కాను నగలు తెచ్చితిననియు, అవి దొంగలు హరించిరనియు నొకతంత్రము పన్ని యిట్లుచేసినాడు. ఈసంగతి కృష్ణమాచార్యులుగారు లోపల తెలిసికొని

తెలిసి వ్యర్థంగా నాకప్పగించుమన్నట్లు చేసినందులకు తమలోఁదాము లజ్జించి మనకవిగారి ముఖము చూడలేకపోయినారు. ఒకసమయమునఁ దారసించిన మనకవిగారితో మాటలాడఁబోఁగా ఛీ! ఛీ! మీముఖము చూడరాదు. నిరపరాధినైన నాకింతవ్యసనము కలిగించినారు. ఇకమీకు కట్టికుడువకపోదు. నాతో మీరెప్పుడును మాటలాడవలదు. పుణ్యమునకుఁ బోవఁ బాపమెదురైనట్లు మీకుపకారముగ కీర్తిదెచ్చిన నాకిట్లు మీరు తెచ్చిపెట్టినారని దూషించి వారితో జీవితకాలములో మాటలాడలేదని యొకవింతసంగతి తెలిసినది. ఇట్టివే నీలాపనిందలు. తొల్లి శ్రీకృష్ణుఁడుతనపైవచ్చిననీలాపనిందకు నెట్లుపరితపించెనో దొంగతనమన్న నసహ్యమునొందెడు మనకవియు నంత పరితపించి యుండుననుటకావంతయు సందియములేదు.

— జటప్రోలు సంస్థానము —

కర్నూలునకుఁ గొన్ని మైళ్ళ దూరములో నైజాము రాజ్యమునకుంజేరి జటప్రోలు సంస్థానముకలదు. అది యిప్పుడు సమీపముననున్న కొల్లాపురమునకు మార్పఁబడినది. దాని యధీశ్వరులు కీ॥ శే॥ (శ్రీ) (శ్రీ) సురభిరాజా లక్ష్మారావు బహద్దరువారు. వారి పరిచయము మన కవికిఁ గలదు. వారు చెన్నపురమునకు దయచేసినప్పుడొకసమయమున మన కవిరాజు వారిపైఁ గొన్ని పద్యములుచెప్పి దర్శనముచేసె. అదిమొదలు వారికి మైత్రి ఘటిల్లినది. వారు కొంతకాలమునకుఁ దమ పూర్వులగు మాధవరాయలుగారు రచించిన చంద్రికాపరిణయమును ప్రబంధమును టీకారూపముగా రచింపుఁడని మనకవి కాజ్ఞయిచ్చుచు మీభారతప్రదర్శనమునకుఁగా రెండువేలరూప్యములిత్తుమని వాగ్దానముచేసి కొల్లాపురమునుండి చంద్రికాపరిణయగ్రంథము రాజమహేంద్రవరమునకుఁ దపాలుమార్గమునఁ బంపించిరి. అంతఁ గొన్ని దినములలోఁ గొల్లాపురమున నాస్థానపండితులుగానున్న కొందఱు కవిరాజకృత మోహినీ మనోహర నాటకమును విమర్శించి ఇందు రసాభాసదోషమున్నదని రాజుగారికి విన్నవించిరఁట! అంతలో రాజుగారు పిల్లలమఱ్ఱి సదాశివశాస్త్రిగారిచే "మేము మరలఁ దెలుపువఱకును మా నాటకారంభము వలదని జాబువ్రాయించి మఱి రెండుమూఁడుదినములలోఁ దనకుఁ బండితులొనరించిన విమర్శనముఁ బంపిరి. మోహినీ మనోహరములోఁ గథానాయకుఁడొక స్త్రీని వరించి తుదిలభించుట మఱియొకస్త్రీని పెండ్లియాడె. ఇదియే రసాభాసము. రాజపండితుల విమర్శనము గాని మనకవి

రాజా 'మీ పండితులు చేసిన విమర్శనము చక్కఁగానున్నది. నా నాటకములో రసాభాసమైన దనుమాట నిశ్చయమే కాని నాందియైనతరువాత "సూత్రధారుఁడు—ఓ! దా కాలమెట్లుమారిపోయినది నియమభూయిష్ఠములైనమహానాటకములు రచింపక యిపుడు పైపైవన్నెలే వరఁగఁజొచ్చినవి. నేను నిపుడట్టి నాటకమే వ్రాసి యట్టివారిమది రంజించెదఁగాక' అని యున్న రెండుపంక్తులును; రెండవపుటలో—ఇతివృత్తమేమి? కవిరాజెవ్వరు? అను వాక్యముల కుత్తరముగా సూత్రధారుఁడు—'ఇతివృత్తమా! ఊఁ!' అనియు కవిరాజెవ్వరనఁటకు—

చ. కవికులశేఖరుండని యఖండయశంబును గొన్న షేక్స్పియ
ర్కవివరుఁ డాంగిలేయమునఁ గ్రొలఁగ వ్రాసి వచ్చెల్లునైటు నాఁ
దవిలిన నాటకంబుకథఁ దాఁగొని తెల్గున వ్రాసె భూసుర
ప్రవరుఁడు కృష్ణమూర్తికవిరాజు సుహృజ్జన సమ్మతమ్ముగా.

అను నాల్గుపంక్తులు చదివిన నందు నాటక నియమములు లేవు. ఇది వృత్తము లేదు. ఇంగ్లీషుకవి వ్రాసినదానికను వాదము తెలిసికొందురు. విమర్శనము వ్రాయుచుందురు.' అని కవిరాజు రాజావారికి జాబు వ్రాసిరి. మఱియుఁ గొంతకాలములో రాజావారు మనకవిరాజునకు మద్రాసులో దర్శనమిచ్చి కడచిన్నదానికి విచారింపక చంద్రికాపరిణయ నాటకమును రచింపుఁడని సెలవిచ్చిరి. మనకవి గ్రంథమారంభించి రెండంకములు వ్రాయువంతలో శ్రీవారు లోకాంతరగతిం బ్రాపించిరి. ప్రారంభించినది కట్టిపోఁగూడదని నాటకము పరిసమాప్తిఁ జెందించిరి. అంతఁ గొంతకాలమునకు శ్రీవారి స్వీకృత పుత్రునకు వివాహమహోత్సవమనియు నాటికిఁ గొల్లాపురమునకు రావలయుననియు మన కవికి శుభలేఖము వచ్చినది. ఆ నాటకము నివేదించుటకు మంచి సమయము దొరికినదని సంతోషించుచు మనకవి కొల్లాపురమునకు శిష్యసహితుఁడై ప్రయాణమై హైదరాబాదు మార్గమున వనపర్తిరోడ్డు స్టేషనులో దిగి మోటారు దొరకమింజేసి యట 15 గంటలకాలము స్నానము భోజనము లేక బాధపడి యట్లున్న సత్రములోనుండి పిదప వచ్చిన మోటారుమీఁదఁ గొల్లాపురమునకుఁ బోయి తమ చిరమిత్రుఁడగు శ్రీధర కృష్ణశాస్త్రిగారింట నివసించి మరునాఁడు దివాన్ కే. వేంకటసుబ్బయ్యగారి దర్శనముజేసి తమ కార్యమంతయు నివేదించిన నాయన "చంద్రికాపరిణయ నాటకమునకు శ్రీ రాజావారు మీకు రెండువేల

రూప్యములిత్తుమని చెప్పినమాట నే నెఱుంగుదును శ్రీ శ్రీ రాణీగారికి మనవి చేయింతు" నని చెప్పి మనవిచేయించిరి. శ్రీ రాణీగారు ప్రస్తుతము రెండువేలి య్యజాలముగాని వేయిరూప్యము లిత్తుమని సెలవుదయచేయించినట్లు దివాన్ గారుమన శాస్త్రిగారికిం దెలిపి పదిదినములు వివాహము తొందరలుదీఱువఱకునుం దుండని సెలవిచ్చుటంజేసి వీరట్లు చేసిరి. ఆకాలములో నొక యంతరాయము కలిగినది. అట నుపాధ్యాయులగానున్న వాజపేయయాజుల రామసుబ్బారాయుడుచి. యే గారు కీర్తిశేషులైన లక్ష్మణరాయ ప్రభుపుంగవులపై నొకచిన్నగ్రంథము వ్రాసి ముద్రించిరి. అందు దోషములున్నవని శ్రీధర కృష్ణశాస్త్రిగారొక విమర్శనముం బ్రకటించిరి. వానివిషయము విమర్శించుటకట నొక సభచేసి యాసభకు జడ్జిగా మనకవిసార్వభౌముని నియమించిరి. వారికట్లుండుటకు నిష్టములేకపోయినను నిర్బంధమునం జేసి యంగీకరించి వాదప్రతివాదములువిని, సాక్ష్యముగాఁ గొందఱు పండితుల యభిప్రాయములు పుచ్చుకొని సర్వమును లిఖితముగావించి "శ్లో. పురస్సర్వస్యనదాం సమర్థ్య మహాభారత సంహితాం, సత్యమార్గ మనుల్లంఘ్యక్రియతే ధర్మనిర్ణయః" అని శపథముచేసి తామొక తీర్పు వ్రాసి సభలోఁ జదివిరి. అప్పుడు సభ్యులుగా నున్నవారును ఆస్థానవిద్వాంసులునగు వనం సీతారామశాస్త్రిగారు ఆతీర్పు శ్రీధర కృష్ణశాస్త్రిగారికి ననుకూలముగాను, రామసుబ్బారాయుడుగారికిఁ బ్రతికూలముగాను ఉండెనని ప్రమాదముగ నిర్ణయించుకొని కృష్ణశాస్త్రిగారిపైఁ గల వైరముం బురస్కరించుకొని "అయ్యా! మీతీర్పులో నొకసంగతి సందేహముగానున్నది. అడిగెదం జెప్పెదరా?" అని ప్రశ్నించిరి. అప్పుడు మనశాస్త్రిగారు "నన్నుఁ దీర్పరిగా నియమించిరి. నేను నాకుఁ దోఁచినరీతిం దీర్పుచెప్పినాను ఇప్పుడు మీరడుగుటయు నేను చెప్పుటయు సరికాదని నాయభిప్రాయము, అయినను దివాన్‌గారి సెలవైనచోఁ జెప్పెదను" అని చెప్పిరట! దివాన్‌గారు "జడ్జిమెంటుపై నప్పీలు చేసికొనవలసినదియే కాని యిప్పుడు ప్రశ్నింపఁగూడ"దని యాజ్ఞచేసిరఁట! అంతతో సభముగిసినది. దివాన్‌గారు మీరూపాయిలు రేపు మీకిత్తును. పుచ్చుకొని రేపుమాపు వెళ్ళవచ్చునని మనకవిగారితోఁ జెప్పి యానాఁడు హైదరాబాదునకు దయచేసిరి; అంతలో వనంసీతారామశాస్త్రిగారు మనశాస్త్రిగారి వినయము వ్యతిరేకముగా శ్రీరాణీగారికి మనవిచేయించి

రంట! అదిమోతపఱకు నిజమో చెప్పఁజాలముగాని మనకవిసార్వభౌములకు కేపుడయుచేయింతుమనిన రూపాయలిప్పించలేదు. మనవిచేయించుటకు దివాను గారూరలేరుగావున మనకవి రిక్తచేతులతో రావలసినవారైరి. రాజమహేంద్రి వరమునకువచ్చిన మనకవి తమవజ్రియుభపత్రికలోఁ దమతీర్పంతయు బ్రకటించిరనియు నవ్వాల దానియాథార్థ్యమంతయుం దెలిసికొని వేయిరూపాయలుతపాలుమార్గమున రాజమండ్రికిఁ బంపించిరనియుఁ దెలియుచున్నది. పిమ్మట మన శాస్త్రిగారికిని వసంసీతారామశాస్త్రిగారికిని నవాలకుగ్రంథము జరిగినది. అది యంతయుఁ బుస్తకరూపమునఁ బ్రచురింపఁబడి యున్నదిగావున నిట వివరింపలేదు. నవ్వాలఁ గొంతకాలమునకుఁ గొల్లాపురమునకువెళ్ళి మనశాస్త్రిగారు సీతారామశాస్త్రిగారి విరోధమును బాటింపక వారియింటికివెళ్ళి మాటలాడినట్లు తెలియుచున్నది

—ముక్త్యాలరాజాగారి పునస్సమావేశము—

........లేదని శ్రీ చల్లపల్లి రాజాగారికి వివాహము పట్టాభిషేకము అని శుభపత్రికను చల్లపల్లిరాజాగారి మేనమామగారగు శ్రీముక్త్యాలరాజాగారు మనకవిసార్వభౌములకుం బంపగా వీరు వివాహమునకుఁ బోలేదుగాని పట్టాభిషేకమునకుం బోయి యట నాగత్తులైయున్న శ్రీముక్త్యాలరాజావారి దర్శనముచేసి పట్టాభిషేకసమయమునఁ గొన్నిపద్యములు చదివిరి. అటఁబండితసత్కారము చేయువారు ముక్త్యాలరాజాగారే. అప్పుడు మనకవిసార్వభౌమునకు రు 116—0—0లే యిచ్చినను గాలాంతరమున పునర్దర్శనముచేసి దౌహిత్రి వివాహమనిచెప్పినప్పుడు రు 500—0—0 లు శాలువలు లోనగునవి బహుమతిచేసిరి. ముక్త్యాలరాజావారు 1000 రూప్యములు 1000 రూప్యముల విలగల వస్త్రములు నిచ్చిరి. పట్టాభిషేకమునకుబోయినప్పుడుమనకవిరాజాచేతిలోనచ్చువేయించిన శ్రీకృష్ణభారతమునందలి శాంతిపర్వములోని 10 ఫారములున్నవి. అవి ముక్త్యాలరాజాగారుచూచి యేమియనియడిగి పుచ్చుకొని సెలవుపుచ్చుకొనుచున్నాను నాకాగితములిమ్మని" మనకవి రాజునుగగా "ఇవినావియే నాకిచ్చునని" రాజుగారు బదులుచెప్పి మామూలుప్రకారము మీకు నేను 116—0—0 లిత్తును శాంతిపర్వమునుండి నాపేరనే ముద్రింపించుఁడని బదులుచెప్పఁగా మనకవి సంతోషించి "మాభారతమాదినుండియుఁ దమపేరనే

నడుమరెండుసంవత్సరము లెట్లయినను మరల శాంతినుండి చివరభాగమునకు మీఁ దియే మీరిచ్చిన సయ్యాకున్న మీపేరనే ముద్రింతుమని చెప్పి సెలవుగొని యింటికివచ్చినారు. వారు చెప్పినప్రకారము సొమ్మిచ్చుచున్నారో లేదో తెలియదుగాని శాస్త్రిగారు చెప్పినప్రకారము ముక్త్యాలరాజాగారికే శాంతినుండి యాశీఃకృతి యిచ్చుటకు నిర్ణయించుకొనినట్లు వారు నాతోఁ జెప్పియున్నారు. చివరకెట్లు పరిణమించునో తెలియదు.

శ్రీకృష్ణకవిజీవితము.

నవమప్రకరణము

— కవిగండపెండేరము —

పాలకొల్లులో 11–1-30 తేదీని ముక్కోటియేకాదశినాఁడు స్వర్ణాభిషేకమైనకొన్నినాళ్ళలో రాజమహేంద్రవరమున శ్రీకృష్ణసినిమాహాలులో నొకనాటకప్రదర్శనము జరిగినది. అప్పుడటకు మనకవిసార్వభౌములు పోయియున్నప్పు డటఁ బ్రేక్షకులైయున్న ముత్తంగిసీతారామయ్యగారు (వీరు రాజమహేంద్రవరమున గొప్పధనవంతులు జమీందారులు) మనకవిసార్వభౌములం బిలిచి 'అయ్యా! గండపెండేరమంటే యేమిటి" అని ప్రశ్నింపగా మనకవి "గండపెండేరమును దానావిద్యలలో నారితేరిన వారికి వామపాదమునకు వేయు బిరుదరూపకమైన యొకవిధమైనయందె. అది తొల్లి కృష్ణదేవరాయలు పెద్దనకు వేసెను.' అని చెప్పగా సీతారామయ్యగారు "స్వర్ణాభిషిక్తులైన మీకు గండపెండేరము వేయనొప్పు, ననఁగా మనకవిసార్వభౌములు నవ్వుకొనుచుఁ దమస్థానమునకుం బోయి కూరుచుండెను. అంతట సీతారామయ్యగారుకొందరుమిత్రులకుఁ బ్రోత్సాహముచేసి గౌతమీపుస్తకాలయమునందేమున గండపెండేరము వేయుటకుఁ దీర్మానించి జోడపాటి శివరామశర్మగారి కార్యదర్శిత్వమ్మునఁ గొంతసొమ్ము చందాలరూపకముగాఁ బోగుచేయించిరి. అంతఁ గొంతకాలహరణమగుటచేఁ, దేశకాలపరిస్థితు లనుకూలముగానుండమిచే దాన దాన న నకార్యమున కొంత రాయము తటస్థించినది, అంతలో మనకవిసార్వభౌములు కవపురంబునకుఁ గావ్యస్మృతితీర్థ జనమంచి శేషాద్రిశర్మగారి బ్రహ్మాండపురాణకృతిసమర్పణమహోత్సవమున నగ్రాసనాధిపతిగా జరిగినప్పుడు తత్పురవా

ప్రత్యర్థులు న్యాయవాదులు విద్యాప్రియులు నగు కే. సుందరరావుగారు లోన గువారు కవిగండపెండేరము కడపలో జరుపుదుమని మనకవిగారికిం జెప్పఁగా వారు స్వదేశమున జరుగుట కభిలషించి తాంబోలు గడపవారికిఁ బ్రత్యాఖ్యానముం జేసిరఁట! అంతలో బెజవాడపురప్రముఖులు కొంతద్రవ్యము సంపాదించి కొంతపని చేసి దేశమునం గల పెక్కుమంది ప్రముఖుల సమ్మతులను స్వీకరించి ప్రకటించిరి, ఇట్లు గొప్పప్రయత్నము చేసిరి కాని వారిప్రయత్నమును గొనసాఁగినది కాదు. ఇట్లు రెండుసంవత్సరములు కడచినపిమ్మట నిరుడు అనఁగాఁ ప్రజోత్పత్తి నామసం॥ర ఆశ్వయుజ బ ౬ కవిసార్వభౌముల జన్మదినం బగుటం జేసి శ్రీ భమిడిపాటి కామేశ్వరశాస్త్రిగారి ప్రోత్సాహమున డాక్టరు బెజవాడ వేంకటస్వామినాయఁడు ప్రభృతులు కవిసార్వభౌముని జన్మదినోత్సవము చేయనెంచి యార్యాపురమునందలి సంస్కృతపాఠశాలలో టేకుమళ్ళ యచ్యుతరావుపంతులు యం. యే. యల్. టి గారి యాధిపత్యమునఁ బెద్దసభ గావించిరి. సభముగియులోపల బెజవాడ వేంకటస్వామి నాయఁడుగారు లేచి 'మనపురంబు నందే శతాధికగ్రంథములే గాక మహాభారతము మూలానుసారముగా రచించిన మనకవిసార్వభౌముల కితరపురంబుల గండపెండేర మొసంగుట పోలియుండదు. మనపురములోనే యీమహోత్సవము పొందఁదగినది. అనిపలికి యెల్లరచే నొప్పించిరి. అప్పుడే కార్యనిర్వాహకవర్గ మేర్పడెను. టేకుమళ్ళ అచ్యుతరావు పంతులుగారు ప్రసిడెంటుగాను బెజవాడ వేంకటస్వామినాయఁడుగారు సెక్రెటరీగా నేర్పడి 8—12—31 వ తేదిని యొక పెద్దనోటీసు ముద్రించి ప్రకటించిరి. ఇట్లు ప్రకటించి కొంతధనము సేకరించి గండపెండేరము జేయింప నెంచునంతలోఁ గలవచర్లగ్రామ నివాసులగు శ్రీ ముందపాటి సీతారామచంద్రరాజు గారు పెండేరమును నిర్మించుటకైనధనమంతయు నొసంగిరి. ఇట్లు సర్వమును సిద్ధము చేసికొని తత్సభ కగ్రాసనాధిపత్యము వహించుటకు శ్రీ శ్రీ శ్రీ జయపుర సంస్థానాధీశ్వరులగు శ్రీ విక్రమదేవవర్మగారిని కోరిరి వారందుల కంగీకరించిరి. కాని యిప్పుడు రాఁజాలమనియును ఆశ్వయుజ బహుళములో నెప్పుడైనను వత్తుమనియు వాగ్దానము చేసిరి. ఆ వాగ్దానము ప్రకార మప్పటికి సభనాపి యాశ్వయుజ బ ౬ గురువారము (20—10—33) తేదిని యుత్సవము జరుగునని మరల నోటీసులు ప్రకటించిరి. పండితులకు, జమీందార్లకుఁ గవితల్లజులకు నుత్తరములు వ్రాసిరి. కాని మహారాజావారు వాగ్దానము చేసినప్రకారము రాఁజాలరైరి.

దీనింజూచి తరువాత నాకుఁదెలిసినవిధంబున వ్రాసెదను) మహారాజు రామన్న ను సర్వము సంసిద్ధమైనదిగావున నుత్సవమాగుట కుత్సహింపక ప్రెసిడెంటు లోనగువారు నాఁడే తప్పక జరుగవలయు నని నిశ్చయించి కింకవీంద్రఘటా పంచాననేత్యాది బిరుదాంకితులు శతావధానులునగు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారినధ్యక్షునిగా నెన్నుకొని గౌతమీగ్రంథాలయమునకుం జెందిన శాలీస్థలము లో గండపెండేరసభం జరిపిరి. ఆనాఁడు గొప్పయుత్సవము జరిగినది. 5, 6 వేల మందిప్రేక్షకులువచ్చి స్థలమంతయుఁ గిక్కిరిసిపోవునట్లు నిలిచియుండిరి. కొంద లు గోడలెక్కిరి. కొందఱు చెట్లెక్కిరి. పెక్కుమంది పండితు లుపన్యాసములు చేసిరి. పద్యములు చదివిరి. గండపెండేరమును స్వీకరించినపిమ్మట మనకవిసార్వ భౌములు జనులమనములు గరఁగిపోవునట్లు తమవినయమంతయు నింతలో నుపన్య సించిరి. సభ రెండుదినములు జరిగినది. మరునాఁడు సంస్కృతకళాశాలవారు మనకవిసార్వభౌముని దోడుకొనిపోయి తమపాఠశాలలో గొప్పసభచేసి సన్మా నపత్రమొసంగి బహూకరించిరి. మరునాటిసభలోఁ గవిసార్వభౌములు తమకృ తజ్ఞతం దెలుపుచు గండపెండేరముం దీసి చేతబట్టుకొని—

'శా. నాకీరిచ్చిన గండపెండెర మిలన్ నాస్వత్వమే నాఁటికిం
గాకుండన్ వినుఁడేను బ్రాణములతోఁ గన్పట్టుచుండాక నా
డాకాల న్విలసిల్లు నెప్డు చెడకుండన్ దీని నాంధ్రావనీ
ప్రాకామ్యంబగు యూనివర్సిటి వహింపం జెల్ల నర్పింతుగన్.'

అని చదివి తమకిచ్చిన గండపెండేరము నాంధ్రవిశ్వవిద్యాలయమునకు సమర్పించుచున్నట్లు వాగ్దానము చేసిరి. ఆ రాత్రిసభను బురస్కరించుకొని యొకచక్కని హరికథ కొమ్మూరి బాలబ్రహ్మానందదాసు గారు చెప్పిరి. బెంగుళూరి నాగరత్న ము సంగీతసభం గావించె. అనంతరము తాళ్ళప్రూడి లోనగుపురంబులలో నభినం దనసభలు జరిగినవి. ఈవిషయమంతయు "కవిసార్వభౌమాభ్యుదయము" మను గ్రంథములో వివరముగా విస్తరింపఁబడియున్నదిగావున నిట సంక్షేపించి నం దులకుఁ బెద్దలు మన్నింతురుగాక.

జయపురసంస్థానము

వంగకళింగదేశముల సంధియందు మహేంద్రపర్వతంబునకు నపరదక్షిణ దిక్కునందుఁ దూరుపుకనుమలనంబడు పర్వతపంక్తినంటి నందాపురరాజధాని

రమణీయంబగు. ఆనందాపుర రాజధాని యిపు డుత్సన్నంబై సమీపముననున్న జయపురంబు రాజధానియై విరాజిల్లుచున్నది. నందాపురము తొల్లి ప్రతాపగంగ దేవను రాజేంద్రుడు పాలించుచుం దన రాజ్యమును దనకుమార్తెను జమ్మూపురమునుండి వచ్చిన వినాయకదేవున కొసంగెను. వినాయకదేవుఁడు రాజై జయపుర రాజులకు మూలపురుషుండయ్యె. ఆనంతరము 1825 వ సం॥రమున రెండవ విక్రమదేవుండు పట్టభద్రుండై రాజ్యపాలనంబు గావించె నతనికి నిద్దరు భార్యలు ప్రథమభార్యయందు రామచంద్రదేవ విశ్వంభరదేవులను నిద్దరుపుత్రులును. రెండవభార్యయందుఁ గృష్ణచంద్రదేవుండను నొక్కపుత్రుండును బుట్టిరి. రామచంద్రదేవు 1860 సం॥రమున రాజై రాజ్యంబేలె. అతనికి విక్రమదేవను కుమారుండు. అతనిపుత్రుఁడు రామచంద్రదేవుండు, ఇతఁడే యీవరకు దివంగతుండైన జయపురరాజు. కృష్ణచంద్రదేవునకు శ్రీవిక్రమదేవవర్మ యనుకుమారుండు. రామచంద్రదేవు డపుత్రకుండై పోవుటం జేసి యిపుడు శ్రీవిక్రమదేవవర్మగారు జయపురాధీశ్వరులై ప్రఖ్యాతిం గాంచుచున్నారు, వీరు మున్ను జయపురమువారినుండి నెలకు 1000—0—0 రూప్యములు తౌజీపుచ్చుకొనుచు విశాఖపట్టణంబునఁ గాలక్షేపము చేయుచుండువారు. వీరు సంస్కృతాంధ్రము లందు నోఢ్రంబునందును బండితులు. కవులు. అనేకగ్రంథములు రచించినవారు వీరికిని మనకవిసార్వభౌములకును బెక్కేండ్లనుండి పరిచయముకలదు. వీరికలాపవతీపత్రికలో వ్రాయుపద్యములేగాక వారిని వీరు స్తుతించిన పద్యములును బైవిషయమును విశదీకరించుచున్నవి. అట్టి విక్రమదేవవర్మగారికి జయపుర రాజ్యము సంక్రమించినదని వినినప్పుడు మనకవిసార్వభౌమునకుం గలిగిన యానందమునకు మితియుండలేదని నే నెఱుంగుదును. జయపుర రాజ్యము తనకువచ్చినట్లుగా నే సంతసించిరి. పట్టాభిషేకసమయమునం జదువవలయునని శ్రీవారిచరిత్రము, సంస్థానచరిత్రము లోనగు సర్వవిషయములుం జేర్చి "విజయలక్ష్మీవిలాసము" "విక్రమాభ్యుదయము" అనుపేరుతో నొక యపూర్వప్రబంధము నిర్మించిరి. ఈ గ్రంథము నిర్మించినప్పు డెట్టిదిగా నుండవలయునని యాలోచించుచోఁ గీర్తికాంతాస్వయంవరమను నది జ్ఞప్తికి వచ్చెనఁట! అది మైసూరు మహారాజు నుద్దేశించి వ్రాయఁబడినది. కీర్తికాంత ప్రపంచమంతయుం దిరిగి యేప్రభువు నాశ్రయింపక మైసూరుమహారాజును వరించెనని యందలికథ. యట్లు వ్రాయవలయునని

మొదటసంకల్పించి 'నాద్యాపి విశ్రాంతి' అనునట్లు కీర్తికాంతవరించినదని చెప్పుటకన్న దేశములు దిరిగినదని చెప్పుటయే మంచిదని నిర్ణయించి. విక్రమదేవవర్మగారి కీర్తికాంత దేశములు దిరిగినదనియు, ఆతిరుగుటకు లక్ష్మీసరస్వతులు కారణమనియువిక్రమదేవుగారి రాజ్యలక్ష్మి వారికీర్తిని దేశదేశములుపోదఱిమెననియు విక్రమదేవవర్మ విష్ణ్వంశమునఁ బుట్టెననియు లోనగుసంగతులతో సర్వవిషయములను సంగ్రహించి యీమహాగ్రంథము వ్రాయఁబడినది. అందలికథ మనోహరము. నారదుఁడు దేశసంచారముచేయుచు భూలోకమునకు వచ్చి యచ్చటి దురాచారంబులం జూచి చింతించుచు విష్ణులోకమునకుం జనుట. విష్ణులోకవర్ణనము. విష్ణ్వాదులతో భూలోకమునందలి దుర్గుణంబులు వర్ణించి చెప్పుట. విష్ణుదేవుఁడాభూలోకదుర్నయం బడఁప విక్రముఁడనుపేరుతో రాజవంశంబునం బుట్టుదునని చెప్పుట. బ్రహ్మదేవుఁడు జయపురరాజవంశము నభివర్ణించి చెప్పుట. (రాజవంశచరిత్ర మతిచిత్రముగా నుండును) విక్రమదేవవర్మగారి జననము, బాల్యము, విద్యాభ్యాసము, లోనగునవి. విక్రమదేవవర్మగారికి విద్యలు రావలయునని నారదుఁడొంటి సరస్వతితో ననేకవిధములం దెలుపగా నామెవచ్చి విక్రము నావహించుట. సరస్వతి కీర్తికాంతతో భూలోకమునకు వచ్చునప్పుడు హిమవత్పర్వతాదుల నభివర్ణించుట. సరస్వతి జయపురారణ్యము లనేకరీతుల వర్ణించుచుఁ గీర్తికాంతకుం జెప్పుట. జయపురవర్ణనము, విక్రము విద్యావిశేషము, వివాహాదికము, ధర్మగుణములు, నారదుడు లక్ష్మికడకుంబోయి తంత్రములుపన్ని చెప్పుట లక్ష్మి లోకసంచారము చేయుచువచ్చి విక్రముని వరించుట, విక్రము రాజ్యప్రాప్తి, పట్టాభిషేకము, రాజధర్మకథనము, విక్రముని ధర్మకార్యములు, రాజ్యలక్ష్మి విక్రముకీర్తికాంతను దేశదేశములు తిరుగంబోలుట, కీర్తికాంత దేశములు పరిభ్రమించుట, అలక్ష్మీలక్ష్మీసంవాదము, రాజలక్ష్మి నలక్ష్మిం బాఱఁదోలి విజయంబుగాంచుట, విక్రముని రాజ్యపాలనము, ఇత్యాది విచిత్రకథాకల్పనములతో విజయలక్ష్మీవిలాసము విరాజిల్లుచున్నది. ఇట్లారుల్లాసములగ్రంథము వ్రాసి మనకవిరాజు జయపురంబునకుం బ్రయాణంబై ధూమశకటము నెక్కి విజయనగరమునుండిసాలూరునకుంజని యట మోటారుకారు నెక్కి తూర్పు కనుమలనుండి జయపురంబుం జేరిరి. (తూర్పుకనుమలమీఁదిదారి ప్రయాణము మిక్కిలి భయంకరము బండిచక్రమింత తప్పినయెడ పాతాళలోకమే. పాము మె

లికలవంటి మొనికలు. ఒకసారి క్రిందిమొగము మఱియొకసారి మీఁదిమొగము. ఆవయిననుండి పోవుచున్నపుడు క్రిందికిఁ జూచినచోఁ గన్నులు తిరుగక మానవు అసమానమగు నాకాశవిమాన మెక్కిపోవుచున్నట్లే యుండును ఈదారి 60 మైళ్ళ దూరము గలిగియుండును) ఇట్లు జయపురంబునకుం జని మహారాజుం దర్శించి గ్రంథము వినిపించి వంశావతారములోఁ గొన్ని క్రొత్తవిషయములు వారు చెప్పగా నట్లనువరించి వారి యాజ్ఞానుసారముగా నింటికివచ్చి ముద్రించి మఱినాలుగైదుమాసములలో జయపురంబునకు మరలఁజని ముద్రితగ్రంథములువారికి సమర్పించి తమ్మాస్థానకవిం జేయుఁడని కోరిరి. మహారాజాగారు దానికంగీకారముం దెలుపుచు నట్లే మిమ్ము మా యాస్థానకవిగా స్వీకరింతుమని వాగ్దానము చేయుచు దివానుగారి కెఱిఁగించిరి. ఉభయులును "సామాన్యులంబోలె మిమ్మాస్థానకవిం జేయనొప్పదు. విజయదశమినాటికి మరల మీరు దయచేయుడు, అప్పుడు మీకు బహుమానమిచ్చి యాస్థానకవిం జేయుదు" మని చెప్పిరి. మసకవినాటికి మరల మూఁడవసారి జయపురంబునకుం బోయిరి. దసరాయుత్సవముతొందరలలో మనకవిసార్వభౌము నాస్థానకవిం జేయుట సిద్ధించినది కాదు. అంతలో రాజమహేంద్రవరమున జరుగు గండపెండేరమహోత్సవమున కగ్రాసనాధిపతిగా రావలయుననియు నాశ్వయుజ బ ౬ గురువారమున జరుపనెంచితిమనియు మహారాజున కాహ్వానము వచ్చినది. మనకవిసార్వభౌములటకే యున్నవారుగావున స్వయముగా నావిషయము మాటలాడి, తప్పక షష్ఠినాటికి వత్తుమని సెలవిచ్చిరి. మనకవి రాజమహేంద్రవరమునకు తెలిగ్రామునిచ్చిరి. అంతలో నీవృత్తాంతము గ్రామమంతయు మ్రోగినది. గుసగుసలు బయలుదేరినవి. కొందరు మహారాజునకుఁ బోవలదని బోధించిరి. అకాలమున నగ్రాసనాధిపతిగాఁ గోరినప్పుడు మనకవి వినుచుండ సెట్టి లక్ష్మీనరసింహముగారు "ఒకులోనంగెడు గండపెండేరము మీరిచ్చుటంతపోలి యుండదు" అని చెప్పినారు. అప్పుడు మహారాజావారు "కృష్ణదేవరాయలు పెద్దన్నకిచ్చిన గండపెండేరమంతపోలియుండదు. ఒకరిచ్చినదానికంటె దేశమంతయుం గలిసి యిచ్చినదానియందే గౌరవ మధికమనియు నొకరిచ్చిన గండపెండేరము స్వీకరింపమనియు మన శాస్త్రిగారు చెప్పుచున్నారు. ఇం దెవరిచ్చిననేమి యది నేనిచ్చుట నాకు దోషముగాఁ గనిపింపలేదు, నేనుదప్పక వెళ్ళి యగ్రాసనాధిపత్యము వహింతు" నని చెప్ప

యున్నారు. కారణములచే మహారాజావారు కాశీపోయినను కార్యము మహోన్నతముగా జరిగినది. మహారాజావారన్నఁ గొన్ని విషయములలో మహోన్నతుఁడే యననైన మహాకవి వచ్చి యాస్థానాధిపత్యము వహించి గండపెండేరముఁ బైవినాఁడు. ప్రజలు సంతోషించినారు, రాజుకాని కొంతయూవంతయు, ప్రజలకుఁ గానుపింపలేదని ముమ్మాటికిం జెప్పుచున్నాను.

గండపెండేరము వేసిన సందర్భమున మా కవిసార్వభౌముఁడు కొంత యుపన్యసించి కొన్ని మాటలు చెప్పినాఁడు. కృతజ్ఞతాసమర్పణము వ్రాసినారు. ఆ విషయమంతయుఁ గవిసార్వభౌమాభ్యుదయ మను గ్రంథములో సమగ్రముగా వ్రాయఁబడియున్నదిగావున నే నిట వ్రాయుట పిష్టపేషణమని వ్రాయక విరమించుచున్నాను.

—◆ స్వభావగుణవిశేషములు ◆—

మనకవిసార్వభౌములకుఁ జిన్నతనంబునుండియు నాత్మగౌరవము మెండు. ఏయింతమాట యెవరివల్ల వచ్చినను సహించునట్టి స్వభావము లేదు. దలిదండ్రులైనను వృథాగాఁ దన్నొకమాట యన్నం బడి యూరకుండరు. వారికిఁ దగిన సమాధానము చెప్పుదురు. ఈకారణముచేతనే వీరికెన్నోలాభములు పోయినవి. ముక్త్యాలరాజాగారు తమమీఁద వ్రాయు నాశ్వాసాంతములు తమకుఁ జూపి కాని ముద్రింపవలదనినంతమాత్రమున నేకదా వారికిని వీరికిని గలతవచ్చుటయు నెలనెలకు వచ్చు నూటపదియాఱురూప్యములు పోవుటయుం దటస్థించినది

ఈనడుమ రాజమహేంద్రవరములో నొకసభలోఁ బదుగురు కూర్చుండి యుండఁగ శ్రీకృష్ణభారతముఁ బ్రసక్తి వచ్చి మనశాస్త్రిగారిం బిలిచి అయ్యా! దీనికారణ మెంతవఱకు వచ్చినది యింక నెంత కావలెను. ఇత్యాదిప్రసంగములు రాఁగా మనశాస్త్రిగారు ఆదిపర్వము మొదలుకొని స్త్రీపర్వమువఱకుఁ బదునొకండాశ్వాసములు 5 సంపుటములుగా ముద్రింపఁబడియున్నది శాంతి మొదలు 7 వ

ర్వములు మూడుసంపుటములుగా ము ద్రింపవలసియున్నవి. 4 వేలరూప్యము లగును. నే నెవ్వరినాశ్రయింపలేను. అప్పుకావలసిన యోగమున్న నగును లేదా లేదు, అని బదులుచెప్పిరి. ఆమాట యటునున్న డాక్టరు బెజవాడవేంకట స్వామి నాయుడుగారు విని మరునాడు శాస్త్రిగారి యింటికివచ్చి 'అయ్యా మీ భారతములోని శాంతిపర్వము నేనచ్చువేయింతును దానికి కావలసిన ధనమిత్తును అని కోరిరి. అప్పుడు మనశాస్త్రిగారు 'మహాసు వంశీయులు' అని గొప్పజమీందారులుకారు రెండువేలరూప్యములు దానికచ్చుకగును. మీరెంతమాత్రం బ్రివేశింప వలదు' అని ప్రత్యాఖ్యానముచేసిరి. మచిలీపట్నం నాటి దేవరపు క్రైస్తవ గుమాస్తా హెడ్మాష్టరుగానున్న దేశముఖ్య అమృతలింగస్వంతులు ఎం. ఏ. యల్. టి గారు శ్రీకృష్ణభారతము శేషపర్వముల యచ్చునిమిత్తం మొకసంఘ మునేర్పఱచి చందాలరూపముగా ధనము సేకరింతుమని చెప్పి కొంతదానిప్రయ త్నముచేసియున్నప్పుడు మనకవిసార్వభౌములు వారియొక్క సంజని 'నే నొరుల నాశ్రయించి యాచించి ధనము సేకరింపలేదని గంజాంజిల్లా సభలో చెప్పి యున్నాను, నే నీయుద్యమములో నొరులు యాచింపకున్నను మీరందరును యాచించి తెచ్చునగదా! దానిచేత నే నప్పుస్తకము మ్రుపమాను. ఫలభోక్తను నేనగుదును; కావున మీప్రయత్నము నాకు సమ్మతముకాదు యంగీకరింపక్కరె అంతలో నాకార్యము వారు నిలిపివేసిరి. ఇట్టెయ్యదులెన్నో ప్రియోదాహరణములున్నవి గ్రంథవిస్తరభీతిచే నిట వ్రాయఁబూనలేదు. కాని యొక్క విషయముమాత్రము వ్రాయుదును. హనుమకొండ పురీవాసులు తుంగతుర్తి నరసింహారావుగారు వీరిచేత భద్రాచలరామచరిత్రము వ్రాయించి కృతినొంది వీరికి సౌఖ్యము నకుం జాలినవస్తుసామగ్రి యొంతయు నిత్తునని చెప్పియుండిరి. అంతలో నా లేదు వొా తప్పనరని విని వానితోం గలహించి గ్రంథమునంపం వలదనెనుఁగొంటచ్చి రనియు వారు తరువాత నాహ్వానించినను వారికడకు వెళ్ళలేదనియుం దెలియు

చున్నది. వీరికిఁ గోపము, పట్టుదల విస్తారము. ఇవి యెట్టివో విచారింపనగు. కోపము సమయములయందు లేనివాఁడొక జడుఁడని నాయభిప్రాయము. వీరి కోపము కారణములేక కానంబడదు. అదియును చిరస్థాయి కాదు. పరవినాశన మున కెన్నఁడును గాఁబోదు. ద్రోహబుద్ధి వీరికుండదు. తప్పుచేసితి నన్నచో వానిపైనున్న తనకోపమును విడిచి వాఁ డెట్టివాఁడైన వానిని దనమిత్రునివలెం జూచును. వాఁడు తన్నుఁ జంపనెంచియున్నాఁడని తనకుఁ దెలిసినను నక్కువిన యము చూపుచుఁ దన్నాశ్రయించినవాని భయమొంచక కలసిమెలసి వానితో ననుగమించును. అంతయు దైవముమీఁద భారముంచి యుండును. పట్టుదల యును ఘనమే. కావుననే యిన్నిగ్రంథములు వ్రాయుటకు శక్తిగలవారైరి. మ ఱియు నీగుణంబులం గూర్చి యనేకప్రమాణములున్నవి. వీరికిఁ జిన్నతనము నుండియు 'ఉభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర, బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతమైన" ఇట్టి గ్రంథములలో గద్యము వ్రాయవలెనని సంకల్ప ముపుట్టినది. అది సాధించిరనుట సత్యముకదా! మఱియు మహాత్ములదర్శనము చేయవలెననియు నది వీరికి నింద్రద్యుమ్నమున సిద్ధించినదని యిము వ్రాసియు న్నాను. మఱియుం గొన్నిగ్రామములు సంపాదింపవలెనన్న తమసంకల్పమున కెన్నియో ప్రయత్నములు చేసినారు. అదిమాత్రము ఇప్పటికి సిద్ధింపలేదు.

వీరు నానాతీర్థములు సేవించియున్నవారు దివ్యతీర్థక్షేత్రములయందు ప్రభావము లేకపోలేదని వీరి నిర్ణయము. ఇదిగాక 'దేశాటనం పండిత మిత్రతా చ' అనుటంబట్టి తీర్థాటనమున మనుష్యునకుఁ గష్టసుఖములు తెలిసి విజ్ఞానము గలుగుటకుఁ గారణమగునని వీరినమ్మకము. వీరు కొందఱు ప్రభువుల నాశ్రయించి ధనము సేకరించిరి కాని దైన్యముగా వారినాశ్రయించి స్వీకరింప లేదు, వీరు పూర్వాచారపరాయణులైనను జాతిమతద్వేషము లేనివారు. శంకర రామానుజ మధ్వాచార్యులనేగాక మహమ్మదు, జైన, బుద్ధ, క్రీస్తు లోనగువారిని మిక్కిలి ప్రేమించి గౌరవింతురు. స్త్రీ పునర్వివాహములు శాస్త్రీ యములు కావని చెప్పుదురు కాని కులటలై వ్యభిచరించి భ్రూణహత్యలు చేయు టకంటె అశాస్త్రీయమైనను పురుషునొక్కని గట్టుకొనుట మంచిదనియు వారు సంఘమునకు దప్పుగా నుండవలయునని యు వీరియభిప్రాయము. ప్రౌఢావివాహ

ములు, చండాలాదిసంసర్శనము, చండాలదేవాలయప్రవేశములోనగునవి వీరం గీకరింపరు. స్త్రీవిద్యను వీరంగీకరింతురు. కాని స్త్రీలు తమజ్ఞానోత్పత్తికిఁ దగిన విద్యలు నేర్చుకొనవలెనుగాని బి. యే. లు యం. యే. లు ప్యాసుచేయుటయు నుద్యోగములు సేయుటయు నుపన్యాసవేదిక లెక్కుటయు, స్వేచ్ఛాప్రవర్తనముచేయుటయు వీరికిష్టములేదు. వీ రాయాజాతుల కేర్పడియున్న నిత్యకర్మములన్నియుం జేయువలయునవియే యనియు నన్నికర్మములును బుణ్యముమాట యటులుండినను సర్వమును శరీరారోగ్యము నిమిత్తమే యని వీరు చెప్పుదురు. ధర్మశాస్త్రమంతయు వైద్యశాస్త్రమే యని వీర నేకప్రమాణములు చెప్పుదురు.

త్యాగము—వీరిచేతిలోఁగాని లేకపోయినను యాచకుఁడు వచ్చియడిగిన లేదని వీరనినట్లు నే నెఱుంగను. అప్పు డెవ్వరియొద్దనో బదులు తెచ్చియైన నిచ్చుకమానరు. వీరి చేతికి 100—0—0. వచ్చినవవి మూఁడుగవ్వలక్రింద నెగిరిపోవును. ఆనాఁడు చేతిలోఁ గానిలేదు. తమకు నూటికో బదియున్నది దానికై విచారించుచుండ దైవానుగ్రహమున కావలసిన ధన మేప్రొద్దుచుండియో వచ్చునుగాని దానికై వీరెన్నఁడును జిక్కుపడినట్లు నేను వినలేదు. భోగము—మనకవి ధనములేనివాఁడయినను మహారాజభోగమనుభవించెనట నిశ్వావాహాంశము. బాల్యమునఁ దల్లిదండ్రు లతిప్రేమతో వీరడిగినవన్నియుం దెచ్చియిచ్చి పోషించిరి. పిమ్మటను వీరట్లే యనుభవించిరి. అరణ్యములోనైనను వీరికి సౌఖ్యభోజనమే దొరకినది. ప్రతిదినమును అవగాఁ దరచుగా వీరింటనేసో పిండివంట చేయుట నే నెఱుంగుదును. మనకవి మంచిపైన నీటిముద్దపాత్రములో నుంచుకొనియే భుజించుచుందురు తాను జేయవలసిన శుభకార్యములు పదుగురు మెచ్చునట్లు చేయును. ధనము ప్రధానముగా నెంచుకొనక గౌరవమే ప్రధానముగా నెంచుకొనుస్వభావము వీరికుగ్గుబాలతోఁ బుట్టినదియే. తప్పుదారిఁ బ్రవర్తించినట్టివారికైన వీరుగర్హింతురు. తనతప్పు తనకుఁ దెలియునప్పుడొరులు చెప్పిన దిద్దుకొందురు. వీరి చిత్తమున దహంభావ మొక్కఁడును లేదు. తనమీఁదికివచ్చినప్పుడు గాని వీ రెవ్వరు నెవ్వనిమీఁదను బోవని నియమము కలవారు. వీరుకొన్నిగ్రంథములు విమర్శించివారి వారిని గర్హించియున్నవారు. అట్టివారు మున్ను తనమీఁద నెవ్వియెవ్వియో వ్రాయుటచేతనే వారిని విమర్శించిరిగాని వృథాగా వారిపై నేగలేదని బాసచేయఁగలను. కలముపట్టినచోఁ దప్పుగలవానిపై దాక్షిణ్యములేక వ్రాయుదురు. వీరివ్రాఁత లెఱుఁగనివారు వీరిని గొందఱు

వారంగీకరింపనిచో సాయంతనశబ్దము విశేషణము కాదు. విశేష్యమే చూడుఁడు లీలాశుకుఁడు "సాయంతనే ప్రతిదినం పశుబంధనార్థం" అని యున్నది. ఇదిగాక కాళిదాసుఁ డుత్తరకాలామృతములో 'సాయంతనే హార్మ్యకే" అని వ్రాసెనని మఱికొన్ని ప్రయోగములిచ్చిరి. ఇత్యాదు లెన్నోకలవు.

'బ్రాహ్మణస్య హృదయం నవనీతం వాచిక్షురోని శితస్తీక్ష్ణధారః" అనున్యాయము వీరియందుఁ బూర్తిగాఁ బట్టినది. వీరిహృదయము నవనీతమని లోకమునకుఁ దెలియనిదికాదు. వీరికి విద్వాంసులన్నను, ధర్మకార్యములన్నను, ప్రీతి మెండు. నిత్య నైమిత్తికములందు శ్రద్ధయధికము, లేపెట్లనూహ వీరి చిత్తంబున లేదు. వీరిదివఱకు సంపాదించిన ద్రవ్యమంతయు నొకలక్షకు పైగాఁ నేయుండును. వీరికిప్పుడేమున్నది! ఋణమే యింకనున్నది. ప్రఖ్యాతియున్నది. వీరిధనమంతయు ధర్మకార్యములకు వినియోగింపఁబడినదికాని దుష్కార్యములకు వినియోగింపఁబడలేదు. వీరిమేనమామగారు మృతించినప్పుడు తనకు మూఁడవనాఁడు వర్తమానము వచ్చినది. ఆయున యాహితాగ్నిబ్రహ్మమేధము చేయించువారులేక శవదహనము కాలేదు. అప్పుడు తానుపోయి పుస్తకముచూచిబ్రహ్మమేధము చేయించుటయేగాక అందులకైనసామ్మునుతూరుకికలంలువ్యయముచేసిరి. అపరకర్మములలో దిగుట తప్పని వీరెంచరు. "అనాథప్రేతసంస్కారం కోటియజ్ఞఫలం లభేత్" అని వీరు గ్రహింతురు. ఈసమయము వీరిమరదలికొడుకు కాలధర్మము నొందగాఁ దాయాటకుఁ జని కర్మముచేయు తండ్రికి వీరుతప్పినప్పుడు వారి జ్ఞాతు లెవ్వరును 'తప్పు చేయుటకంగీకరింపనప్పుడు తాను తప్పు గిప్పనెంచక వారిస్థానమునఁ దానే కర్మకాండను నెరవేర్చెనని తెలిసినది. రాజమహేంద్రవరములో మాదిరెడ్డి వేంకటేశ్వరరావుగారను సంపన్నగృహస్థుఁడొకఁడు మనకవిసార్వభౌమునకుఁ బరమమిత్రుఁడై కుడిభుజమై యుండువాఁడు. అట్టివాఁడు దైవవశమునఁ గాలధర్మము నొందగా రాజమహేంద్రవరములో గొప్పయుత్సవము చేసినారు. మోటారుపై శవము నూరేగించినారు. మనకవి యామోటారుపైనుండి యటనట నుపన్యాసములు చేయుచు శ్మశానవాటిలో శవముఁజితిపైఁ బెట్టినప్పుడు దానికి ప్రదక్షిణములుచేసి శవముపై బియ్యముజల్లి మరలివచ్చినారు. మఱియు నిట్టివెన్నో కలవు. అవి యన్నియువ్రాసిన నొకభారతమంతయగుననియు నింతమాత్రమే స్థాలీపులాకన్యాయము'గా లోకము గ్రహింపఁగలదని నిర్ణయించి యిట్లు సంక్షేపించుచున్నాను.

శ్రీ కృష్ణకవి జీవితము.

దశమ ప్రకరణము.

—గ్రంథవిమర్శనము—

మనకవిసార్వభౌములు శతాధికగ్రంథములు రచించినట్లు ద్వితీయప్రకరణమునఁ దెలిపియుంటిని. ఆగ్రంథములలోఁ గొన్నిమాత్రమే నాకు లభ్యమైనవి అందును కొన్నిమాత్రమే నాతెలిసినవిధంబున దేశకాలాదులం బేర్కొనుచు నిట విమర్శించి వ్రాయుచున్నాను. ఈ దేశకాలనిర్ణయమున నించుక వ్యత్యాసము పడినను బడవచ్చును. తెలిసినవారు నాతప్పుల మన్నింతురుగాక.

సత్యనారాయణోపాఖ్యానము—ఇది వ్రతకథననుసరించి వ్రాయఁబడి నచిన్నపద్యకావ్యము మనశాస్త్రిగారు చిత్రభానుసంవత్సరాంతమున వ్రాసిన మొదటిగ్రంథము. శైలిసులభము.

ఉ. అక్కట విత్తహానియగుచుంచుఁ దలంచియు మంచియన్నముల్
మెక్కక నీరసాన్నములె మెక్కుచు నుప్పుకులేని గంజికిం
దక్కినవారిఁ దాఁ బ్రువు నెదం గడు దస్సియ పోవ్రుసేయు నీ
మిక్కిలి లోకమెల్ల నిటు మిన్నకపోయె నిఁకేమిసేయుదుర్.

సావిత్రిచరిత్రము—స్వభానుసంవత్సరమున రచింపఁబడినది. సావిత్రియందుగలభక్తియే ఈగ్రంథనిర్మితికి కారణము. ఇదియె ఆశ్వాసములప్రబంధము.

సీ. సిరము పూఁబూవ చందురుని వెన్నెలతోన్నిగారంపుఁ దెలిమేనికళలు నెఱయ
బాణీనాడెసు చిల్కపల్కులు మీటుపల్లకి కనుగుణ తాళలయలుగాఁగ
నుపనిషత్తులు నిత్యముడిగంపుఁ జెలియలై, యిరుచక్కి వీచోపులిడుచునుండ
నొండొంట బయ్యంట నొరయు సంగీతసాహిత్యాత్మకుచముల నెనగసరము
తే. లలరు వెలిదమ్మిగద్దియఁ గొలువుదీరి, భక్తలోకమనోభీష్టఫలదయై జ
గంబు లేలెడు శ్రీశారదాంబకరుణ, మొలకలెత్త మదాత్మలో వెలయుఁగాత.

పంచ. సదా మదిం దలంతుఁ గావ సత్యవంతుఁ జెట్టి యా
పదాన్వయుండునైన నాకు వానితోడి లోకమా

గదా ! ముదంబుతోడ సన్న్యాసికుమంటు దానసే
వదావదా ! మఱొందు మాటవల్కఁ బాడిగాదుగా.

గౌతమీమాహాత్మ్యము—ఇది 5 ఆశ్వాసములపద్యకావ్యము. పార్థివసంవత్సరమునఁ బ్రారంభించి సర్వధారిసంవత్సరమువఱకు రచింపబడినది. ఇక్కాలమున మనకవిగారికి పెద్దపెద్దసంస్కృతసమాసములతో, కఠినపదములతో, గ్రంథమొండవలయునని యభిప్రాయము కలిగియున్నట్లు శైలింబట్టి తెల్లమగుచున్నది. ఇందుఁ బెక్కువర్ణనములు, కల్పనలు, నున్నవి. 1900 సం|రమున ఎఫ్. ఏ. పరీక్షకు నిందలి ప్రథమాశ్వాసము పఠితము.

మ. అకటా యొక్కనిసొత్తుగాని వనమం దావాసముం బొంది యొం
డ్లకు కీడెన్నఁడు సేయక శాకఫలముల్ భక్షించుచుం గాలమి
ట్లోకచందంబున వెళ్ళఁబుచ్చు మనకయ్యో దయ్య మోర్వంగఁజా
లక యిప్పాటులు సంఘటించెగదె వాల్గంటీ యిఁకేమందు నే.

మ. గగనోర్వీభమృగాంక సంఖ్యశకమాసగ సర్వధార్యబ్దమం
దగజాజాని పదార్చనారతుఁడు కృష్ణాభిఖ్యుఁడాంధ్రావనీ
వ్యగ మద్రాజమహేంద్రపట్టణసమీపగ్రామవాస్తవ్యుఁ డా
భగణాబ్జార్కముగా వసుంధర దలిర్పం జేసె నీగ్రంథమున్.

కాళిదాసవిలాసము, తెనాలి రామకృష్ణచరిత్రము, జగన్నాథమాహాత్మ్యము—ఇవి మూడును వచనప్రబంధములు, ఇంచుమించు గౌతమీమాహాత్మ్యము రచించునప్పుడే రచించి కలావతిలోఁ బ్రచురించినారు.

ఏకావళీపరిణయము—ఇది దేవీభాగవతములోనికథ. 6 ఆశ్వాసముల పద్యకావ్యము. 25 వ సంవత్సరమున రచింపబడినది. గౌతమీమాహాత్మ్యరచనాకాలమునాటి శైలికన్న నీశైలి మృదులము.

చ. కటకట కన్నులం దెఱచి కానగజాలని చేతకూన న
క్కటికమొకింతలేక బలుకారడవిం బడవైచి పోయిరం
చటు వినినంతనుండి మనమూరడి నోఁచెదు దల్లడిల్లెడుం
జటచట గుండెకొట్టుకొను దారసిలున్ మెయికిం బ్రకంపముల్.

గజాననవిజయము—ఇదియు 25 సం|రములలోపుననే వినాయకచతుర్థి నాఁడు చదువుట కనుకూలించునట్లు వీరితండ్రిగారు వేంకటసోమయాజులుగారు

కథసంగ్రహించి గ్రంథము నేయుమని యాజ్ఞాపించుటంజేసి దీనిని రెండాశ్వాసముల లపద్యకావ్యముగా రచించినారు. దీని నాశీర్వచనకృతిగాఁ గొని పనలపూడి గ్రామవాస్తవ్యులు వాడ్రేవు చినకృష్ణంరాజుగారికొమారుఁడు సూర్యనారాయణ మూర్తిగారు మనకవికి యు 1 కి రు 1000ల వెలచేయు 6 యకరముల యీనాం భూమియిచ్చిరి, ఇందలి పద్యములు హృద్యములు,

సీ. దారులారా! పాటుచేలులారా! మీరు, గంగోత్తమాంగునిఁ గాంచినారె?
పసువులారా! కీరశిసువులారా! మీరు, గిత్తపజీరు వీక్షించినారె?
గట్టులారా! పుట్టచెట్టులారా! మీరు, బూచులమొకమీనిఁ జూచినారె
పాములారా! పెనుగాములారా! మీరు, వరభోగిభూషణునరసినారె
తే. మబ్బులారా! విసరుగాలియబ్బులారా! చుక్కలారా! పువుంబొదలయిక్కలార
వేల్పులారా! పవలురేయుఁ దాల్పులార!, నామనోహరుఁ దిలకించినారె మీరు.

కావేరీచరిత్రము — ఇది 30 వ సం॥తమున రచింపఁబడిన చక్కనిపద్య కావ్యము. ఇందుఁ గావేరీనదీవృత్తాంతమును, అనేక కథలుం గలవు. దీని నా శీఃకృతిగాఁగొన్న వాడ్రేవు సుబ్బారాయుఁడుగారు మనకవిసార్వభౌమునకు యు 1కి రు 1000 సుమారు వెలహోవు 6 యకరముల భూమి తమయన్న సూర్య నారాయణమూర్తిగారివలెనే సమర్పించినారు.

ఆనందోదయము లేక యానందము — ఇది మూఁడాశ్వాసముల యచ్చ తెలుఁగు ప్రబంధము. కవిసార్వభౌముల యచ్చతెలుఁగు మిశ్రకావ్యమువలెనుం డునుగాని క్లిష్టమై యుండదు. "మాటలనాడిన నదుపునఁ బేటతెలుంగున నాగ్రత తేలికవారిం, బాటించి కబ్బము న్నెదఁ, బాటాదూటములు వచ్చుపెరిజెనవ్యాకుఁడీ" అని ప్రతిజ్ఞచేసి చక్కని తెలుఁగునుడులతో నీకావ్యమును రచించిరి. ఇదియును భగవద్విలాసము, పతివ్రతలచరిత్రము, గజాననవిజయము, లోనగు 5, 6 ప్రబంధములు మున్నదిసంవత్సరముల వయస్సునం దొక్కమాఱు ప్రారంభించి తమ కలావతీపత్రికలోఁ బ్రచురించుచు వచ్చినారు. ఇట్లే కలావతిలో వీరిగ్రంథముల న్నియుఁ బ్రతిసం॥రము 5, 6 చొప్పున వెలువడినవి. ఈపత్రికవలననే వీరిన్ని గ్రంథములు వ్రాయుటకుఁ గారణము గలిగినది.

చ. తలఁకకమమ్ము రేల్పెఱమదాయనగెల్చినవాని చుట్టలఁ
మెలపితిమంటి కొల్చి మన మీరును దొల్లిటి బాముసందుమా

తలఁబడినారటంచడుగఁ దమ్ములనం ... ప్రొక్కవచ్చునో
వెలయఁగఁ దేంట్లకంచుగి మొవిప్పిన యానకిపోఁగ పెన్నిరుల్.

చ. లలినొకసారెగాంచి మరలఁగ ... యనఁ గాంచుమనిచ్చలోఁ
గలుగఁగఁజేయునట్లవరి కాంచినయంతన తేటతెల్లమై
తెలిసెడునట్లు కబ్బమును దేలికదారిని జేటతెల్గునం
బలికెను గృష్ణమూర్తి కవి వాసిగదుర్గ్మఖ కార్తికంబునన్.

కనకగిరి— ఇదియునొక కల్పితప్రబంధము. కృష్ణామండలమందలి తిరుపూరు గంపలగూడెముునకు సమీపమున నున్న కల్లూరను గ్రామమున రావణ సంహారముచేసి పుష్పకారూఢుండై పోవు శ్రీరాముడటఁ గొండపై నరసింహ మూర్తిం బ్రతిష్ఠించి పోయెనఁట! అదియే కనకగిరి. అందు బంగారముకలదని కింవదంతి. అట నిప్పటికి నైజామునవాబువారి భటులు కావలియుందురు. మన కవిసార్వభౌముతేదియో పనిగలిగి యట కేగినప్పుడు తత్ప్రభావమును విని యీ గ్రంథమురచించి యం. శేషగిరిశాస్త్రిగారి కంకితముచేసిరి. ఇందనేక నీతులు గలవు.

మ. వరగంజేసెను ... నగరీవాసుండు శ్రీ వేంకటా
ధ్వరికిన్వేంకటసుబ్బసోమి దయకుం బాలుండు శ్రీ గౌతమీ
పరమాహాత్మ్యముఖప్రబంధకృతి, ... శ్రీపాదకృష్ణాఖ్యుఁడుం
బరనేత్రేభమృగాంకసంఖ్య శక ముఖ్యంబొప్పు నప్పీకృతిన్.

వేంకటేశ్వరీయము— ఇది పెద్దతిరుపతియొక్కయు, ద్వారకాతిరుపతియొక్కయు మాహాత్మ్యమును దెలుపు పద్యకావ్యము. మన కవిసార్వభౌమునకు లంకావ్యవసాయమున ముప్పది నల్వదివేలు ఋణమైనప్పుడాదరించి, ఋణము తక్కువవడ్డికిప్పించి యేమేమోచేసి ఋణవిముక్తునిగావించిన నిమ్మన జియ్యన్నగారికిఁ గృతజ్ఞతాసూచకముగా నిది యంకితము చేయఁబడినది. ఇందలికల్పనయుఁ బద్యములు నతిమనోహరములు

ఉ. అమ్మలయమ్మపాల్కడలి యందుదయించిన ముద్దుగొమ్మ నె
త్తమ్ములనాడుకొమ్మ ప్రియుదమ్ముని మారునిగన్నయమ్మ లో
కమ్ములనెమ్మినేల సిరిఁగన్బడునియ్యల మేలుమంగ తా
యమ్మ చెలంగుఁగాత మనయమ్మల నిమ్మనవారియింటిలోన్.

సీ. మారామనగవాడ మారాముడుని చేతి, పిల్లలనుగనొకర్త నెత్తికైవైచె
కులగోత్రములు లేక, కులగోత్రములు నేలు, నెఱుకగా యని యొకర్త నెత్తికెజడలు
తలిదండ్రులెఱుంగ కిలబుట్టితివినత్తి, నెఱుగియూకలనొత్తు నెత్తిముట్టితి
నా కచోటునకిలేక సకలభూములమెట్టు మొఱుగా, యనియొకర్త నెఱులు నెత్తి
తే. చేపలందిప్పునీటిలోఁ జేపవగుదు పందులందిప్పు వనులలోఁ బందివగుదు
సింగములనిప్పు గుహలలో సింగమగుదు వెట్టివాఁడైనవగుదువో యొఱుక పోర.
కం. కలికాలమునైమవేతే డుల యాకలరంగనవ్వ దువినిర్మించెన్
విలసత్కవి రాజాఖ్యుఁడు కలావతీ పత్రికాధికారికడంకన్.

భగవద్విలాసము — ఇది మూఁడాశ్వాసముల పద్యకావ్యము. ఇందు బ్రహ్మ విష్ణుమహేశ్వరులలో నీశ్వరుని ప్రభావమధికముగా వర్ణింపబడినది.

చ. కలనసమస్తదేవతలఁ గన్మదలించెను, నంతలోన నే
గాలిచిచ్చుజగంబులఁ బ్రకీర్తినిగ్గెను, యేలినాఁడ బు
ఱ్ఱులగనినాఁడ, వైభవముతోఁ దుబతూఁగితినీకటాక్షమున్
గలుగుతవంబసర్పి నినుఁగట్టితి నెంచుఁగొలంత నాకికన్.

ప్రద్యుమ్నోపాఖ్యానము — ఇది భాగవతాద్యనేక గ్రంథములు పరిశీలించి 6 ఆశ్వాసములుగాఁ బెంచి చేసిన పద్యకావ్యము. 1906వ సంవత్సరమునఁ బుట్టినది. ఇందు శ్రీకృష్ణుఁడు బదరికాశ్రమంబునకేగి తపముచేసిన కథయు, దివ్యస్థలముల వృత్తాంతము, ప్రద్యుమ్న జననము, శంబరాసురుఁడు హరించుట చేతలో రతికి బ్రద్యుమ్నుఁడు దొరకుట, శంబర సంహారము లోనగు కథలతిమనోహరముగా వర్ణింపఁబడియున్నవి. దీనియందు మన కవికిఁ బ్రీతిమెండు.

చ. తెలియఁగనెంతవాఁడు నీఁద్రెళ్ళిర కాని యొకంతమిత్రి క
న్నులమునిఁ బ్రాణిపొట్టుట కనుంగొని యేమివి యేమొఱుంగమా
పొలిసినసంతతుఁగనియు బూమెలెత్తిఁగి యా సుట్టిగట్టి యా
య్యాలలిటు లూగుమందమునిమించుట వెఱ్ఱితనంబు కాదొకో.

క. భువినిధిదివిశుచివరుసం దవిలినహాయనాబ్దమందు ధరణీసురుడా
ర్యవిధిజ్ఞుఁడు కవిమిత్రుఁడు కవిరాజాఖ్యుండు దీనిఁగడఁకరచించెన్.

శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిరూష్మ్య నిర్వచన నైషధకావ్యము — పఫ బభ మవ శషసహలు లేని యచ్చతెనుగు మాటలతో, 'తన జడకరగలదటంచు' యను 11

అక్షరములు మాత్రమే కలుగునట్లు వినోదార్థము రచించిన గ్రంథము. ఇది గౌతమీమాహాత్మ్యము వ్రాసిన కొలఁదికాలములో వ్రాసినట్లూహింపఁ బడుచున్నది.

ఆ. కయితఁ జదువ లేక కడఁగు నీయుత నెన్ని యేని చిక్కు డారు లానునిట్టి
తెలుఁగుఁ గడలి నీఁద దలఁకెదనక్కటా! కాన నరయు మన్న గన్నతండ్రి.

క. తలకుం దగదని తలపక, తెలియఁగ నగు కొలఁది తేటతెలుఁగునఁ జేయం
దలకొన్న గ్రుడ్డికలుఁగులఁ దెలియం జను నెంతకతకుఁ దెలుఁగెట్లనినన్.

అమృతరాజీయము—ఇదియొక కల్పితకథ. ఈకథను మహారాష్ట్రదేశములో హరికథగాఁ జెప్పుచుందురు. ఇందుఁ గొంత రామకథయును, కొంతకృష్ణకథయును వర్ణింపఁబడియున్నది. హనుమంతుఁడు రామునివలన బ్రహ్మపదంబుఁ గోరి తపించుచు నొక్కనాఁడు నారదుం గూడి తీర్థాటనము చేయుచు ద్వారకకు వచ్చుట. అదివిని శ్రీకృష్ణుఁడు వాని నెదిరింప బలరామాదులం బుచ్చుట, వారందఱు హనుమంతునకోడుట. గరుత్మంతునకును బరాజయము కలుగుట. శ్రీకృష్ణుఁడు తాను రాముఁడై తనతో సీతగా సత్యభామను నిలుపుకొని హనుమకు దర్శనమిచ్చుట. సత్యభామకుఁ బరాభవము గలుగుట. అంత రుక్మిణి జానకియై కృష్ణునికడకువచ్చిన హనుమంతుఁడు వారి నభివందనము చేయుట లోనగు చక్కనికథ యిందుఁగలదు.

చ. మునుమును పారిజాతసుమము౯ దనితో మురవైరికీయ నా
ఘనసరభరిభరంబువను గట్టిపతం బడిగాదె దుఃఖము౯
గొనకొనఁ జేసె నీ కపుడు గొల్లున నేడిచి గెల్పితీవు గో
బ్బున నిపుడుం బ్రతిక్రియకుఁ బూనఁగరాదె విచారమేటికే.

ఆంధ్రవేణీసంహారవిమర్శనము, ఆంధ్రవిక్రమోర్వశీయవిమర్శనము, ప్రసన్నయాదవనాటకవిమర్శనము, ఆంధ్రశాకుంతలనాటకవిమర్శనము, కురుపాండవదాయభాగవిమర్శనము, విజయవిలాసకృతివిమర్శనము ఆంధ్రమేఘసందేశవిమర్శనము, నన్నభట్టారకచారిత్రవిమర్శనము, ఆంధ్రభాషాశాసనవిమర్శనము—ఇవి యన్నియు నానాగ్రంథములు విమర్శించి వ్రాయఁబడిన వచనరూపకగ్రంథములు. ఇవి యప్పుడప్పుడు వ్రాసి కలావతిలోఁ బ్రకటింపఁబడినవిగాపునఁ గాలనిర్ణయము సరిగఁ దేలలేదు. ఇట్టి విమర్శనగ్రంథములలో కొన్ని కారకములని చెప్పుటకింత పెదవియాడదయు గాను

వీనివలననే మన కవిసార్వభౌములకు కొందఱకు విరోధి కావలసి వచ్చెను. ఈవిరోధిని గాలాంతరమునఁ బరమమిత్రునిగా నెల్లవారును భావించి పూజింపకపోరని నానిశ్చయము.

మాయావతీనాటకము.—ఇందు రతిదేవి మాయావతియై శంబరాసురు నింట సూదాధికారిణియై యుండి చేపలో దొరికిన ప్రద్యుమ్నునిఁ బెంచి పెద్ద వానింజేసి వానిచే శంబరుని జంపించి యతనిని బెండ్లియాడినకథ విచిత్రముగా వర్ణింపఁబడినది.

చ. మనకిటు రాజసాధముని మందిరమందు మహీంద్రులింతి వా
రిని దెగఁగోసి వంటఁబొనరించుచు నూడిగముండుమంచమున
వ్వనజభవుండు నిన్నొనట వ్రాసెనుదానికిఁ జింతచేసినం
గనఁబడునే ఫలంబిపుడు కాఁగలకార్యము గాకయుండఁగా.

లోడారిలుచ్చిగాఁడు, కుక్కకాటువైద్యము, ధాష్టికపంతులు, కాళిదాస ప్రహసనము. ఇవి చిత్రమైన ప్రహసనములు. అన్యార్థావబోధకములై పాఠకుల కింపుపుట్టించునను టతిశయోక్తి కాదు.

చాణక్యశతకము.—చాణక్యుఁడు లోనగువారు చెప్పిననీతులు భారతాదులలోనినీతులు సంగ్రహించి వ్రాసిన చిన్నగ్రంథము దీని కాలమును సరిగాఁ జెప్పజాలను.

సావిత్రీనాటకము.—మహాపతివ్రతయగు సావిత్రిచరిత్ర మీనాటకమందు పద్యము ఇదియును యిప్పటికిఁ గొంతవరకయియున్నది.

మ. భువనంబుల్ భువనాధినాధులును శంభుల్ విష్ణులున్ బ్రహ్మలున్
నవనేశులున్ నవనాథుల్ నరకముల్ స్వర్గంబులుంగోటె స
ర్వవిశేషంబుల వేదవిద్యలేకదా. వాకుచ్చు నాయున్న నీ
కవురూపంబులు నీవుగా కెవియులేవమ్మా త్రిలోకేశ్వరీ.

భారతసారనాటకము.—భారతములోని ముఖ్యమయినకథ యంతయు వచ్చునట్లొకనాటకము వ్రాయవలయునని కవి సంకల్పించి ఇది ప్రారంభించి కొంచెముమాత్రము వ్రాసి విరమించియున్నారు అందు మొదటిపద్యము.

శా. శ్రీవాక్పార్వతులన్ భుజాంతరముఖక్షేత్రంబులన్ దాల్చియే
కేశేశన్ వహియించి నిర్గుణము నీ కేదేంటి శ్రీపుంసత్వా

గావిద్యాభాసుభస్థితిఙ్ గధునీధీశాఖ్యల్ త్రివేదాత్ములా
దేవాధీశులు మువ్వురున్ సుఖమునన్ దేలింత్రు మిమ్మెవ్వరున్.

ఇది ప్రారంభించునప్పటికి వీరు సంస్కృతభారతము చదివియున్నట్లు కానిపించదు ఇది నన్నయభట్టారకుని భారతమునుంజూచియే వ్రాయబడెనని తోచుచున్నది. ఉదంకుని పైాశిష్యుడని నన్నయభట్టారకుని భారతమందే యున్నయది. తరువాత వ్రాసిన శ్రీకృష్ణభారతమునందు సంస్కృతప్రకారము వేదుడనియే వ్రాసియున్నారు.

వీరరుద్రవిజయనాటకము—ఇది మహోన్నతంబుగా నోరుగంటి పురంబున రాజ్యపాలనంబుజేసి ప్రసిద్ధిజెందిన ప్రతాపరుద్రుని కథయంతయు సంపూర్ణముగ వర్ణింపబడినది. ఇది 5 అంకముల మహానాటకము. ఇందు భక్తిశూరాదికములైన కొన్ని పద్యములుకలవు.

మ. జడబుద్ధిప్రకృతిం బెనంగియును రాజద్రోహివై మోసపో
త్తైతి సంతోషమునాగ శిష్టస్తుతమూర్తిం బల్కదే? దిష్టవుం
బడి మాతేటిపు దస్వతంత్రుడయినన్ స్వస్థానశక్తిం గడున్
గడుదీపించుటకేమి ప్రాణము లిడంగానుండె సందేహమా.

స్వారాజ్యోదయనాటకము—ఇది నామమాత్రావశిష్టముగావింపబడినదని వ్రాయుటకు నాకలము చంచలించుచున్నయది.

బొబ్బిలియుద్ధనాటకము—ఇది యారంకములుగల వీరరస ప్రధానమయిన మహానాటకము. ఇందు బొబ్బిలి పెద్దదొరల పరాక్రమమంతయు వింతగా వర్ణింపబడినది. ఇది ప్రస్తుతము సర్వదేశవ్యాపకమాయి రంగస్థలములయందు ప్రదర్శింపబడి ప్రఖ్యాతి గాంచుచున్నయది.

మ. తమవానీయది ఖండపల్లిమడుగా గండాగ్రిలనాంగంటివా
కొడుకుల్ లేకరసీకు రాహామునకుం గోయింపగా నెంతువా
జనబుద్ధిపరమాపళారివగు నిం జక్రింపకాపంతయున్
గడిమి న్నేనిదె కండకండలుగ నీకాయంబు ఖండింపనే.

వేణీసంహారనాటకము—1906 సంవత్సరమున నిది రచింపబడినది. భట్ట నారాయణకృత వేణీసంహారమునకిది సరియైనతెనుగు. నాటకములను తర్జుమాలు చేయుట్లు మన కవిరాజుగారి కిష్టములేకున్నను గారణాంతరమున నిది రచింపబ

చినది. అందలి మొదటిపద్యము దానికిఁ దెలుగుపద్యమును మాత్రము వ్రాయు చున్నాను.

శ్లో॥ నిష్పిష్టైరక్ష్యైర్భిన్నలితమకరందో మధుకరైః
కరైరిందో రంతశ్చురిత ఇవసంభిన్నముకులః
విధత్తాం సిద్ధిం నో నయన సుభగామస్య సదసః
ప్రకీర్ణః పుష్పాణాం హరిచరణయోరంజలిరియం॥

ఉ. మానకత్రొక్కుచుందినను మత్తిలుపట్పదముల్ గలంచు పూ
దేనియలోన వెన్నెలలు దీరుచునట్లయి విచ్చు మొగ్గలై
మానిలమాంఘ్రులందిను సుమంబులదోయిలి పూజ్యలీసభా
నీనులకన్న పండువగు సిద్ధిని మాకు నొసర్చుగావుతన్.

కలభాషిణీనాటకము—పింగళి సూరనార్యకృత కలాపూర్ణోదయము లోని మొదటి నాల్గాశ్వాసములలోనికథ ననుసరించి 7 అంకముల నాటకముగా రచియింపఁబడినది. ఇందుఁ బాత్రోచితమయిన భాషం బ్రయోగించుటయే కాక సమయోచిత వృత్తములతో నిండియున్నది. ఇది 1908వ సంవత్సరమునందు మొదటినాటకముగా మన కవిరాజుగారిచే రచియింపఁబడి 1909వ సం॥రము ఫ. ఏ. పరీక్షకు బఠనీయగ్రంథమై విరాజిల్లినది. ఇందలి కథ మనోహరమైనది. శృంగారరస ప్రధానమయిన యీనాటకము, ఎన్నిసారులు చదివినను చదువ వలయుననియే బుద్ధి పొడముచుండును.

మ॥ గురువుల్ దిట్టినదిట్టనీ వినిలోకుల్ నవ్విరన్ నవ్వనీ
చిరకాలార్జితభూరిపై భవతపశ్శ్రీపోయినన్ బోవనీ
ప యుండప్పినదప్పనీ తెలివితేవల్ మాసినన్ మాయనీ
తరుణీరత్నము దీనిఁ గవయుకేఁ దాళంగలేనింతయున్.

రాజభక్తి నాటకము—ఇది జార్జిఫిఫ్తు పట్టాభిషేకమున 1911డిశంబరు 12వ తేదీని బ్రకటింపబడినది.

మ. సగుణుండయ్యును నిర్గుణుండగు మహా, స్వాత్వంబు విశ్వంబునం
దుఁగడుంగల్గి స్వతంత్రుఁడయ్యుఁ బరతంత్రుండై మహాత్ముండు నిం
తగనై మొల్లెడనిండి పూర్ణుఁడగుచున్, దానందలేఁ డట్టిమై
తగు సర్వేశ్వరుఁ డిప్డు జార్జనృపు లందఱిని మిన్నులున్.

— మోహినీమనోహర నాటకము—ఇది షేక్స్పియరను మహాకవిరచిత

చిన ట్వెల్తునైట్ అను నాటకకథ ననుసరించి వ్రాయంబడిన యైదంకముల నాటకము. శృంగారరస ప్రధానము. మోహినియను రాజపుత్రి సముద్రమునం బడియు బ్రతికి మనోహరుఁడను తన ప్రియుని పెండ్లియాడినకథ. మనోహరముగా వర్ణింపబడినది.

వీరసేన విజయనాటకము — ఇదియును షేక్స్పియరు రచించిన పెరిక్లిస్ అను నాటకకథ ననుసరించి వ్రాయబడిన యైదంకముల నాటకము.

ఇందు — చచ్చెనని సముద్రమున బారవేయబడిన వీరసేనుని భార్య బ్రదికి మరియొక చోటనుండుటయు వెనుక వారి సమాగమంబును అత్యద్భుతముగానుండును. ఇది యిప్పటి కముద్రితము

సుందోపసుంద నాటకము — ఇందు సుందోపసుందులను రాక్షససోదరులెంతో మైత్రిగానుండి పిదప నొక దేవకన్యవలన వాదితులై యొండొరులు పోరిచచ్చినకథ. వింతగా చమత్కరించి వ్రాయబడినది

అహల్యా నాటకము — ఇందహల్యను, గౌతముఁడు, నింద్రుఁడు పరిణయమాడఁగోరగా బ్రహ్మదేవుఁడొక్క తంత్రము పన్ని గౌతమునకిచ్చి వివాహము జేసినకథ యద్భుతకల్పనతో వ్రాయబడియున్నది.

కమలినీపరిణయము — ఇది సింబలెన్ అను నింగ్లీషు నాటకకథ ననుసరించి వ్రాయబడిన నాటకము. ఇందలికథయు నత్యంతమనోహరము. ఇది యింతవరకు సంపూర్ణముగా వ్రాయఁబడియుండలేదు.

భోజరాజ విజయము — ధారానగరము రాజధానిగాగల గౌడదేశసహితమైన దక్షిణాపథమంతయు నేకచ్ఛత్రముగాఁ బరిపాలించి విద్యాభోజుండని ప్రఖ్యాతిఁగాంచిన భోజమహారాజు బాల్యచరిత్రమంతయు నెంతో వింతగా వ్రాయబడినది. ఇది యేడంకముల మహానాటకము. ఇందుఁ గథానాయకుఁడు బాలభోజుఁడు. భోజుని పినతండ్రి ముంజుఁడు రాజ్యలుబ్ధుఁడై భోజుని వధించుటకుం బంపుటయు వత్సరాజను సామంతరాజు వానిం జంపక రహస్యమునం దెచ్చి తనయింటం దాచుటయు, నంతలో వత్సరాజబోధితుండగు మంత్రి యొక మాంత్రికుని గల్పించుటయు, భోజుఁడు వ్రాసిపంపిన పద్యమును జదువుకొని ముంజుఁడు మరణోన్ముఖుఁడయి యుండెననియు, అంతలో నా మాంత్రికుఁడు చచ్చినవారిని బ్రతికింపగలనని బొంకగా ముంజుఁడు వానిం బిలిపించి, భోజుని బ్రతికింపుమనుటయు, మాంత్రికుఁడు, మంత్రప్రభావమున, బ్రతికించినట్లు చేసి

భోజుని దెచ్చి యిచ్చుటయు, నతనిపట్టాభిషేకంబు నిందు వర్ణింపబడియున్నది.

సీ. పినతండ్రి శాసనంబున దివికేగదనమ్మ నాకై శోక మందకమ్మ
ముంజభూపతియంప జోచుంటిని గురువర నాకుగా నీవు వగవకయ్య
రారాజుపంపున ధారుణివీడెదనన్న జయంత నన్నాఁగకయ్య
మనుజేంద్రునాజ్ఞ గైకొనిపోయెదను బుద్ధిసాగర నీప్రేమ వీగవయ్య.

తే. గురువువలెనన్ను భక్తితో గూర్మితోడ, ననుసరించు నా సహపాఠులార! మిత్రు
లార! మిమ్మెడబాసి నేనరుగుచుంటి గరుణవిడనాడి నన్నింక మరువుఁడయ్య

వేదాద్రిమాహాత్మ్యము—కృష్ణామండలమునందు నందిగామ సీమయందు విఖ్యాతిఁగాంచియున్న వేదాద్రియందు వెలసియున్న శ్రీ——ంహస్వామి వారి మాహాత్మ్య మంతయు నిం దైదాశ్వాసముల పద్యకావ్యముగా వర్ణింపఁబడినది.

చ. కలఁగఁడు వెచ్చనూర్పఁడు వికారమునొందఁడు బీతుఁజెందఁడె
వ్వలనను గంటనీర్విడఁడు వాఁడుచేరఁడు తండ్రిచెంతకే
యలమటయుంగొనం డెడఁదహా పరమేశ్వర! హా రమేశ! హా
సలలితమూర్తి హా సుగుణసాగర యంచు వచించునెంతయున్.

మ. ఋతుసింహేభ శశాంకసంఖ్యను శకంబింపొంద నానందమున్
దితిహాసంబులతోడ వేదమహీభృద్వృత్తాంతముంగూర్చి యిం
చిరరీతిన్ రచియించెదీని గవిరాట్ శ్రీపాదకృష్ణుండు, సం
తతముగా నీమనఃకృపారసంబునకుఁ బాత్రుండై జగద్వల్లభా.

శ్రీరామకుమారవిజయ నాటకము—ఇందు శ్రీరాముఁడు రాజ్యముచేయుచుండఁ జాకలివాని మాటఁబుచ్చుకొని గర్భవతియగు సీత నరణ్యంబులకుఁ బుచ్చుటయు, ఆమె వాల్మీక్యాశ్రమంబున నుండఁ గుశలవులను నిద్దఱు పుత్త్రులు పుట్టుటయు, వారు రామాశ్వమేధాశ్వమును బంధించుటయు, లక్ష్మణాదులతో వారికి యుద్ధమును, అనంతరము శ్రీరాముఁడు కుశలవులతో సీతంగొనిపోయి సాకేతమున సుఖంబుండుటయును మనోహరముగా వ్రాయఁబడియున్నది.

చ. ఖలుఁడగు పంక్తికంధరుఁడు కన్నగనఁజాలక నన్నుఁగొంచుఁ బోఁ
దెలిసియితండు శౌర్యమున దిక్కులుపిక్కటిలంగ నార్చుచున్

కలనోనరించి రావణుని గండడగించియు మించినాకుఁగా
నిలనిట్లు తెల్పినయ్యెనయొ యేమనిచెప్పుదు దైవనిర్మితిన్.

గౌరాంగచరిత్రము—ఇది వంగదేశమందు మున్ను ప్రసిద్ధిగాంచిన నిమి యను గౌరాంగుని పవిత్రచరిత్ర మంతయుంగల వచనప్రబంధము. ఇది మానవసేవపత్రికయందు ముద్రితము.

తిలకమహారాజనాటకము—ఇందు బాలగంగాధర తిలకుగారి, జీవితమంతయు, ప్రదర్శనోపయోగముగా చేర్చి, రచింపబడినది. ఈ పుస్తకము ప్రథమముద్రణములో మన కవిసార్వభౌమునకు రూ 3000లు క్రయధనమువచ్చినది.

గాంధి విజయధ్వజ నాటకము—ఇది కరన్‌చంద్ మోహనదాసు గాంధిగారి జీవితముతో నలరారుచున్నది.

మహాభారత యుద్ధనాటకము—ఇది 1927 సం॥రమున రచింపబడిన 6 అంకముల మహానాటకము; ఇందు భారతకథ అంతయు, సంగ్రహముగా వ్రాయఁబడియున్నది.

ఉ. స్వార్థపరుండువోలెనయి సాహసవృత్తిఁ బహించి మిమ్ము యో
వ్యర్థముగాఁగఁబోవ నెటులంపఁగనేరుతునయ్య! సర్వలో
కార్థశరీర! నీవు, మనమత్తులు, తమ్ములు నాకునిట్టి మి
మర్థమునందు నాసమెయి, నక్కటవీడి మెలంగనేర్తునే.

శ్రీనాథకవిరాజీయము—ఇది 1927వ సం॥రమున భారతపత్రికలోఁ బ్రకటింపఁబడినది. ఇందు శ్రీనాథకవి సార్వభౌముని చిత్రచరిత్రమంతయు నెంతో వింతగా వర్ణింపఁబడినది.

మ. కృతులంగొన్న మహానుభావులగు పృథ్వీశుల్ పరంబంది కీ
ర్తి క్షితిజీవించుట కష్టసాధ్యమగుటం జిత్తంబునందెంచి భూ
పతినోడీశ్వరు వేఁడి గుత్తగొని సేవ్యంబేమ జేయింప నా
ప్రతికూలంబగు దైవమిట్లుతలంచెం బాడయ్యెసర్వంబయో.

చంద్రికాపరిణయ నాటకము—ఇది శ్రీమజ్జట్ప్రోలుసంస్థానాధీశ్వరులగు సురభిరాజా లక్ష్మారాయ ప్రభుపుంగవుల యాజ్ఞానుసారము 7 అంకముల నాటకముగా 1930వ సం॥రమున రచింపఁబడినది. ఇందలికథ మాధవరాయప్రణీతంబైన చంద్రికాపరిణయమను ప్రబంధమునుండి స్వీకరింపబడినది.

సీ. కీరమా చటులవాకూర్పమా త్రుళ్ళకు బావురుగాడునా వజ్జగలఁడు
కోకిలంబా! కలుషామలంబా! యింక నోరెత్తకుము వానకారువచ్చు
భృంగమా! గీతప్రసంగమా! చాలునీ మొగిరిపాటిందు సంపగులుగలవు
లోకమా! వంచితలోకమా! యింతలోఁ బోగ రేలనీపాలఁ బ్రొద్దుగుంకు

తే. ఎల్లరును నేమిచేసెదరింక నన్ను, మృదులతరవాణి కలకంఠి కృష్ణవేణి
లికుచకుచమైనచంద్రిక, సుకృతఫలము గాఁదరిసినాకుజహవీయఁగలదుగాన.

విజయలక్ష్మీ విలాసము— ఇది జయపుర సంస్థానాధీశ్వరులగు శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుంగారి చరిత్రమును, సంస్థానచరిత్రమును లోనగు నానావిషయములు తెలుపు 6 ఉల్లాసముల మహాప్రబంధము. 1933 సం॥రమున రచితము. దీనింగూర్చి విపులముగా, నవమప్రకరణమందు వ్రాయబడియున్నది.

చ. జలమయపర్వతాగ్రముల సొరుగఁదీరిన భూరుహంబులన్
గలకుసుమంపుఁ దావులనుగైకొని వ్రేఁకనగాక వాకలం
బలపలనౌతరంగముల భాతినటించుచుఁ బిల్లవాయువుల్
సలుగడవచ్చితాఁ కెడు ననారతమెల్లను హాయిఁజెందగన్.

మ. సెలయేళ్ళుం గనుమల్లవే గిరులలోఁజెన్నారఁజా చాళ్ళపైఁ
గలగల్లాడుచు, వాకపందులగతిన్, గన్పట్టిపార్శ్వ ళ్లలన్
గళముల్ వంచి జలంబులాను మృగముల్ కందోయిపైఁ దుంపురుల్
యుంబడ్డవిదిర్చ్బెడిగ్ మొగములంగంటే కురంగేక్షణా.

శ్రీకృష్ణభారతము—18 పర్వములు—ఇది వ్యాసకృత శ్రీ మహాభారతమనుసరించి 15 సం॥రముల కాలము, పాటుబడి, రచించిన మహాగ్రంథము.

సమ్యగాంక సంఖ్యకీక ముప్పారగన్ ఈ సూబ్దంబునం
దుచు షష్టిపూర్తిమహామే పుణ్యక్రియంగాని నా
వ, ంబున సఫలంబుగా సలుపులిష్టన్, బూనునీభారతో
ల్లనదామ్నాయము పూర్తిజేసియిడితిన్ రక్షింపవేరక్ష కా.

దీనంజేసి మన కవిసార్వభౌమునకు 60వ సం॥రము వచ్చునప్పటికి, కృష్ణభారతము పూర్తియయినదని తెలియుచున్నది. దీనింగూర్చి పెక్కురు మహాపండితులు సదభిప్రాయముల నిచ్చియున్నారు. పెక్కుచోట్లఁ బెక్కు సభలజేసి, మన కవిగారికి సన్మానపత్రములిచ్చి సత్కరించియున్నారు. ఈవిషయముమంతయుఁ

గవిసార్వ భౌమాభ్యుదయమను గ్రంథమువలన తేటతెల్లమగుచున్నది. నీగ్రంథ ప్రాశస్త్యమునుగురించి యింతకంటె హెచ్చుగా వ్రాయక గ్రంథములోని యొక్క పద్యముమాత్రము వ్రాయుచున్నాను.

ఆరణ్యపర్వములో, దమయంతి బాహుకుఁడై యున్న తన భర్తయగు నలుని తన సౌధమునకు రప్పించి, వానితోనన్న విషయము.

చం. అలసినవంబునం నిదురనందినదానిఁ బరాపవాదమున్
దలపనిదాని, సాధ్వియగుదాని, బ్రజావతియైనదాని నే
కలతకుగానిదానిఁ గులకాంతనయో నలుబోలిపీడిపోఁ
గలిగినవాఁడొక్కరుని గంటివొకో యెటనేని బాహుకా.

మఱియుఁ గవిసార్వభౌమ ప్రణీతములైన గ్రంథము లెన్ని యోగలవు అందు గొన్ని నాకు లభింపమింజేసియుఁ బ్రభుత్వోద్యోగంబుననొకింతయుం దీరమింజేసియు, గ్రంథవిస్తర భయంబునంజేసియు, నిట్లు గొన్ని గ్రంథములుమాత్రమే, స్థాలీపులాక న్యాయముగా నుదాహరించితిని.

శ్రీకృష్ణకవిజీవితము.

ఏకాదశ ప్రకరణము

ఇటీవల కవిసార్వభౌముల జీవితములో మిక్కిలి ముఖ్య[illegible] గ్రంథకభాషాభిమానము పండితవివాదమును రెండువిషయము[illegible]నైన తెప్పటావశ్యకముగాక పోదని ప్రత్యేకముగా వానినిప్రకర[illegible] వ్రాయుచున్నాను.

మన యాంధ్రభాష పెక్కుభాషల సంయోగమున నైన[illegible]ట నిర్వివాదాంశము. పెక్కు భాషాపదము లీభాషయందుఁ జేరియున్న[illegible] ఇది తద్భవ, తత్సమ, దేశ్య, గ్రామ్యములని నాలుగువిధముల వ్యవహరింపబడుచున్నది. గ్రామ్యము వ్యవహారోపయోగ్యముకాని గ్రంథోపయోగ్యము కాదు. అందుఁ బూర్వకవులు వాడిన కొన్ని పదము లనింద్యగ్రామ్యములుగా స్వీకరింపఁబడుచున్న[illegible] అవితప్పఁ దక్కినవి గ్రాంథికములు చేయనొప్పదని 'ఆము[illegible]పర్వములలో

మాన్యుఁడు పల్కు తెలుఁగులవిగాక" అని కవిరాజుసాదులు నియమము చేసిరి. ఈ యాచారమునకు భిన్నముగా నిప్పుడు కొందఱు గ్రామ్యమనియు వ్యావహారిక భాషయనియు వేరువేరు పేర్లుపెట్టి తమగ్రంథములలో నిచ్చవచ్చినట్లు వ్రాయుచు నెల్లవారిచే వ్రాయించనెంచి దేశమున గొప్పప్రచారము సాఁగించి తమమతమునఁ బెక్కుర నాకర్షించుచున్నారు. వ్యావహారికభాషావాదమున ముఖ్యులు మ. రా. శ్రీ రావుసాహేబు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారు. వీరాంధ్రభాషయందుఁగల సర్వగ్రంథములను సూలంకషముగాఁ జదివి యఖండ పాండిత్యమును సంపాదించినవారు. వీరితోడయున్నవారందఱును వ్యావహారిక భాషనుపయోగించి గ్రంథములు వ్రాసి ప్రకటించుచున్నారు. ఇదిగాక వీరిశిష్ట వ్యవహారస్థభాషకు భిన్నముగా నెల్లి [illegible] ననేకవిధముల గ్రామ్యముపయోగించుచున్నారు. ఈసందర్భమునఁ గొన్నిసమితులేర్పడి భావకవిత్వమని యొకవిధమైన పద్ధతితో గ్రంథములల్లుచున్నారు. ఇట్లున్న కాలమున నిప్పటికైదుసంవత్సరములక్రిందట తణుకుపురములో నాంధ్రసాహిత్యవార్షికోత్సవము జరిగినది ఆసభకు మ.. రా రా. శ్రీ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారధ్యక్షులు ఆసభలో గిడుగువేంకటరామమూర్తి పంతులుగారు తమవ్యావహారికభాషంగూర్చి యుక్తియుక్తముగా 2,3 గంటలకాలము పన్యసించి యొకదీర్ఘవాదముపపాదించి వోట్లుతీసి [illegible]న్నారు. అప్పుడాసభలో నున్న మనకవిసార్వభౌములు వోటుకోరినారు. 'వ్యావ[illegible]తో గ్రంథములు వ్రాయనొప్పునని సభవారంగీకరింపవలెను" అను [illegible]పనము. దానిపై మనశాస్త్రిగారు 'వారు వ్యావహారికభాషతో [illegible] వ్రాసికొనుట కంగీకరింపుఁడని కోరినప్పుడు మనకేమిబాధకము? [illegible]టకు సమ్మతింపవలె"నని చెప్పిరి. వ్యావహారికవాదులు తమ [illegible]బుచ్చిరని సంతోషించిరి. అంతఁ గొన్నినాళ్ళకు గ్రాంధికవా[illegible]ము "భారతము నాంధ్రీకరించు కృష్ణమూర్తిశాస్త్రిగారు తమకు [illegible]గ్రామ్యవాదము నంగీకరించిరని పత్రికలలో వ్రాసిరి. 'నేనట్లంగీకరింపలేదు. [illegible]మునై నేనొక్కపత్రిక నెలకొల్పుచున్నాను దానివలన నాయభిప్రాయములెల్ల తెలియుఁగాక' యని శాస్త్రిగారు గ్రామ్యము ఖండించుటకై 'వజ్రాయుధ' మనుమాసపత్రికం బెట్టి 3,4 సంవత్సరములు భాషామహాయుద్ధము చేసినారు.

‘చచ్చిపుచ్చిన డొక్కలవంటి ప్రాతమాటలనేపట్టుకొని వ్రేలాడక దేశ
మున శిష్టులు మాటలాడునట్టి మాటలను మన గ్రంథములలో నుపయోగించుకొ
నుచు భాష నభివృద్ధికిం దీసుకొని రావలయును. మీ ప్రాతమాటలిపుడు ప్రజలకు
రుచించుటయు నర్థమగుటయు లేదు. మీ గ్రాంథిక మిప్పటి కాలమునకు పనికిరా
దు. తిక్కన గ్రాంథిక భాషను మీరు వ్రాయ నెంచినను వ్రాయలేరు. తద్గ్రాం
థికము వ్రాయుటకన్న మానుట మంచిది. కావున సర్వజనసుబో
ధకముగా వ్యావహారిక భాష నుపయోగించుకొనవలెను’ అని శ్రీ
రామమూర్తి పంతులుగారి వాదము. ‘ఇట్లుతగదు. మా ప్రాతమాటలు కాసిం
పంబడి పెక్కువందల సంవత్సరములనుండి గ్రాంథికములై సర్వజనగ్రాహకములగు
చున్నవి. ఏ దేశమునను న్నవారికైన గ్రంథస్థభాష యొక్కటిగానే యుండునుగా
వున సర్వసౌలభ్యమును బొంది గ్రహింపసాధ్యమగుచున్నది. మీ వ్యావహారికము
గ్రామమున కొక్కవిధముగా దేశమున కొక్కవిధముగానున్నది. బళ్లారివారిమా
టలు నెల్లూరివారికి నెల్లూరివారిమాటలు గోదావరివారికి గోదావరివారిమాటలు
గంజామువారికి తెలిసికొనశక్యములుగావు. ఇదిగాక యొక్క గ్రామమందే యెన్ని
జాతులున్నవో యన్ని విధములైన వ్యవహారమున్నది. గంజాములో నేనీచజాతుల
మాటలు సచ్ఛూద్రులకు వారివారిమాటలు బ్రాహ్మణులకు నర్థముకావు.
అట్లే సర్వదేశములందునుండును. మీ దేశమందే శిష్టులనబడువారే సు[illegible]
సొమ్ము, మరిగంటే, ఉన్నాది, వెళ్ళిపోస్తేకాను ఇత్యాదులు [illegible]
ఇవి గోదావరివారికే తెలియవు. బళ్ళారివైపువారికి మొకతే తెలియు[illegible]
హారిక భాషకు హద్దుపద్దులేవు, ఆ భాషతో గ్రంథములు చేసిన[illegible]
ముగ్రహించుటకు వ్యాకరణము లక్కరలేదు. గాని దేశమునకు రె[illegible]
శబ్దనిఘంటువులుండి తీరవలెను, శుద్ధశ్రోత్రియులు అంచాపు,
శి. షుణాకము ఇత్యాదులెన్నో పలుకుదురు. మా ధనకా[illegible]
వ్యవహరించుమాటలు విన్న కర్ణకఠోరములుగానుండును. వా[illegible]
ఘంటువులు కావలసియుండును. ఇవియన్నియు గ్రంథస్థములు చేయ మనుట
సరియైనపథముగాదు. ఇత్యాదులంబట్టి శిష్టవ్యవహారము మీరను[illegible] ముభాష
నింద్యగ్రామ్యమని యేనాయభిప్రాయము. ఈగ్రామ్యమనంతము. ఎఱుకులగ్రామ్య
ము, తురకలగ్రామ్యము, చెంచుగ్రామ్యము, కోదుగ్రామ్యము, కొండగ్రామ్యము, చచ్చ
టిగ్రామ్యము, బ్రాహ్మణగ్రామ్యము, వైశ్యగ్రామ్యము, శూద్రగ్రామ్యము, గంజాము

గ్రామ్యముగోదావరిగ్రామ్యము, నెల్లూరిగ్రామ్యము, బళ్ళారిగ్రామ్యము, మంథెనగ్రామ్యము, ఇత్యాదులెన్నో గ్రామ్యభేదములున్నది. ఏశిష్టసాంప్రదాయమును మనము స్వీకరింపవలెనో? ఏదిస్వీకరించినసర్వసుబోధకమగునో నిర్ణయించుటకు శక్యము కాదు. దీనివలన సర్వసుబోధకమగుటకుమారు పండితులకేయగమ్యాగోచరమై పోవును. ఇట్లుచేయుట భాషనశింపఁజేయుటయే కాని వృద్ధిచేయుట యెప్పటికిని గాదు. సర్వజనసుబోధకముపేక్షించిరదా మీరు వ్యావహారికభాష కావలెనను చున్నారు. సరే నేను 10 పంక్తులు గ్రాంధికముతో వ్రాయుదును. మీరు 10 పంక్తులు వ్యావహారికముతో వ్రాయుఁడు. ఆ రెండును భాషాజ్ఞానములేని యొక యాంధ్రభాటవిసునియొద్ద చదువుదము. ఎవరివ్రాఁత వానికిఁ దెలియునో దానిని స్వీకరింతము' అని యెన్నోవిధములంజేసినది కవిసార్వభౌముని వాదము. ఇట్లు వారికిని వీరికిని కొన్నిసంవత్సరములు హోరాహోరిం బత్రికావాదము నడిచినది 'మనవాదము పండితులసమక్షమున దీర్చికొందము దానికొకసభ చేయుంతము. అందు బళ్ళారి మొదలగు దేశములనుండి దేశమునకిద్దఱు పండితులుండవలెను. వారిసముఖమున నావాదము నేనును, మీవాదము మీరును జెప్పుదము. వారు చెప్పినప్రకారము మనము నడుచుటకు దీర్మానించుకొందము' అని మనకవిసార్వభౌములు కోరగా శ్రీరామమూర్తిపంతులుగారు 'దేశదేశములవారేమిటికి తనదేశము వారుండు'రని కొందఱిపేర్లు చెప్పినారు. దానికి మనశాస్త్రిగారంగీకరింప [illegible]గలేదు. అంతలో మనకవి శాంతింపక ప్రతిసంజాయిషీపత్రికయం [illegible]మును పిరసించుచు స్వీకరించినవిధముఁ జెప్పు [illegible]ములువ్రాసినారు [illegible]వ్రాఁతలు వ్యావహారికములు కానే కావు. తిక్కన్నభాషతోడనే [illegible] నేనే వ్రాయగలనని—

[illegible]వాదము తెలిచికొంట, భమ్మను దెప్పికొంటసిభేష్షులయి
[illegible]మియిూరవారులు, మల్లెలమ్మట్నాల వాలోల్లలార !

...., ముద్దుగుం కేతల్కొ పన్న దద్దుయిసక
గడెక [illegible]చులు జేవడిసిమోచ్ర...

ఇత్యాదులెన్నో పద్యములు, పాటలు, వ్రాయుటయేకాక "ఒకానొకధాతువున కొకానొకధాతువు పరంబై యొకానొకయర్థంబగు ఉ॥ వెళ్ళిపోయొచ్చా స్తా' వెళ్ళి, పోయి, వచ్చి, యేస్తా, ఇవియన్నియు గూడి వచ్చిరాఁదని యర్థమువ

బోధమగుచుండునని" ఇట్లు పరిహాసముగా నొకగ్రామ్యవ్యాకరణము వ్రాసి గ్రామ్య
వాదమును నిరసించినారు. మనకవిసార్వభౌములు ప్రకృతిప్రత్యయములు పాడు
చేసి "వస్తాడు, పోతాడు' అని వాడ వలదని చెప్పుచునుగాని భాషాభివృద్ధిగా
దేశీయములు, జాతీయములు లోనగుపదములు దేశకాలపాత్రానుసారముగాఁ
బ్రయోగించుకొనవలయునని యే చెప్పెదరు స్టేషను, కుర్చీ, మేజా, తివాసీ,
మాష్టరు లోనగుపదములు ప్రయోగించి భాషాభివృద్ధి చేయవచ్చునని చెప్పెద
రు. దీర్ఘసమాసములు, క్లిష్టపదములు వేయక సులభపదములతో తేలికదారిని
కవిత్వము చేయవలయుననియు నది సర్వజనసుబోధకమగుననియు మనకవిసార్వభౌ
ముని యభిప్రాయము పీరి యీయభిప్రాయ మెఱుంగక కాబోలు వీరి భారతములో
నెన్నోతప్పులున్నవని రామమూర్తిపంతులుగారు మున్నొకప్పుడు రాజమహేం
ద్రవరములో నొకసభ చేసి యిట్టివి కొన్నిపదములేరి చెప్పి యిట్లు శ్రీనాథాదు
లు ప్రయోగించినారు. అందఱును బ్రయోగించుచున్నారు. ఇవిమాత్రము సరి
యైనగ్రాంథికములుగావు, ఇట్లుతిక్కనాదులు ప్రయోగింపలేదు అని చెప్పుచు
సుత, కోలెశబ్దములు నాఁడుశబ్దముయొక్క యూపవిభక్తిమీఁద నేనా టం
గోలె, నాఁటినుండియుని యుండును. వీనికి వ్యతిరేకముగాప్రయోగించినారిది
తప్పు అని చెప్పగా మనకవి లేచి 'నాప్రయోగములకన్నిటికి శ్రీనాథాదుల
గ్రంథములలోనున్నవని మీరేసమాధానము చెప్పినారుగావున వేరే నేను గ్ర
క్కఱలేదు.' సుత కోలెశబ్దములు ప్రథ్యర్థకములు నాఁడుశబ్దా
నం దేకాని ప్రయోగములు లేవు' అని మనకు శాసనము లేదు. 'నా
కోలె' అనితిక్కనసోమయాజి ప్రయోగములు కలవు, దీనికేమి చెప్పె
కట్లువ్యాకరణముపుట్టునపుడు మీమాటఁ బాటింపవలసిన యవ—
ఇట్లు సమాధానము చెప్పినారు. శ్రీకృష్ణభారతములోనున్న—
టయా" అనుపదప్రయోగము తప్పని పంతులుగారు వ్రాయ
గారివల్ల వింటిని. దీనిపై శాస్త్రిగారు చెప్పినసమాధాన మిదివఱకే నః
రణమునఁ జూపితిని. మఱియుఁగొందఱు "సత్యాం బానుమతిఁ"ముఖాన శ్రీకృ
ష్ణభారతప్రయోగము సరికాదనియు, సత్యవతికి సత్యయనిప్రయోగము లేదని
యు, నిటశాస్త్రిగారు బొడ్డుగోసి పేరుపెట్టినారనియుఁ బరిహసించిరి. మనకవిసా
ర్వభౌములు దానికిఁ జెక్కుసమాధానములిచ్చి 'తతోనిష్కాంతిమాలోక్య

నత్యాపుత్రమథాబ్రవీత్ ' అను వ్యాసభారతప్రయోగము... బొడ్డుగోసి పేను పేరుపెట్టలేదు వ్యాసుఁడే తనతల్లికి బొడ్డుగోసి పేరుపెట్టినాడు అని వ్రాసిరి. ఇత్యాదు లెన్నో యాక్షేపణలకు సమాధానములిచ్చుచు వజ్రాయుధపత్రికను నిరంతరాయముగా నడిపిరి. మఱియు రామమూర్తి పంతులుగారితోడ నేగాక భాషావిషయమునఁ జెక్కుమంది పండితులతో వివాదపడి విమర్శనములు వ్రాసి సభాముఖంబున నుపన్యాసములుగావించి అహర్నిశానములు తదేకదీక్షతోఁ బని చేసి ధనవంతులుగారున్నను మిక్కిలిధనవ్యయమునకోర్చి, శాయక్లేశమునొంది పలుమందితో విరోధము సంపాదించి తనపట్టుదలవలన నెన్నియో లాభములను గోలుపోయి శ్రమపడుచు నాత్మగౌరవమును మాత్రము గాపాడుకొనుచు భాషాసేవయే తనప్రాణరక్షణమనునట్లు జీవయాత్రసలిపిరి. అట్టి మనకవిగారిప్పుడేమనుచున్నారో యించుక గమనింపుడు. లోకములోఁ దనకిప్పుడు శత్రువులు లేనేలేరనియు నొక్కభాషావిషయంబునఁ గొందఱు మాత్రము లేకపోలేదనియు నట్టివారియొడఁగూడ నేఁడు మైత్రినెఱపఁగోరి నెయ్యదిని మన నూహించునట్లు వారువారి గండపెండేరమహోత్సవసందర్భమునఁ జేసిన కృతజ్ఞతానమర్పణమున—

'మ. ధరణిన్ వైరులులేరు నాకిపుడు విద్యాసంప్రదాయప్రసం
గతిన్ గల్గినవైరమేరియెడనేఁ గన్పట్టినన్ వారి నా
పుల్ మిత్రులుగాఁ దలంచి చెలిమిన్ పూర్ణంగఁజేయన్ప్రయ్నించెదన్
...ందగు నెల్లవారును నమస్కారంబు గావించెదన్.'

...చెప్పిరి. దీనింబట్టిచూడ మనశాస్త్రిగారు భాషాసంగ్రామమింతట ...ంచుచున్నట్లును, ఏతత్సంగ్రామమున విజయము గాంచియు ...గలిగినశత్రువులతో మైత్రినెఱపఁగోల్పి శాంతచిత్తులై "దూషణ ...రంబులు శరీరమునకుగాని యాత్మకులేవను నిరాగబుద్ధితో దేహ ...రిను జరుపనున్నార ...విషయము సూక్ష్మబుద్ధులకు గోచరింపకపోదు. ...స్త్రిగారిజీవితచరిత్ర యొకనూతనపథమున నడచుననితోచు

ఎ. ఏలయన—

...భాషావిషయమున భారతాంధ్రీకరణముకన్న మిన్నయగు కావ్యము ...రిలేదు. కవితాజీవితమునకవిసార్వభౌమ బిరుదలాభమునకును, స్వార్థా

భిషేకమునకును, గండపెండేరబహూకృతికిని మిన్నయగు గౌరవము మఱియొక్కటిలేదు. మఱియు నాంధ్రకవిత్వచరిత్రారంభమునుండియు నేటివఱకుం గల మహాకవులు తమతమజీవితములలో నొకఁడొకఁడుగాఁ బొందినసన్మానములన్నింటిని వీరొక్కరే తమజీవితములో నొంది ధన్యులైరి. ఇంతకన్నఁ గవితాజీవితమున నెవ్వరైనం బొందవలసిన గౌరవములుండఁబోవు. ఇట్టిమహోన్నతగౌరవములం బొందుటంబట్టియుఁ దనజన్మమునకు హేతుభూతమగు మహాభారతాంధ్రీకరణము పూర్తియగుటంబట్టియుఁ, గాఁబోలు నిఁకఁ దమకవితాజీవితమునకు విశ్రాంతినొసంగి ప్రశాంతచిత్తులై భగవదారాధన తత్పరులై జీవితశేషమును గడపుకొనుచు సుఖంబుండునట్లు తెలియుచున్నది. స్వస్తినమస్తు మంగళానిభవంతు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

గద్యము.

ఇది శ్రీపరమేశ్వరకరుణాకటాక్షసమాసాదిత కవితావిచిత్ర,
భార్గవగోత్రపవిత్ర, శ్రీలక్ష్మీదేవీవేంకట సోమేశ్వర
సుపుత్ర సకలసుకవిజనవిధేయ, అనంతపంతుల
రామలింగస్వామినామధేయప్రణీతమైన
శ్రీకృష్ణకవిజీవితమను సత్తమచరిత్రము
సంపూర్ణము.
శ్రీ శ్రీ శ్రీ